భారతి

Received 16/11

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

నవంబరు 1959

సంపుటము 36 : : సంచిక 11

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

నవంబరు 1959

డిసెంబరు సంచికలో

మనవి మాటలు

మనసు మరుగున తారాడే పలుకుబడులను వెలువరించడానికి మాటలే రాచబాటలు. ఈ మాటలకు పలుకుబడి-నుడికారం- ప్రాణం. నుడికారం తెలిసి ప్రయోగించిన నుడువులు సజీవాలు, పరమార్థనివేదనా సమర్థాలూ అవుతాయి. రచయిత వివక్షకీ పాఠకుని అభిముఖీకరణమే కాని విముఖీకరణం కాదు. కనుక పలుకుబడితో పెరవారితనాన్ని మాపుకోవడం అవసరం.

అయితే, మానవవర్గం అన్యోన్యాశ్రయంతో నే ఆదికాలంనుంచి అభివృద్ధి చెందుతున్నది. ఈ శతాబ్దంలో ప్రజానుబంధం విస్తరించి భాషలకూ పరస్పర సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ కారణంగా భాషల వికాసానికి సాంకర్యం తప్పనిసరి - అనేవాదం ఉంది.

“అతడు గ్రంథమును వ్రాసినాడు...అనుట తెలుగు పలుకుబడి కాదు. కమ్మ వ్రాసినాడు. జాబు వ్రాసినాడు అనుటే కాని గ్రంథము వ్రాసినాడు అనుట ప్రాచీనుల పలుకుబడి కాదు. వ్రాయుట లిపికరుని పని. అందు రచనాచమత్కృతి లేదు. గ్రంథము రచించినాడు, కబ్బము కట్టినాడు, కబ్బము చెప్పినాడు అనుట ప్రాతి తెలుగు పలుకుబడి. అయినా, నేడు అనేకులు గ్రంథము వ్రాయుచున్నాడు అని వ్రాయుచున్నారు. ఇది ఇంగ్లీషు పలుకుబడి. తెలుగులో రూఢికెక్కినది. ఇక తొలగింప కుదురదు. తొలగింపనక్కలేదు.

“గ్రామాధికారిని కరణమని పిలుతురు అనుట తెలుగుపలుకుబడి కాదు. కరణ మందురు. కరణమని పేర్కొందురు అనుట తెలుగుపలుకుబడి. కరణమని పిలుతురు అనట ఇంగ్లీషు పలుకుబడి. తెలుగుభాషలో రూఢమైనది. ఇక తొలగింపసాధ్యముకాదు. రూఢికెక్కినతర్వాత తప్పుగా భావించడం తొలగిపోతుంది” అన్నారు భాషాతత్త్వవేత్తలు.

నిజమే. ఇలాటి సాన్నిహిత్యం, సామరస్యం భాషావికసనానికి అవసరమైనవే. కాని, ఆలోచనల అలలను అరికట్టి, భావనా వైభవాన్ని బీటలు వారజేసే సాయుజ్యం, సమైక్యం సమాదరణీయాలా! బుద్ధిని మొద్దుబారజేసి, భావదాస్యానికి పట్టంకట్టి చేవను చితుకగొట్టే చిత్తవృత్తి ఆకాంక్షణీయమా? ఈ భావదాస్యంవల్లనే కాబోలు కొన్నిరచనలు కొన్నికలలకాలమో, వికలలకాలమో చమత్కారాపాదకాలు అవుతాయి కాని, కలకాలం — కనీసం కొంతకాలం—వాని మననం చేసుకొనే స్థాయిని అందుకోడం లేదు!

సంస్కృతదాస్యంతో నవజీవభావాలు కొన్ని మోసుకొనిపోలేదా? ఒక ప్రాంతంలో ‘మణిప్రవాళ’మనే కృత్రిమభాషే పుట్టుకురాలేదా? అని ఆక్షేపిస్తారు కదూ! ఔను. కొంతవరకూ ఇది వాస్తవమే. కాని, రచనారహస్యాన్ని, నిర్మాణమర్మాన్ని ఎరిగినవారెవరూ ఇతర భాషాభావప్రవాహంలో కొట్టుకుపోలేదు. తమభాషమూలబంధాన్ని, పలుకుబడి పట్టును, ఆలోచనల ఆలవాలాన్ని కాలదన్నలేదు. వాటిని గట్టిపరచుకొనే ఇతర వాఙ్మయాల భావకుసుమాలను ఏర్చి కూర్చి తమరచనలను అలంకరించుకొన్నారు.

ఏ సాహిత్యంలో ఎక్కడ ఏమంచి కానవచ్చినా, భ్రమరనీతితో స్వీకరించడం భావ్యమే. అయితే, ఆగాలిపాటుకే పడిపోవడం, ఆ తావులకే దిమ్మతిరిగిపోయే మనస్తత్త్వం తగదు. ఈ మనస్తత్త్వం అనువాదాలలో మరీ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఉదాహరణకు: సమ్మిట్ టాక్స్ అంటే, శిఖరాగ్రచర్చలు. అగ్రనాయకుల చర్చలు అంటే ఎంతసులువు? శిఖరాగ్రంలో చర్చలు అనే అపార్థానికి అవకాశం లేదూ? స్పేస్ షిప్-రోదసీనౌక. నౌక అనే మాట ఎందుకు? నీఞ్ ధాతువునుంచి పుట్టిందికదా అంటారేమో! యోగాద్రూఢిర్బలీయసీ! విమానంమీద వెళ్లాడు. మీద అనేది మన పలుకుబడా! విమానంమీద ఎక్కి ఆ రెక్కమీద ఈ రెక్కమీద చేరి ఒక కాలు వేసుకొని ప్రొపెల్లర్‌ను తిప్పడమా? విమానంలో అంటే సరిపోదూ? భూమి సంస్కరణలు- ఇది పూర్తిగా ల్యాండ్ రిఫార్మ్స్ అన్నదాని మక్కీకి మక్కీ కాదూ? భూమిస్వామ్యం కదా సంస్కరించబడేది! ఇలాగే హిందీ సంప్రదాయదాస్యంకూడా. ఈ హిందీ అభిమానులు “మేరా కహనా యహీ హై కి” అన్నరీతిలో నే “నేను చెబుతున్నది ఏదికదా”అని ఎత్తుకుంటారు మాట. ప్లేగ్ నివారణ నిపుణునికి ప్లేగ్ శాస్త్రి అని హిందీలో వ్రాశారు. ఇది ఎలా ఉంది?

భావం భాష అన్యోన్యాశ్రయాలు కనుకనే సంప్రదాయంలో, సముదాచారంలో వ్యుత్పత్తిని, పలుకుబడిని పట్టుగొమ్మచేసుకొని, ఆలోచనలను అల్లుకున్నప్పుడే మౌలిక రచనలు మొలకెత్తుతాయి. పలుకుబడిని పరిహరించడం- పరిమార్చడం వద్దనే ఈ మనవి.

విశ్వనాథ మధ్యాక్కఱలు: శ్రీగిరి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

అన్నియుం జక్కఁగా జరుగుచున్నప్పు డభవ! యీ మృత్యు
వన్నది సహజమైనట్లు దానిభయంబు లేనట్టు
లున్నది యది వచ్చినప్పు డీరీతినుండఁగఁ జేయు
సున్నితంబుగను శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నీవు లింగాకార మూను టీ ధారుణికి నీ యథార్థ
భావంబు వ్యాఖ్యానపరచునట్టులు పరమ పూర్ణతయు
నావెఁ గోలగా జ్యోతి వగుట నిరాకార పరిధి
సూవె నీవగుట శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నను నే విచారించుకొనిన నవ్వగా నాకే యున్నయది
నిను సమభ్యర్థించు పద్ధతి సుకృతి నీరేజ మధువ
ధుని సముద్రునిఁ గోరవచ్చుఁ బెనుకొండ తూగుటేలో వ
రుణ దేవుగూర్చి శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నాబిడ్డ యీ కైతపాప మిది కూడ నగజాతస్వామి
జాబాలిమైత్రావరుణి మొదల్ ఋషుల్ సంబంధమాడ
రాఁబోరు నా మాటమీఁద దీనిని గ్రహియింపు మిదియె
సోబానకూడ శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

వియదాదికబ్రహ్మత్తనూ శివా పట్టువిడుపులు గల్గు
దయయేమి దను భవా సతత సురవారిధారాభిషేక
మయమైనఁగాక యీ కరుణ యేరీతి మన్నింతు నభవ
సువహా కాదయ్యె శ్రీశైలమల్లికార్జునమహాలింగ!

ఆలోల కల్లోలితామ్రసూకృతి యా రెండునాళ్ళు
నీలలోహిత తీసిపోయెను గదయ్య నీ దయాతటిని
నీలమండలలోతు లేదు ముంచఁ దడిపొడి చేయదు సామి
శూలమ్ము చివర శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

తుదిదాఁకఁ దోడవువాని వోలికఁ దూగి వచ్చితివి
పదిబారలేగిన యంతలోఁ జప్పఁబడిపోయి తభవ
ముదిసిన నాకంటెఁగూడ మిక్కిలి ముదిసినయట్లు
చొాదుగుమాలితివి శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

నీవు నామనసులోనుండి మెపుడు కంఠేకాల తొలఁగి
పోవను నొక తృప్తివిడచి నీవల్ల పొందినదేమి
పావనంబైన నీ వెల్గుచూపించు పాపానఁబోవు
నూవె యంచనన శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

రెంటుభావాలొకేసారి యుండనిరీతిగాఁ దర్క
పండితుల్ చెప్పఁగ రేమి చెప్పుట పరమ మహేశ
గండిలో నొడియు నిచ్చోట గుండమై కదల విం దమర
కుండలమూర్తి శ్రీశైలమల్లికార్జున మహాలింగ!

కాలువగా జాలువారి యింతలో గడ్డకట్టెదవు
నాలోనఁ బానుగార్చుచుంటి యగ్గికణంబు నేరుపుగ
కాలాంతకున కైనవాడు నొక్కటే కానివాఁ డొకకి
పోలింపఁజేయ శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

చిత్తము లాగుచున్నయవి మెఱ్ఱనిచేరులై వ్రేలు
గుత్తులు గుత్తులై ప్రిదిలుకొన్నవి గుండియలెల్ల
బత్తుల వో వేల్పుచెట్ట నీమెడ పట్టుకోనీవె
పొత్తేమిపోదు శ్రీశైల మల్లికార్జున మహాలింగ!

ఓసామి నీవు నా గుండెలోపల నుంటివా పెద్ద
లా సాము లన్నారటంచు నిది భ్రాంతియా నాకు నభవ
మానరమ్ముగ నింతపైకిఁ బాక్కవా మసలిన నచట
నూనరివాడు శ్రీశైలమల్లికార్జున మహాలింగ!

ఒకటి యథార్థమా నంబికాజాని యుర్వి నెంచేని
నొకదొట్టి యుండె నీ తత్త్వ మయ్యది యెంతైనఁగాని
కొకిబికి యీ ధరాతత్త్వముం ద్రవ్వకొలఁదిఁ గన్పడెడు
నుకమందునట్లు శ్రీశైలమల్లికార్జున మహాలింగ!

ఎఱ్ఱమండ భూపతి చేబ్రోలు శాసనము

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

పూర్వచాళుక్య నృపతియైన రాజరాజనరేంద్రుని కుమారుడు మొదటి కులోత్తుంగచోళ చక్రవర్తి తన రాజధానిని వేంగిదేశమునుండి చోళదేశమునకు మార్చినపిదప వేంగీరాజ్యపరిపాలనము నిమిత్తము తన కుమారులను రాజప్రతినిధులుగా పంపుచు వచ్చెను. వీరికి తోడుగా నుండుటకై తన చాళుక్యవంశమును ప్రాచీనకాలమునుండియు భక్తివిశ్వాసములతో గొలిచిన భృత్యకుటుంబములలోని సమర్థులైన నాయకులను మొదట సేనానులను, దళనాయకులను జేసి పిదప వారిలో కొందరికి సామంతరాజచిహ్నముల నిచ్చి మండలేశ్వరులను గావించెను. ఈ రీతిని మొదటి కులోత్తుంగుని రాజ్యపరిపాలనము కడపటి వత్సరములలో వేంగీదేశమున పెక్కు సామంతమాండలిక రాజ్యము లేర్పడినవి. కులోత్తుంగచోళ చక్రవర్తి చివరి రాజ్యకాలమునుండి కాకతీయులు జయించువరకు ప్రాగాంధ్ర (వేంగీ) దేశచరిత్రము సామంతమాండలికరాజ్యచరిత్రమే. ఇట్టి మాండలిక వంశములలో కొండపడుమటిదేశము నేలిన నాయకవంశ మొకటి.

కొండపడుమటిదేశ మనగా కొండవీటికొండలకు పడుమట నున్న నరసారావుపేట, సత్తెనపల్లి (గుంటూరు జిల్లాలోని) ప్రాంతములు. ఈ దేశమును మొదటి కులోత్తుంగుని, అతని సంతతివారి కాలమునందు పాలించిన మాండలికులను శైలపశ్చిమ వసుంధరాధిపతులని, గిరిపశ్చిమశాసనులని, గిరిపశ్చిమదేశాధిపతులని వ్యవహార ముండెను. ఇక్కడ శైలము, గిరి యనగా, కొండవీటి కొండ. ఈ గిరిప్రతీచి త్రిసప్తతి, అనగా డెబ్బది మూడు గ్రామముల దేశము. ప్రాచీనకాలములో దేశపరిమితి గ్రామముల లెక్కను తెలుపబడుచుండెను. (ఉదాహరణము: వేంగి పదారువేలు; వెలనాడు ఆరువేల దేశము; పాకనాడు ఇరువదియొక్క వేయి గ్రామముల దేశము.) గ్రామమన్న నెంత పరిమితిగల ప్రదేశమో ఇంతవరకు తెలియరాలేదు.

గిరి పశ్చిమదేశాధిపతులు తాము దుర్జయుని సంతతివారమని చెప్పుకొనియున్నారు. వీరు చతుర్థకులులు. దుర్జయాన్వయుడైన బుద్ధవర్మనరేంద్రుడు వేంగీపూర్వచాళుక్యరాజ్య స్థాపకుడైన కుబ్జవిష్ణువర్ధన భూపుని యనుంగుభృత్యుడు. మధుకైటభ వైరియైన విష్ణువు విహంగరాజువలెను, రావణ విజేతయైన శ్రీరామచంద్రుని మరుత్సుతునివలెను భక్తితాత్పర్యములతో గొలిచినందుకు ఆ చాళుక్యమహారాజు సంతుష్టుడై రాజలాంఛనముల నొసంగి గిరిప్రతీచికి(గిరిపశ్చిమదేశమునకు) అధిపతిని కావించెను.

కుబ్జవిష్ణువర్ధనుని కాలమునుండి మొదటి కులోత్తుంగచోడచక్రవర్తి కాలమువరకు కొండపడుమటి దేశాధిపతుల చరిత్ర యేమియు తెలియదు. కులోత్తుంగ చోడచక్రవర్తి రాజ్యకాలము చివరినుండియే ఈ గిరిపశ్చిమశాసనుల శాసనములు కాన్పించుచున్నవి. వీరి మొట్టమొదటి శాసనము గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా పాకాలపాడు గ్రామమునందలి కేశవస్వామి ఆలయము ముందరి శిలమీద కానవచ్చినది. త్రిభువన చక్రవర్తి కులోత్తుంగచోడదేవుని నలువదియైదవ రాజ్య వత్సరమునకు సరియైన శకవర్షము 1036 (క్రీ.శ. 1114) నాటి ఉత్తరాయణ పుణ్యకాలమునందు చక్రవర్తి సామంతుడైన కొండపడుమటి దేశాధిపతి ఒక దేవాలయమునకు పాకలపాటి గ్రామములోని భూమిదానమిచ్చిన విషయము తెలుపుటకు పుట్టిన శాసన మిది. కాని శాసనమున ఏ దేవాలయమునకు చేసిన దానమో, దాతయైన కొండపడుమటి దేశాధిపతి యెవరో ఆ విషయములు గల శాసనపంక్తి భాగములు శిథిలమైనవి. ఈ కారణము వలన శకవర్షము 1036 నాటి కొండపడుమటి దేశాధిపతి పేరు తెలియవచ్చుట లేదు.

కొండపడుమటి భూపతుల తరువాతి శాసనమే ఈ చేబ్రోలు శాసనము. ఈ శాసనమున పేర్కొనబడిన మాండలికుడు ఎఱ్ఱమండ భూవరుడు. ఇది శకవర్షము 1040 (క్రీ. శ. 1118) నాటిది. పాకలపాటి శాసనమునకును, దీనికిని నాలుగేండ్ల యెడము. గిరిప్రతీచి శాసనుల వంశవృక్షమునందు బుద్ధవర్మకుపిదప పేర్కొనబడిన మొదటి మాండలిక ప్రభువు ఇతడే యగుటచేత

పాకలపాటిలో భూదాన మొసంగిన కొండపడుమటి ప్రభువు కూడ ఈ యెఱ్ఱమంచిరాజే కావచ్చునని తోచుచున్నది.

2

ఈ యెఱ్ఱమంచినృపతి చేబ్రోలు శాసనము చరిత్రకు చాల ముఖ్యమయినది. ఇది 1928 లో దక్షిణ హిందూదేశ శాసనములు, ఆరవ సంపుటమునందు 117 వ నెంబరు శాసనముగ ప్రకటితమయినది. దీనినే పూజ్యులైన శ్రీ జయంతి రామయ్యపంతులు గారు తమ 'శాసనపద్యమంజరి' యను పుస్తకములో 7 వ నెంబరు శాసనముగను, దక్షిణహిందూదేశ శాసనసంపుటము లోని ఈ శాసనమునందు శాసనశిల కొక ప్రక్కనున్న ముప్పది పంక్తులలో 15 పంక్తులను ఆరవ నెంబరు శాసనముగను ఇచ్చి, వదనములోనున్న కొంత శిథిలమైన మిగిలిన 15 పంక్తులను తమ గ్రంథమునం దీయక వదిలి పెట్టినారు.

శాసనపద్యమంజరిలోని ఏడవ నెంబరు శాసన పద్యపాఠ మిది :

1. క. శ్రీరమ (ణీయు)ణ్డు గులని
స్తారకుణ్డు న...న్వచంద్రు(ణ్డు) భుజ (బా)
ధారుణ్డు గన్నయపుత్రుణ్డు
మారణ్డు(మా)...ప్రతికోణ్డనూరక పేర్మిని.

2. చ. జితరిపు(శే)త మణ్డలిక
సంఘము జేగిర పశ్చిమ(ంబు)న
పతికగు(నె)ఱ్ఱమణ్డజన
పాలకు లేక మహాప్రధానిక
స్థితియును నం(ద)లంబును వి
శేష విభూతియుం(జే)మ్మిర్చ తో స ప్ర
స్తుత(ము)గ నుణ్డం గండ డని
మార(ణ్డు) పౌరుషనమ్మిర పారుణ్డై.

3. చ. తన...లోకవిది
తఃబుగా బొప్పిచిన పణ్డసరుణీ
జనపతి మ స్తవంబున బ్ర
శ స్తితి నచ్చెజవాడ సత్యసా
ధనసుభటావలిం దున్మి
తమ్ములు దానునుం బోరిలోనం జే
కొన్నని గెలిపించె నా(డు)నధి
కణ్డు మారణ్డు శౌర్య పారుణ్డై.

4. ఉ. విరుదు మాడలుం జెనదె
పెణ్ణు(ను) నింతియుకాని(త)మ్ములో
పారయ లేని పందల దు
రాత్ముల దుర్వ్వనసాయమును దురా
చారులం జెప్ప నేర్చిక ల
సద్గుణధీరు...వీరదు
ర్వ్వార(ణు)విశ్వకర్మ కుల
వల్లభు మారనిం జెప్పడెవమ్మహిని.

5. అనుపమసాహసస్ఫుగన
నమ్మర మెయిం దలపోయ నా(శిం?) చే
కొన్నని కతువిరులై నెగడు
కన్నులు బొం(ద్ద)ల తోడి యాడనం
జను నసహాయసాహసర
సప్రియు మణ్ణ మహీతలేశు క
ట్టనుంగు నుదగ్రశౌర్య సుభ
టాగ్రణిం బ్రోలను బుత్రు మారణిని.

6. రాజవిభూషణుణ్డు సుర
రాజవిలాసుణ్డు వస్త కీర్తి వి
భ్రాజితుం డెఱ్ఱమాడ జన
పాలకు నచ్చిన వజ్రదండక
నొజ్జా సుతుణ్డు మారని మ
హోర్వ్వీపసన్నిధిం జెక్కు రాజన
తోజితు విశ్వకర్మ కుల
భూషణు వైరివరేంద్ర భీషణున్.

7. గొడుగులు నందలంబును న
గు(ర్వ్వ)గు మున్న మహావిభూతియుం
బ్బడసెను విశ్వకర్మ ముని
బావ్వతివల్లభుచేత దివ్యమెయి
గొడుగులు నందలంబును న
గుర్వ్వ గుమున్న మహావిభూతియుం
బ్బడసెను నెఱ్ఱమండజన
పాలకు చేతను మారం డమ్మర మెయి.

శాసనపద్యమంజరిలోని ఈ శాసనపద్య పాఠమునకును, దక్షిణహిందూదేశ శాసనములు ఆరవసంపుటము లోని శాసనపద్యపాఠమునకును భేదము లేదు. రెండును ఒక్కటే. ఆరవసంపుటములోని శాసనపద్యపాఠమునే శ్రీ పంతులు గారును గ్రహించియుండురు. ఆంధ్ర యూనివర్సిటీలోను, ప్రాయికముగా మద్రాసు యూనివర్సిటీలోను బి. యే. పరీక్షకు వెళ్లు తెలుగు విద్యార్థులు శాసన పద్యమంజరిలోని మొదటి పది, పండ్రెండు శాసనములను ప్రాచీనాంధ్రభాషాతత్త్వము తెలియుట కొరకు అధ్యయనము చేయవలసియున్నది. ఆ పది పండ్రెండు శాసనములలో నీ చేబ్రోలు శాసన మొకటి.

శాసనపద్యములందలి భాషావర్ణక్రమాదులను గురించియే కాని బి. ఏ. తెలుగు విద్యార్థులు అందలి చరిత్ర విషయము తెలిసికొనవలసిన వక్కర లేదు. ఈ శాసనములోని పద్యములన్నియు దోషభూయిష్ఠముగ నుండుటచేత శాసనపద్యముల నిచ్చి శ్రీ పంతులుగారు అధోజ్ఞాపికలలో (ఫుట్‌నోట్సు) స్పష్టముగ దోషములని తెలిసిన వానికి, వ్యాకరణదుష్టములయిన వానికి సవరణలు సూచించి అర్థము సుస్పష్టముకాని పట్టుల 'ఇట్లుండవచ్చును, ఈ పద మిట్లుండ నోపును' అని ప్రత్యేక సూచనలు చేసినారు. నాలుగవపద్యము మొదటి గణము తప్పినదని 'మెయి' 'మై' అని చదువవలెనని సూచించిరి. శాసన పద్యములలో ఎనిమిదవది కందపద్యము.

శ్రీ పంతులుగారు సూచించిన మార్పుల ప్రకారము సవరించినచో ఈ శాసనమునందలి రెండవ, మూడవ, నాలుగవ పద్యము లీక్రింద చూపిన విధమున నుండును.

2. జితరిపు(చే)త మణ్డలిక
  సింహము శ్రీగిరి పశ్చిమంబునం
బతియగు(నె)ఱ్ఱమణ్డజన
  పాలకులేశ మహాప్రధాని క
స్థితియును సం(ద)లంబును వి
  శేష విభూతియుం(జే)మిణితోడం బ్ర
స్తుతి(మ)గు మణ్డం గండ జవి
  మార(ణ్డు) పౌరుషసమ్మిణ పారుణై.

3. తన......లోక విది
  తంబుగం బ్రోచిన పణ్డధారుణీ
జనపతిసం స్తరంబున ధృ
  తస్థితి నబ్బెజవాడ నన్యపా
ధనసుభటాళిలిం దునిమి
  తమ్ములు దానునుం బోరిలోనం జే
కొన్ని గెలిపించె నా(డు)నధి
  కుణ్డగు మారణ్డు శౌర్య పారుణై.

4. ఓరుదు మాడలుం జెనదె
  పెన్న(ను) నింతియకాని (త)మ్ములో
పారయలేని పంచల దు
  రాత్ముల దుష్యర్థవసాయులను దురా
చారులం జెప్ప జేట్టికి ల
  సద్గుణధీరు......వీరగు
వ్యాకర(ణు)రికైకమ్మణకుల
  వల్లభు మారనిం జెప్ప డిమ్మహిన్.

పై విధముగ ఆ పద్యములను సవరించినను 'జితరిపుచేత' యను పద్యమునకు అర్థముగాని, యన్వయముగాని కుదురుటలేదు. ఎఱ్ఱమండజనపాలుడు శ్రీగిరి పశ్చిమదేశమునకు పతి-ప్రభువు కాడు. అతని రాజ్యము కొండవీటి కొండలకు పశ్చిమమున నున్నది.

నేను మద్రాసులో నున్న యప్పుడు ఒక కళాశాలలోని తెలుగు ఉపన్యాసకు లొకరు నా యొద్దకు వచ్చి ఈ పద్యములను జూపి వీని కర్థము చెప్పుమని కోరినప్పుడు కాని నేను వీనిని పరిశీలనగ జూచి లేదు. వేరువేరు కళాశాలలలోని తెలుగు ఉపన్యాసకులు వీని నెట్లు సమన్వయించి యర్థము చెప్పుచున్నారో నాకు తెలియదు. నా కీ పద్యములను జూచినగనే ఎఱ్ఱమండభూపతి రాజ్య మేదో అదివరకే తెలియుటచేత 'శ్రీగిరి'కి శ్రీ పంతులుగారు సూచించిన 'శ్రీగిరి' యను సవరణ సరియైనది కాదనియు, పద్యము సుబోధము కాకుండుటచే నిది దోషభూయిష్ఠముగ నున్నదనియు తోచి శాసనమున నిట్లేయున్నదా యని కనుగొనవలయు నను ఆత్రము కలిగి శాసన ప్రతిబింబము చూడవలెనను బుద్ధి పుట్టినది. అప్పటికి—ఇప్పటికి నేమో నాకు గుర్తులేదు—శాసనశాఖవారి ఆఫీసులో కొంతభాగము అదృష్టవశమున మద్రాసు సెంటుజార్జి కోటలో నే యుండెను. దక్షిణహిందూదేశ శాసనసంపుటములలో నదివరకు ప్రకటితములైన శాసనముల ప్రతిబింబములు కొన్ని యచ్చటనుండినట్లు తెలిసి యచ్చటి కరిగి ఈ శాసన ప్రతిబింబమును దీయించి చదివితిని.1

శాసనము చెక్కిన శిల ఇసుకరాయి యగుటవలన నేమో శాసనాక్షరములు పరిస్ఫుటముగ లేవు. శాసనమునందలి కడపటిభాగము బొత్తిగా పాడుగా నున్నది. అక్షరములు దగ్గరదగ్గరగ నుండి వ్రాత పాడుగ నుండుటచేత సరిగ పాఠము విడదీయుటకు కుదురలేదు. ఈ కారణముచేత ఈ శాసనమునందలి పద్యములలోని కడపటి కందపద్యము నీ వ్యాసములో పొందుపరచుట మానితి.

కొన్ని దినములపాటు ఈ శాసన ప్రతిబింబమును పరిశీలింపగా పరిశీలింపగా తుదకు ఈ శాసనపాఠము ఇదివరకున్న దానికంటె కొంత మెరుగుగా కుదిరినది.

---

1. దయతో నా కీ శాసనప్రతిబింబమును పరిశీలించుకొననిచ్చిన గౌర్నమెంటు శాసనశాఖాధిపతులకు అందుముఖ్యముగా శ్రీ హెచ్. వి. నరసింహస్వామి గారికి నా కృతజ్ఞతాపూర్వకవందనములు.

పద్యములు కొంతవఱకు సుబోధములై నవి. పూర్వోక్త దానాశ్రితపద్యములలో రెండవదాని యందలి జేగిరి శ్రీగిరి కాదన్నది రూఢమైనది. నేను పరిశీలించిన శాసన పద్య పాఠమును ఈ దిగువ పొందుపరచుచున్నాను.

1. శ్రీరమణీయుండు కులని
స్తారకుండు న...శ్యదంగుండు సుజనా
ధారుండు గన్నయపుత్రుండు
సూరణ్డు సూ...పత్తికొండ సూరన చేయించెని.

2. జితరిపునేత మణ్డలిక
సంగముచే గిరిపశ్చిమావనీ
పతియగు నెల్లిమణ్డజన
పాలకుచేత మహాప్రధానిక
స్థితియును నందలంబును వి
శేషవిభూతియుం జేయించెతోడ ప్ర
స్తుత మగుచుండగా బడసె
సూరణ్డు పౌరుషధర్మ సారుస్థై.

3. తన...లోకవిది
తంబుగబ్రోచిన మణ్డవారుణీ
జనపతి ప్రస్తవంబున శ్రీ
శస్తితి నబ్బెజవాడ నన్యసా
ధనసుభటావలిం దునిమి
తమ్ములు దానునుం(!)బోరిలోవం జే
ర్చెని గలిపించె నాకు నధి
కుణ్డగు సూరణ్డు కౌర్యసారుస్థై.

4. చీరపుమాటలం జెనటి
పేర్లు(ను*) నింత్రియ కాని తమ్ములో
పారయులేని పందల దు
రాత్ముల సువ్వర్ణవసాయులను దురా
చారులం జెప్ప నేట్లికి ల
సద్గుణ ధీరు...వీరదు
వాన్వరణు విస్వకర్మకుల
వల్లభు సూరనిం జెప్పఁ డిమ్మహిని.

5. అనుపమసాహస స్ఫురన
సమ్మెఁ మెయిం దలపోయ నా[జిం] చే
ర్చెని కమ్రుపీరులై చెగను
కున్నులు బొంద్దలతోడి యాడనం
జను నపహాయ సాహసర
సప్రియు మణ్డమహీత లేఖ క
ట్టనుంగు సద్గ కౌయ్యుర్జ సభ
టాగ్రణిం ప్రోలమపుత్రు సూరణిని.

6. రాజవిభూషణుండు సుర
రాజరిలాసు ణవ స్తకీర్తి వి
భ్రాజితుం డెల్లిమండజన
పాలకు నచ్చిన వజ్రదండ గ
న్నాజ సుతుండు సూరని మ
హోద్విప సన్నిధిం చె(?)ప్పరాజ స
తోషజ[ు]తు విశ్వకర్మకుల
భూషణు వైరినరేంద్ర భీషణున్.

7. గొడుగులు నందలంబును న
సువ్వర్ణగుదున్న మహావిభూతియుం
బ్బడసెను విశ్వకర్మముని
జావర్తి వల్లభుచేత విద్యమెయి
గొడుగులు నన్దలంబును న
సువ్వర్ణగుదున్న మహావిభూతియుం
బ్బడసెను నెల్లిమణ్డజన
పాలకుచేతను సూరం డమ్మర్గమెయి.

3

ఈ శాసనము ఎల్లిమండనృపతి భృత్యుఁడును, కన్నాజ ప్రోలముల కుమారుఁడును, విశ్వకర్మకుల వల్లభుడును అయిన సూరడు చేబ్రోలి కుమారస్వామికి అఖండదీపమునకై గొఱియలను దానము చేసిన విషయమును దెలుపుటకు పుట్టినది. ఈ విషయమును దెలుపు సీసపద్యము శాసనపద్యమంజరిలో ఆరవసంఖ్య శాసనముగ నీయబడినది. ఆ పుస్తకములో ఆరవ, ఏడవసంఖ్యలవి రెండును గలిపి ఒకటే శాసనము. ఈ శాసన కాలము శకవర్షము 1040 (శకమహీపాలకసంవత్సరంబులు గగనాబ్ధి విధు దింగుగణన దనర). ఈ సీస పద్యమున సూరడు "శూద్రక ప్రభృతులతోడికులము వాడ(?కు)ను కలితనమువా" డనియు, "మండ భూపాలకు మహనీయు సామ్రాజ్యరాజ్యాభివృద్ధిపరాయణు"డనియు, "అతులశౌర్యసారు" డనియు,"రుంద్ర యశు" డనియు వర్ణితుడయినాడు. ప్రాచీనకాలములో విశ్వకర్మకులజులు కూడ మహీపతుల కొలువులో చేరి సంగ్రామరంగమునం దనుపమ శౌర్యసాహసములను జూపి విక్రమించి తమ ప్రభువులకు విజయము చేకూర్చి వారివలన అనేక గౌరవమర్యాదలను పొందుచువచ్చిరి. అట్టివారిలో ఈ సూరడొకడు.

క్రీ. శ. 1118 (శకవర్షము 1040)లో మొదటి కులోత్తుంగచోడభూపతి తన కుమారుడైన విక్రమచోడ నరేంద్రునికి యౌవరాజ్యపట్టము కట్టెను. నాటినుండి యువరాజు తండ్రితో గలసి రాజ్యవ్యవహారములను చక్కబెట్టుచు వచ్చెను. వేంగిని రాజప్రతినిధులుగ పాలించుటకు చక్రవర్తి తనయులైన రాజకుమారులింకెవ్వరును లేకరి. అందువలన పూర్వచాళుక్యుల వేంగీరాజ్యము మాండలికుల పరిపాలనక్రిందనే యుండి పోయెను.

అంతకుపూర్వమునుండియు వేంగిని వశపరచుకొనుటకు అనేక ప్రయత్నములు చేసి విఫలులైన పశ్చిమచాళుక్య చక్రవర్తులలో కులోత్తుంగచోడ చక్రవర్తికి సమకాలికుడును, ప్రబలశత్రువును, త్రిభువనమల్ల బిరుదాంచితుడును అయిన ఆఱవ విక్రమాదిత్య చక్రవర్తికిపుడు మంచి యవకాశము లభించినది. కులోత్తుంగ చోడునికి సరియైన ఉజ్జీ విక్రమాదిత్యుడు. ఈతని యాస్థానకవియైన బిల్హణ కవీంద్రుడు విక్రమాంకదేవ చరితమను పేర నతని జీవితచరిత్రమును సంస్కృతమున రచియించెను. విజ్ఞానేశ్వరీయమను పేర యాజ్ఞవల్క్య స్మృతికి వ్యాఖ్యానమును రచించిన విజ్ఞానేశ్వరుడు కూడ విక్రమాదిత్య చక్రవర్తి యాస్థానకవే. విక్రమాదిత్యుని యాస్థానములో బిల్హణుని వంటి కవిచక్రవర్తులే కాక సాహసవిక్రమార్కుల వంటి దండనాయకులు కూడ నుండెడివారు. అట్టి వారిలో మహాప్రచండ దండనాయకుడు అనంతపాలరసు ఒకడు. విక్రమాదిత్య చక్రవర్తినియోగమున అనంతపాలదండనాయకుడు సేనలను గూర్చుకొని వేంగీదేశముపై దండెత్తివచ్చెను. వేంగీదేశములోని దుర్గములొక్కటొక్కటిగ శత్రువులకు వశమగుచు వచ్చినవి. ఈ దండయాత్రాసందర్భమున పశ్చిమచాళుక్య సేనకును, మాండలిక సేనకును పోరు జరిగిన ప్రదేశములలో బెజవాడలో జరిగిన పోరిలో ఎఱ్ఱమండభూధవుని పంపున అతని కట్టనుంగు సూరడు దండుగూర్చుకొని శత్రువులతో తలపడెను; శత్రుభటావలిం దునిమి తన ప్రభువునకు గెలుపు చేకూర్చెను. జనపాలుడందుకు మెచ్చి అతనికి 'మహాప్రధానిక స్థితియును, అందలమును, విశేషవిభూతియు' ననుగ్రహించెను. విశ్వకర్మునితొల్లి పార్వతీవల్లభుని చేత 'విద్యమై' 'గొడుగులు, అందలము, మహావిభూతియు' బడసిన విధమున అనవ్రతకీర్తి విభ్రాజితుడు 'ఎఱ్ఱమండజనపాలకు నచ్చిన వజ్రదండ' సూరడు 'అర్థిమై' ఆ జనపాలకు చేతను 'గొడుగులు, అందలంబును, మహావిభూతియు' బడసెను. 'శాసనపద్య మంజరి' పీఠికసంఖ్యశాసనములోని విషయము ప్రధానముగ విశ్వకర్మకులవిభూషణుడైన సూరని ప్రశస్తి.

ఘటన

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

"అయ్యా, కొండుభట్లు పంతులుగారు! కన్యావరణాల సమయం సెలవిప్పించండి" అనడిగాడు మొగపెళ్లివారి పురోహితుడు.

"అది మా మామగారితో మనవి చెయ్యండి మీరు" అని మాత్రం అని వూరుకున్నాడు, పెళ్లికొడుకు తండ్రి, కొండుభట్లు.

"వీరప్పయాజులుగారితో మనవి చేసుకుంటున్నా" నన్నాడు, పురోహితుడు.

అజానుబాహువు మనిషి యాజులు.

పంచె కట్టాడు; కాని లాంగ్‌కోటు తొడిగి, పాగా చుట్టుకుని వున్నాడు అతను.

జానెడేసి పొడుగున్నాయి మీసాలు, వెండి తీగల్లా. సహజంగా లావుగ్గ వతను, దసువుసంస్యలు తక్కువయినా, వేషానికి మాత్రం లావుగ్గానే వుంటాడు, సప్రయత్నంగా.

ప్రతిభావంతుడని పేరూ వుందతనికి, దానికి మాటున రాకీసు సిన్న బిరుదూ వుంది.

"జరిగించెయ్యండి" అన్నా డతను, చేయూపుతూ.

పురోహితుడు సభాపతికేసి చూశాడు.

"గ్రామశ్వేనా పదిరూపాయ లిప్పించండి" అన్నాడు సభాపతి.

పురోహితుడు తనకేసి తిరక్కముందే "పెద్దలకు అణాచొప్పున ఇప్పించండి" అన్నాడు యాజులు.

ఇది విని, సభాపతి, కళ్లు మూసుకుని తలఅడ్డంగా వూపుకున్నాడు.

"సభాపతిగా రంగీకరించడం లేదు యాజులు బాబుగారూ!"

"ఏమో?"

"కన్యావరణాలూ, సభాకట్నాలూ వూరుమ్మడి మీద పుచ్చుకోడం వుంటుంది, కొన్ని వూళ్ళలో."

"అయితే?"

"ఎంతో కొంత మొత్తం సభాపతిగారి కందించాలి, ముందు మనం."

"తరవాత?"

"గౌరీపూజామంటపం దగ్గిరికి, పెళ్లి ప్రవర పూర్వకంగా వరుసి పేరు చెప్పి పిల్ల నడగడానికి, ముగ్గురినో, అయిదుగురినో, మరికొందరినో, ప్రత్యేక ప్రత్యేకంగా కన్యావరణ లిచ్చి పెద్దలను కూడా పంపాలి, మనం."

"అదంతేనా?"

"వరహా లివ్వవద్దు, రూపాయ లివ్వవద్దు, అర్ధలు - పావులాలు - బేడలు - అణాలు - అర్ధణాలు కానులు చివరికిప్పటి మానం ప్రకారం కొత్తపైసలున్నా యివ్వవద్దు" అని బదులు చెప్పాడు సభాపతి పురోహితుడికేసి చూస్తూ.

యాజులు మొగం చిట్లించుకున్నాడు.

ఈ మర్యాదలు తెలియనివి కావతనికి.

కాని, సభాపతి మాటగా తన్నడక్కపోడం.

తనకేసి చూడకపోడం, తరవాత సైనా.

పోనీ అంటే, కొత్తపైసల మాట యెత్తడం.

ఆయన తనని లోభికింద కట్టా డనుకున్నాడు.

అది పరాభవంగా భావించుకున్నాడు.

అభిమానం తెచ్చుకున్నాడు.

ఆగ్రహం కూడా? పెంచుకున్నాడు, చివరికి.

దీంతో "రెండువిధాలా యివ్వలే మని చెప్పండి" అన్నాడు, తానున్నా పురోహితుడికేసి చూస్తూ, యాజులు.

"ఇవ్వం అనే చెప్పండి"అని కూడా అన్నా డతను, కొంచెం దురుసుగా.

సభాపతి మాట్లాడలేదు.

పాలోచనగా పక్కకి చూశాడతను, కొంచెం కిందుగా.

అలా వుండే కళ్ళుమూసుకున్నా డొక్కమాటు.

చివరికి, తన యెదటే వున్న వృద్ధపండితుడికేసి పులుకూ పులుకూ చూసి వూరుకున్నాడు.

"తరతరాలుగా వస్తున్న ఆచారం యిది మావూళ్లో. ఇవాళ హఠాత్తుగా మారవలసిన అగత్యమూ లేదు. మారనూ మారదు" అన్నా డా వృద్ధపండితుడు సభాపతికేసి చూస్తూ.

"మావూరి మర్యాదలు వేరు. మేము పాటించు కోవలసిన వవి."

వీరప్పరాజు లిలా అన్నాడు, కాని అతను మాట ముగించక పూర్వమే "కాదు కా" దన్నాడు, మరో పెద్దమనిషి.

"ఏమి కాదు?"

"మా గ్రామంలో — అంటే పెళ్ళికొడుకు స్వగ్రామంలో కూడా రెండు విధాలా యివ్వడమే ఆచారం."

"కావచ్చు. వ్యవహారం నడుపుతున్న వాణ్ణి నేను. ఈవూరి మర్యాదలతో నాకు ప్రసక్తి లేదు."

మరెవరూ మాట్లాడ లేదు.

వ్యవహారం నిలిచిపోయింది.

గడియారమే ఆగిపోయి నట్టయింది.

పులుకూ పులుకూ చూశాడు పెళ్ళికొడుకు, తండ్రికేసి.

"అబ్బాయి—" అన్నాడు కొంకుభట్టు పురోహితుడితో.

"పెళ్ళికొడుకే కాదు, నేనూ తొందరపడు తున్నాను, కాని వ్యవహారం నావశం తప్పింది. దిగ్గంతుల వంటి పండితులు కూచుని వున్నారు సభలో. లోకంలో నేను తలెత్తుకుని తిర లంటే నా బాధ్యత కూడా వుందిక్కడ. సభాపతిగారూ విహామగారూ కూడా అనుజ్ఞ దయచేయిస్తేనే, ముందు కడుగు వెయ్యడం నేను" అని స్పష్టంగా చెప్పాడు పురోహితుడు.

"మాకు తోచింది మేమిస్తాం" అన్నాడు యాజులు, బెట్టుగా.

"తమ కొమార్తె పాణిగ్రహణం సందర్భంలో ఆశీర్వచనం చేసి, వెళ్ళవలసిందన్న కన్యాదాత పిలుపు మీద వచ్చాం మేము. మావిధి మేము మరిచిపో లేదు. తప్పము కూడా. అయి తే, ఈవూరి మర్యాదలతో తమకు ప్రసక్తి లేదన్నవారి వూరి మర్యాదలతో మాకూ లేదు, ప్రసక్తి."

సభాపతి యింగితం గుర్తించి వూరి వృద్ధపండితు డిలా అనగా, అందరి చూపులూ యాజులుమీద పడ్డాయి, గోదావరిజల్లులాగ.

ఆలోచించాడు యాజులు.

వివరం తప్పించా లనుకున్నాడు.

"సుముహూర్తం దగ్గిరపడుతోంది, కానివ్వా" లన్నాడతను, కొంచెం గట్టిగా.

"నా అభ్యంతరం యేమీ లేదు. గడిచిపోయిన కాలం నేను కూడతీసుకోగలను. కనక, యింకో మాట చెబుతున్నాను. ఊరివారి అనుజ్ఞ లేకుండా తంతు నడిపించుకొనిపోవడం అతి సాహసం అవుతుంది" అని మళ్ళీ చెప్పాడు, పురోహితుడు.

"మరి తంతుమాట? సుముహూర్తం—దాటి పోతే దాని కెవరూ బాధ్యులు?"

అందరూ వులిక్కిపడ్డా రిది విని.

చూడగా, అయిమూలకొంగం పెట్టుకుని నిలవ తీస్తున్నట్టు చూస్తున్నాడు కొంకుభట్టు.

అసల్లో రెవెన్యూ తహస్సీలుదారతను.

తాను పనిచేసిన తాలూకాల్లో చండశాసను డనే పేరుం దతనికి.

కాని యిది అతను పనిచేసిన వూరు కాదు.

ఇది సభ కాని తాలూకా కచేరీ వసరూ కాదు.

తన పట్టు కయినా తహస్సీలుదారూ కాదత నిప్పుడు.

నిజాని కిది అతనికొడుకు పెళ్ళి.

అయితే, మొగపెళ్ళివారిలో భోజనాలకు పిలుపు వస్తే రొంటరిపట్టుకి వాళ్ళే మడికట్టుకుంటారు, తక్కినవారు.

అతను మాత్రం యాజులు కూడా పిలిస్తేనే సిద్ధపడ్డం.

ఏమయినా, అతని చేవ్రాలుతో వున్న ఆహ్వాన పత్రిక. అందుకనే వచ్చారు, చాలామంది పెద్ద మనుష్యులు.

వారిలో కొందరతనిలాగే "రిటైర్డు" బాపతువారయినా, ఇప్పుడు పనిచేస్తున్నవారూ వున్నారు, చాలామంది.

కొన్ని తాలూకాకచేరీల గుమాస్తాలూ వున్నారు.

మరి, తాను కూడా వారిలాగే శ్రోతా ద్రష్ట అయిమాత్రమే కూచోవడమా?

ఇదిగో, యీ తపనతో తన పెత్తనం యిలా చూపించుకున్నాడతను.

"ఒక్క సంగతి మనవిచేసుకుంటా" నంటూ అందుకున్నాడు, పొరుగూరు ప్రౌఢవిద్వాంసు డొకడు—ఇది తెలియక.

"శాక్యాన్ని పట్టిలాగే వైదికాన్ని పట్టిన్నీ వొక్కొక్క వూరి కొక్కొక్క పద్ధతి యేర్పడి వుంటుంది—"

"అయితే, యేమిటండీ?" అంటూ గద్దించాడు యాజులు.

"ఏమిటో వివరించుకున్నారా మీరు?" అని ముదలకించాడు పండితుడు.

"చెప్పండి చూతాం."

"అయితే, నేను చెప్పేదంతా వినండి ముందు."

"చెప్పమన్నాగా?"

"ఈవూరు వచ్చారు మీరు. ఇక్కడివారికే మీరు కన్యావరణ లివ్వడం. కనక, సభాపతిగారి మాట విశ్వసించడమూ అంగీకరించడమూ మీకు ధర్మం."

"ధర్మం అంటే యెక్కడిది? మే మివ్వడానికి సిద్ధంగా లేమనా మీ వూహ, పోనీ?"

"మరి, సాహసించకపోడాని క్కారణం?"

పక్కకి చూస్తూ వూరుకున్నాడు యాజులు.

"ఇంకొకటి కూడా వుంది" అంటూ అందుకున్నాడు వూరి యువకుడు.

"పదు లడిగితే పాతికలూ, పాతిక లడిగితే నూట పదార్లూ ఇచ్చినవారు కూడా వున్నారు, ఈవూరి విద్వాంసులు."

కళ్లు మూసుకుని, సభాపతి, తలతాటించుకున్నాడామాటకి "అవు" నన్నట్టు.

"అడిగిందే యివ్వనివారు లే రంటారా?" అనడిగాడు యాజులు, అవ్యవధానంగా అందుకుని.

"ఉండరూ? ముఖేముఖే సరస్వతీ కదా?"

"సరస్వతి మాటకి తల వూపవలసిందేగా అందరూ?"

గభీమని లేచా డొక యువకుడు.

మంచి వర్చస్వి అతను.

మెరుపు దీపాల వెలుగులో కళ్ళు జిగాల్ జిగాల్మనిపించేస్తోంది అతను కప్పుకుని వున్న వూదారంగు జరీ కాశ్మీరుశాలువు.

మొదట చాలా చురుగ్గా చూశా డతను.

సభ అంతా సావధానం అయినట్టు తోచగానే వొక్కటే మాట అన్నా డతను, అతిఖండితంగా "మీ రడిగినంతా ముందే పుచ్చుకుని వచ్చారు మీ రీవూరు, కనక, మే మడిగినంతా కూడా మాకిచ్చి మావూరి పిల్లను చేసుకుని వెళ్లండి మీవూరు" అని.

సభ అంతా చకితం అయిం దామాట విని.

గుసగుసలు రేగాయి, అంతటా.

బహుముఖాల తాండవం ప్రారంభించింది, చివరికి సరస్వతి.

రెండే మాటలు వినపడ్డా యా కోలాహలంలో అందరికీ "ఇవ్వం" అని వొకటీ "అలా యిస్తేనే గాని పుచ్చుకోం" అని వొకటీని.

2

"అదేమే, పిల్ల మొగాన సంబరమే కనబడదేమే?" అనడిగిం దొక ముత్తయిదువు, అపవారించి పెళ్ళికూతురి తల్లిని.

"వయసు వచ్చిన పిల్లగదా, పెళ్ళిలో సిగ్గుపడదూ పిన్నీ, నా బిడ్డ?"

"ఏమో, నవ్వు మందకొడిగానే కనపడుతున్నాదే."

"నెత్తిమీద యింత బరువెత్తుకున్నాము గదా-"

"లక్షలు పోగుపెట్టుకొచ్చున్నాడు నీ మొగుడు, బరువేమిటే నీకు?"

"లక్షలుంటే తీరిందటమ్మా యిది, మొగపెళ్ళివారిలో పిల్లా మేకా కాక, పేరంటాళ్లే యాభైమంది వున్నారు. తగిన మర్యాదలు చేసి వారిని సాగనంపడం యెలాగో, ఆందోళన కాదుటమ్మా నాకు?"

గౌరీపూజ ముగిసింది.

సభక్తికంగా నాందీ దేవతారాధన పూర్తిచేసుకుని, పీటలమీదినుంచి లేచివెళ్ళి యెందుకో యెవరితోనో మంతనాలు సాగిస్తున్నాడు కన్యాదాత.

"పెసరట్లు లేకపోతే తెల్లవారడమే గాని పొద్దు గడవదుట వియ్యపురాలికి, కొంపతీసి మరిచిపోలేదు గదా తమ్ముడూ!" అనడుగుతూ కొట్టు పెత్తనదారు కోసం వంటపందిటిలోకి బయలుదేరింది పెళ్ళికూతురి తల్లి.

"మరదలా," అని పిలుస్తూ ఆమె వెంటబడింది మరో ముత్తయిదువు.

"ఏమే, మా చెల్లెలి కొడుకు కిరీటి పనికివచ్చాడు కాదూ నీ చిన్నకూతురికి?" అని కూడా అడిగిందామె, కంఠం నొక్కుకుంటూ.

"అదేమిటి వదినా అలా అడుగుతావూ నువ్వు? కిరీటివంటి పెళ్ళికొడుకుని సంపాదించుకోగలమా మేము? పిల్ల చూపంతా అతనిమీదే వుందమ్మా యిప్పటికీని?"

"మరి, యిలా యెందుకు జరుగుతోంది?"

"మా పెద్దల్లుడు వుద్యోగస్థుడు, సువ్యరుకుడు. చిన్నల్లుడు కూడా వుద్యోగస్థుడే అయి వుండాలిట మీ తమ్ముడుగారికి. శతపోరాన్నేను, వినిపించుకుంటేనా?"

"నలభై యకరాల మాగాణి—ముద్దులమూటకట్టే మేడ—యాభై అరవై వేలకు తక్కువ లేని నిలవ—"

"ఏం మెరగమటమ్మా? ఘటన లేదనుకోవాలి."

"పెళ్ళికి రమ్మని పిలిచారు కామోసు మీరు, సభలో కూచుని వున్నాడు మా నాయన. వాడియెదట మీరు తెచ్చిన పెళ్ళికొడుకు—"

"తీసికట్టు, వరా?"

"రెండో పెళ్ళివాడని సందేహించి వట్టున్నాడు, మా తమ్ముడు. పాతికేళ్లు నిండలేదు నాయనకు."

"అదేమీ కాదమ్మా, రెండో పిల్లనయినా యీ వూళ్లో యిచ్చుకుందామని మహా వుబలాటపడ్డా న్నేను. పిల్ల రాతా నారాతా యిలా వున్నా యేమి చెప్పకోనూ?"

"పద్దెనిమిదేళ్ళు నిండిన పిల్లగదా, సంబరమే కనపడదేమీ మొగానా? నే నెరగనివా దాని చురుకుదనమూ, దాని వుబలాటమూ—"

"పీటలమీదికి వెళ్ళాక యేమవుతుందో నా బిడ్డ, మతి పోతోందమ్మా నాకు."

"మెడలు వంచారు కామోసు మీరు, అదేం చెయ్యగలుగుతే, పసిపిల్ల పాపం?"

"పిలవడానికి వెళ్ళగా 'నేను రాలేను వదినా, మరోలా? అనుకోకు' అంది మీ చెల్లెలు. కిరీటికి తండ్రి లేకపోడం నిజమే అనుకో, నే నర్థంచేసుకోలే దనుకున్నావా మీ చెల్లెలి వూహా?"

"తనకి కట్నం అక్కర్లేదన్నాడు కిరీటి. 'అమహాలక్ష్మి తన యింట్లో అడుగుపెడుతుం' దనుకుంది నా చెల్లెలు."

"మూడువందల రూపాయల జీతగాడని పెళ్ళికొడుకుని చూసి మురిసిపోతున్నారు మీ తమ్ముడు, నిన్న తెల్లవారింది మొదలు అన్నం ముట్టంలేదు, నా బిడ్డ తెలుసా?"

"పదివేలు పోసి కొని తెచ్చుకున్న మొగుడు, కాఫీ వుపమాలూనే గాని అన్నం ముట్టుతుందా యేమిటది యింక?"

3

"ఏమి శేమి?"టని ఆత్రంగా అడుగుతూ వచ్చాడు గౌరీపూజా మంటపం దగ్గిరనుంచి కన్యాదాత.

"కన్యావరణలదగ్గిర ఆగిపోయివుందంట తంతు" అని బదులు చెప్పాడు తన పురోహితు డతనికి.

"కారణం?"

"గ్రామస్థు లడిగిన మొత్తం వరపక్షంవా రివ్వరుట. వరపక్షం వారిచ్చేది గ్రామస్థులా పుచ్చుకోరుట"

"ఇంత అని నిర్దేశం—"

"పదిరూపాయ లడిగారు గ్రామస్థులు. తమకు తోచిం దిస్తారుట వరపక్షంవారు. అదయినా గ్రామ త్యేనా కాదుట, అణా చొప్పున యిస్తారుట."

అటుచూసి యిటుచూసి "బావగారూ" అని పిలిచాడు కన్యాదాత, పెళ్ళికొడుకు తండ్రిని.

"మీరు చెప్పతలిచిం దేదో నాతో చెప్పండి" అన్నాడు యాజీ అవ్యవధానంగా, కళ్ళు పెద్దవి చేసుకునీ, తర్జనితో తనని నిర్దేశించుకుంటూను.

కన్యాదాత తన మామగారికేసి చూచి వూరుకున్నాడు.

ఆవూరి కరణమే అతని మామగారు.

అపలీసంబంధం కోరి కుదిర్చినవాడే ఆ కరణం.

అటూ యిటూ మాతామహు లయివున్నవా రిద్దరూ చూసుకున్నారు గంభీరంగా,

"నేను మీకు చెప్పవలసినవాణ్ణి కాను" అన్నాడీ మాతామహుడు.

"నేను మీ చేత చెప్పించుకోవలసినవాణ్ణీ కాను" అన్నాడా మాతామహుడు.

"వ్యవధి లేదు మరి" అన్నాడు కన్యాదాత పురోహితుడు.

"మన కా ఆందోళన అక్కర్లేదు, మిథునం కూడా తారాబలచంద్రబలయుక్తంగానే వుంది" అని బదులుచెప్పా డందుకు వరపక్షంవారి పురోహితుడు, యాజీ లందుకోకముందే.

"నా కనుష్ఠానసమయం అవుతోంది, మరి" అంటూనే లేచాడు సభాపతి.

"మిథునమే స్థిరపరిచారా ?" అనడుగుతూ తానుగూడా లేవడాని కుద్యుక్తు డయినాడు, పొరుగూరి వృద్ధపండితుడు.

"ఆందోళన అక్కర్లే దన్నా నందే" అని మళ్ళీ బదులు చెప్పాడు వరపక్షం పురోహితుడు.

"ఏమి సెలవు?" అనడిగాడు కన్యాదాత, చేతులు దోయిలించుకుని యాజులుని.

"చెప్పానుగా?"

అసంతృప్తి—విసుగు—నిరసనభావం - అసహనం—ముంగోపం—మూతిముడుపులు—ఇన్ని ప్రతిఫలించాయి, సభాముఖాన.

"మనం వైదీకులం, ఇది వైదికతంతుకి సంబంధించిన విషయం. మీరు కొంచెం ఆలోచించాలి" అంటూ చేసుకువస్తున్నాడు, గ్రామకరణం.

"ఎంత దూరం ఆలోచించాలో అంత దూరమూ ఆలోచించే స్థిరపరిచాన్నేనీ విషయం" అంటూ తివాసీ సద్దాడు యాజులు.

4

ఉత్తరపు వసారాలో పైపాన్యమి సన్నాయి ఆగిపోయింది.

దక్షిణపు తెరపిలో అమ్మణ్ణి మేజువాణీ కూడా నిలిచిపోయింది.

"ఏమిటేమిటి?" టవకుసుతూ దూసుకువచ్చారు చాలామంది పెళ్ళిపెద్ద ఉభయపక్షాలవారూ.

వారిలో వొక సబ్ మాజిస్ట్రేటున్నాడు.

ఒక సర్కిల్ ఇనస్పెక్టరున్నాడు.

ఏడెనమండుగురు అడ్వొకేట్లున్నారు.

అయిదారుగురు డాక్టర్లున్నారు.

పంచాయతీబోర్డు ప్రెసిడెంట్లే వున్నారు పదిమందికి పైగా.

ఒక బుగ్గమీసాల ముస్నద్దీ కూడా వున్నాడు.

"దయచెయ్యండి రాజాబాబూ" అంటూ వచ్చాడా ముస్నద్దీ, ఒక క్షత్రియ ప్రముఖుడికి తహజీమిస్తూ.

ప్రశ్నలు—ఆందోళన—జిజ్ఞాస—ఆత్రం—అభావం—కంగారు—అసంతృప్తి—వెటకారం—ఇన్ని చిత్తవృత్తులు లాస్యం చేస్తున్నాయి వారందరి మొగాలమీదా.

వరుని వూరి పెద్దకరిణం ఆ ముస్నద్దీ.

ఆవూరి మున్సబా క్షత్రియప్రముఖుడు.

కానయితే మూడో వరసలో కూచున్నాడు ముస్నద్దీ, కాని, కొంచెంభట్టు, ముందటు మామగారిని చూసీ, తరవాత తనకేసి చూసిన చూపందుకుని "ఏ స్థితిలోవున్నాం బ్రహ్మగారూ మనం?" అ నడిగాడు పురోహితుణ్ణి, ముందు తానాసవశుద్ధిగా కూచుని.

పురోహితుడు చెప్పాడు.

"ఊరివారికీ మొగపెళ్ళివారి పక్షం పెద్దలకూ మాటపట్టింపులు వచ్చాయి కన్యావరణల దగ్గిర, మరి" అనిన్నీ వివరించాడతను.

"అలాగా?" అన్నట్టు తల పంకించుకున్నాడు ముందు ముస్నద్దీ.

"దుంపలు దంపలు చేసుకుని తరలివచ్చాక—మంగళస్నానాలయినాక—ధర్మప్రజాసంపత్తికోసం ఒక స్త్రీని పెళ్ళిచేసుకుంటానంటూ వరుడు సంకల్పం చేసుకున్నాక—పిల్లను చూసిపెట్టండని కోరి పెద్దలను రాయబారం పంపవలసిన స్థితిలో—వరుడు మూడుముళ్ళు వెయ్యగలిగేటట్టు సన్నివేశాలు కల్పించుకోవలసిన మొగపెళ్ళివారికి పట్టింపులు."

"చిత్రం" అన్నాడు పొరుగూరి విద్వాంసుడు.

"ఆడపెళ్ళివారితో నయినా కాదు, వూరివారితో పట్టింపులు."

"చిత్రం—చిత్రం"

సభ అంతా దలితం అయిందీయెత్తుగడ చూసి.

ఎగిసిపడి విరగబడి చూశాడు యాజులు.

అది గుర్తించాడు ముస్నద్దీ.

"సద్గుణోదం ధర్మం" అన్నాడతను, తాపీగా.

"తమరు చాలా ధర్మంగా సెలవిప్పించారు" అన్నాడు విద్వాంసుడు.

"మరి. తరవాయి?" అని మళ్ళీ అడిగాడు ముస్నద్దీ.

"ముందడుగు వెయ్యవలసినవారితో తమరు వక్కాణించడం."

"మరి ముందడుగు వెయ్యడం అంటే?"

"వెనకతీత అన్నమాట."

"అదీ మాట. వెనకతీత వున్నచోటే సాచి అడుగు పడుతుంది ముందుకి"

"పోనీ అంటే వూరివిద్వాంసులు—"

"వారు బాగా తెలుసు. ఈవూరి విద్వాంసులు పుంభావసరస్వతులు. ఇక సభాపతిగారా, సాక్షాత్తూ బృహస్పతే. కనుక వారు సెలవిప్పించినట్టు నడుచుకోవలసినవాణ్ణే కాని, వారికి చెప్పవలసినవాణ్ణి కాన్నేను."

"చిత్రం" అన్నాడు మళ్ళీ పొరుగూరి విద్వాంసుడు పొగతీసుకుంటూ.

గతుక్కుమనిపోయాడు యాజులు.

తమపక్షంగా వచ్చిన పెద్దమనిషే తనమీద—ముఖ్యంగా తనమీద దోషారోపణ చెయ్యడం.

కొట్టినంత పనయింది యాజులుకి దీంతో.

పైగా, ముభావంగా మాట్లాడుతున్నాడు ముస్నద్దీ.

కవక?

"వారడిగినంతా? యివ్వవలసినదేనా?" అనడిగాడతను, తానూ ముభావంగానే.

"వారడిగినంతా యివ్వవలసిందేనా? అని కాదు, చూసుకోవలసిం దిక్కడ, వారిచేత అడిగించుకోవలసిందేనా?" అని.

"పండితులకు సంభావన యివ్వడం అంటే నాకెంత యిష్టమో—"

"కన్యావరణ లివ్వడం అంటే పండితులకు సంభావన యివ్వడం కాదు యాజులుబాబు గారూ" అన్నాడు పురోహితుడు.

"మరేమి టండీ కాకపోతే?"

చాలా గట్టిగా అడిగా డత నీమాట.

గ్రహించి మరీ అడిగాడు.

"ఏమిటో వుమ్మన్నా?" అన్నట్టు చూశాడు ముస్సద్దీ, యాజులుకేసి వోరకంట.

"అయ్యా, యాజులుబాబుగారూ, మీ మనమడు పెళ్ళిచేసుకోబోతున్నా డిప్పుడు. అందు కో పిల్ల కావా లతనికి. మంచిపిల్లను చూసిపెట్టండని రాయబారాలు పంపగల సుహృద్గులను ఏరుకుని ప్రార్థించాడు వారిని. ఎక్కడి కెక్కడికో వెళ్ళమని అతని ప్రార్థన. దారిఖర్చులు కావాలి వెళ్ళాలంటే వారికి. మీ మనమడే యివ్వా లందు కొంత డబ్బు. నేను కన్యావరణ లిమ్మన్నా నే, అది, అలా యివ్వవలసిన డబ్బన్న మాట. అది సంభావన యెలా అవుతుందీ? డబ్బేమో మీ మనమడిదీ, మీ మనమడే యివ్వవలసిందీని. అది మీ చేతిలో వుంది మరి, యిప్పుడు. అంచేత నే మిమ్మ ల్నడగవలసివచ్చింది నాకు."

చిరునవ్వు కనపరుస్తూ చెప్పాడు పురోహితుడీ మాటలు.

వెటకారం వుందా చిరునవ్వులో నిగూఢంగా. అది గమనించాడు ముస్సద్దీ.

అతని బుద్ధి చమత్కృతం అయింది దీంతో.

"అయితే, కొంత పొగడ్త పూతపెట్టాలి దానికి, తాను.

అయితే, యాజులుగారి కిది తెలీకుండ నేనా బ్రహ్మగారూ, మీ వూహ?" అనడిగా డతను, సాకూతంగా చూస్తూ.

"వారికి తెలుసునా తెలియదా? ఇది కాదు పంతులుగారూ నేను చూసుకోవలసింది. వివాహం తంతుకి సంబంధించి యెవరి కే జిజ్ఞాస కలిగినా - అగత్యం అని నాకే తోచినా, యిక్కడ యింతమంది సరసు లున్నారు కనక - నేను బ్రహ్మాసనం అధిష్ఠించిన్నీ వున్నాను కనకగూడా, అది వివరించడం నా విధీ, నా బాధ్యతానూ" అని బదులుచెప్పాడు పురోహితుడు.

"ఒక్క సంగతి మనవిచేసుకుంటాను సెల వయితే?" అంటూ అందుకున్నాడు పారుపూరి విద్వాంసుడు మళ్ళీ.

"సెల విప్పించండి" అన్నాడు ముస్సద్దీ.

"సభాపతి గారు పది రూపాయ లిమ్మన్నా రంటే, అది, వారి సొంతాని క్కాదు. వారు ఈవూరి బ్రాహ్మణ్యాని కంతకూ కిరీటంలేని రాజు. వారసత్వేనా మాత్రమే కారు వారు సభాపతులు, సర్వాత్మనా వారే అందుకు తగ్గవా రిప్పుడీవూళ్ళో. ఆశీతివ్యయనూ కర్తలమీద పరీక్ష యివ్వగలరు వారివాళ్ళ కూడా. శ్రౌతమున్నూ అంతా వారికి వాచోవిధేయమూ, కొట్టిన పిండిన్నీ. చయనం చేసివున్న—సర్వతోముఖమున్నూ చెయ్యబోతున్న కర్మిష్ఠులు వారు. అగ్రహారీకుల్లో వొకరు. ఈవూరి పెద్ద స్థితిపరుల్లో కూడా వారొకరు."

"నమో మహద్భ్యః" అన్నాడు ముస్సద్దీ, సభక్తికంగా అంజలిబంధం శిరస్సున కీలించుకుని.

"గణపచీరల పద్ధతి ఎంతో సంప్రదాయపరిజ్ఞానం వున్న సంపన్నులుగాని గుర్తించలేరు. తమ రది ఆచరించే వున్నారు, కనక, మనవిచేసుకుంటున్నాను. తమ అయిగురు కుమాళ్ళ పెళ్ళిళ్ళలోనూ ఆచరించి వున్నవారు సభాపతి గారు."

"పరమ ప్రామాణికులు వారు" అంటూ మళ్ళీ అంజలిబంధం శిరస్సున కీలించుకున్నాడు ముస్సద్దీ.

'ఈవూరి బ్రాహ్మణ్యంలో వచ్చిన సఖ్యాకట్నం అంతా—కన్యావరణల మొత్తమున్నూ అంతా ఈవూరి నూటయాభైయిళ్ళ బ్రాహ్మణ్యానికీ పంపకం అవుతుంది సంవత్సరాని కొకమాటు."

"అవును, ఎక్కడా అంతే అది."

"ఇక్కడి విశేషం యేమిటంటే? మహాశివరాత్రి పర్వదినాన అదంతా పారుపూరి విద్వాంసులకు వినియోగం అవుతుంది, యథోచితంగా."

"అదీ విన్నాను."

"అదిగో, అందుకోసం యీవూరి బ్రాహ్మల అంతస్థు కాపాడాలి సభాపతి గారు. తరలివచ్చినవారి దర్జా కాపాడాలి. అందరి క్షేమమూ కోరాలి."

"కనక?" అనడిగాడు యాజులు పురపుర చూస్తూనూ, తల యెగరవేసుకుంటూనూ.

"వారు చెప్పింది విశ్వసించడమూ, అంగీకరించడమూ ధర్మం యెవరికయినా."

"ధర్మం అంటే యెక్కడికి?"

"ఇందాకా అడిగేవున్నారు మీరీమాట. ధర్మం వొక విధంగా గహనమూ, మరో విధంగా విశదమున్నూ. దాని పరిధులు గుర్తించే శక్తి బాధ్యతా బుద్ధివి."

"పది రూపాయలని వారు పేరు పెట్టడం ధర్మంగా వుందా?"

"నిక్షేపంగా వుంది."

"అంతేనా మా తాహతు?"

తేరిచూశాడు పండితుడు.

ధార్ష్ట్యం అవలంబించా లనుకున్నాడు.

అతని పెదవు లదిరాయి.

అది గుర్తించి "ఆగండి" అన్నాడు ముస్సద్దీ పండితుణ్ణి, చెయ్యూపుతూ.

"యాజులు బాబుగారూ" అంటూ అటు చూస్తున్నవాడల్లా తిరిగాడతను.

సభ అంతా నిస్తరంగసముద్రం అయిపోయింది, చూపంతా ముస్సద్దీమీద నిలిచి.

"మీరు పుచ్చుకున్న వరకట్నంలో, నూటికి పది రూపాయల చొప్పున వుంచుతాను మీకు మంగళ హారతి పళ్ళెంలో, సదస్యం సందర్భాన, తరవాత, తమనున్నా స్వయంగా హారతి యిస్తుంది మీరు తీసుకువచ్చిన మేళనాయకురాలు. అందరు సానలవంటిది కాదు, నూటికి రెండు రూపాయలు పుచ్చుకుంటుందామె, ఖరారుగా. బ్రాహ్మణ్యులయిన పురోహిత పండితులు వెయ్యికి రూపాయి అడిగారు మిమ్మల్ని."

"అంతేనా మా తాహతు? అవమానిస్తున్నారు నన్ను, మళ్ళీ."

"అది కాదని చూపించండి మీరు ముందు. అడిగే వాడు తక్కువ అడగాలి ఇచ్చేవాడెక్కువ యివ్వాలి. ఇది వైదిక ధర్మం. మన వేదశాస్త్రి లవగాహన చేసుకున్న వారి చిత్తవృత్తి యిలా నడుస్తుంది."

ఇరుకున పడ్డాడు యాజులు.

దారి కనపడలేదతనికి.

మాటయినా తోచలేదు.

అందరూ మెప్పుగా చూశారు ముస్సద్దీ కేసి.

"శెబాస్" అన్నట్టు అతని వీపే నిమిరాడు రాజుబాబు.

పెళ్ళికొడుకూ కొండుభట్టూ మొగమొగాలు చూసుకున్నారు.

"ఇచ్చెయ్యండి మామగారూ" అన్నాడు కొండుభట్టు, అవ్యవధానంగా.

ముస్సద్దీ మాటలు బాగా కళ్ళించాయతణ్ణి మరి.

యాజులు మాత్రం ఉగ్రుడయినాడు.

"నా కొడుకు పెళ్ళి కాదు, నీకొడుకు పెళ్ళిది. ఇవ్వడానికయినా మానడానికయినా నీదే అధికారం" అంటూ రొక్కం సంచీ కొండుభట్టుదగ్గిర వుంచేశాడతను.

5

"వందే-మాతరమ్" అంటూ ఒక వాగ్బాణం రివ్వుమంది సమయాన పెళ్లిపందిట్లో.

ఉత్తరపు వసారాలో పది ప్రతిధ్వను లిచ్చిందారివ్వ.

ఆ పదిరివ్వలూ పదుగురు ఐచ్ఛికసేవకురాళ్లయి ప్రవేశించాయి పెళ్లిపందిట్లో పసుపుపచ్చని జెండాలతో.

వారివెనక దళపతి వాలకంలో ఒక యువతి.

సభ అంతా నిర్విణ్ణం అయిపోయిందామెని చూసి.

"సిస్టర్ జానకీదేవి" అంటూ యువకుల్లోనూ, 'జానకమ్మగారు' అంటూ యువతుల్లోనూ కోలాహలం రేగింది.

"దీక్షితులు బాబయ్యా" అంటూ పిల్చిందామె గంభీరంగా చూస్తూ, సౌమ్యంగానే.

చూసి ఊరుకున్నాడు కన్యాదాత.

ఊరుకున్నాడంటే, మాట రాక.

మాటరాక అంటే, గుండె లాగిపోయి.

పెళ్ళికొడుకు ఎడమకన్ను అదిరింది.

ఎందుకో ఆందోళన — ఎందుకో నిరాశ — ఎందుకో భయం — ఎందుకో కంగారు — ఇన్ని కమ్ముకున్నాయతని మొగాన, దట్టంగా.

"దీక్షితులు బాబయ్యా" అంటూ మళ్ళీ పిలిచిందామె, ఆలస్యం సహించలేక.

యాజులు కంఠం బిగుసుకుపోయింది.

"ఏమి తల్లీ?" అనడిగాడు దీక్షితులు, బాగా ఎత్తుపడిపోయి.

"ఎంత కొన్నావు బాబయ్యా, నువ్వు పెళ్ళికొడుకుని?" అనడిగిందామె, గొంతెత్తి.

సభ అంతా దద్దరిల్లిపోయిందీమాటతో, బాంబుపాటు లాగ.

"ఎంత కొన్నావంటే —" అంటూ అందుకున్నాడు కరణం.

నిప్పులు కక్కుతూ చూసింది సిస్టర్ జానకి కరణంకేసి.

"దీక్షితులు బాబయ్య తప్ప మరెవరూ బదులు చెప్పనక్కర్లేదు నాకు" అంటూ ఉరిమిందామె.

"నేను తీవ్రంగా గర్హిస్తున్నా నీమాట. చాలా అవమానకరమైన ప్రశ్న మాకిది." అన్నాడు యాజులుద్రిక్తుడై.

ఇటు చూస్తే కొండుభట్టు తలవంచుకుని వున్నాడు.

అటు చూస్తే తన కూతురు ఆత్రపడిపోతోంది, తనకేసీ కొండుభట్టుకేసీ చూస్తూ.

అంచేత ఊరుకోలేకపోయాడు, యాజులు.

"మీ రెవరండీ?" అనడిగింది సిస్టర్ జానకి అతణ్ణి.

"పెళ్ళికొడుకు నా మనవడు.

"ఎలాంటి మనవడు?"

"కూతురి కొడుకు."

"మీ ప్రమేయం లేదిక్కడ, మీరూరుకోండి."

కొండుభట్లు ఒకమాటు తలెత్తి చూసి మళ్ళీ మొగం వంచుకున్నాడు.

ఆమాటతో అతని కొక ప్రాణం లేచివచ్చినట్టయింది.

"నీ ప్రమేయం మాత్రం యేముం దిక్కడ?" అనడిగింది పెళ్ళికొడుకు తల్లి, రుసరుసలాడుతూ.

తన భర్త అడగవలసిన ప్రశ్న అది.

అడగనందుకు చాలా కోపంగా చూసింది కూడా అతనికేసి.

"కొంచెం ఓపికపట్టు" అంది సిస్టర్ జానకి, చేత్తో నిషేధిస్తూ ఆమెని.

"అసలు నిన్నెవరు పిలిచా రంట, యిక్కడికి?" గద్దిస్తూ మళ్ళీ అడిగింది పెళ్ళికొడుకు తల్లి.

"మా దీక్షితులు బాబయ్యగ సంగతి తేలనీ. తరవాత అడుగు, నీ యిష్టం వచ్చిన ప్రశ్నలు నన్ను."

"ఎవరి సంగతి అయినా నీ కెందుకనడుగుతున్నాన్నేను."

"నీకొడుకు మూడుముళ్ళూ వెయ్యగలిగేదాకా అభ్యాగతురాలవు నువ్వసలు. నీ హద్దులో నువ్వుండు."

ఏమనడానికీ తోచలేదు పెళ్ళికొడుకు తల్లికి.

అలవాటయివున్న అధికారం మాత్రం వులికింది.

"ఊరుకుంటా రేమండీ?" అంటూ కస్సుమం దామె వెంటనే, భర్తమీద.

అందరి చూపులూ కొండుభట్టుమీద పడ్డాయి.

"విశ్వపురా లెవరా?" అని నిరీక్షిస్తున్న వారి కందరికీ సందేహం తీరిపోయింది.

కొండుభట్టుకి మరో ప్రాణం లేచివచ్చినట్టయింది.

అర్ధనారీశ్వరు డిప్పు డతను.

పెళ్ళికొడుకు మొగం చిట్లించుకున్నా డిదంతా చూసి.

గౌరీపూజా మంటపం దగ్గరనుంచి వచ్చి, తన పక్షం స్త్రీల వంకరిని తప్పించుకుని ముందువరసలో నుంచుంది పెళ్ళికూతురి తల్లి.

ఆమెని గుర్తించింది జానకి.

"ఏం బాబయ్యా, బదులు చెప్పాలి వాడు" అంటూ నిక్కచ్చిచేసింది కూడా కన్యాదాత నామె.

"కాలేదు చెను. వరదక్షిణ యివ్వడాని కంగీకరించాను. ముందే యిచ్చేశాను కూడా"

"వరదక్షిణ అంటే యేమిటండీ?" అనడిగింది సిస్టర్ జానకి, పురోహితుణ్ణి.

"తాను చేసిన కన్యాదానానికి సాద్గుణ్యం లభించడానికి కన్యాదాత వరుడి కిచ్చే హిరణ్యం" అని బదులు చెప్పాడు కన్యాదాత పురోహితు డందుకు.

"ఎప్పు డివ్వా లది?"

"కన్యాదానం చేశాక."

"అది పూర్తయిందా?"

"అంతవరకూ రానేలే దింకా. పిల్లను చూసి పెట్టమని వగైరు రాయబారులను కోరనేలేదు కూడా యింకా."

"ఏం బాబయ్యా, నువ్విచ్చింది వరదక్షిణ కాదు. తన కొడుకుని నీ కమ్మినందుకు కొండుభట్టు గారికి క్రయధనం నువ్విచ్చింది."

"......................"

"వరకట్నం అని వొప్పుకో నువ్విచ్చింది."

"వరకట్నం అనవిమూ వుంది, లోకంలో, దాన్ని."

"ఏమండీ బ్రహ్మగారూ, ఏం చెబుతారు మీరు?"

"వరకట్నం వేరూ, వరదక్షిణ వేరూను. రెండూ జరుగుతున్నా యీ రోజుల్లో"

"నువ్వు చేసింది 'లా' కు విరుద్ధం. తెలుసా బాబయ్యా?"

"......................"

"నువ్వు చేసింది శిక్షార్హమైన నేరం. ఇదిన్నీ గుర్తుకి వచ్చిందా?"

గభీమని లేచాడు యాజులు.

"మళ్ళీ గర్జిస్తున్నాన్నే నీధోరణి" అంటూ పులిమా డతను, కోపోద్రేకంతో వొణికిపోతూ.

"ఈ ధోరణి అర్థం అయిందా అసలు నీకు?"

"నీమాట కర్థం వుంటేనా?"

"అర్థవర్తుగా అనుకుంటాను చూసుకో, ఏమాత్రం ధర కట్టింది నీకు నీ మనమణ్ణి అమ్మేసంలో?"

"నీ కెవ రిచ్చా రీ అధికారం, యిలా అడగడానికి?"

"నీతికి సంబంధించిన అధికారం మన్నిస్తావా నువ్వు, లాకు సంబంధించిన అధికారం మన్నిస్తావా?"

"రెండూ మన్నించ న్నేను."

"అయితే ఓపికపట్టు. నిన్నూ నీ కూతుర్నీ, నీ అల్లుణ్ణీ, నీ మనమణ్ణీ కూడా విచారణ చెయ్యడానికి 'లా అండు ఆర్డరు' నీతి పాలించేవారు వస్తారు?"

సభలో వున్న సర్కిల్ ఇనస్పెక్టరు వొళ్ళు ఝల్లుమంది.

అతనూ సబ్ మాజస్ట్రేటూ మొగమొగాలు చూసుకున్నారు, ఆత్రంగా.

"అసలు, నువ్వెవరివి?" అంటూ గద్దించాడు యాజులు.

"గౌరీపూజా మంటపంలో వున్న పెళ్ళికూతుర్ని లా తీసుకురావే నూరీదూ" అంది, సిస్టర్ జానకి, అటు చూసి, వురిమినట్టు.

లోపలికి బయలుదేరింది, కలంటేయరు నూరీసు, పసుపుపచ్చ జెండా వూపుకుంటూ.

పెళ్ళికూతుర్ని వెంటబెట్టుకునిన్నీ వచ్చింది, ఉత్తరక్షణాన.

అందరూ తుళ్ళిపడ్డారది చూసి.

పెళ్ళికొడుకు కొయ్యయిపోయాడు.

"అదిగో చూడు, ఆ బాలికను ప్రతినిసురాలి న్నేను, ఇప్పుడు చెప్ప నాకు బగులు. ఎంత కమ్మాలవు నీ మనవణ్ణి?" అంటూ నిలవతీసింది యూజుల్ని, సిస్టర్ జానకి.

అటు తిరిగింది తరవాత.

"నీయిష్టంమీదే కొన్నాడా మీవాయన, యీ పిల్లాణ్ణి, సుభద్రా?" అ నడిగింది పెళ్ళికూతుర్ని.

"మొగుణ్ణి కొనుక్కోడం నాకిష్టం లేదు"

"పోనీ, కొని లేవడం జరిగిపోయింది కదా ఈ ఈ పిల్లాణ్ణి పెళ్ళాడ్డం నీ కిష్టమేనా మనస్ఫూర్తిగా?"

"కాదు."

ఉద్వేస్తుగా లేచినుంచున్నాడు పెళ్ళికొడుకు. పీట దిగి అడుగున్నా వెయ్యబోయా డతను.

"ఆగు!" అంటూ గద్దించింది, సిస్టర్ జానకి.

పెళ్ళికొడుకు మానుపడిపోయాడు.

అది చూసి కొంసుభట్లు లేచాడు.

"రారా, అబ్బాయీ. మనం వెళ్ళిపోదాం" అంటూ దారిచేసుకోడానికిన్నీ చూశా డతను.

"నుంచో!" అంటూ కసురుకుంది అతనిమీద కూడా సిస్టర్ జానకి.

"నీకొడుకు నమ్ముకున్నావే మా దీక్షితులు బాబయ్యదగ్గిర పదివేల క్రయధనం పుచ్చుకొని? గొడవల్లో దిగడం భయం అయితే ఆ డబ్బంతా ముందిక్కడ పెట్టి మరీ కదులు."

ఇలా అంటూనే పథకేసి తిరిగిం దామె.

"అయ్యా, అమలాపురం సర్కిల్ ఇనస్పెక్టరుగారూ, సబ్ మాజిస్ట్రేటుగారూ, బహుశ్రుతులు ఓ అస్వకేట్లూ, డాక్టర్లూను, దగ్ధమూళ్ళ ముస్నబు కరణాలు కూడా వినాలి. సంగతి అంతా తెలిసే వచ్చారు మీరందరూ యిక్కడికి. వచ్చి జరిగిందీ, జరుగుతున్నదీ చూశారు, చూస్తున్నారు కూడా. మీ అందరి పేర్లూ నోటుచేసుకుని వున్నా న్నేను. సిద్ధంగా వుండండి, కోర్టుకు రావలసివుంటుంది మీరందరూ" అనిన్నీ అందామె, గొంతెత్తి.

6

ఆంధ్రపత్రిక, మెయి 22:—

చండికేశ్వరం అగ్రహారం, మెయి 19 :- తూర్పుగోదావరిజిల్లా, రామచంద్రపురం తాలూకా, చండికేశ్వరం అగ్రహారంలో, మొన్నటి 15వ తేదీ నొక వివాహం జరిగింది. వధువు, పీసపాటి వేంకట దీక్షితులుగారి రెండో కూతురు సుభద్ర. వయస్సు 18 ఏళ్ళు. వరుడు ఆ అగ్రహారం కాపురస్థులే అయిన దర్భ వీరేశ్వర తర్కవాచస్పతిగారి ఏకైకపుత్రుడు కిరీటిరావు. వయస్సు ఇరవైనాలుగేళ్ళు, కాని, రెండో పెళ్లివాడు. నలభైయేకరాల మాగాణిభూస్వామి. మంచి ప్రతిభావంతుడు. సుభద్ర చక్కని చుక్క అయితే అతను స్ఫురద్రూపి, దర్జాఅయినవాడు త్యాగి, భోగి, తాలూకా కంతటా గ్రంథాలయోద్యమంలో ప్రముఖుడు.

కాని పెద్దచదువులు చదివినవాడు కాడతను. తమ పెద్దల్లుడు లాగే తమ చిన్నల్లుడున్నూ, సర్కారు ఉద్యోగి అయివుండాలన్న అభిలాష కలవారు కావడంవల్లనే వేంకట దీక్షితులుగారతనికి తమ కొమార్తె నివ్వడాని కిష్టపడలేకపోయారు.

అయితే, మొదటిభార్య పోయినప్పణ్ణుంచీ కిరీటిరావు మనసంతా సుభద్రమీదే వుండేది. సుభద్రకూడా అతణ్ణే గాఢంగా ప్రేమించివుండేది. దీనికి తోడు, కల్లూరివారి సంబంధం తప్పిపోయాక అప్పటికప్పుడు సుభద్రకు వివాహం చెయ్యవలసివచ్చింది వేంకట దీక్షితులుగారికి. లేకపోతే చేసిన ప్రయత్నం అంతా వ్యర్థం అయిపోయే పరిస్థితి యేర్పడింది. చాలా వేలు ఖర్చయివుండేది అందుకోసం. ఆ కారణంవల్లా, యథార్థం గ్రహించీ వేంకట దీక్షితులుగారు సుభద్రను కిరీటిరావు కిచ్చి, తెల్లవారగా మిథునలగ్నంలో నే వివాహం జరిపించారు. ఉభయఖర్చులూ తామే భరించి దేవదుందుభులు మోగేటట్టు మహోత్సవం జరిగించారు.

చివరికిలాగ ఆ ప్రేమికు లిద్దరూ దంపతు లయినందుకు చూసినవారూ, విన్నవారూ చాలా సంతోషిస్తున్నారు.

కిరీటిరావున్నూ తాను కోరిన వధువు తనకు లభించినందున పరమానందభరితుడై, ఊరిగ్రంథాలయానికి స్వయంగా నొక భవనం కట్టించి యివ్వడానికి పూనుకున్నాడు.

ఈ వివాహం ఈ విధంగా జరగడానికి సిస్టరు జానకీదేవి పూనికే ముఖ్యకారణం. మొదట ఆమె సాహసం గుర్తించలేనివారు ఇప్పుడామెను వేయినోళ్ల ప్రశంసిస్తున్నారు.

బూర్గులవారి భాషాసేవ

శ్రీ బి. రామరాజు

"శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారిని గూర్చి ఆగస్టు 'భారతి'లో శ్రీవారు "హైద్రాబాదులో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్యాయమంత్రిని తలపించేవారు; ఇప్పుడు కేరళపాలకులుగా అన్నిటా కృష్ణరాయలను తలపిస్తారు" అని ఉట్టంకించినది పరమసత్యము. ఒక వైపు రాజకీయ వ్యవహారజ్ఞతయందును, ఇంకొక వైపు పరిపాలనా దక్షతయందును, మరొక వైపు రచనాపాటవమునను శ్రీ రామకృష్ణరావు గారి శేముషీ వైభవము ముప్పేటవాలువలె అష్టమూక లెరుగని పసను గలది. వారు నేర్చిన పదిభాషలందు ఐదింటిలో కవిత లల్లి నేర్చినారు; పరిశోధనాత్మకములు, పరిశీలనాత్మకములగు వ్యాసములను కూర్చినారు. మొన్న మొన్న నే షష్టిపూర్తులు జరుపుకొన్న వారి జీవితచరిత్రమున సరిగా లెక్క పెట్టినచో నలుబది నాల్గు సంవత్సరములు సాహితీకృషికి కేటాయించవచ్చును. ప్రత్యక్షముగనో పరోక్షముగనో వారి సాహాయ్యమో ప్రోత్సాహమో పొందని సాహిత్యసంస్థ తెలంగాణమున లేదు. ఈనాటి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ కూడ ఆనాడు వారు తెలంగాణమందున్నప్పుడే ప్రకటించిన వాక్కుల వర్ధముట్లనుగమనించిన సంస్థ. సంస్థలకే కాక కవిపండితుల కెందరికో స్వహస్తపరహస్తముల తోడ్పడి ప్రోత్సాహమొసగినవారు శ్రీ రామకృష్ణరావు గారు. కేవలము రచయితలుగా వారొనర్చిన కృషి నుగ్గడించుటే ప్రకృతము నా కర్తవ్యము.

లక్ష్మీసరస్వతులకు అత్తగారిండ్ల ఆరళ్లు లేని పుట్టు రుచక్కని కుందనపు వంగడము బూర్గులవారిది. ఒడ్డో రకముగాని చక్కగా సాగినది జీవనయాత్ర. పట్టినది బంగారమైనది; ముట్టినది ముత్యమైనది. తాతల నాటినుండి పరంపరగా నిత్యపారాయణములగుట భారతభాగవతరామాయణములు శ్రీ రామకృష్ణరావు గారికి శ్రుతములైనవి. స్వయముగా చదువుకొన్న తెలుగులు బడిచదువులటుల బాగుగ నాకళింపైనవి. తినిన దంతయును జీర్ణమై జీర్ణమైనదంతయు శక్తిగా మారిన కావలసిన దేమున్నది! కవిత లల్లుటకు పదునారవయేట పట్టిన కలమీనాటికిని సాగుచు నేయున్నది. శ్రీ రామకృష్ణరావు గారి నూనూగుమీసాలను వరించిన కవితాకన్య అసూర్యంపశ్య. వారు 1920-22 మధ్యన వ్రాసిన అనేక ఖండకృతులలో కొన్ని మాత్రము గోలకొండ మున్నగు వానిలో ముద్రింపబడినవి. ఆ సమయమునందే ఒక నాటకమును ఒక నవలను వ్రాసి భద్రముగా నుంచినారు. ఏ యుపేంకుడో నచ్చుకట్టలె ఆ పాపుణ్యదేవి కుంపలములుగొని తెమ్మటకు. కీ. శే. సురవరం ప్రతాపరెడ్డి గారికి అప్పుడప్పుడు తాము వ్రాసిన ఖండకావ్యములను, శ్రీ రామకృష్ణరావు గారి కావ్యములను వేర్వేరుగా ముక్తాహారములు గూర్చవలయునని కోరిక యుండెడిది. 1924-1928 నడుమ థామస్ గ్రే గారి "ఎలిజీ" అనువాదమును సగము మాత్రమే 'సుజాత' పత్రికలో ప్రకటించినారు.

శ్రీ బూర్గుల రామకృష్ణరావు గారు పూనానగర మందలి ఫెర్గుసన్ కాలేజిలో చదువుచున్నప్పుడే ఇంగ్లీషులో కవన మల్లినారు. కొన్ని సానెట్లతో పాటు "ఆర్ట్ అండ్ క్రిటిసిజం" వంటి మరికొన్ని వ్యాసములు కాలేజీ సంచికలందు ప్రకటించినారు. తెల్లదొరలు కుట్రబన్ని బీరారును కాజేసినపుడు అది హైద్రాబాదు రాజ్యమునకే చెందవలెనని చారిత్రకాధారములతో 1922-1933 ప్రాంతములందు కొన్ని వ్యాసములింగ్లీషులో ప్రచురించినారు. ఆ నాటి హైద్రాబాదు పరిస్థితులను గూర్చి సెయింట్ నిహాల్‌సింగ్ వ్రాసిన వ్యాసములను విమర్శించుచు 1922వ సంవత్సరమున వ్రాసిన వ్యాసములు "హిందూ" పత్రికలలో నున్నవి. "బాంబే క్రానికల్", "ఇండియన్ సోషియల్ రిఫార్మర్", "మరాఠా" వంటి ప్రాత పత్రికలు తిరుగవేసినచో నాటి సమకాలీన సమస్యలగూర్చి వారు వ్రాసిన వ్యాసములు కొల్లలు. 1924 నుండి 1949 వరకు వారప్పుడప్పుడు వ్రాసిన ఇంగ్లీషు వ్యాసము లన్నియు రాజకీయములు మరియు సమకాలీన సమస్యలకు సంబంధించినట్టివే. మతము, సంస్కృతి మున్నగు విషయముల గూర్చికూడ శ్రీ రామ

కృష్ణరావుగారు పెక్కు వ్యాసములు వ్రాసినారు. డా. లతీఫుగారు గత సంవత్సరమే తమ "ఇండో-మిడిల్ ఈస్ట్ కల్చరల్ ఎకాడెమీ" పక్షమున శ్రీ రామకృష్ణరావుగారు వ్రాసిన "కల్చరల్ సింథసిస్ ఆఫ్ ఇండియా" అను చక్కని వ్యాసమును ప్రచురించినారు. ఈ విషయమును గూర్చియే వీరివరకు 1947-1948 మధ్యన "రయ్యత్" పత్రికలో ఉర్దూ భాషలో పదు వారు వ్యాసములు ప్రకటించినారు. రంగమునకు వచ్చి రాశికి రాని రచనము లివి. శ్రీ రామకృష్ణరావుగారు రాశికి తెచ్చి రంగమునకు జేని రచనము లెన్ని కలవో? ఆది శంకరుల "సౌందర్యలహరి" యనువాద మట్టివానిలో నొకటియని మాత్ర మెఱుగుదును. ఇటీవల కొన్ని సాహిత్యసంస్థల పూనికచే వారిరచనములు కొన్ని రాశికి రంగమునకు వచ్చినవి. అట్టివానిచే యాధారముగా గొని శ్రీ రామకృష్ణరావుగారి రచనముల పరిచయ మొనర్తును. ప్రధానముగా పద్యరచనములు మరియు గద్యరచనములని వారి రచనములు వర్గీకరింపవచ్చును. పద్యరచనములందు సొంతరచనములు మరియు అనువాదములని వేరు వేరు చేయవచ్చును. సొంత రచనములు:—

కృష్ణశతకము

ఈ శతకమును ఆంధ్రసారస్వత పరిషత్తు - హైద్రాబాదువారు 1956 లో ప్రచురించినారు. ఈ శతకములను గూర్చియు శ్రీ గోల్కొండ వేపారి శ్రీ వైష్ణవ సమాజము-బరంపురంవారు 1958లో ప్రచురించిన "శ్రీ వెంకటేశ్వర సుప్రభాతమును" గూర్చియు శ్రీ రామకృష్ణరావుగారు కృష్ణశతకమున వ్రాసిన తమ "మనవి"లో నిట్లు చెప్పుకొన్నారు. "సంకట బంధరె వెంకటరమణ—అని కన్నడ సామెత. కష్టం వచ్చినప్పుడు ఇష్టదైవతాన్ని స్మరించుకోవడం అల్పబుద్ధియైన మానవుని అలవాటు. ఎల్లప్పుడూ తలచుకొనేవారు అరుదు. జనవరిలో 1955 లో టైఫాయిడ్ జ్వరము తగుల్కొని నెలరోజులు మంచం ఎక్కాను. అప్పుడు భగవన్నామ స్మరణ చేసుకొనుటకై బుద్ధిపుట్టి ఎన్నడో చదువుకొన్న శ్రీ వెంకటేశ సుప్రభాతము, కృష్ణశతకము మున్నగు స్తోత్రముల శ్లోకాలు పద్యాలు జ్ఞాపకం చేసుకున్నాను. చాలాకాలం క్రితం చదువుకొన్నందున మరచిపోయి జ్ఞాపకం రాలేదు. పుస్తకాలు కూడ అప్పుడు అందుబాటులో లేవు. అందువల్ల పద్యస్ఫూర్తిచే నేను స్వయముగా సంస్కృతంలో 'శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, తెలుగులో 'కృష్ణశతకము' రచింప సంకల్పించి ఆరంభించితిని. నిర్బంధ శయ్యావాసం లభించిన ఆకాలంలోనే రెండు రచనలు సగం పూర్తి చేసితిని. మిగతా సగం పూర్తి చేయుటకు ఒక సంవత్సరం పట్టింది"—శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు వైష్ణవులు. భక్తిప్రపత్తులు వారి రచనములందలి ప్రధాన గుణములని ప్రత్యేకముగా చెప్పనక్కరలేదు. లోకమును తనను విమర్శించుకొని భగవంతుని సన్నిధానమున ఆత్మనివేదన మొనర్చుకొనుట భక్తకవుల శతకములందంతటను సాధారణము. కృష్ణశతకమున కూడ ప్రధాన గుణ మిదియే. దీనిలో మొత్తము 101 పద్యములు గలవి. ఆంధ్రదేశమున అబాలగోపాలమున ప్రచారమందిన ప్రసిద్ధ కృష్ణశతకము వలెనే సరళసుందరమైన భాషలో నడచిన దీశతకము. రెండింటికిని భాష యందును, భావము లందును పోలిక లనేకములు.

భగవంతుని శరణాగతరక్షణపరత్వమును గూర్చి చెప్పిన పద్యమిది.

"శరణాగత పరిరక్షణ
బిరుదమునకు సాక్షియా విభీషణుడే నీ
దరిజేరి శరణువేడిన
సరగున లంకాభిషిక్తు సలుపవె కృష్ణా."

అట్టి భగవంతు నెట్లాహ్వానించుచున్నారో కనుడు:

"కాలుని భీల పన్నాగము
లాలంబిద్దలయు రోదనాక్రందనముల్
గోలెత్తునప్పు డందెల
కాలి ఘలంఘలల రమ్ము, కావుము కృష్ణా."

పై పద్యమున నుత్తరార్ధమున గల రామణీయకమును వాచ్యముగా చెప్పనవసరముండదు. విషయవాంఛా వ్యామోహమున జిక్కుకొను మనుష్యస్వభావమును గూర్చి చెప్పిన పద్యమిది.

"ఏమి మనస్సో హరిహరి
స్వామిని బసెద్రోసి స్వారి సలిపెడు కుజ్జం
చేమీ యనిపించును వశి
గామితముల వెంటబడుట గాంచిన కృష్ణా!"

పరతత్త్వము వాద ప్రతివాదములతో, కుతర్కములతో తేలునది కాదని వారి యభిప్రాయము.

"పరమతభంజనదీక్షా
పరతంత్రులు వాదికొత్త వైశ్వానరులున్

తరతరము దఱచిపోరిన
తరమే పరతత్త్వమూర్త్యుల్లగ కృష్ణా!"
భక్తిద్వారమున సాధించవచ్చునని వారి యాశయము.
"ప్రజ్ఞావాదుల కెపుడున్
సుజ్ఞేయము గాదు నీదు సుగుణ సురూపం
బజ్ఞానియైన భక్తుని
జిజ్ఞాసాహ్లాదమునందు చిక్కెదు కృష్ణా!"
నేటి రాజకీయములందు తలమునకలగుచున్న వారి మనోభావ మెట్టిదో పరిశీలింపుడు.
"జనసేవరొ నీ సేవని
జనతా రాజ్యాధికారజనితక్లేశం
బున గ్రుంకుచుంటి నిత్యము
కనికరమున బాహువు దింపి కావవె కృష్ణా!"

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము

దీనిని శ్రీ గోల్కొండ వేపారి శ్రీ వైష్ణవ సమాజము–బరంపురంవారు 1958 లో ప్రచురించినారు. ఏడు కొండలవానికి వేకుజామున మేలుకొలుపుసేవ నిత్యము జరుగుట మన మెరుగుదుము. ఆ మేలుకొలుపులకు స్వామివారు మేల్కొందురో లేదో కాని ఎంతటి జడాత్ముడైనను లేచి చైతన్యమును పుంజుకొనుట మాత్రము సత్యము. ఆ వేంకటేశ్వరసుప్రభాతమును మనమునందుంచుకొని అదే నడకతో రచింపబడిన ముప్పది శ్లోకముల కుచ్చ మిది. దీనికి వెనువెంట తెలుగుపద్యములు కూడ శ్రీ రామకృష్ణారావుగారే వ్రాసియున్నారు. ఈ రెండు వెంకటేశ్వరసుప్రభాతములకు గూడ అచ్చటచ్చట పోలికలున్నవి.

స్వామివారి పుష్కరిణీమాహాత్మ్యము నుద్ఘోషించు శ్లోక మిది.

"స్వర్భానుగ్రస్త మిహిరాంశు సహస్రకుల్యాన్
మాయాబలేన మలినీకృత మానసౌఘాన్,
సమ్మార్జయంతి మనుజాః సరసీజలేన
శేషాద్రిశేఖరవిభో తవసుప్రభాతమ్,"

ప్రభాతకాలమున చేతనాచేతనము లన్నియు స్వామివారి సేవలో సంకీర్తనమున నున్నట్లు కనుపించును. కనుకనే శ్రీ రామకృష్ణరావుగారు కోకిలలగూడ స్వామివారి స్తోత్ర మొనర్చుట నిట్లు వర్ణించినారు.

"ఆనమ్ర మాత తరుమండ ముపేత్య కల్యే
పీత్వాఽతిరుద్య ఫలసార రసాత్మకావ్యమ్,
పుంస్కోకిలాః శ్రవణసుందర మాలపంతి
శ్రీ వేంకటాచలపతే తవసుప్రభాతమ్!"

పోతనగారిని జ్ఞప్తికి దెచ్చు శ్లోకమొకటి:

"త్వత్పాదపద్మమకరంద రస ప్రమత్త
చిత్తా న జాత్వపి త్వదన్య ముపాశ్రయంతే,
మందారమత్తమధుపో మదనం కిమిచ్ఛేత్
శ్రీ వెంకటాచలపతే తవ సుప్రభాతమ్!"

ఈ శ్లోకమునకు వారే యొనర్చిన యనువాదమును పరిశీలింపుడు.

"తావక పాదపద్మగళి
త స్ఫుర దచ్ఛమరంద మత్తముల్
భావుక చిత్తముల్ పరుల
పంచల జేరునె యెప్పుడేనియున్
బోవునె పారిజాతమును
బొందిన తుమ్మెద యుమ్మెతన్ గనన్
నీవిక జాగుసేయకుము
నిద్దుర మేల్కొను వెంకటేశ్వరా!"

పండితులకు, పామరులకు, జ్ఞానులకు, భక్తులకు, అర్థులకు, సమస్తజనములకు, సేవ్యుడైన స్వామివారిని శ్రీ రావుగారిట్లు మేల్కొలుపుచున్నారు.

సంత్రాసితార్తజగతాం పరమార్థతత్త్వ
జిజ్ఞాసు శిష్ట విదుషాం హి ఫలార్థినాం చ,
సుజ్ఞానినాం చ తవ పాదయుగం శరణ్యం
శ్రీ వెంకటాచలపతే తవ సుప్రభాతమ్.

ఈ శ్లోకమున కనువాదము.

త్రాసిత జీవితార్తులకు
తత్త్వ పదార్థ రహస్య శాస్త్రజి
జ్ఞాసులకున్ ఫలార్థులకు
జ్ఞానవిశేష సుసంభృతాత్మ స
న్యాసులకున్ త్వదీయ వర
దాంబుజ యుగ్మమె కా శరణ్యమై
బాసటయౌను భక్తజన
భావిత మేల్కొను వేంకటేశ్వరా.

సంసారసాగర సముత్తరణమునకై కృపాకటాక్షముతో సేతువును నిర్మింపుమని స్వామి నెట్లు ప్రార్థించుచున్నారో కనుడు.

ఉన్మీల్య నేత్రసరసీరుహ యుగ్మ మద్య
సంసారసాగర సముత్తరణైక సేతుః,

సంబన్యతాం తవ కృపామయ దృష్టిజాలైః
శేషాద్రి శేఖరవిభో తవ సుప్రభాతమ్."

దీని కనువాదము.

"నీ కమనీయ నేత్ర వన
నీరజయుగ్మము విప్పి యిప్పుడీ
లోకముపై కృపారస వి
లోకనజాలము నుప్పి దానిచే
ప్రాకటమొప్ప గట్టు మెంక
వారధి నీ భవసాగరంబుపై
లోకులు దాట శేషగిరి
లోలుడ మేల్కొనుమ వెంకటేశ్వరా!"

శృంగగిరి శారదాస్తుతిః

శ్రీ రామకృష్ణరావుగారు హైదరాబాదురాష్ట్ర ముఖ్యామాత్యులుగా నున్నప్పుడు శృంగగిరికి జగద్గురువులను సందర్శించ బోయిరి. అప్పుడచటి శారదా దేవిని దర్శించి భక్తిపారవశ్యమున దేవిని గొనియాడిన స్తోత్ర శ్లోకములు 'స్రవంతి' సంపుటి 3 సంచిక 1 లో (ఏప్రిల్ 1956) ప్రకటింపబడినవి. వానిలో రెండు శ్లోకములు మాత్రి ముదాహరింతును.

"శకీకీర ముఖోద్గత శ్రుతివచ
స్సందోహ సంలాపినీమ్
సాంగామ్నాయ రసాత్మకావ్య జననీ
సంప్లావనోత్కంఠితామ్,
వీణావాదన గాన నృత్య ముదితామ్
పుణ్యామ్ కలాంభోనిధిమ్
శాన్తోద్యాన విహారిణీం ఉపనిష
త్సౌభాగ్యవృతామ్ భావయే."

"వామే కరే నిహిత హేమవిపంచికాయాః
తంత్రీరవై ర్ముఖరిత మరముఖ్యలోకామ్,
దిక్పాలమౌళి మణిమండిత పాదపద్మామ్
వాణీం భజామి ఘటితాంజలి మస్తకోఽహమ్."

శ్రీ రామకృష్ణ రావుగారు వేరొక సందర్భమున రచించిన గౌరీస్తుతి, వాణీస్తుతి, మరియు లక్ష్మీస్తుతి కూడ అంకే ప్రకటింపబడినవి. అందులో లక్ష్మీస్తుతిని గమనింపుడు.

"వైకుంఠమందార వనాంతరాళ
సుధాసరశ్చంద్రశిలాతలాగ్రే,
పర్యంకభాగే రమమాణ కాంతా
కుచాగ్రచేలాంచలగ్రస్త పాణేః,
గజేంద్ర సంత్రాణ సముత్సుకత్వాత్
వినా ఖగేంద్రం చ పరిద్రుతస్య,
హరే గృహజాలగ్న పటాను కృష్టా
మనః ప్రయాంతీం కమలాం నమామి."

పోతనగారు గజేంద్ర మోక్షమున చెప్పిన "అల వైకుంఠ పురంబులో", "సిరికిం జెప్పడు" పద్యములను మనమునం దుంచుకొని వ్రాసిన లక్ష్మీస్తుతి ఇది.

భా వ మం జ రీ

ఈ శీర్షికలో 'స్రవంతి' యందే (3-వ సంపుటము 5-వ సంచిక) ఆరు శ్లోకములు ప్రచురించినారు. వానిలో రెండు శ్లోకముల నుదాహరింతును.

"యత్ర యత్ర తవ పాదపంకజం
తత్ర తత్ర కమలాయతే ధరా;
యత్ర యత్ర తవ మంద సుస్మితం
తత్ర తత్ర శరదిందుచంద్రికా."

ఈ శ్లోకమును విన్న ఉమర్ ఖయ్యాం తలపులో మెరయును. కాని నాకు మాత్రము భగవద్రామానుజుల గూర్చి వేదాంతదేశికుః వారు కొండొకచో
"భిక్షా పర్యటనకు మేషు ! భిరాంచక్రే గళిత్కల్పిమా యతివ్యాన్యాసమిషేణ పత్రమకరీముద్రాం సముద్రాం
బరా."
యని చెప్పినది జ్ఞప్తికి వచ్చినది.

"సుధాంత కేళీ నిలయాశ్చ రమ్యాః
క్రీడాంగణా శ్చైవ హి రాసభానాం,
రాజన్య చూడామణి చుంబిపాద
రాజీవనోఽపి హి విస్మయాధిః."

ఈ శ్లోకము కూడ ఉమర్ ఖయ్యాము నే తలపించు చున్నది. బహరాము చక్రవర్తి మధువానివచోట ఈనాడు సింహము విశ్రమించుచున్న దను భావమును వెలార్చు రుబాయీ యది.

శ్రీ కృ ష్ణా ష్ట క ము

కేరళరాష్ట్ర పాలకులుగ నున్న శ్రీ రామకృష్ణ రావుగారు గురువాయూరు (కేరళ) శ్రీకృష్ణ క్షేత్రమును సందర్శించి ఆ స్వామివారిపై చెప్పిన పద్యాష్టకము 'స్రవంతి' (సంపుటము 5 సంచిక 1 ఏప్రిల్ 1958) లో ముద్రితము. శ్రీకృష్ణస్వామిని మనసార వర్ణించిన వారి భక్తి పారవశ్యము లీలాశుక జయదేవాదుల భక్తిని స్ఫురింపజేయును.

"నల దంభోజ పలాశ నేత్రములతో
   దంతాంశు శుభ్రచ్ఛటా
మిళితస్మేరమనోహరాధరముతో
   మేలైన బంగారు గు
వ్వలు వలె గట్టి వినీలనీరదవపు
   ర్దైవార్ఘ్యశ్రీ మెంపార్చు నీ
చెలువంబున్ కనురాల జూపగదవే
   శ్రీ నందగోపాలకా."

ఆ పరాత్పరుని విభూతిని పశుపక్షచరాచరము లందు జూచిన శ్రీరామకృష్ణరావుగారు ఋద్ధానిని ముగ్ధులు మూగగట్టు తెలుగులో నెట్లు పాడిరివారో కనుడు:

"పచ్చని యాకు లేజిగిని
   బారెడు నీటి పరాగ పాటలం
దచ్చపు వెండి వెన్నెలల
   నామని బూచెడు పువ్వు నవ్వులో
విచ్చుకగొంతులో నోరుల
   విచ్చము గోరెడు టిమ వాల్కలో
నచ్చగు శాళి శుద్ధముల
   స్వాంతములో గనిపింతు కేశవా."

అనువాదములు

ఇంతవరకు కవితారూపమున వారు వెలువరించిన స్వాంతరచనముల గూర్చి కొలదిగా మనవి చేసితిని. ఇక వారి యనువాదములను పరిచయ మొనర్తును.

ఫారసీయనువాదము:–శ్రీ బూర్గుల రామకృష్ణ రావుగారికి విద్యార్థిదశలో ఫారసీ రెండవభాషగానుండి నందునను, సహజముగా ఫారసీకవిత్వమందున్న మాధుర్యమువలనను వారి కభిరుచికలిగి ఆ వాఙ్మయ సాగరమును మథించు నవకాశము కలిగినది. అసలు హైద్రాబాదురాజ్యమందలి విద్యావంతులు, గౌరవ కుటుంబములవా రందరును ఒకప్పుడు ఫారసీ చదువను వ్రాయను నేర్చుకొనుట పరిపాటిగా నుండెడిది. అది శ్రీ రామకృష్ణరావుగారు బొంబాయిలో ఎల్.ఎల్.బి. పట్టమునకు చదువుచు "అంజుమన్ ఇస్లామియా" హైస్కూలులో నుపాధ్యాయులుగా పనిచేయుచున్న దినములు. ఉమర్ ఖయ్యాం రుబాయీలను ఫిట్జిరాల్డు ఆధారముగా శ్రీ రాయప్రోలు సుబ్బారావుగా రప్పు డప్పుడే ఆంధ్రలోకమున కందించిరి. ఫారసీ చదివి యనువాదము చేసిన కవికోకిల దువ్వూరి రామిరెడ్డి గారు కూడ ఆదినములందె యా పనికి పూనుకొనిరి. కాని వారి యనువాదములు కొన్ని మాత్రమే (1928) 'భారతి'లో ప్రకటింపబడినవి. వారి పానశాల 1935లో వచ్చినది. మూలమునే చదివినవారగుటచే శ్రీ రామకృష్ణరావుగారు ఉమర్ రుబాయీలను పెక్కింటిని యనువదించి వానితోపాటు ఉమర్ జీవితమును గూర్చియు రెండు వ్యాసములను 'సుజాత' పత్రికలో (1927) ప్రకటించిరి. ఉమర్ ఖయ్యాము రుబాయీలనే కాక శ్రీ రామకృష్ణరావుగారు సూఫీసర్మద్ రుబాయీలనుకూడ పెక్కింటిని అనువదించినారు. అవి యన్నియు నముద్రితములే. ఫారసీ వాఙ్మయమున నింత ప్రగాఢాభిరుచి యుండుటచేతనే శ్రీ రామకృష్ణరావు గారు కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు స్థాపించిన 'విజ్ఞానవర్ధినీ పరిషత్తు' సమావేశములలో రెడ్డిగారి ప్రోత్సాహమున 'ఫారసీ వాఙ్మయము' గూర్చి రెండు వ్యాసములు వ్రాసి చదివియుండిరి. మరికొంత విష యము సేకరించియు, ఆ వ్యాసములను విపులీకరించియు పోలీసుచర్యకు పూర్వము వారు సెంట్రల్ జేలులో నుండినప్పుడు "ఫారసీ వాఙ్మయచరిత్రము"ను వ్రాసి యున్నారు. ఇదియు నముద్రితమే.

ఉమర్ ఖయ్యాం హృదయమును తెలుగు వారికి మారలిచ్చిన శ్రీ రామకృష్ణరావుగారి యనువాదము లొండు రెండు ఉదాహరింతును.

"సరసుడు మిత్రు డిష్టుడును
   సన్నిహితుం డొకరుండు లేక యొం
టరినను భూమిగర్భమున
   డాగి పరుండెద నిన్నియేండ్లొ నీ
థురసము ద్రావు మింపుగ వ
   ధూమణి తెల్పకుమీ రహస్యమె
వ్వరికిని విచ్చబో దికను
   వాడినపువ్వు మరెన్నినాళ్ళకున్."

శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి 'మధుకలశము' మనోజ్ఞ మయ్యును ఫిట్జిరాల్డుపై నాధారపడుటచే మూలమునకు కొంచెము దూరమైనది. ఫారసీనుండి యనువదించిన కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారి రచన ములకును శ్రీ రామకృష్ణరావుగారి యనువాదములకును తారతమ్య మరయగోరువారు 'వ్యాసముక్తావళి' 36 పుటలలో మొదటి రెండు పద్యములను 'పానశాల'

యందలి 18-14 పద్యములతోడను, వ్యా. ము. మొదటి పద్యమును 'పానశాల' మొదటి పద్యములతోడను పోల్చి చూచునది. మూలమున కెంతెంత సన్నిహితముగా నున్నారో చూపుట కొక యుదాహరణము.

"సాకర్ బఖ్ ష్ సుబాహ్ దర్ జహాఁ కీస్త్ బగో
ఆఁ కస్ కి సుబాహ్ సాఁర్ద్ మాఁ జీస్ బగో
మన్ బల్ తువమ్ ప్రతూ బది ముకాఫాత్ ధహీ
పస్ ఫర్ఖ్ మ్యాన్ మన్ ఓతూ చీస్త్ బగో."

దీనికి శ్రీ రామకృష్ణరావుగారి యనువాద మిట్టులున్నది.

"ధర నపరాధ మెన్నడును
తప్పిదమో చేయనివాఁ డెవండు ? అ
నరు డెటు లిజ్జగంబున ను
నం గలిగెన్ దురితంబు జేయకే
దురితము లే నొనర్చెదను
దుష్టఫలంబుల నిత్తు వీవు శ్రీ
హరి మరి భేదమున్న నిను
నంత వచింపుము నీకు నాకునున్."

ఇక కవికోకిల యనువాద మారయుదము.

"ఎవ్వడు తప్పుసేయ డిల
నెట్టుల జీవిక సాగు సేయడేన్
అవ్వల పాపి పీడనచు
వక్రమతిన్ విధింతువ య్యయో
రవ్వయు రచ్చయేల యప
రాధుల మిద్దర మాట నీకు నా
కెవ్వఁ డమైన భేదము ర
హించునొ కొంత వచింపు మీశ్వరా!"

సంస్కృతానువాదములు

పండితరాజ పంచామృతము—సంస్కృతవాఙ్మయ క్షీరవారాశి యందు రాజా పండితరాజు. తన్ముఖ నిష్యంది లహరీపంచక సుధాపాన పరవశులైన శ్రీరామకృష్ణరావుగారు దానిని తెలుగుదనకమున "పండితరాజ పంచామృతము" గా ఆంధ్రలోకమున కర్పించినారు. దీనిని ఆంధ్రరచయితల సంఘంవారు శ్రీవారి షష్టిపూర్తి సంవత్సరమున 1959 లో ప్రచురించినారు. ఈ గ్రంథమునకు కర్ణపూరమును సమర్పించిన పరిశోధకాగ్రేసరులు శ్రీమాన్ ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులవారి యభిప్రాయము లివి :" జగన్నాథుని పంచలహరులలో నొక్కొక్క గంగాలహరియే ఆంధ్రీకరింపబడినది. తక్కిన నాల్గులహరులు నితఃపూర్వము తెనిగింపబడనే లేదు. అందువల్ల నీ లహరు లైదింటికి నిదం ప్రథమముగా సాంగ్రపరివర్తనముల రచించిన విశిష్టగౌరవము డాక్టరు బూర్గుల రామకృష్ణరావు సుహృదయులకే దక్కినది. వారి రచనమున సుభ్రపసూతి ధారావాహిక మగు శయ్యాసంపద మాధుర్యౌజఃకాంతులను కావ్యగుణములను విలసిల్లుచున్నవి"—శ్రీరామకృష్ణరావుగారికి ఆంధ్రసాహిత్యమున శాశ్వతకీర్తి ప్రతిష్ఠలు కూర్చిపెట్టుటకీ యొక్క గ్రంథమే చాలును. "సంస్కృతకావ్యముల నాంధ్రీకరించుట క్లేశభూయిష్ఠమైన కార్యమని విజ్ఞులెరిగిన విషయమే. ఉభయభాషలందు తలస్పర్శి యగు పాండిత్యమును, రసభావాద్యలంకరణ విధానములను జీర్ణించుకొను శక్తియును, కవితాప్రౌఢిమతోపాటు నుడికారపు సొంపులను గూర్చగల శిల్పమును కలిగియున్నచో భాషాంతరీకర్తయొక్క ప్రయత్నము విజయవంత మగును. ఈ సామగ్రి ఇంచుకేనియు గలుగకుండెయు నేనొనరించిన సాహసమున" కని శ్రీరామకృష్ణరావుగారు తమ "మనవిలో" నుట్టంకించియున్నారు. చివరివాక్యము వారి వినయసంపదను చాటు నత్యుక్తి, తక్కినదంతయు ధ్వన్యంతరముగా వారి సామర్థ్యమును చాటు స్వభావోక్తి. "తెలుగున నీ పుట్టినకృతి తొలుతనె నెను భావ మాత్రదో చెడుదింగిల్ జెంగిడయనువాదన" యని కీ. శే. జయంతి రామయ్య పంతులుగారనువాదముల గూర్చి చెప్పిన లక్షణమునకు 'పండితరాజ పంచామృతము' లక్ష్యము. ఇట్టి "స్థాయినం గకొనుట పురాకృతపుణ్యముతోపాటు సముపార్జితమైన సాహితీసంపదలు" గాక మరేమి యగును? ముద్రితములైన మూలపాఠములందు కొన్ని యచ్చుతప్పులని తోచినవానికి శ్రీరామకృష్ణరావుగారు చేసిన సవరణలు పాండిత్యస్ఫోరకములే కాదు సమంజసములు మరియు సాచితీశోభితములు. వారే యేపాఠముల నెట్లు సవరించినది వారి "మనవి" నవగతము చేసికొన్నవారికి స్పష్టము. శ్రీమాన్ ఈయుణ్ణివారు శ్రీరామకృష్ణరావుగారి యనువాదమునకును ఇతరుల యనువాదములకునుగల తారతమ్యములను పట్టిచూపినారు. శ్రీ రామకృష్ణరావుగారి యనువాద మెంత మౌలికమో ఈ పద్యమును జూచిన తెలియును.

"ప్రభాతే స్నాంతీనాం నృపతి
రమణీనాం కుచతటే
గతో యావన్మాత ర్మిలతి
తవ తోయై ర్మృగమదః,

మృగా ప్తార ధైర్యమానిక
శితనఖాగ్రైః పరివృతా
విశంతి స్వచ్ఛందం విమల
వపుషో నందనవనమ్" (గంగాలహరి)

"నీ నీటన్ దొలవార రాచరమణుల్
గారాడ బీన స్తవా
స్థానమ్మౌ మృగపంక మందు గలి చన్
ధన్యమ్ములై శేభ్యులై
మా వారయాన సహస్రపదేభగణ సా
మ్రాజ్యమ్ము నెన్నంట గా
నానంద మ్మెసవరించు నందనవనీ
స్వచ్ఛంద సంచారముల్"

శ్రీరామకృష్ణరావుగా రొక్కొకచోట శ్రీనాథుని అనువాద పద్ధతి నవలంబించినారు. ఒక్క యుదాహరణము:

"ఆనంద నాట్యార్త్రాంత స్ఫుటకపట హేరంబజననీ
కటాక్ష వ్యాక్షేప క్షణజనిత సంక్షోభనివహాః,
భవంతు త్వాం గంతో హరశిరసి గంగా తనుభువః
తరంగాః ప్రోత్తుంగా దురితభయభంగాయ భవతామ్"

"అరుణార్క స్ఫుట చండి కాకృతిక టా
క్షాక్షేప సద్యః క్షణ
స్ఫురితామర్ష వికంపితేశ్వరజటా
జూటాంతరంగా పరి
త్వరత ప్రోత్తుంగ తరంగభంగిమ ముల్
క్రాంతంబు దుర్వార దు
ర్భర సంసార సముద్భవ చ్ఛిఖి శిఖా
భంగమ్ము గావించుతన్"

మూలకర్త కెంతటి తాదాత్మ్య ముండునో అనువాదమునకును అంతతాదాత్మ్యమున్న నే సాధ్యముకాని ఈ పద్యమును గమనింపుడు.

"సురస్రోతస్విన్యాః పులిన మధితిష్ఠ న్నయనయో
ర్విధాయాంతర్ముద్రా మథ సపది విద్రావ్య విషయాన్,
విధూతాంతర్ధ్వాంతో మధురమధునా యాం చితిరుదా
విమగ్నః స్యాం కస్యాం చన నవనభస్యాంబుదరుచి"

"అమరతరంగిణీ పులిన
మందు సుఖాసనమండి కన్నులం
దమరిచి యోగముద్ర విష
యమ్ముల దల్చి హరించి లోని సం
తమసము తత్సుఖాత్మక సు
ధారసనిర్ఝరి నవ్యవాంబుదో
త్తమరుచి జిక్కి లీనమునిగి
సమ్యక నౌటరి యున్నడో కదా!"

శ్రీరామకృష్ణరావుగారి మానస కేదారమున భక్తిసస్యములు పూటిగా పండినట్లు పై పద్యము పతాక మెత్తుచున్నది.

వ్యాసముక్తావళి

ఇంతవరకు శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారి పద్యరచనముల పరిచయ మొనర్చితిని. ఇక వారి గద్యరచనములగూర్చి మనవి చేతును. ప్రారంభముననే వారి వివిధవ్యాసములు ఫారసీ వాఙ్మయచరిత్రము మున్నగు వానిని పేర్కొనియుంటిని. వారు 1926 నుండి 1947 వరకు అప్పుడప్పుడు గోలకొండ, సుజాత, శోభ మున్నగు పత్రికలందు ప్రకటించిన సాహిత్య విమర్శనాత్మకములు, మరియు పరిశోధనాత్మకము లగు వ్యాసములు ఆంధ్రసారస్వత పరిషత్తువారు సంకలన మొనర్చి "వ్యాసముక్తావళి" గా ప్రకటించినారు. ఇందులో మొత్తము పది వ్యాసము లున్నవి.

1. 'నవీనవాఙ్మయము — ఎంకిపాటలు :— ఈ వ్యాసము శ్రీరామకృష్ణరావుగారు 1926 లో వ్రాసినది. ఎంకిపాటలనుగూర్చి ఆంధ్రదేశమున గొప్ప దుమారము రేగిన కాలము అది. అట్టి సమయమున తమ సునిశిత పరిశీలనాశక్తి, సత్యాన్వేషణాసక్తితో వారు భాషా వాఙ్మయములు వాని క్రమపరిణామమునుగూర్చి విపులమైన వ్యాఖ్యానము చేసినారు. "త్రసరేణువు మొదలు బ్రహ్మాండమువరకు ననంతకోటి రూపాంతరముల గన్పరచు నా సచ్చిదానంద స్వరూపమువలె లలిత కళాస్ఫూర్తి శేఖరములగు మనుజుని మానసిక వ్యాపారములు ప్రపంచముయొక్క వివిధావస్థల ననుసరించి యనేకవిధముల వ్యక్తమగుచుండును. అట్లు గాగూడదని వాదించిన మానువా? ఏ మనుజునియొక్క విచారభావనా ప్రపంచముల బయలు పెట్టు సంజ్ఞ. వాఙ్మయము సక్రమ పద్ధతులపైన నిర్మింపబడిన విజ్ఞానసౌధము. అది యెల్లప్పటికిని నిర్మింపబడుచు ఒకప్పుడు పరిపూర్ణతనందని నిర్మాణరాజము. అట్టి దాని స్వరూపమును సంకుచితపరచుట కెవరి తరము"మని ప్రశ్నించినారు శ్రీరామకృష్ణరావుగారు. నవీన యుగధర్మమైన జీవంభావనాత్మకమును రసాత్మకమునగు కళాసృష్టికి మూలతత్త్వమును

పరామర్శించినారు. గ్రాంధికా గ్రాంధిక భాషాభిమానము లెంత నిరర్థకములో సూచించినారు. సహృదయ విమర్శకుని కుండవలసిన లక్షణముల నుట్టంకించినారు. ఎంకిపాటలయందలి శబ్దసౌందర్యము, భావసౌకుమార్యము, ప్రణయమందలి యౌచిత్యమును గూర్చియు చర్చించి నిగ్గు తేల్చినారు.

2. ఉమర్ ఖయ్యాం : ఈ వ్యాసమును (1927) సుజాతలో ప్రచురించియుండిరి. దీనిలో ఉమర్ ఖయ్యాం జననము—జన్మభూమి - విద్యాభ్యాసము - సహాధ్యాయులు - చతుశ్శాస్త్రపాండితి - రాజసన్మానములు - కవిత్వము - బహిష్కారము - గీతములసంఖ్య- ప్రక్షిప్తములు - ఇతరభాషలలోని అనువాదములు - ప్రతులు - మధుకలశప్రశంస - మూలముతోడి తారతమ్యము - ఉమర్ ప్రణయతత్వము - ఇఖ్షై హాఫీజీ - సూఫీమార్గము - సెమిక్ నిష్ఠుర నిర్భయభావ ప్రకటనము - మున్నగు సమస్తవిషయము లున్నవి.

3. ఈశ్వరతత్వము - ఉమర్ ఖయ్యాం :— ఇదికూడ పై వ్యాసమువలె 1927 లో సుజాతలో ప్రచురింపబడినది. దీనిలో ఉమర్ నాస్తికుడు కాడనియు, అతని తత్త్వజ్ఞానము (సర్వసర్వరూప మక్షేమము. ఈశ్వరతత్వజ్ఞానము దుస్సాధము), జీవన్మిథ్యావాదము, అతనికి గలిగినశంకలు, ఈశ్వరునితోడి వాదనలు, వైష్ణవభక్తులతోడి పోలికలు, సాంఖ్య, యోగ, అద్వైతతత్వ సమన్వయమార్గస్థితియు సోపపత్తికముగా నిరూపించినారు. పై రెండు వ్యాసములందును వారనువదించి యుదాహరించిన పద్యసంఖ్య మూడువందల కెక్కువ.

4. కాకునూరి అప్పకవి జన్మస్థానము—ఈ వ్యాసము శ్రీ రామకృష్ణరావుగారి పరిశోధన పటిమకు పతాక. దీనినివారు (1932) గోల్కొండ పత్రికలో తొలుత ప్రకటించియుండిరి. అప్పకవి జన్మస్థానము మహబూబునగరం మండలమున కల్వకుర్తి తాలూకాలో తమ స్వగ్రామమగు బూర్గుల కాగ్నేయముల దూరమున నున్న కాకునూరగ్రహారమని నిరూపించినారు. కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావుపంతులు గారును శ్రీ గిడుగు వెంకటసీతాపతి గారును అభినవ మాత్రగామ నిర్ధారణమున నెట్లు పొరపడిరో నిరూపించి, ఇప్పటికిని కాకునూరికి రెండుమైళ్ళదూరమున నున్న 'లేమామిడి' యే అగ్రహారమనియు, అందే అప్పకవి ప్రపితామహుండు పోయినయుండెననియు నిరూపించినారు. నిడుదవెల్లి, బొద్దికేపల్లి మున్నగు అప్పకవి చెప్పిన గ్రామముల నిరూపించినారు.

5. ఉర్దూభాషా పారస్వతములు :—శ్రీ రామకృష్ణరావుగారీ వ్యాసమును (1943) ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావుగారి షష్టిపూర్తి సంచికలో తొలుత ప్రచురించినారు. తెలంగాణమువా రందరికిని ఉర్దూభాషావాఙ్మయములతో పరిచయ మధికము. శ్రీ రామకృష్ణరావుగారికి ఉర్దూ కరతలామలకము. ఈ వ్యాసమున వారు ఉర్దూ పుట్టుపూర్వములు మొదలుకొని ఈనాటివరకు గాంచిన యభివృద్ధిని పరిశీలనాత్మకముగా సమీక్షించినారు. శౌరసేని ప్రాకృతము పాదులోని ఖడీబోలీ, అరబ్బీ ఫారసీపదముల మైత్రితో రేఖ్తాయై, ఖాన్ ఆర్జూకవిచే ఉర్దూనామకరణమంది, మిర్జా అమీర్ ఖాన్, సుల్తాన్, వలీలకృషితో పెరిగి, లాల్ ఖిల్లా (ఢిల్లీ) నుండి లాల్ దర్వాజా (హైదరాబాదు) వరకు వ్యాపించిన నీవానాయకుల ప్రాపకమున ఫలించి, ఈనాడు భారతీయభాషలందొకటైన ఉర్దూభాషా చరిత్రమును క్లుప్తసుందరముగా వర్ణించినారు. అటుతరువాత ఉర్దూసాహిత్యచరిత్రమును యుగములుగా విభజించి (మొగలు పాదుషాల కాలమునుండి కుతుబ్షాహీ సుల్తానులవరకును, తదనంతరము నిజాం సర్కారువారి ప్రాపకమునను) అమీర్ ఖుస్రూనుండి వలీఔరంగబాదీ వరకును పుట్టిన ప్రథమయుగచరిత్రమును, సౌదా, మీర్, దర్ద్ కవిత్రయముతో ప్రారంభమయిన రెండవయుగము, గాలిబ్ జౌఖ్, ఆతిష్ అక్బరాబాదీ, బగ్రా, దక్బస్తు, ఎక్బాల్ మున్నగు కవుల కృషితో నెట్లు వికసించి ఈనాటి మఖ్దూం మొహియుద్దీన్ వంటి అభ్యుదయ రచయితలచే నేతీరుగా దోహదములొందినదో వివరించినారు. ఉర్దూభాషాచరిత్రముల గూర్చి తెలుసుకొనగోరువారికీ వ్యాసమొక సిద్ధఘుటిక. "ఉర్దూవాఙ్మయ సోపానము - బహ్మనీ కుతుబ్షాహీ సుల్తానులు" శీర్షికతో శ్రీ రామకృష్ణరావు తెలుగు భాషా సమితివారి 'తెలుగు సంస్కృతి' సంపుటమున నొక చక్కని వ్యాసమును ప్రచురించినారు.

6. సూఫీ సర్మద్ :—పర్షియాలో పుట్టి భారతదేశము మెట్టి వాణిజ్యమును వీడి ప్రణయమున దగిలి ఇష్కు మజాజీనుండి ఇష్కు హకీకీ సోపానమెక్కి విరాగియై దిగంబరుడై చివరకు జీవన్ముక్తుడై ఆలంగీరు చక్ర

సత్రికర్త కెరదైన సూఫీభక్తుని గాథ యిది. సూఫీల భక్తిసోపానక్రమమును గూర్చి వర్ణించునప్పుడు శ్రీరామకృష్ణరావుగారి వచనశైలి ఒడ్డులొరసి పారు ప్రవాహమువలె నడచినది. భక్తివిషయము వచ్చినచో వెల్ల వారి కుండె జల్లుజల్లుమనును. తదనుగుణముగా వారి కలము గల్లుఘల్లుమనును. "ఏ శిథిలమనస్కుడు తన మధుర విశేషములను ప్రణయినీదృగ్విలాస విభవముల మననము జేయుచు గడుపుట నెరుగడో వాని కొవంద స్వరూపుడగు ప్రణయమూర్తిని ధ్యానించుచు రాత్రులు తపించు భాగ్యమెట్లబ్బును? ఏ గర్వోపహతుడు తన ప్రణయనిధానము నెల్ల ప్రేయసియొక్క మదగజగమనగర్విత చరణద్వయంబుపై సమర్పణంబు చేయలేడో వానికి సాత్త్వికసుశ్యామాంభోరూపములగు శిలావిగ్రహముల బగల్చుట కేరీతి శక్తి కలుగును? ఏ శుష్కహృదయము మనోహారిణీ మధురాధరసంజనిత గానామృతముచే సుస్మితమై పరిభవింపదో యది పరమపురుషుని వేణునాద సుధాలహరిచే నెట్లు తరంగితమగును? పూర్వము కాలినవత్తియే తీవ్రముగా నంటుకొని జ్వలించును గాని క్రొత్తవత్తిపెట్టిన దీపము వెలిగించుట కాలస్యమగును కదా"—ఇది వారి శైలికొక యుదాహరణము. నిష్కారణముగా సర్మద్ వంటి మహాభక్తుని చంపించిన ఆలంగీరు చక్రవర్తినిగూర్చి వ్రాసినప్పుడు వారిశైలి మహోద్వేగమునందినది. ఆ పట్టు లుదాహరించిన గ్రంథవిస్తరమగును. అట్టి మహోద్వేగమునుకూడ, 'అనల్ హక్' (సోహం బ్రహ్మ) సిద్ధాంతమునకై తన తలపందునిచ్చిన మహాభక్తుని చరిత్రమును ముగించునప్పుడు, నిర్లిప్తతతో నణచిపెట్టి ధీరోదాత్త గాంభీర్యముద్రను బట్టి నడచిన దీ శైలి. "పట్టాభిషిక్తుడైన రెండవయేట నీరక్తపాతమొనర్చిన ఆలంగీరు చక్రవర్తి తరువాత 25 సంవత్సరములు రాజ్యమేలినను, ఈకాలమున నెప్పుడాతనికి శాంతి లభించలేదు. మరణముకూడ పరిస్థలములోను విషాదావస్థయందును సంభవించినది. ఏ మహాత్ముని రక్తబిందువుల ప్రభావమో! కాని ఆ మహాత్ములెట్టి వాక్యమేమి బలుకనప్పుడు మనకేల చక్రవర్తి పైకోపము?" ఉబికివచ్చు కన్నీళ్ళను గద్గదస్వరముతో కన్నులలోనే యదుముకొన్నట్లున్నదీ చివరివాక్యము!

7. రెడ్డిరాజులకాలపు మతసంస్కృతులు:— 'వ్యాసముక్తావళి' యందిది చివరివ్యాసము, దీనిని శ్రీ రామకృష్ణరావుగారు (1947) తొలుత 'శోభ'లో ప్రచురించిరి. ఇది కూడ వారి పరిశోధనాత్మక దృష్టికి తార్కాణమగు వ్యాసరాజము. దీనిలో రెడ్డిరాజుల పుట్టుపూర్వములు, వారికి పూర్వ మాంధ్రదేశమున ప్రబలిన జైన, శైవములు, రెడ్డిరాజ్యమున బ్రాహ్మణమతమునకు లభించిన ప్రోత్సాహము వారి యాలంబమున వెల్లివిరిసిన శైవవైష్ణవములు, వారి దానధర్మములు, భక్తిప్రపత్తులు, నాటి సాంఘికపరిస్థితులు మున్నగునవి సమగ్రముగా వర్ణించినారు. వారి వ్రాతల కాధారములు శాసనములు, సమకాలీన వాఙ్మయము, దేవాలయములు మొదలైనవి. వారీవ్యాసములు వ్రాయునాటికి మల్లంపల్లి వారి రెడ్డిరాజుల చరిత్రముగాని, రెడ్డి సంచిక గాని, వెలువడి యుండలేదు. కనుక వస్తుసమీకరణమునకు వారి కెంతశ్రమ, ఓర్పు వలసి యుండెనో మనము భావింపవచ్చును.

ఇంతవరకు ఇటీవల ప్రచురింపబడిన పుస్తకములు, పత్రికలాధారముగా శ్రీ రామకృష్ణరావు గారి సాహిత్యకృషి సంగ్రహించితిని. అముద్రితముగానుండినది, ముద్రితమై నాకందనిదెంత సాహిత్యము కలదో, రావుగారి యనుభవము కడుదొడ్డది. అట్టివారు స్వీయచరిత్రమును కూడ వ్రాసిన నెంతబాగుండును! ఫారసీ వాఙ్మయచరిత్రము ముద్రింపబడిన నా జాతి గ్రంథములందది శ్రీ.

ఋ షి వా ణి

శ్రీ బెళ్ళారి శ్రీనివాసమూర్తి

పరవశత వాల్మీకి పలికినది ఛందమై
కరుణమై కవితమై కదలించె జగమెల్ల —
పరమజాహ్నవి పారు సరణిలో రామకథ
మఱపించె నవరసోన్మాదమున తనువెల్ల.

ఆదికవి లోలోన నణగినది భావమై
స్వాదువై, గీతమై సాగినది తృటిలోన —
పాదుకొని శాంతి దివ్యానంద నాకమై
యీదించె భవసాగరోదకము దరిగాన !

మునిచంద్రు తపమెల్ల జనచకోరజ్యోత్స్న౨
యనువుమై పొంగినది యలమినది దిక్సీమ —
కనుదెఱపి యాధ్యాత్మికప్రేమ యమృతమై
తనిపినది తనయంతతానమై హృత్సీమ.

రామగాథాప్రసష్ట ప్రేమమై, శోకమై
ఆ మనోహరవాణి యాడినది శ్లోకమై —
స్వామి జీవనగీతి సాధ్వి జానకి రీతి
భూమి కాదర్శమై పొల్చినది యొకరీతి !

భారతీయ తత్త్వమీమాంస: ప్రజారాజ్యాలు

శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు

పాశ్చాత్య పండితులు మన తత్త్వశాస్త్ర విషయమున ఎంతో కృషిచేశారు. కాని వైదేశికులు, విమతస్థులు కావడంవల్ల మన తత్త్వశాస్త్ర రహస్యం వారికి బోధపడిందికాదు. ఇక మన పండితులను చూడబోతే, వారు తర్క వితర్కాలతో కాలక్షేపం చేస్తూ, ముఖ్యవిషయాన్ని జారవిడుస్తూ ఉంటారు.

నేటి ప్రజారాజ్యములు సుఖశాంతులతో వర్ధిల్లవలెనంటే గృహస్థ (పౌర) ధర్మనిర్వహణం సుష్ఠుగా జరగాలి. మన తత్త్వ మీమాంస లా గార్హస్థ్య ధర్మాన్ని చక్కగా నిరూపించినది. ధర్మాచరణకు, జ్ఞానసంపదకు పాత్రుడుదగకపోతే మనశ్శాంతి దుర్లభమవుతుంది. మన తత్త్వ విచారణయందు ఈశ్వరారాధనమనే ప్రధాన లక్షణమొకటి ఉంది, కర్మ జ్ఞానములను చక్కగా సమన్వయం చేస్తున్నది. ఈ లక్షణం ఇతర తత్త్వదర్శనములకు లేదు. మన తత్త్వదర్శనం ఉదారాశయము సమున్నతమగుటవల్ల ఈ కాలాన సకల జనులకు సౌఖ్యం లభింపజేయుటకు కడు మిక్కిలి అనుకూలిస్తుంది.

శ్రద్ధాలోపము

తత్త్వశాస్త్ర సారమును జారవిడిచి, అంతశ్శుద్ధిలేని దురాచారముల నవలంబించుటచే ఇటీవల మన ఆచరణకు, శాస్త్రానికి విరోధం వాటిల్లినది. దీనికి పరపాలనం కొంత కారణమయినను మనకు శాస్త్రమునందు శ్రద్ధాభక్తులు లోపించుటే ముఖ్య కారణం. అంతేకాని మన శాస్త్రానిది కాదీ లోపం. ఇపుడు శాస్త్రవిహితమైన ఆచరణ అవలంబించే అవకాశం మనకు లభించింది. కనుక మనము దానిని పరీక్షించి చూడవచ్చు.

నేటి భౌతిక దర్శనములవల్ల మన కలవడిన జ్ఞానానికి, సంయమానికి మన తత్త్వదర్శన మొక్కటే చాలా అనురూపమైనది; నేటి కాలాని కది అనుగుణమైనది. కనుక మనం మనస్ఫూర్తిగా దాని నవలంబించి, తదనుగుణాచరణం చేసిచూడవచ్చును.

ఇతర ధర్మములకు భయమే ప్రవర్తకం. రాజదండనం, పరలోక దండనం అనే భీతి ఇటీవల మన ధర్మమందుకూడ జొరబారిన మాట నిజమేకాని వేదాంత దర్శనమున అట్టిభీతికి చోటులేదు. మన శాస్త్రము ధర్మమునకే తప్ప ధర్మప్రవర్తకుడగు రాజునకు ప్రాధాన్య మీయదు. ప్రకృతిని పాలించేదే ధర్మము. స్మృతికర్తలు, న్యాయాధికృతులు ప్రతిపాదించే ధర్మానికి ప్రాధాన్యము లేదు.

మనతత్త్వ శాస్త్రము, నేటి భౌతిక దర్శనములు

"భూతజాల మంతా నాచే వ్యాప్తమై నాయం దున్నది. అది నా కాధారము కాదు. నేను సృష్టిస్థితి కారణుడనయ్యు దానియందు తగుల్కొనను. ప్రకృతి వశమై పుట్టుచున్న ఈ సృష్టికి ప్రకృతియే ఆధారము. నా అధ్యక్షతచే ప్రకృతి చరాచరసృష్టి చేయుచున్నది. దానిచే జగచ్చక్రము ప్రవర్తించుచున్నది" అని గీతలు నవమాధ్యాయమున 4-10 శ్లోకములందు చెప్పుచున్నవి. మూలప్రకృతియందలి సర్జనశక్తి వికాసమే జగత్తని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. నేటి భౌతికదర్శనములు గ్రహించిన ఈ రహస్యాన్ని మన దార్శనికు లేనాడో అతీంద్రియ దృష్టిచే గ్రహించిరి. ఇది పరమాద్భుతము కదా!

నేటి పదార్థవిజ్ఞానము, జీవశాస్త్రము మనదార్శనికులకు క్రొత్తవికావు. సత్యగవేషణమే ఉపనిషద్విచారణకు జీవగఱ్ఱ. అప్రాకృతములను అద్భుతములను మహిమలను అపేక్షింపక ఉపనిషత్తులు నిత్యమగు సత్యమునే ఉపాసించును. నేటి భౌతిక దర్శనజ్ఞానమును కొంత నమ్మి కొంతనమ్మని అన్యమతములు సందేహశీలములు. భౌతిక తత్త్వదర్శనమున కట్టిపాట్లులేవు.

భౌతిక దర్శనములకంటె ముందే మన వేదాంతశాస్త్ర మీవిధంగా సృష్టి రహస్యాన్ని దర్శించి, ధర్మమునకు శాస్త్రమునకు సమన్వయము కూర్చినది.

అంతేకాదు. లాభసాటి బేరము, పోటీవ్యాపారము గృహస్థ ధర్మవిరుద్ధములనీ, అవి లోకమునకు శ్రేయస్కరములు కావనీ మన ఋషులు ఏనాడో గ్రహించిరి. ఫలాభిసంధి (లాభదృష్టి) లేకుండా, లోకశ్రేయమును కోరి శక్త్యనుసారం కర్మాచరణ చేయవలెనని మన శాస్త్రం చెప్పుచున్నది. దీని ననుసరించే గీతలు కర్మలలో ఎక్కువ తక్కువలు లేవనీ, అన్నీ సమాన గౌరవార్హములే అనీ చెప్పుచున్నవి. లోకారాధనమే ఈశ్వరారాధనమని నిరూపించి గీతలు పరోపకార నిరతికి ప్రేరణ కల్పించుచున్నవి. గీతలు చెప్పిన కర్మయోగ మిదియే. ఫలాపేక్ష లేగాక, ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలాచరించవలెననీ, అట్టి సన్యాసము నాదరించుట పరమ సుఖహేతువనీ గీతలు ప్రవచించినవి.

ఎవరి ధర్మములు వారాచరించుటే జగత్కారణుడు, సర్వవ్యాపకుడు నగు ఈశ్వరుని పూజించుట. ఇతరుల ధర్మమును నిపుణంగా చేయుటకంటె స్వధర్మాన్ని ఓపినట్లు చేయుటే శ్రేయము. స్వభావానుగుణకర్మ మందు దోషమున్నను దానిని విడనాడరాదు. అగ్నితో ధూమము వలె మానవకర్మలన్నిటిలో ఏదో దోషము కూడియుండును. నిష్కామంగా, నిస్సంగమనస్కుడై కర్మలాచరించుటే సన్యాసము. ఇదియే గీతోపదేశము.

అర్థవ్యవస్థ

లాభదృష్టిలేని నూతన అర్థవ్యవస్థను నేడు లోకం కోరుతున్నది. అట్టి వ్యవస్థ కిదివరకే గీతలే పునాదులు వేసినవి. స్వప్రయోజనపరుల లాభరతులకొరకే గీతలిట్లుపదేశించెనని అవివేకులు పల్కుచుందురు. నిజమే. మలినబుద్ధులకు, దోషైకదృక్కులకు అమృతము హాలాహలము వలె కన్పించును.

అధిక ధన వ్యయముచే గాని నేడు జీవనం గడచుటలేదు. జన సంఖ్య నానాటికి పెరిగిపోతున్నది. కావున వ్యష్టికర్మను సమష్టికి సౌఖ్యప్రదముగునట్లు దిద్దే అర్థవ్యవస్థ చేయవలెను. అటి వ్యవస్థ పలుమందికి బాధాకర మవుతుంది. పురుషకారం స్వేచ్ఛను కోరుతూ ఉంటుంది. నూతనార్థ వ్యవస్థ ఆ స్వేచ్ఛ నరికట్టుటచే బాధ కల్గుతుంది కావున అట్టి పురుషకారమును, ఉత్సాహమును, సంతుష్టిని పూర్తిగా తుడిచిపెట్టని వ్యవస్థ చేయవలసి ఉంటుంది. ఇతరులు అధికార సహితంగా తన స్వేచ్ఛ నరికట్టుతున్నారనేదే పురుషుల అసంతుష్టికి మూలకారణం కనుక అర్థవ్యవస్థను ధర్మము నందు ప్రతిష్ఠించినచో ఆ బాధ తొలగిపోయి, సంతోషోత్సాహములకు కారణమగును. పరోపకారము ధర్మవిహితము నే భక్తి విశ్వాసములు కుదిరినచో పురుషునకు తదనుగుణమగు సంయమము, చిత్తవృత్తియు లభింపగలవు.

పురుషుల కర్మ సమాహారమే సమష్టికర్మ. పురుషులు సంతోషోత్సాహములతో పనిచేయని నాడు సమష్టికర్మ ఫలింపదు. సంతోషము నేడి పురుషలక్షణం. సమష్టి కట్టి సంతోషాదులుండ నేరవు కావున పురుషులు భయముచే గాక సంతోషోత్సాహములచే కర్మచేసే వ్యవస్థను మనము కల్పించాలి ధర్మబుద్ధి, ధర్మప్రేరణము — ఇవియే అట్టి సువ్యవస్థకు మూలబలమై ఉండాలి. ధర్మచింతన మొక్కటే పురుషునిచే సంతోషపూర్వకంగా పరోపకారం చేయించగలిగేది. ఇదియే హైందవధర్మసారము. గీతలు దీనినే బోధించినవి.

19వ శతాబ్దిలో యూరపునందైశ్వర్యము సమకూర్చిన పోటీవ్యాపార విధాన నిరాకృతమైనది. దాని స్థానే భిన్నప్రకార వ్యవస్థితమైన సహకారమే జీవన సర్వస్వమును పాలింపవలెనని సర్వులు అంగీకరిస్తున్నారు. తొల్లిటి వ్యవస్థకు లాభదృష్టియే ప్రేరకము, ప్రాణప్రదము. తద్వ్యతిరిక్తమైన దేదో మరియొక ప్రేరణ నూతన వ్యవస్థకు గావలసియున్నది. కావున అర్థచింతా విముఖమైన ధర్మచింతను, తదనుగుణ చిత్తసంస్కారమును కల్పించవలసియున్నది. కమ్యూనిజము కేవల భౌతిక దృష్టితోనే తాను కార్యమును సాధించితి ననుచున్నది. కాని, హింసాబహుళము, క్లేశప్రదమునగు విప్లవంవల్ల గూడా ఈశ్వర భక్తివంటి తాత్కాలిక చిత్తవృత్తి విశేష మొకటి ప్రజల నావహిస్తుందని మనం గ్రహించవలెను. స్పర్ధాశూన్యమగు అర్థవ్యవస్థ ఎదటనైన, ఏ మాత్రమైన ఫలప్రదమైనచో అదట నెల్ల ఆత్మమూలమును కదలించే మహావిప్లవమో యుద్ధావేశమో ప్రాప్తించి, స్వార్థచింతను తుడిచిపెట్టిందకాని మరియొకటి కాదు. ఈశ్వర చింతకు ప్రత్యామ్నాయమైన ఈ యావేశము తాత్కాలికమే కాని చిరస్థాయి కాజాలదు.

నాస్తికతతో ఆత్మ వినాశము

స్వతంత్ర పురుషకారంతో గూడిన అర్థవ్యవస్థ యూరపులో భేదములకు దారితీసింది. సంపద కొందరి

రొమ్ము నే కేరుకొని, ఇతరులు విప్వ్వరములో కూరుకొని పోయిరి. ఆ దారిద్ర్యం స్వదేశంలోనే కలుగనక్కర లేదు. ఇతర దేశాలను పీల్చుక తినటం తేలిక కూడాను. అలా పరులను పీల్చుకొని తినాలంటే ఇప్పు డిక సాగదు. అలా కూడబెట్టిన సొమ్మును పాపపు సొమ్ముగా ఎంచే రోజు లివి. సంపదుత్పత్తి ఒరులకు పీడాకరం కాకుండా ఉండాలి. సంపన్నతలో అంతరములు, కొందరికి అసౌఖ్యములు ఉంటే తీరుతవంటేను, వాటిని సహించక తప్పదంటేనూ సాగ దిక. బహిరంగంగా గాని, చాటు మాటున గాని పోటీ వ్యాపారం సాగించటం మాత్స్యన్యాయంగా ఎంచుతున్నా రిప్పుడు. "నా పురుషకార ఫలితం నేనే అనుభవించాలి. ఇందులో ఒకరికి జోక్యం ఉండకూడ"దనే రోజులు వెనుక బట్టినవి. వెనుకబడిన దౌర్భాగ్యుల నుపేక్షించి, ముందుకు సాగిపోవటం కూని పనిగా ఎంచుకొంటు న్నాము. సమష్టి శ్రేయంకొఱకు వ్యక్తుల సొంత వ్యవహారములలో జోక్యం చేసికోవటం యుక్తమనీ, జోక్యం చేసికోక తీరదనీ అంటున్నా రిప్పుడు.

ప్రాతవ్యవస్థను నిర్మూలించి, సమష్టి శ్రేయం కొఱకు స్వార్థరహితమైన నూతనార్థిక వ్యవస్థను నెలకొల్పే భారం కొలదికాలాన కొందరి చేతులలో పడినది. వారు తాత్కాలికమైన రాజకీయ ప్రయోజనమునకు లొంగిపోవటం దురదృష్టం. అసంతుష్టియే విప్లవ హేతువనీ, మతధర్మములు సంతుష్టి ప్రదములు గావున వానిని నిర్మూలించవలెననీ వారు తలపోసిరి. నల్ల మందువంటి యీమత ప్రాతవ్యవస్థలో భాగంగనుక దానికి సమూల నాశం తలపెట్టిరి. పరాప్రవృత్తికీ, స్వార్థరాహిత్యానికీ ప్రబల హేతువైన ఆస్తిక్యమును వారీవిధంగా చేసేత నిర్మూలింపబూనిరి. లోకమున హెచ్చుతగ్గులను సహించటం నేర్పేదీ, దీనులకు సమాశ్వాసం కూర్చేది ఈ ఆస్తిక్యమే కావున అసంతుష్టి కారకుల కది ప్రబల ప్రతిబంధకమై కన్పించింది. దానిని దండనీతివల్లనో, సామాద్యుపాయములవల్లనో మట్టుబెట్ట సంకల్పించిరి. ఆసంకల్పం పూర్తిగా ఈడేరలేదనే అనుకుందాము.

నూతనవ్యవస్థకు ప్రాణభూతమైన నిస్స్వార్థప్రవృత్తికి ఆస్తిక్యమొక్కటే రక్షకమని యెఱుంగక వారు దానిని నిర్మూలింప సమకట్టుట ఆత్మనాశకరము. ఆర్థికవిప్లవము సాధించుట కీయాస్తికతా నిర్మూలన మనవసరమని వారు గ్రహింపరైరి. విప్లవావేశమున బడి కొట్టుకొని పోవుచున్నవారి కీయనర్థము గోచరింప దయ్యెను. ఆయావేశమే సర్వసమర్థమని యెంచిరి. ఆయావేశం నిలిచేదికాదు. ద్వేషము, క్రౌర్యము ప్రజల నెంతకాలమని తమ వశమున నిలిపికొనగలవు? ఆస్తిక్యము స్థానే అప్పటి కుపకరించిన ఆవేశం చల్లబడగానే నూతన వ్యవస్థ కూలిపోతుంది. అందువలన స్వార్థపోషకములైన కొన్నికొన్ని ప్రయోజనాలను ప్రజలకు కల్పింపవలసి వస్తున్నది.

పూర్వ వ్యవస్థయందు పురుషకారానికి ప్రేరకమైన లాభదృష్టిని వీరు మరల సంగుదారులవెంట అనుమతించినవారగుచున్నారు. స్వార్థపరతను బలాత్కారముచే మాన్పనులేము; పరార్థపరతను ప్రభుత్వ సావధానత రక్షింపనులేదు. ప్రభుత్వపు పరామరిక కొంతకాలానికి సడలకతప్పదు. దాని పటుత్వంకూడా తగ్గిపోతుంది. కాబట్టి ఏదో మిషతో ప్రజలకు కొన్ని ఎరలు చూపవలసివస్తుంది. ఈవిధంగా తొల్లిటి లాభదృష్టిని సమ్మతించినట్లే అవుతున్నది. చాటుమాటుగా కల్పించే యీ లాభపు ఎరలవల్ల అప్పటిపబ్బము గడచిపోవునేకాని అవి శాశ్వత పరిష్కారాన్ని సాధించలేవు.

ప్రేరణశక్తి

సంఘములోని స్త్రీ, పురుషులలో నెవరి వ్యక్తి వారిది. సంఘమున కట్టి ఏకవ్యక్తి యుండదు. వ్యష్టికి పరోపకార చింతను పుట్టుటకు మార్గము లున్నవేకాని దాని ప్రత్యేక లక్షణములు మాత్రము మాన్పరానివి. వ్యక్తికి హాని కలుగకుండ పరోపకార చింతను పుట్టించే యుపాయమును విచారింపవలెను. గీతలో చెప్పిన దానికంటె అంగులకు మంచి యుపాయము కన్పించదు. అంతరమైన ధర్మచింతకుండే శక్తి బాహ్యములైన ప్రభుత్వ సావధానతకు, బలాత్కృతికి ఉండజాలదు. ధర్మచింతనకుండు హెచ్చరిక గూఢచారుల చూపుల కుండదు. ప్రభుత్వ దండనముకంటె ఆ ధర్మ చింతనమే అధిక ఫలప్రదము అను రహస్యమును గుర్తింపవలెను.

ఇంతకంటె ముఖ్య విషయమేమనగా, భారత ప్రజల ధర్మచింతనమునకున్న ఉదారత మరి యే మతమందును కానరాదు. భారత ప్రజ తత్త్వాన్వేషణ కనేక నామరూపములు కల్పించుకొనిరి. ఎవరి యిష్ట దైవము

వారి కున్నను ఇతరులు పూజించెడి మూర్తులను వారు కాదనరు. తమ అరాధ్యదైవము నెంత కొనియాడు కొన్నను వారితర దైవములను తెగనాడరు. సుదృఢమైన యీ భక్తిభావమునంగా, ఉదారమగు నీధర్మ సంప్రదాయమునంగు పెరిగిన హైందవుల చిత్త సంస్కారము. ఇతర మతములతో దగవులాడక, నానా లక్షణ లక్షితమైన సనాతన జీవనము సుఖముగా కొనసాగి పోవుటకు హేతువగుచున్నది. ఈ సంప్రదాయము పురాతనమయ్యు నేటి కాలమున కెంతయు తగి యున్నది. ఎవరి మార్గము వారిదైనను అన్ని మార్గములు పరమేశ్వరునే పొందించునని యీ నిస్తుల ధర్మలక్షణము గీతలలో 4-7-9 అధ్యాయములందు తరచుగా ప్రస్తావింపబడిన.

నన్నే రూపమున ధ్యానించినను, ఏ విధముగా పూజించినను భక్తుడు నన్నే చెందుట నిక్కమని పరమేశ్వరుడు గీతలలో నభయమొసగుచున్నాడు. ప్రధానముగ భక్తి విషయమున చెప్పిన ఈ యౌదార్య లక్షణము సకల మతములను లోగొనుచున్నది.

ఇంతటి యుదార ధర్మమునకు మూలమైన సత్యమును చిరకాలమునాడే హైందవ మహర్షులెట్లు దర్శింప గలిగిరా యని ఆశ్చర్యము పొడమును. విశ్వశ్రేయమునకు, జగన్మంగళమునకు సాధనమయిన యీ ధర్మబోధమే హైందవ సంస్కార పరిమళమునకు నాయకమణి వంటిది.

సన్యాసము

సంశయాత్ములీట నొక ప్రశ్నము చేయుదురు: "అంతయు బాగునే యున్నది కాని సన్యాసము మాట యేమి? కర్మత్యాగ విషయ మేమందురు? గృహస్థ ధర్మాచరణము, పురుషకారము ప్రధానముగ ఈ కాలమున సన్యాసమును, దైవాధీనతను బోధించు హైందవ మతమువలన ప్రయోజన మేమి?" యని యడుగుదురు. ఇదిగో, సమాధానము చెప్పుచున్నాను. మన వేదాంత శాస్త్రము కర్మత్యాగమును, సన్యాసమును బోధించుట లేదని ముందుగా గ్రహింపవలెను. కర్మఫలము నెడ ఆసక్తిని విడనాడుమని చెప్పునే కాని మన వేదాంతము మీరనుకొన్న కర్మసన్యాసమును బోధించుట లేదు.

సరిగా ఇట్టి ప్రశ్నయే తన్నడిగినట్లు శ్రీకృష్ణుడు గీతలలో నీ విషయమును స్పష్టముగా వివరించెను. కర్మాచరణమున శ్రద్ధయు, కర్మఫలము నెడ ఆసక్తియు ప్రధానమని శ్రీకృష్ణుడు చాటి చెప్పెను. అసంగుడై కర్మాచరణ మొనర్పవలయునని యే గీతలు ప్రతి అధ్యాయమునను ప్రతిపాదించినవి. ఈ విషయము నిరూపించుటకు శ్లోకముల నుదాహరింప బనిలేదు. ఇందు సంశయమునకు చోటు లేదు. విషయ సుఖాభిలాషయే సంసారమున దుఃఖమునకు హేతువగుచున్నది. దీనివలననే మోహము, క్రోధము, మతిభ్రంశము, దుఃఖము జనించును. గీతలు, ఉపనిషత్తులు చేసిన మహోపదేశ మిదియే.

గృహస్థుడు (భోగుడు) అసక్తుడై ధర్మాచరణ మొనర్పవలెను. అతని కర్మాచరణము లోకము కొఱకే గాని స్వలాభము కొఱకు గాదు. ఈ మహోపదేశమే గీతలకు సమన్వయత నార్జించిపెట్టినది. గీతలు, ఉపనిషత్తులు చెప్పిన యీ పరమార్థమును గ్రహించినచో ఈనాటి పౌరులు సంఘసేవా ధురులు కాగలరు. లోకమును సేవించుటకై తన బ్రతుకెల్ల మీదుగట్టిన గాంధీజీ దృఢ సంకల్పమునకు, ధీరతకు మూలకందమీ గీతోపదేశమే. వేయి మాటలకంటె ఈ ప్రత్యక్ష నిదర్శనమే చాలును గీతాధర్మ ప్రాశస్త్యమును చాటి చెప్పుటకు.

ఇక కర్మసిద్ధాంత మందురా, హైందవధర్మమున కదే ఆయువుపట్టు. ఆధ్యాత్మిక జగత్తునకూడ కార్యకారణ సంబంధము నది నిరూపించును. మానసికము, కాయికమునగు కర్మలకు ఫలమనుభవింపక తీరదనుట మనకు ప్రత్యక్షమే. ఆ కర్మఫలము శరీరముతో అంతము కాజాలదు. శరీరియు, కర్తయునగు జీవుడు శరీరముతో దాను నశింపడు. ఈ జన్మమున వల్ల కాయిక మానసిక కర్మల ఫలము జీవు నంటి పట్టుకొని తదనురూపమైన నూతన జన్మము నాతనికి ఘటించును. ఇదియే హైందవ తత్త్వశాస్త్రసారము. దీనిని కాదందురా, మరియొక సిద్ధాంతము నన్వేషించుకొనుడు. దీని నంగీకరించిన గృహస్థుల నీ కర్మఫల బాధ్యత తప్పదనుటయే ముఖ్యము.

జగత్కారణమును, దాని స్వరూపము నిదమిత్థ మని నిర్ణయింపజాలము. మన పరిమితబుద్ధి చే అనంత తత్త్వమును నిర్వచింప బూనినచో నెక్కడికక్కడే విరోధములు పొడగుచుండును. ఆత్మయే జగత్కారణ మని అంగీకరించినచో నేటి మన భౌతిక విజ్ఞానము

కర్మ సిద్ధాంతముతో సమన్వితమయినట్లు ఇంకొక సిద్ధాంతముతో సమన్వితము కాగు. శక్తికి నాశము లేదని భౌతిక దర్శనముల సిద్ధాంతము కదా! మన కర్మవాదము ఆ సిద్ధాంతముననే ఆత్మ లక్షణమున కన్వయించుచున్నది. పరాపర ప్రకృతుల (Matter and spirit) నిత్యతను చెప్పెడి యీ రెండు సిద్ధాంతములు పరతత్త్వ లక్షణమును వేర్వేర నిరూపించుచున్నవి.

అదృష్టము

కర్మఫల స్వరూపమును మన వేదాంతులు దైవమని వక్కాణింతురు. పాశ్చాత్యులు చెప్పెడి అదృష్టము వేఱు. అది మనవారు చెప్పెడి దైవమునకు సవతి తమ్ముని వంటిది. మన దైవమునకు ప్రకృతి ధర్మములతో విరోధము లేదు. పురుషకారము నది భంగింపదు. కారణమున్నచో కార్యము తప్పదనుటయే మన కర్మ సిద్ధాంతము. ప్రకృతి గనుక మనివార్యమని న్యూటను నిరూపించెను. ఆత్మ పునర్గతియు నట్టిదేయని మన వేదాంతము చెప్పుచున్నది. ఒకానొక పని చేసిన పిమ్మట దాని ఫలమునుండి తప్పించుకొనలేము. ఒకానొక ఫలమును సంపాదింప గోరుదుమేని దానికి కారణమగు కర్మ నాచరింపతీరదు. మన తలపులకు, చేతలకు అనురూపమగు ఫలము పుట్టితీరును. ఇదియే కర్మసిద్ధాంతము. కర్మఫలము తప్పదని యెఱిగి గృహస్థులు ధర్మాచరణ మొనర్పవలయును. నిషిద్ధ కర్మను పరిహరించుటకు రాజశాసన భీతితో పని లేదు; నిషిద్ధకర్మకు ఫల మనుభవింపక తీఱదను నిశ్చయమే చాలును.

కర్మసిద్ధాంతము పురుషకారమును, ఇచ్ఛను గాదనదు సరికదా, పురుషున కది స్వేచ్ఛాదాన పత్రమువంటిదనుట యథార్థము. నీవు తలచెడి తలపులు, పలికెడి పలుకులు, చేసెడి చేతలు, తల్చిన నిగ్రహము— వీనిలో నొకటియు ఊరకపోవు. దేనిఫలము నది యిచ్చితీరును. పురుష ప్రయత్నమేదియు వ్యర్థము కాదు! నీ యత్నమునకు ఫలము నీదియే యని చెప్పుటకంటె స్వేచ్ఛ మఱి యేమి కావలెను.

నీ భావిని నీ చేతులలోనే పెట్టిన పిమ్మట స్వాతంత్ర్యమునకు లోపమేమి? వేదాంతశాస్త్రము చెప్పెడి కర్మకు పురుష ప్రయత్నమనియే అర్థము. పురుషకారమున కందు నిక్షేపము లేదు. ఆ పురుషకార స్వరూపమునే విధి యనియు, దైవ మనియు చెప్పుదురు. గ్రుడ్డిదగు నదృష్టము వేఱు. ఫల స్వరూపమగు దైవము వేఱు.

కర్మసిద్ధాంతమునకు, అదృష్టమునకు పొత్తు లేదనుట కిది చాలును. కాయిక మానసిక కర్మలు పురుషుని బుద్ధి తీర్పునందును. ఆ తీర్పునకు, మరణమునకు మృత్యువు గూడ అడ్డు నిలువదు. జన్మాంతరమందైనను అభ్యుదయము సాధింపవచ్చును. ఇదియే హైందవ ధర్మ సర్వస్వము. క్రిస్టియనులు, జైనులు నిచట నొక శంక చేయుదురు. పాపకర్మములకు ఫల మనుభవింపక తప్పదేని ఇక ఈశ్వర భక్తికి, ఈశ్వరానుగ్రహమునకు తావెక్కడిది? — అన్నచో, చోటు లేకేమి, ఉన్నది. పశ్చాత్తాపముచే ఈశ్వరానుగ్రహము లభించును. పశ్చాత్తాపమనెడి పురుషకారమునకు ఈశ్వరానుగ్రహము ఫలమగునే కాని అది కేవల మీశ్వరాధీనము కాదు. తీవ్రమగు పశ్చాత్తాపమనెడి కర్మచే భక్తుని చిత్తము పాపక్షాళితమగును. దానినే ఈశ్వరానుగ్రహముగా నెంచికొందుము. ఈ పశ్చాత్తాపముచే గలుగు ఆనందమెంత రమణీయమైనదో కదా! అయ్యది కర్మసిద్ధాంతమున కంగు అపత్తి లేదు.

అన్ని కర్మలకున్నట్లే పశ్చాత్తాపమునకు గూడ ఫలముండును, పాపముతో ఆత్మ సలిపెడి పోరాటమే పశ్చాత్తాపము. పోరాటము సల్పుచుండగనే ఆత్మకు విజయానందము లభించుచుండును. యుద్ధ క్షోభముతో విజయానంద మందు ఐక్యమును భజించును. అనుతాప పూర్వకమైన వ్యథాగ్ని యందు పాపకర్మ హరించిపోవును. కావున ఈశ్వరానుగ్రహ సిద్ధాంతమునకు కర్మపద్ధతికి విరోధము లేదు. ఉత్తర జన్మమున పూర్వస్మృతి యుండదు కదా, అపుడు ఫలించెడి కర్మఫలన మేమి ప్రయోజనము? పురుషకారమున కది యెట్లుపకరించును? ముందెప్పుడో ఎవరో అనుభవింపబోయే సుఖం కోసం నేను ప్రస్తుత సుఖమెందుకు వదలుకోవాలి? అనుభవకాలమందు పూర్వస్మృతి గాని, కర్మాచరణ సమయమందు భవిష్యజ్ఞానము గాని లేదుకదా! అని సుఖకాములు ప్రశ్నింతురని వినుడు:—

సత్కర్మాచరణమే సంతోషము

ఫలముతో, లాభముతో నిమిత్తము లేకుండా సత్కర్మాచరణ మొనర్చునపుడు నీవు సుఖ మనుభ

వించుటలేదా? మంచిపని చేయుటలో సంతోష మందుట మానవస్వభావము. ఇందు చిన్నలు పెద్దలు అను భేదము లేదు. సత్కార్యము సర్వులకు సంతోష మొసగును. నీ యిరుగుపొరుగు వారికి నీవారికి మేలు చేయుటలో లాభదృష్టియుండదు. మానవ మాత్రులందఱు తమకుతామే సహజముగ నిట్లు మేలొనర్చి సంతోషింతురు.

నీ గ్రామమునకు, నీ దేశమునకు సౌఖ్యమును కోరుకొందువు. ఒకరికొకరు మేలు చేసికొనుచు సంతోషమున నోలలాడుట సర్వసామాన్యము. భౌతిక దర్శనములు పేర్కొను ఆకర్షణము (Gravitation) వలె నే ఇదియు పరమసత్యము. ఏకమైన పరబ్రహ్మము నేకమైనట్లే ఈ యనేకము మరల ఏకత్వమునందగోరును. ఆ రెంటికి నీ యాకర్షణము నిత్యలీలవంటిది. మూలమందున్న ఆ యేకత్వమే సకల జీవరాసుల నొండొంటి దెస కనేకవిధముల నాకర్షించుచున్నది. దేశమునకు మేలుగోరి, భావిప్రజల యోగక్షేమమును గోరి నేటి వారలు సుఖమును త్యజింతురు. ఈ త్యాగమునకు నీవు లేమిలాభము? ముందటి కేమి ప్రయోజనము? అను విచారణకు పాల్పడక త్యాగము లొనర్చుట సాజము. నేడు మనము నాటుచున్న చెట్లనీడ నెవరనుభవింతురో యని ఆలోచింపకుండనే చెట్లను నాటుచుందుము. అట్లే ఈ జన్మమున మనం సత్కార్యాచరణం చేస్తే భావిలో మంచిజన్మము కలుగుతుంది. అంటే ఉత్తర కాలమున సత్పురుషులు జన్మింతురు. మన ఉత్తర జన్మమునే భావితర మంటున్నాము. సత్కర్మను చేసిన మనమే భావిలో సత్పురుషులమై జనించి లోకమును నింపుదుము. అట్టి ఉత్తమ ప్రజాభివృద్ధికై ఉద్యమించుట మనవంతు. సత్కర్మలు చేస్తూ, దుష్కర్మలకు సంతాపము జెందుచు, ఈ పుణ్యభూమిలో మంచిజీవులనువృత్తి, మంచిజన్మలను పండించుదము. పూర్వస్మృతి లేకున్న నేమి? ఆ స్మృతిభారం దుస్సహము కాగలదు.

ఇంతకంటె మంచిజన్మలు ధరింపవలెనని యత్నించినచో లోకము సత్పురుషమయం కాగలదు. ఉత్తమ ప్రజాసృష్టికై శాస్త్ర చోదితమైన యీ యుపాయము వేదాంతము మన కనుగ్రహించినది. మంచి జాతి కోళ్ళను, పశువులను పుట్టించుటకై మనము చేసిన యత్నములు ఫలించినవి కావా? అట్లే గుణ శరీరములను, ఆత్మలను సంస్కరించుకొని మంచి ప్రజగా నవతరింతుము. మనము సాధించిన మంచి జాతికోళ్ళకు, గోవులకు పూర్వస్మృతి లేదు కదా, అట్లే మనకును లేకుండు గాక. పూర్వజన్మమున మన మెవ్వరమో తెలియకున్న నేమి? అట్లు తెలియకుండుటే మేలుసుమీ!

సహకారము

సదాచరణమునకు వేదాంతము రెండు ప్రయోజనములను చెప్పుచున్నది. 1 నిక్కమైన సౌఖ్యము లభించుట, 2 జన్మాంతరమున సజ్జనుల సంభూతి పల్లె ప్రజల పరస్పర సహకారము, దేశభక్తి, వేదాంతము నివి మూడును ఉత్తరోత్తర విస్తృతములై ఒక్క పరిధిలో నిముడును. సహకారముచే పల్లెపట్టులకు, దేశభక్తిచే ప్రజా బాహుళ్యమునకు, వేదాంతముచే భావిలోకమునకు క్షేమము లభించును.

నే నిందనుక జెప్పినదాని సారాంశమిది: (1) భౌతిక దర్శన సిద్ధాంతములకు విరుద్ధములగు మతములు దుష్కాచార కారణకు, వంచనమునకు దారితీయును. హైందవ వేదాంత దర్శన మీనాటి భౌతిక దర్శన సిద్ధాంతములకు సమ్మతమైనది (2) స్వార్థపరతచే మానవలోక కల్యాణము లభింపదనియు, పరస్పర సహకారమే అందులకు మార్గమనియు నంగీకరింతుమేని అట్టి నూతన సంఘ వ్యవస్థా ప్రేరణమును, కారణ కలాపమును మనతత్త్వశాస్త్రమునందే లభించును. ప్రజా రాజ్యములకు తత్త్వికమగు ధర్మము గూడ అందే సంపన్నమగుచున్నది. (3) ఇతర మతముల యెడ ఓర్మి పరమ ధర్మముగా మన వేదాంత దర్శనము విధించుచున్నది. కావున జగదభ్యుదయాని కది చక్కనిదారి చేర్పరచిన దగుచున్నది. పదార్థ విజ్ఞానము నున్నగు భౌతిక దర్శనములతో విరోధింపకయే లోకకల్యాణ మార్గము నది ఆత్మ ప్రతిష్ఠిత మొనర్చుచున్నది. అది మత్తుమందు కాదు; లోకయాత్రా రథమును రాచబాటపై నడపే పార్థసారథి.

(పాట్నా కళాశాలలో రాజాజీ చేసిన ప్రసంగమునకు తెలుగు.)

విశ్వమున విశిష్టు డెవడు?

శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రి

ఆ. వె. వాదధూళి రేగ "బ్రహ్మాండమున నేఁడు
జీవకోటిలో విశిష్టుఁ?" డనుచు
మొదట లేచి పలికె భూదేవి దొడ్డమ్మ
వాక్కులందుఁ దొట్రుపాటు గదుర.

మ. "కులశైలంబులఁ బుణ్యతీర్థ సుమహాకూపారముల్ మోయుదున్;
గలిగింతుం గనుఁ బాడిపంటలు ప్రజాకాండంబు వర్ధిల్లఁ, గో
ల్లలుగాఁ బంచుచునుందు నా ధననిధుల్ వార్వీరు నా కెల్ల వా
రలకున్ నేన మహత్తర న్నగుదు మీరల్ లెన్న యోజింపుఁడా !

చ. అన విని దాని సైఁపక మహాభుజగుండగు నాది శేషుఁ డి
ట్లనె; "భరియింతు నాదగు ఫణాగ్రమునందు ధరిత్రి, నింతె కా
దనయము దేవదేవుఁడగు నంబుజనాభుని సేవ చేయు పా
వనతముఁడన్ మహత్తరుఁ డెవండు ననున్ వెలిగా వచింపుఁడా !"

కం. పలు కది విని లోకము బీ
టలువాఱఁగఁ బెద్దనగి మృడానీపతి "యీ
చిలువను దాలిచితిని నా
గళమున నాకన్న నెవరు గలరు విశిష్టుల్ ?

కం. అల మృత్యుదేవతకు నిల
బలియగును బిపీలికాది బ్రహ్మాండంబుల్
గెలిచితినిఁగాదె దానిని;
హాలాహలాశనుఁడ; నేన యధికతరుండన్."

కం. ఆలించి శూలిమాటలు
గైలాసము పలికె; "శివుఁడు గాపురముండెన్
మాలోఁగిట; నాశృంగముఁ
బోలిన శృంగంబుగలదె భూలోకమునన్ ?"

కం. అదివిని ప్రతిధ్వనింపఁగఁ
బదిదిక్కులు రావణుండు పదిముఖములతో
వదరెం "బెకలించితి ని
ర్వదిచేతుల నీధరాధరంబును దొలుతన్.

కం. ఆశించితిఁ గేలంగొని
క్రీడా కందుకమువోలె క్షితిధరమును; నీ
రేడు జగంబుల నాకె
వ్వాఁడున్నాఁడీఁడు? బాహుబల సంపదలన్?"

ఆ. వె. మూలగూరుచున్న వాలియంతట లేచి
వానివంకఁ గడు నవజ్ఞఁ గనుచు
"నీ దశాస్యమృగము నేఁ దెచ్చియిచ్చితి
నాటబొమ్మగా మదాత్మజునకు."

కం. అనవుడు మానముతో నిం
దనుకం గూర్చున్న వాఁడు దాశరథియుఁ బ
ల్కెను; నే నీ వాలిని నా
ధనువున కెరఁ జేసికొంటి దర్పము వాయన్.

ఆ. వె. అట్టులగుట నేన యధికతరుండను"
ననుడు నాలకించి యటనొకండు
కావిపుట్టములను గట్టిన జడదారి
లేచి రామచంద్రుఁ జూచు చనియె.

మ. పరమాత్ముండగు నీ మహామహుని నిర్బంధించితింబట్టి; నా
చెఱఁ దప్పించుక పాఱిపోవుటకుఁ జేసెన్ యత్నముల్ కొన్ని; యే
మఱకే రేయుబవళ్లు వే కనుల నంస్తంభంబుఁ గల్పించితిన్
మఱి నాకన్నను మద్గృహీతుఁ డధికుండా? నుంత యోజింపుఁడా!"

చ. అనవుడు నొక్కరేని నెనురాడకపోయిరి కాదటంచు దా
నినిఁ; దనకన్న నాతఁడె యనేక గుణంబులఁ బెద్దటంచుఁ దోఁ
చెను బ్రతివానికిం; దుదికి సిగ్గున వ్రాల్చిరి మోములెల్ల వా
రును స్వమహత్తరత్వమది రూపఱఁ జీకటివోలె వెల్గుచేన్.

(శివానంద కథావళినుండి)

కోనగణపతి ఖండవల్లి శాసనము

శ్రీ తురగా కృష్ణమూర్తి

పశ్చిమ గోదావరిజిల్లా తణుకు తాలూకాలో వసిష్ఠ గోదావరికి పడమటగా నొక్క యరమైలు దూరమున "ఖండవల్లి" గ్రామమున్నది. అది తణుకు పట్టణమునకు ఆగ్నేయముగా సుమారుగా నాలుగైగు మైళ్ల దూరములో నున్నది. ఈ ఖండవల్లి గ్రామము లోనే సుప్రసిద్ధ కవులును, అనేకాంధ్ర గ్రంథకర్తలును, కళాప్రపూర్ణులు నగు శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులుగారు ఉద్భవమందిరి. ఆస్థానకవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారిచే "బొబ్బిలియుద్ధ నాటకము"న ప్రస్తావించబడిన "ఖండవల్లి మడుగు" ఈ యూరిదే!

నాకు ఈ గ్రామములో శ్రీ ఖండవల్లి సాంబశివ రావుగారి సహాయమున లభ్యములైన రెండు శాసనములలోను మొదటిది కోనగణపతి దేవునిది. శాసనము రెండు ప్రక్కలను వ్రాయబడిన ఒకే ఒక రేకు. రాగి కడియముచే తాటియాకారముగ బిగింపబడి యున్నది. కడియము మొనలు కలిపి అతికించబడి పద్మాకారముగ నున్న కుంద్రపు రాగిబిళ్లచే అలంకరింపబడి యున్నది. ఆ బిళ్ల 2.0" వ్యాసముకలిగి ఊర్ధ్వభాగమున రెండువైపున సూర్యుడును, కుడిభాగమున చంద్రుడును, మధ్య తారకయు, దాని క్రిందగెడల వామపార్శ్వమున చక్రమును, దక్షిణపార్శ్వమున శంఖము,అధోభాగమున మధ్య వరాహమును దానికి కుడిప్రక్కను మత్స్యమును, రెండవ ప్రక్కను కూర్మమును చెక్కబడియున్నవి. రాగి కడియము 0.5'' దళసరి గలిగి 3.2'' వ్యాసము కలిగి యున్నది. ఈ కడియము రాగిరేకునకు రెండవప్రక్క 0.6'' వ్యాసము గల రంధ్రమునుండి దూర్చబడి యున్నది. ఈ రంధ్రము రేకున కెడమ అంచునుండి 1.0'' దూరమునను, పై అంచునుండి 2 8'' దూరమునను, క్రింది అంచునుండి 3 0'' దూరమునను పొడువబడి యున్నది. రేకు 1/10'' దళసరికలిగి 11.0'' పొడుగు 6 3'' వెడల్పుకలిగి 125½ తులముల బరువు కలిగి యున్నది. శాసనము మొదటిప్రక్క 17 పంక్తులును రెండవప్రక్క 8 పంక్తులును కలిగి సంస్కృత శ్లోక రూపమున తెనుగు లిపిలో వ్రాయబడినది. అక్షరములు ఎడమనుండి కుడికి వ్రాయబడినవి.

ఇది కోనసీమను పదమూడవశతాబ్దియందు పాలించుచున్న కార్తవీర్యార్జునుని (హైహాయ) వంశమువాడైన కోన గణపతిదేవునిచే నొసంగబడిన క్షేత్ర శాసనము. శాసనకాలము శక సంవత్సరములు 1218 కు సరియైన క్రీ॥ శ॥ 1296 వ సంవత్సరము. దుర్ముఖి నామ సంవత్సర శ్రావణ శుద్ధ దశమీ మంగళవారమునాడీ దానము చేయబడినది. దానప్రతిగ్రహీత కపి గోత్రోద్భవులలో నగ్రగణ్యుడు, శంకరాపరావతారుడును, రాజపూజితుడైన విద్దనాచార్యులు. దాన మీయబడినది "త్రింశత్ఖారి పరిమిత క్షేత్రం." ఈ క్షేత్రమునకు హద్దులు తూర్పున కోలపుంత నరిమిపుడ్డి, ఆగ్నేయమున బోలికుంటతోపు, దక్షిణమున గుర్రాలపుంత, నైఋతిని పులపర్తి ప్రిశేకే, ఉత్తరేశ్వరపురపు ముయ్యవకుట్ర జాపురుగడ్డపుడ్డి, పడమరను, ఉత్తరమునను ఉత్తరేశ్వరపురాంతర్భాగపు సరిహద్దులును, ఈశాన్యమున జాపురుగడపల్లమును. ఈ క్షేత్రము "పులపర్తి" గ్రామమునకు వాయవ్యదిశ నుండినట్లు "పులపర్తి పురీ క్షేత్రం తద్వాయవ్య సంస్థితం" యను శ్లోకమువలన దెలియుచున్నది. ఈ పులపర్తి గ్రామమును ప్రస్తుతము "అన్నవరప్పాడు" గ్రామమని యనుచున్నారు. ఈ అన్నవరప్పాడు గ్రామమున నాకు లభ్యమైన కాటయ వేమారెడ్డి తామ్రశాసనమును త్వరలో ప్రకటింపనున్నాను. కాటయ వేముని అన్నవరప్పాడు శాసనములో "అన్నవరప్పాడు" గ్రామమునకు "పులపర్తిగ్రామ" మని యాదినామ మున్నట్లు తెలుపబడినది. ఈ క్షేత్రమును గణపతివలన విద్దనాచార్యులు స్వీకరించిరి క్తిభావమున నుత్తరేశ్వరపురమున కలిపి వేసెను.

శాసన కాలము

శాసనములో దానకాల మీ విధమున వర్ణింపబడినది.

"రాజా గణపతి స్సోయం శకవర్షేషు జాగ్రతి,
నవకద్వయ సంయుక్తే సహస్ర ద్విశతాధికే.

దుర్ముఖివత్సరే మాసి శ్రావణే నవకేత్వసౌ,
పక్షే దశమ్యాం వారేచ పురందరగురోః సతి."

కార్తవీర్యార్జునుని (హైహయు) గోత్రమునకు చెందిన హైహయులు కోనమండలమును క్రీ॥ శ॥ 1073 మొదలు క్రీ॥ శ॥ 1364 వరకు పాలించిరని చరిత్రకారులు నిర్ధారించియున్నారు. అట్టి కోన హైహయులలో గణపతి క్రీ॥ శ॥ 1254-1300 మధ్య పాలించినటుల తెలియవచ్చుచున్నది. కావున నీ దాన కాలము క్రీ॥ శ॥ 1254-1300 మధ్యకాలముననే అయియుండవలెను. ఆసంవత్సరము దుర్ముఖి వత్సరమైయుండియుండవలెను. అదిప్రమును దృష్టియందుంచుకొని యీశాసనకాలనిర్ణయమునకు గడంగవలసియున్నది.

పైశాసన శ్లోకములలోని 'నవకే ద్వయు సంయుక్త' అన్న పదములను నేను 'నవకే ద్వయి' అని పొరపాటుగా చదువగా శ్రీ హెచ్. కె. నరసింహస్వామిగారు (ఎపిగ్రఫీ శాఖ సూపరింటెండెంట్, ఉదకమండలం) 'నవకద్వయు' అని సరియగు పాఠము చూపిరి. వారికి నా ధన్యవాదములు. 'నవకద్వయు' పాఠము నంగీకరించి 'సహస్ర ద్విశతాధికే' యనిచదివిన శకసంవత్సరము 1218 యగునని నే నూహించుచున్నాను. దానికి సరియైన క్రీ॥ శ॥ వత్సరము 1296 అగుచున్నది. శకవత్సరము 1218 (క్రీ॥ శ॥ 1296) దుర్ముఖి వత్సరమైనది గాన నీ శాసన కాల మిదియే యని నిర్ద్వంద్వముగా జెప్పవచ్చును. అప్పటికి కోనగణపతి పాలనమునకు వచ్చి నలుబది రెండు సంవత్సరము లగుచున్నది. కావున వయఃపరిపాకదశలో నున్న కోనగణపతి తనకులగురువులగు విద్యనాచార్యునకు త్రింశత్తారిమితి క్షేత్రమును దానమిచ్చియుండె నన్న యబ్బుర మేమియు లేదు.

చారిత్రక విశేషములు

క్రీ॥ శ॥ 1254 మొదలు క్రీ॥ శ॥ 1300 మధ్య కాలమున కాకతీయుల పాలనము మహోన్నతదశ నందియుండెను. కాకతీయసామ్రాజ్యము కళింగముదాక వ్యాపించి సుస్థిర ప్రభుత్వముక్రింద పరిపాలింపబడుచుండెను. కాకతి రుద్రమ ధాత్రియగు చాళుక్య వీరభద్రుడు నిరవద్యపురము రాజధానిగా చేసి పశ్చిమ గోదావరీ మండలములోని కొంతభాగమును పాలించుచుండెను. చాళుక్య వీరభద్రేశ్వరుని రాజ్యములోనిదే యైన కోనమండలము నాడు స్వతంత్రరాజ్యముగా నుండక సామంతరాజ్యముగా నుండియున్నట్లు చరిత్ర వలన మనకు దెలియవచ్చెడిని. కాని శ్రీమతి వి. యశోదాదేవి (M.A; M.Litt) గారు "The History of Andhra Country" అను గ్రంథములో "Bhima and Ganapati did not acknowledge loyalty to the Cholas. Neither there is any reason to suppose their loyalty to the Kakatiyas. But they allied themselves with some local comtemporary dynasties and this added to their strength" అని కోనమండలాధిపులు కాలమున చోళుల అధికారము క్రింద గాని, కాకతీయ ప్రాబల్యము క్రింద గాని యుండలేదని నొక్కి వక్కాణించుచున్నారు. మరియు నిరవద్యప్రోలు ప్రభువులగు చాళుక్య ఇందుశేఖరనృపాలునితో సంబంధ బాంధవ్యములు కలిగియుండి, తత్కారణమున బలవంతులైనారని కూడ సూచించుచున్నారు.

ఇంతవరకు లభ్యములైన శాసనాదికములవలనను, చరిత్రాంశములవలనను గణపతి, యాతని తండ్రి భీమవల్లభుల సంయుక్తపాలనానంతరమున అనగా క్రీ॥ శ॥ 1300 సంవత్సరమునుండి కోనమండలమును భీమవల్లభుడును, అతని కుమారుడు రామనాథదేవరయును సంయుక్తము (Joint) గా పాలించిరనియు, క్రీ॥ శ॥ 1318 వ సంవత్సరానంతరమునుండి ఈ యిరువురిని గూర్చిన విశేషము లేవియును తెలియవచ్చుట లేదనియు శ్రీమతి యశోదాదేవి గారు "Ganapati is not heard of after A. D. 1300 and Odayamahadevi does not mention him in her grant of A. D. 1306. An inscription at Palakol dated A.D. 1318 mentions the sons of Ramanadha Devara, son of Bhima Vallabha. So probably on Ganapati's death in A.D. 1300, his younger brother Ramanadha Deva joined his father Bhima Vallabha in exercising sway over Konamandala. And after A.D. 1318 neither Bhima nor Ramanadha are heard of" అని వ్రాసినారు. ఈ వ్రాతలబట్టి వృద్ధుడైన తండ్రి భీమవల్లభుడు సజీవుడై యుండగనే గణపతి చనిపోవుటయు, ఒంటరిగా రాజ్యభారమును వహింపజాలక భీమవల్లభుడు తన తనయుడగు రామనాథదేవుని కూడ పట్టాభిషిక్తునిజేసి, సంయుక్త రాజ్యపాలనము నెరపెననియు నిశ్చయింపవలయుచున్నది. ఇది సరిగాదు. శ్రీమతి

యశోదా దేవిగారీ యాధారమునుబట్టి భీమవల్లభుడు సజీవుడై యుండగనే గణపతి మరణించెనో దెలుపరైరి. ప్రస్తుత శాసనమునందుగల వంశప్రకారమిది:

"రాజా గణపతి స్తత్ర రరాజ గుణసాగరః,
యత్ఖడ్గతీర్థ నిర్మగ్నా(గ్నాః)లభంతే దివిమత్పదం.
భీమవల్లభ నామా భూ త్తస్య రాజ్ఞ స్తనూభవః,
సప్తార్ణవీం సముల్లంఘ్య యస్య కీర్తిః ప్రకాశతే.
తస్య భూమిపతే రాసీత్ పుత్రః కులవిభూషణం
రాజాగణపతి స్త్యాగభోగ లక్ష్మీనిజాశ్రయః"

ఈ శ్లోకములను బట్టి గణపతి - భీమవల్లభుడు - గణపతి - యని యిద్దరు గణపతిదేవులగుచున్నారు. ఈ రెండవ గణపతియే ఈ శాసనము వేయించినవాడు.

క్రీ॥ శ॥ 1318 వ సంవత్సరాంతమున కోన భీమవల్లభ, రామనాథదేవుల పాలన మంతమై రామనాథదేవుని కుమారుడగు భీమవల్లభుని రాజ్యపాలనము ప్రారంభింపబడెనని శ్రీమతి యశోదాదేవిగారిట్లు వ్రాయుచున్నారు: "Bhima Vallabha A-D- 1318-1364: This Bhima is heard of from a record at Palakol dated A. D. 1364. Probably he was the grandson of Ramanatha through one of his sons mentioned in a record from Palakol with date A-D. 1318 and whose names are not given in the record. As has been suggested already he was probably the succession of Bhima Vallabha and Ramanadha. If so his reign must have lost for forty six Years.

In his time Kakatiya power ended and the Reddis became their political successors. Vema and his son Anapota were the Reddi Rulers with Capital of Kondavidu and their Kingdom included the Godavari deltaic area. Probably Bhima owed allegience to the Reddis in this period."

క్రీ॥ శ॥ 1318 వ సంవత్సరమున పాలకొలను క్షీరారామేశ్వరస్వామికి రామనాథదేవుని కొమార్లు చలిపందిరి నిమిత్తం చేసిన శాసన మిట్లున్నది:

"స్వస్తిశ్రీ శక వర్షంబులు ౧౨౪౦ గు నేంటి కార్తిక శుద్ధ ౧౫ గు స్వస్తి సహస్ర బాహుప్రతాప వీర్యోర్జ గుణ సంపన్నులైన శ్రీమన్మహామండలేశ్వర కోనభీమవల్లభరాజుల సుపుత్రులైన రామనాథదేవ కొమార్లు [క్షీ]రారామేశ్వర శ్రీమహాదేవర స[న్ని]ధిని సర్వకాలము [న్ను] యుదక దానము సేస్తిమి."

ఈ శాసనము క్రీ॥ శ॥ 1318 వ సంవత్సరం కార్తీక శుద్ధ 15 నాడు యివ్వబడినది. శ్రీమతి యశోదాదేవిగారి నిర్ణయము ప్రకారము రామనాథదేవర క్రీ॥ శ॥ 1318 నాటికి పాలనము చాలించెను. ఆ సంవత్సరము తర్వాత నాతని ప్రశంస లెందును గానవచ్చుటలేదు. కావున క్రీ॥ శ॥ 1318లో రామనాథదేవుడు స్వర్గస్థుడయ్యెనని భావించవచ్చును. ఆ సందర్భమున అతని కొమార్లు శ్రీ క్షీరారామేశ్వరస్వామికి ఉదకదానము చేసి శాసనము వ్రాయించియుండిరి. రామనాథదేవుని యనంతరము సహజముగా నాతని కొమార్లు రాజ్యాధికారము వహించవలసియుండగా నట్లుగాక క్రీ॥ శ॥ 1318 లో రామనాథదేవుని మనుమడు భీమవల్లభుడు రాజ్యమునకువచ్చెనని శ్రీమతి యశోదాదేవిగారు వ్రాసియున్నారు.

రామనాథదేవ కొమార్లు అనుదానిలోని కుమార్లు మర్యాదా వాచక మనుకొందును. కొమార్లు అనునది రుద్రదేవకుమార అనుదానిలోని యువరాజత్వవాచకము వంటిది. కనుక శ్రీమతి యశోదాదేవిగారి యూహ చర్చనీయము.

పాలకొల్లులోని క్షీరారామేశ్వర దేవాలయములో క్రీ॥ శ॥ 1364 వ సంవత్సరమున సింగరాజు నాగనభోయడు యిచ్చిన శాసనములో భీమవల్లభుని ప్రశంస గలదు. ఆ శాసనమునం దిట్లున్నది:

'శక వర్షంబులు 1286 ను నేంటి చైత్ర శుద్ధ 10 గురువారాన క్షీరారామేశ్వర శ్రీమహాదేవరల సర్వాంగాలు సేయింపిడి భోయుజీతనకు కోన భీమవల్లభ రాజులు ఆనతిని చ్చి సింగరాజు నాగనభోయుండు దేవరభండారాన కానిక పెట్టు గద్యలు 10........................'


ఈ శాసనములో నుదాహృతుడైన భీమవల్లభుడు రామనాథదేవుని మనుమడు భీమవల్లభుడని శ్రీమతి యశోదాదేవిగా రూహించియున్నారు. ఈతడు రామనాథదేవుని యనంతరము క్రీ॥ శ॥ 1318 లో రాజ్యపాలనమునకు వచ్చి క్రీ॥ శ॥ 1364 వరకును (ఈశాసన మాధారముగా) పాలించినటుల వారు వ్రాసినారు.

గణపతిదేవుడు నిస్సంతుగా క్రీ॥ శ॥ 1300 సంవత్సరమున చనిపోయియుండెనని యు

క్రీ॥ శ॥ 1254 మొదలు క్రీ॥ శ॥ 1318 వరకు ప్రభుత్వము నెరపిన భీమవల్లభుడు (గణపతి, రామనాథదేవుల తండ్రి) వృద్ధాప్యమువలన మరణించియుండునని యూ, రామనాథదేవరకొమాళ్ళ పాలకొలను శాసనము క్రీ॥ శ॥ 1318 లో నీయబడినందున యాసంవత్సరములోనే రామనాథదేవుకు కొలనర్క్ష మొందియుండవలెననియు యూహించి, రామనాథదేవుని కొమాళ్ళ అనామకులై యున్నటు శాసనాధారమును చూచుకొని, క్రీ॥ శ॥ 1364 వ సంవత్సరపు సింగరాజు నాగబోయని శాసనములోగల భీమవల్లభుని ప్రసక్తి సకలంబనముగా శ్రీమతి యశోదాదేవి గారు ఈ భీమవల్లభుడు రామనాథదేవుని మనుమడై యుండియుండవలెనని యూహించి, రామనాథదేవు ననంతరము మనుమనికే పట్టాభిషేక మొనర్ప సాహసించిరి; కాని రామనాథదేవుని కొమాళ్ళ విషయమై యూహింపనైన యూహింపలేదు!

నాచే గ్రహింపబడిన శాసనమూలపాఠమును యథాతథముగ నీ క్రింద నిచ్చుచు శాసన ప్రతిబింబమును, క్రింద ప్రచురించుచున్నాను. ఇది చరిత్రపరిశోధకులకు ఇతోధిక మనోవికాసము గలిగించునని నమ్ముదును.


శాసనపాఠము - మొదటివైపు



1. లక్ష్మీపతి రసౌ యుష్మాన్ పుష్ణాతు క్రీడయా కిరిః।
   యస్య దంష్ట్రాదళె ధాత్రి పుష్పె భృంగివ ఖెళ
2. తి। కల్యాణం కలికా చాంద్రి శంభో భూషా కరోతు వః।
   యస్యా మయూఖా రాజంత్తె కందర్ప
3. స్య శరాఇవ। సదాతు భువనాధారః కమఠః కమళాపతిః।
   మంథాద్రి కష ణె య్యా (య?) స్య క్రీడా కండూ
4. తి రాబభౌ। ఆదా వంభోజభూ స్సృష్ట మహీవళయ మండనం।
   దెశః కొన ఇతి ఖ్యాత శ్చకాస్తి సుఖ నం

5. శ్రయః। తత్ర తత్ర వరేణ్యస్య కార్తవీర్యార్జునస్య గోత్రతః।
అస్తి రాజకులం రమ్యభాగ్య భోగవిభూషణం।
6. రాజా గణపతిస్తత్ర రరాజ గుణసాగరః।
యత్ఖడ్గ తీర్థే నిర్మగ్నా (గ్నా?) లభంతె దివిషత్ పదం। భీమవల్లభ
7. నామాభూత్ తస్య రాజ్ఞస్తనూభవః।
సప్తార్ణవ విం సముల్ల (ం?) ఘ్య యస్య కీర్తిః ప్రకాశతె। తస్యభూమి పతె
8. రాసీత్ పుత్రః కుల విభూషణం।
రాజా గణపతి స్త్యాగభోగ లక్ష్మినిజాశ్రయః। విరాజతె యస్య కృ
9. పాణ ధారా ప్రఫుల్ల సీలోత్పలజాత సఖ్యాం।
కాంతిం విగీర్ణామివ శత్రు నారి నెత్రా
10. ంజనస్థాం పునరుద్వమంతి॥ అసౌ గణపతి స్స్వయం కొన దేశం ప్రపాలయన్॥
11. కల్పవృక్ష ఇతి ఖ్యాతిం భూదెవానాం సమశ్నుతె।
దెవనాచార్య్యే సంభూత శ్రీ రంగా
12. చార్య్యే సంభవె। సభక్తిం విడ్డనాచార్య్యే భజతె శంకరె యథా।
ప్రత్యక్షభావం ప్రతిపద్య దాతు
13. ం భుక్తిం చ్చ ముక్తించ్చ సుధీశ్వరాణాం।
కృతావతారం గిరిశం గృణంత్తి తం విడ్డనాచార్య్యే మశె
14. ష లోకాః। రాజా గణపతి స్స్వయం శకవర్షేషు జాగ్రతి।
నవకద్వయ సంయుక్త సహస్ర ద్విశ
15. తాధికె। దుర్మ్ముఖ వత్సరె మాసి శ్రావణే ధవళ త్విషి।
పక్షె దశమ్యాం వారెచ పురందరగురోః
16. సతి। గుణినా మగ్రగణ్యాయ కపిగోత్రస్య మాళయె।
మనో వాక్కాయ వంద్యాయ విడ్డనా
17. చార్య్యే శంభ్భవె। పులుప ర్తీ పురె క్షేత్రం తస్యవాయవ్య సంస్థితం।
త్రింశత్ఖారి మితం భ

రెండవవైపు



1. క్త్వా ప్రాదా దుత్తమ సస్యదం।
   తత్ క్షేత్రం ఏడ్డనా చార్య్యః స్త్రింశత్ఖారిమితం తతః। ఉత్తరేశ పురాంత
2. స్థం క్రుత్వా కురుత విప్రసాత్।
   అస్య త్రింశత్ఖారి పరిమితస్య క్షేత్రస్య సీమానః। ప్రసిద్ధయె దేశ భాష
3. యా కథ్యంతె। పూర్వతః కొలపుంత నడిమిపుడ్డి।
   ఆగ్నెయతః బ్బాలిగుంట్ల తూపు। దక్షిణతః గు
4. ట్టాలపుంత। నైఋతిత పులూపర్తి ప్రెకెడి ఉత్తరెశ్వరపు ముయ్యన కుట్ర।
   జావులు గడ్డ పుడ్డి। పశ్చి
5. మతః। ఉత్తరతః। ఉత్తరెశ్వర పుర్త్రాంత బ్భావిత త్వా
   త్తత్సమాన ఎవ సీమానః। ఈశానతః జావులు గడ్డ...
6. ల్లము॥ ఇద మాచంద్ర మాసూర్య్యం సుస్థితం క్షేత్ర శాసనం।
   అస్తు స్వస్తికరం కామం విప్రాణా మం
7. శ భాజినాం। సామాన్యోయం ధర్మ్మసెతు నృపాణాం
   కాల (లే?) కాలె పాలనియో భవద్భిః। సర్వా నెతా న్భా
8. వినః పార్థివెంద్రా న్భూయో భూయో యాచతె రామచంద్రః।
   శ్రీ దెవై్యనమః॥ శ్రీ॥

క్షంతవ్యులు!

శ్రీ "శండిల"

"భద్రాద్రి రాముడి దర్శనం రేపు చేసుకుందాం."

"అలాగే."

"సాయంకాలంవరకు చల్లగాలికి అలా వెళ్ళొస్తారా? స్నానానికి వేన్నీళ్ళు పెట్టి వుంచుతాను బంగళాలో. పెందలకడనే వచ్చెయ్యండి."

"సరే."

"కొండలు,గుట్టలూను. దారీగట్రా బావుండదు."

పనిమీద గాని యాత్రార్థమై గాని భద్రగిరికి వచ్చిన ఎందరో ఉద్యోగుల్ని చూశాడు వీరయ్య. వారికి తాను నిర్ణయించుకున్న పద్ధతిలో సేవలువంటివి చేశాడు. కాని ఈయనలాంటి అధికారి అతడికి ఇప్పటివరకు దసులుబడలేదు. మధ్యాహ్నం మనగా లాంచి దిగి వచ్చినప్పటినుంచీ ఆయన్ను అనుసరిస్తూ ఏవిధంగా తృప్తిపరచి మెప్పించగలనో అని లోతులు తీయడానికి తాపత్రయపడుతూనే వున్నాడు. పాతికేళ్ళకు పైగా పాతుకుపోయిన వీరయ్య. వయస్సుతో పాటు అనుభవం కూడా ఆర్జించిపెట్టిన సత్తాను అతడికి ఎటువంటి అధికారినైనా ఇట్టే తనదారికి మళ్ళేట్లు చేసేది. ఈయన విషయంలో అది మారడంలేదు. ఉద్యోగను హోదాకు సంబంధించిన ఆరాలు ఎంత తీద్దామని ప్రయత్నించినా అంతు చిక్కడంలేదు. ఇంతకు ఆయన ఎందుకిక్కడకు వచ్చినట్టో కూడా ఇతమిత్థం తేలలేదు. పోతే ఆ కొద్ది ఘంటలలోను ఆయన వెలువరించిన—అచటి గోదావరీతీరం, పరుపుగా పరచబడ్డట్లున్న గులకు మెరుగు ఇసుక ఉపరితలం, ఆలయ ప్రాంగణానికి దారితీసే పావంచాలు, చలనంలేని పహారాజవాన్లను గుర్తుకు తెస్తూ నిలబడ్డ చింతలు—ఇటువంటివాటిని చూర్చిన భోగట్టా వీరయ్యకు కావలసిన అంకాన్ని అందనిచ్చిందిగాదు. దీన్ని గురించి పదేపదే ఆలోచిస్తూ ఆ ముసలిబంట్రోతు బంగళావైపు నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఇంక ఆయన—దరదర ముందుకు పోతూనే వున్నాడు. అప్పుడప్పుడు భుజంమీది బొచ్చుతువ్వాలుతో నుదుటనుగ్రమ్మే చెమట బిందువుల్ని వొత్తుకుంటున్నాడు. ఆయన నడచేదాన్ని దారి ఆపడానికి వీల్లేదు. బండలు, వాటిమధ్య పల్లాలు—ఇంకా కొంచెం ముందుకుపోతే ఎడమచేతివైపు నూరుగజాల దూరంలో నిత్యమూ ప్రవహించే పావనగోదావరీ నదితో స్నేహం కలిగి నిరంతరము ప్రొద్దుపుచ్చే, కుడివైపున నిటారుగా ఆకాశంలోకి ఎగబ్రాకడానికి ఉత్సాహపడుతున్న మెట్టలు... ఆయన బూటుకాళ్ళ క్రింద పడి నలిగిపోయే రాలిన రెండుటాకులు మర్మర ధ్వనులు చేస్తున్నాయి. సంజ సమీపిస్తున్నా గ్రీష్మ ఋతువు ఆఖరి పాదపు ఎండ - మరి అది ఆషాఢపు చివరి చురుకు కదూ! - దర్పాన్ని ఉడికిస్తూనే వుంది.

ముందుకు చకచక సాగివచ్చిన ఆయన గమనం అనుకోకుండా ఆగిపోయింది. ఆయన సమీపించింది కూడలి మాత్రం కాదు. ఏ కారణంచేతనైనా కావచ్చు- అక్కడి కొండకోనకు త్రోవతీసేటట్లు పరచి వుంచబడ్డాయా అనే భ్రమ గొల్పే ఎండుటాకుల నిడుపాటి ప్రోవులు ఒక కొసనుండి అంటుకొని చిటచిటలాడుతూ కాలుతున్నాయి. పాంథులు విసిరి పారేసిన - చివర కొద్దిపాటి నిప్పుతో మిగిలి వున్న సిగరెట్టు ముక్క - లేదా దూరాన్నుంచి ఎగిరివచ్చిన నిప్పురవ్వ - కనీసం కృత్తికాపవనానికి ఒంకొంటి ఘర్షణ ఫలితంగా చెట్ల కొమ్మలనుండి పుట్టిన అగ్ని కావచ్చు-ఏదైనా చాలు అక్కడ మంటలు పుట్టించడానికి. విషవాయువు పొగలు వ్యాపించినట్లు, నీలివార్తల పుకారు పాకినట్లు, అంటువ్యాధి ప్రాకినట్లు, ధ్వనులు పయనించినట్లు మంటలు మింటికెగ ప్రాకడానికి చిరునాలుకలు చాస్తూ క్రమంగా కొండకొమ్మను చేరుకోవడానికి పోటీపడుతున్నాయి. అది ఒక మహారణ్యమేమో! పొగల సెగలు నలుదిశల క్రమ్ముకుంటున్నాయి. చీకటిలో అదే దృశ్యాన్ని ఆయన చూచివుంటే అంధకార బంధురమైన అనిశీథిని దుర్భేద్యమైన దుర్గాన్ని అధిరోహించడానికి కాగడాలతో ఎగబ్రాకే సేనల బారుల వెలుతురులు దృష్టిపథంలో మెదిలివుండేవి.

ఆయనకు ఆ మంటలను ఇంకా చూడాలనిపించింది. ముందుకేపోతూ చెట్ల పడమ తిష్ట వేసుకొని కలకాలం కాపురం చేయాలని ఉబలాట పడుతోందా అన్నట్లు తోచే ఉష్ణతీష్ణత తనను తాకితే ఎలాగుంటుందీ? శారీరకంగా మానసికంగా అనుభూతి ఎటువంటిది? సంఘానికి, సమాజపుకట్టుబాట్లకు ఎదురీదడానికి ప్రయత్నించి లంఘింప జూచే తరుణవయస్కుని విప్లవ భావవీచుల్ని తాను అక్కడ పొందగలడా?

సాహసించి ఆయన ముందుకు పోగలిగేవాడే. కాని అలాగ జరుగలేదు. తుప్పలను డొంకలను దగ్ధం చేసి చెట్లకొమ్మలమీదికి ఎక్కడానికి తీవ్రపడే అగ్ని తాకిడినుంచి బయటపడాలని స్వీయప్రాణ రక్షణార్థం కొట్టుమిట్టాడే కొన్ని అడవిజంతువుల దురవస్థ ఆయన్ను ఆకర్షించి నిలిపివేసింది. ఆ డొంకనుంచి ఈ కంచెకు గెంతిన కుందేలు అక్కడికంటె ఇక్కడి వేడి హెచ్చు కావడంచేత నేమో ఉక్కిరి బిక్కిరై ప్రక్కనున్నది అగాధమైనదో యేమైనా భయపడక దానిలోకి ఉరికేస్తోంది. ఉడుకుబోతుకు తాళలేని ఉడుము చల్లదనంవైపు పోవాలనే ప్రగాఢ వాంఛతో ఇంకా మంటలవైపే ఉడాయించడం చూచి ఆయన నవ్వుకున్నాడు. మెట్టతాబేళ్లు అటు ఇటు చురుగ్గా జరగడంలో మంటలు ఎంత చప్పుడు చేస్తున్నా—ప్రాణంకోసం అలమటించే వాటి జరజరలు కూడా స్పష్టంగా వినిపిస్తున్నాయి. రెండు ముంగిసలు వేడెక్కిన రాళ్ళ పైభాగంనుండి జారలేక ఒళ్ళు కాల్చుకున్న వాటిని ఆయన చూశాడు. అల్లంత దూరానవున్న దృశ్యం ఆయన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. రెండు చిరుమానులు ఒకమద్ది నిటారుగా మహా వృక్షాలుగా పెరిగి కొద్దిపాటి నీడను పరివ్యాప్తం చేయడానికి ప్రయాసపడుతున్నాయి. ఆ ఛాయలో పైనున్న ఆకాశంలో విహరించే మొయిలు కన్నను చూచి పురివిప్పి నృత్యం చేయడానికి విజృంభిస్తున్న దొక నెమలి. దాని కింకా దూరాన్నుంచి ముందుకు దూసుకువస్తున్న మంట లవుపించలేదేమో! లేక ఆ ఋతువులో దానికంత ధీమా వుంటుందేమో! అయితే ఒక్కటిమాత్రం జరిగింది. ఈ మంటలనుండి తన్ను రక్షించుకోవడానికి శరవేగంతో ముందుకు ప్రాకిన కాలసర్పమొకటి—ఆరాటంలో తాను నిల్చున్నది తన శత్రు స్థావరమని గమనించి వుండకపోవచ్చు—కించిత్కాలం ఆ మద్ది చెట్టుక్రింద నెమలి పింఛం మాటున నిలబడ గల్గింది. పరిస్థితి జీవుని పెట్టే ఒత్తిడి అలాంటిది!

క్షణంసేపు ఈ ప్రకృతి సౌందర్యాన్ని ఒక వంకనుండి చూచిన ఆయన మరొక వైపుకు మరలిపోక తప్పిందిగాదు. సూర్యాస్తమించడానికి ఇకనొక గంటకన్న ఎక్కువ సమయం వుండదు. ఆయనకు ఒళ్లంతా చెమట పట్టింది. వేడిగల్లను పొగచేతను నల్లనిరంగు అదొకలాగున ఆయనమీద కప్పుకుంది. బొచ్చుతువ్వాలు భుజమ్మీద వేసివున్నా, అప్పటివరకు రెండుమూడు దఫాలు దాన్ని ఆయన ఉపయోగించి వున్నా ఇప్పుడది ఆయన ధ్యాసలో లేదు. తాను క్షణం క్రితం తిలకించిన దృశ్య ప్రభావము—విపత్కర వాతావరణంలో తగుల్కొని దాని చీకాకుకు తట్టుకోలేక కొట్టాడుతున్న—ఘనంగా ఒకనాడు బ్రతికిన మహా సమాజపు దురవస్థను ఆయన దృష్టిపథంలో నిల్పి వివిధమైన భావాల్ని ఉత్పన్నం చేసింది. తత్ఫలితంగా ఆయన తన స్వస్థతను కొంతవరకు కోల్పోయాడని చెప్పవచ్చు.

వెనక్కు మళ్ళడంలో కూడా తీవ్రతనే కనబరచి నందువల్ల ఆయన అనుకొన్నంత త్వరగా నది వొడ్డుకు చేరుకోగలిగాడు. ఇంతలోనే ఆకాశంలో మేఘం కూడా ఆయనకు సానుభూతి ప్రకటిస్తున్నట్లు ఎండకు తెరగప్పింది. వచ్చి వచ్చి ఆయన పెట్టబడినది గాక పుట్టినట్లేవున్న గోడను మరపించే ఒక నల్లరాతి బండవార దాన్ని అనుకొని ఓరగా ఒక ప్రక్క నిలబడిపోయాడు. అనుకోకుండా అక్కడ చదికిలబడిపోయాడు. చెక్కిన నల్లని శిలా వితర్దికవలె భూమిపై శాశ్వతంగా పడివున్న ఒక బండ దిమ్మమీద ఆయన నిడుపాటి తన బొచ్చుతువ్వాలును పరచుకొని వెనుచేతులను ఆ ఫలకానికి ఆనించి అరచేతులలో మోపబడ్డ గడ్డం ఆధారంపై తన కట్టెదుట తనను పులకింపజేస్తున్న దృశ్యాన్ని చూస్తూ బోంగిల పడుకొని వున్నాడు. గోదావరిపై నుంచి చల్లని పిల్లగాలి అటే వచ్చింది.

2

గోదావరీ తీరంలోని ఆ భాగం ఆమెకు సుపరిచితమై వుండవచ్చు. ప్రతిరోజూ అదే సంజవేళ ఆమె అక్కడకు స్నానానికి వస్తూవుండాలి. తనకుతక్క మరొకరికి ఆ తావు ఏ విధంగానూ గుర్తింప నసాధ్యమై

ఉండి ఉండాలి. కనీసం ఆ చోటు అట్టిదనే ధీమానైనా ఆమె ఉంచుకొని ఉండాలి. లేకుంటే ఆ తరుణి స్నానపద్ధతిలో ఆ స్వేచ్ఛ, ఠీవి, హుందాతనం, సౌందర్యం మూర్తీభవించి ఉండేవికావు; ఎంతో ఆలోచన చెయ్యగల ఆయన్ను అంత త్వరగా ఒక భావవీధిలోంచి మరొక వీధిలోకి లాక్కు రాగలిగేవి కావు. ఆమె కిన్నెరసానీ గాదు; వనదేవతా కాదు—మరే గంధర్వకన్య అనుకోడానికీ ఆస్కారంలేదు. ఆమె అచ్చంగా ఒక పడుచుపిల్ల. అంతకు మించి అతి దగ్గరగా సూక్ష్మంగా సూటిగా చెప్పగల శక్తిమంతమైన మాట మరొకటి దొరకడం కష్టం. పోల్చడానికైతే ఎన్నైనా ఊహలు పుడతాయి: ఆ తరుణంవరకు కలత చెరుగని సరస్సు, అతి నిర్మలమైన మనస్సు. కడిగిన ముత్యం. చిదిమి పెట్టిన దీపం. అందాన్ని పుణికి పుచ్చుకొన్న యౌవనం. అరణ్యంలో కొండ కొమ్ము నుండి ఆషాఢంలో కురిసిన వర్షానికి వాగులు నింపుకొచ్చిన క్రొత్తనీటితో నిండుజవరాలివలె తొణికిసలాడి గట్లు నొరసికోవడానికి ఉరకలు పెట్టే గోదావరి. మరి ఇట్టి మనసు అట్టి మగవానికి అవస్థాభేదం కలిగించడంలో ఆశ్చర్య మేముంటుంది. నీళ్ళలో నే అక్కడక్కడ చిత్రంగా పేర్చబడినట్లున్న బండలపై కూర్చుని అటు ఇటు గుమికుతూ, ఒకచో వయ్యారంగా సబ్బుతో వొళ్ళు తోముకుంటూ లీలగా ఖేలగా తన లేతచేతులతో నీళ్ళు భుజాలకంటూ విసురుకుంటూ ఆమె అలా ఎంతసేపు జలక్రీడ సాగించిందో-ఎంతటి మహా సౌందర్యవంతమైన లతకైనా ఒక ఆశ్రయం లేనిదే శోభించదుగదా! అడవిలోని కొండమల్లెవలె, కొండలోని సెలయేటివలె, ఏటిస్వచ్ఛమైన నీటిబిందువు వలె ఆ సౌందర్యానికి సార్థక్యం అన్నది ఎక్కడ? దాన్ని ఎవరు చూచి ఆనందించను? ఒకవేళ దాన్ని ఎవరైనా చూచినా అది జరిగినట్లు ఆమె గుర్తించినా మరుని మేడంలో సంభవించే పరివర్తనవల్ల జనించిన భావపరిణామం మెలా వుంటుందో వేరె చెప్పనక్కర లేదు. ఆమె స్నానం ముగించుకొని వుండవచ్చు. సహజమైన చనవుతో మెట్లు నెక్కినట్లు ఒడ్డునవున్న బండలదగ్గరకు వస్తోంది. కొద్ది సమయంలో ఆమె వొళ్ళు తుడుచుకుంటుంది. నిడుపాటి వెంట్రుకలుగల జుత్తును పిండిపెట్టుకొనే అలవాటున్నదో లేదో—పాతికేళ్ళకు పైదాటని పడుచుదనం తనలో రెక్కలిచ్చే వింతవింత భావాల త్రొక్కిడికి తట్టుకోలేక ఆయన లేచి నిల్చున్నాడు. ఆయన శరీరం ఇంకా స్వస్థత నొందలేదు. కాళ్ళు అప్రయత్నంగా వెనక్కు నడిచాయి. చప్పుడు చెయ్యకుండా ఆయన రెండుమూడు బండల ప్రక్కకు ప్రాకిపోయాడు ఎక్కడ నక్కి వున్నా ఆయనమాత్రం ఆమెకు కనబడకూడదు. ఆమె మటుకు తనకు కనపడాలి. ఓహో! ఎంతటి బలవత్తరమైన దీవాంఛ! విధి ఆయనకే అనుకూలించింది.

ఆమె తనవస్త్రాల్ని విప్పుకొని పోగుగా పెట్టుకొనివున్న స్థలానికి వచ్చింది. ఒక్కసారి నలుకెలంకులా కలయజూచింది. ఆచూపు క్రొత్తది. అది ప్రసరించిన కోణమే వేరు. ఇవన్నీ స్పష్టంగా దూరాన్నుంచి ఆయన ఆమెకళ్ళలో చదువగలుగు తున్నాడు. అనుకోనట్లు ఆమె క్రొత్తచూపుకు ఒకక్రొత్త వస్తువు అనింది. ఆవడమే తడవు ఆమెలో విపరీతమైన భావాలు వింతవింత భంగిమలలో విచిత్రలాస్యం ప్రారంభించాయి. లేత గులాబిరంగులోవున్న ఆమెనునుమెత్తని పాదాలు ఆయన బొద్దుకువ్వాలపై పడ్డాయి. ఈ తుంటరి ఎవరిది? ఇక్కడికెలా వచ్చింది? ఇది స్త్రీల దానికివలె కనబడ్డంలేదే! మరి దీని యజమాని ఎవరు? లేక తన భ్రమగాని ఇది తానిక్కడకు రావడానికి చాలాసేపటిక్రితమే వుండిపోయినదివా! పరంపరలుగా ప్రశ్నలు ఆమెను తికమక పెడుతున్నాయి. వీటికి ఆక్షణంలో సమాధానం రావడం దుర్లభం. కారణం ఆమె అక్కడ ఎవ్వరున్నారని వాటికి తన ఎర్రని పెదవులద్వారా వ్యక్తీకరణం ఇవ్వగలదు? అనిర్వచనీయమైన మౌనంచేత పరిభ్రమించబడ్డ ఒకవిచిత్ర విన్యాసం! దీన్ని దూరంనుంచి చూస్తూ ఆయన తనలోనుండి తొట్రుపడుతూ వెలుపలికి వెలికిరావడానికి విశ్వప్రయత్నంచేసే హాస్యాన్ని బలవంతంగా ఆపుచేసుకున్నాడు. తనకు తెలియకుండా ఆ స్త్రీ ఎంతటి అవివేకాన్ని ప్రదర్శిస్తోంది! లేకుంటే ఏమాత్రం ప్రపంచ జ్ఞానం కలిగిన యువతియైనా నీళ్ళనుండి బయటకు రాగానే చేయవలసిన పనేనా అది? తక్షణం ఆమె పాముకుబుసాన్ని మరపించే వాయిలుచీర శరీరమంతటా కప్పుకొని వుండవలసింది. త్వరలో ఒళ్ళు తుడుచుకొని బట్టలు సరిగా కట్టుకొని ఇంటిముఖమై ప్రయాణం ప్రారంభించి అప్పుడు—కావాలంటే ఇటు అటు విలాసానికి లేదా ఎదైనా తెలుసుకోడానికి చూడవచ్చు. కాని ఇక్కడ అదేమీ జరగలేదు. అయితే ఒకటిమాత్రం చెప్పాలి.

ఆమెకంటే లేదంటే పదేళ్లు ముందుగా ప్రపంచంలో అడుగు పెట్టిన ఆయన - విద్యాధికుడు గూడా కావచ్చు —తన నిర్ణయాలనే గీటురాయిపై ఆ అమాయికపు మేలిమి బంగారాన్ని గీచి వుండవలసింది గాదు. అట్లైతే గీటుకు సరిగానే వస్తుంది. కాని పరిశీలకుని అంచనా వాస్తవానికి కొంచెం దూరంగా వుంటుంది. ఇందులో దోషమెవరిదీ లేదు.

ఆమెది యౌవన తీవ్రత. దాని ముష్కరానికి ముందు వెనుకలు లేవు. ఎట్టి దిట్టలైనా ఆ అవస్థలో అంధులే. అక్కడ మనం అనుకొన్న ప్రమాణాలేవీ పని చెయ్యవు. అది గర్వం. దాని తీవ్రతకు అవధులుండవు. వేగానికి లెఖ్ఖ కట్టడం కష్టం. అది మనిషి చేత ఇప్పుడు ఈ పని ఇలాగ చేయిస్తుందని ఇంతవరకు ఇదమిత్థంగా చెప్పగలిగిన వాడెవ్వడూ లేడు. ఒక వేళ వున్నాడని ముందుకువచ్చినా వారిమాటలు నమ్మ వీలు లేదు. కనుక నే ఆమె అలాగు చేసింది. ఎలుగెత్తి పిలుద్దామని పిలువలేకపోయింది. ఇంకొంచెం ముందుకు పోయి చుట్టు ప్రక్కల చూద్దామని చూడలేకపోయింది. 'ఈ వస్తువు ఎవరిదో—దీనిగొడవ మనకెందుకు?' అనుకొని దానిని వదిలివేద్దామని ఒకటికి పైగామార్లు స్థిరీకరించుకొని గూడా ఆమె ఆ తువ్వాలును తీసి పైన కప్పుకోకుండా వుండలేకపోయింది. మనిషికి పతనం అనేది ఎప్పుడు ఏ మూలనుండి ఎలాగ సంభవిస్తుందో ఎవరూ చెప్పలేరు.

ఆ పిల్ల ఆ బొచ్చు తువ్వాలుతో ఒళ్ళంతా శుభ్రంగా తుడుచుకొంది. అంతటితో ఆగాలా! జుట్టును దానికి పిడిపెట్టి అనేకవిధమైన వయ్యార మొలికించేటట్లు మెలిద్రిప్పి తలపై తెల్లని మల్లెపువ్వులను కుప్పగా తురుముకొన్న కొండ దేవతవలె ధరించింది. ఇంక తర్వాత ఆమె ఏంచేసిందో ఆయనకు సరిగా తెలియదు. కారణం సూర్యుడు వీరికవుర పరిస్థితిని చూడలేక సిగ్గు పడ్డాడా అన్నట్లు తన ముఖాన్ని పశ్చిమ దిశారాణి ఒడిలో దాచుకోవడమే. ఆమె చకచక తన నివాసం వైపు నడుస్తోంది. పాతిక గజాలదూరం ఎడంలో ఆయన ఆమెను అనుసరిస్తున్నాడు. ఎవరైనా ఆయన్ను ఆ క్షణంలో చూసి ఎందుకీయన ఈ పడుచువెంట పడ్డాడు? అని గుణించుకుంటున్నందుకుమాత్రం ఆయన ఆ పని చెయ్యడంలేదు. ఊరికి కొంచెం దూరంలో గాలి ధారాళంగా వీచే స్థలంలో నిర్మింపబడ్డ గిరిజనుల నూతన నివాసస్థానాలలో ఆమె వసతివుంది. దాన్ని ప్రభుత్వంవారు ప్రణాళిక పనులలో ఒక భాగంగా నిర్మింపజేశారు. అప్పటి గిరిజనుల సేవకని కొందరు అధికారులను, సంఘసేవికలను నియమించి ప్రత్యేక శాఖగా ఆ పని నిర్వహిస్తున్నారు. ఆమె గది తలుపు తాళంతీసింది. కనుచూపు మేరలోనే ఆగి ఆయన ఆని సంతవరకు ఆ గదిని చూస్తున్నాడు. అది ఒక్కరే వుండడానికి అనువుగా కట్టబడ్డ గదులకోవకు చెందినది. లోపలికి ప్రవేశిస్తూనే ఆమె తలుపు గడియ వైచుకొంది.

3

కొద్ది క్షణాలు మౌనంగా నడిచాయి. ఆమె ఎన్నడు విననటువంటి నూతన ఫక్కీలో తన తలుపు బయటనుంచి తట్టబడడం గుర్తించింది. ఆ స్వరం అధికార పురస్కృతమైనది. అవతలి వ్యక్తి తన మాట, ముల్లె ఏదో లోపల వుండిపోయినట్లు దబదబ బాదుతున్నట్లు ధ్వనిస్తోంది. ఆమె దరాలున తలుపు తెరచింది. ఎదుటనున్న వ్యక్తిని చూచింది. ఆయనా ఆమెను చూశాడు. కొన్ని సెకన్లు మాత్రమే వారి మధ్య మౌనంగా నిలబడ గలిగాయి.

"ఎవరు మీరు? ఎవరికోసం వచ్చారు?" అదరి పడేటట్లు ఆమెనుండి వచ్చింది ప్రశ్న.

"నేనే నండి. ప్రత్యేకమైన పనివుండి వచ్చాను" ధీమాయే ప్రత్యుత్తరంగా ఆయననుండి వెలువడింది.

"ఆ పనేమిటో తెలుసుకోవచ్చునా?" ఈ ప్రశ్నగూడా విరసంగానే వచ్చి ఆయన్ను ఘాటుగా తాకింది.

"నా వస్తువు ఒకటి ఈ ఇంటిలోకి వచ్చింది. దయవుంచి దాన్ని ఎక్కడ వున్నదో వెదకి తీసుకొని వెళ్ళనివ్వండి" ఇది జవాబు కాదు; రెట్టించిన ధీమా.

ఆమె కణత పగిలేనంత పనయ్యింది. బలవంతుని అరచేతి దెబ్బకు పళ్ళు కదలిన బలహీనుని ముఖం ఆమెలో ద్యోతకం కావడానికి ప్రయాసపడింది. అయినా ఆమె ఆడది. అసమానమైన స్త్రీ - తన మార్పును తానే ధైర్యంగా సంబాళించుకోడానికి ప్రయత్నించి "మీరనేది నా కర్థం గావడంలేదు. డొంకతిరుగుడు దారివదలి సూటిగా చెప్పండి. మీకు ఏమి కావాలో? ఈ స్థలంలో ఈ సమయంలో ఇక్కడ పురుషులకు ప్రవేశం నిషిద్ధం!"

ఆయన పకాలున నవ్వడానికి ప్రయత్నించాడు. కాని మందహాసం మాత్రం చెయ్యగలిగాడు. మరి

ఎదుటి మనిషి గుర్తించుకోనగలిగితే ఆపాటి ప్రహారం చాలు. "వస్తువును అపహరించినవాళ్ళు తమ నేరాన్ని తాము అంగీకరించక పోగా దాన్ని కప్పి పుచ్చుకోవాలని చూచేటప్పుడు ప్రశ్నలకు సూటిగా సమాధానాలు రావు. ఇవ్వకూడదుగూడా. అందునా ఈ సందర్భంలో అసలే పనికిరాదు. మళ్ళీ అడుగుతున్నా. జనీ! మీ రెవ్వరో నాకు తెలియదు. మీతో నాకేమీ పని లేదు. తెలిసిగాని తెలియకగాని లేదా కొంచెం ప్రయోజనం కాంక్షించి వుంటేగాని మీరు నా వస్తువును తీసుకొన్నారు. ఈ సరికి దాని ఉపయోగం కూడా పూర్తయి వుంటుంది కనుక వెంటనే నా బొచ్చు తువ్వాలు నాకిచ్చివెయ్యండి." ఆయన నింకేమీ మాట్లాడలేదు. ఒక్క అడుగైనా ముందుకు వెయ్యలేదు. విజేత వలె అచంచలంగా నిలుచున్నాడు.

అప్పటివరకు ఆమెను ధైర్యంగా నిలబెట్టిన తామని ధరఃసా యిచ్చిన ఆమె ఊహాసౌధంలోని పునాదులు తునాతునకలై పోతున్నాయి. హిమానీ నదాల ప్రవాహంలోని మంచుబండరాలవలె తేలిపోతున్నాయి, 'ఇప్పుడేమిటి చెయ్యడం? పాదాలపైబడి ఆయన్ను క్షమించండి అని ప్రార్థించడమా? నేను తప్పుచేశానని గొంతెత్తి ఏడ్వడమా?'– 'ఛా! ఇదేంపిటే? ఇంతమాత్రానికే బేలవై పోతావేం? కించిత్కాలం ఒకరి వస్తువు నాదని వాడుకొన్నావు. యజమానులు దాన్ని అడుగుతున్నారు. వెంటనే ఇచ్చేసి బూజులు దులుపుకొని శుభ్రంగా అలికి ముగ్గుపెట్టుకున్న మందిరాంతర్భాగంవలె నీ హృదయాన్ని చక్కబరచుకో'—

'ఇది నీవనుకొన్నంత తేలికపని కాదు. అది కేవలం ఒక తువ్వాలుమాత్రమే కాదు. జరిగినపని నీవు తీసుకోవడమేనా? కాదే. అది వర్ణనాతీతమైన పతనావస్థ. నీవు మాచేదాన్ని ఇతమిత్థమని పోల్చుకోలేక పోతున్నావు. మరి నీవు మాడకుండా ఎంత గ్రంథం జరిగిందో ఎరుగుదువా—నా కళ్ళతో చూడనిదాన్ని నేను నమ్మను. దాని ప్రమేయం నేను పెట్టుకోను–అనే ఆధునిక యువకులవలె దీన్ని త్రోసి పారెయ్యగలవా? అసాధ్యం'—

జీవితంలో ఎన్నడు ఎదుర్కొనియుండనటువంటి తీవ్రఘర్షణకు తట్టుకోలేక ఆమె తూలిపోతోంది. అతిప్రయత్నంపై నిలుపుతున్న దేహంతో ఆమె ఒక్క పనిమాత్రం చేయగలిగింది. తడిసిన తువ్వాలును ఆయనచేత పెట్టింది. "క్షమించండి" అందామనుకొని పెదిమలదాకా ఆమాటవచ్చినా సాహసించి ఉచ్చరించలేక పోయింది.

"మంచిది. ప్రస్తుతానికి సెలవు యిప్పించండి రాముడు మేలుచేస్తే మళ్ళీ కలుసుకొందాం." మధురాతి మధురమగు స్వరంలో దివ్యవీణపై భవ్యఘణితులు పలికినట్లు అని ఆయన తువ్వాలు భుజమ్మీన కప్పుకొని చీకటిలో బంగాళావైపు వెళ్ళిపోయాడు ఆమె వెంటనే తలుపు వేసేసుకొంది. దీపం ఆర్పేసింది. రాత్రి కింకేమీ తీసుకోలేదు; పచ్చిమంచినీళ్లైనా పుచ్చుకోలేదు. కుప్ప కూలినట్లు మంచంపై పడిపోయింది. శాంతికోసం నిద్రకోసం ఘూర్ణిల్లింది. నిద్ర పట్టలేదు. రాత్రి గడచిన కొద్దీ ఆమెను ఏదో పెనుభూతం ఆవహించినట్లు భయపడసాగింది. దిగులుపడ్డది; ఖేదపడ్డది. ఒకవ్యక్తి తాను నిలుచున్న మహోన్నతశృంగ శిఖరంనుండి విధివశాన క్రిందకు బలంగా త్రోయబడడంవల్ల పొందిన పాటువలన గలిగే బాధను ఆమె తెల్లవార్లూ భరించింది.

ఆయన బంగళాకు చేరుకోనేసరికి ఎనిమిదిగంటలైంది. పేరయ్య కాచిన వేడినీళ్ళుపోసుకొని బట్టలు మార్చుకొని క్యారియర్ లో తెచ్చిన అన్నం భోజనంచేసి మంచంపై మేను వాల్చాడు. బాగా అలసివుండడంవల్ల ప్రయాణపు బడలికవల్లను చావకొట్టి పారేసినట్లు ఆయనకు ఇట్టే నిద్రపట్టేసింది. ఒకజాము సుఖసుప్తి అయినాక స్వప్నంలో స్పష్టంగా సాయంత్రపు దృశ్యాలు తారాడ్డం మొదలుపెట్టాయి. లాంచి దిగడం. అరణ్యదర్శనం. గోదావరీతీరం. సోపానాలు. కొండదోవ. అంటుకొన్న ఎండుటాకులు. అడవిజంతువులు. బండరాతిపక్క పడుచుపిల్ల స్నానం. ఒక్కటొక్కటే అతివేగంగా కదలిపోతున్నాయి; తిరిగి తిరిగి అవే దృశ్యాలు కలలో నిజాలవలె కనబడుతున్నాయి. కొండగాలి మళ్లింది. గోదావరిపైనుండి చల్లగా బంగళామీదికి పవనం దాడివెడలింది. బంగళా ఆవలి ప్రక్కన నారత్రాటికి వ్రేలాడగట్టబడి ఆరవేయబడ్డ బట్టలకొసన వున్న నిడుపాటి బొచ్చుతువ్వాలు ఆ గాలికి కొద్దిగా కదలుతోంది. నిద్రలో దానికీ స్వప్నంవచ్చినట్లు ఆ తలపు సుడుల్ని తలచుకొని ముసిముసి నవ్వులు నవ్వుకొంటున్నట్లు ఆకదలిక చెప్పక చెబుతోంది.

4

మరునాడుదయం ఆయన రామ దర్శనం చేసుకున్నాడు. పేరయ్య పొందదలచిన భోగట్టా చాలవరకు లభించింది. ఆయనది కాకినాడట. ప్రణాళికా శాఖలో జిల్లా అధికారులందు ఆయన కూడా ఒకరు. ఇవాళ సాయంత్రం జరుగనున్న గిరిజనాభ్యుదయ శాఖవారి కార్యక్రమానికి—వార్షికోత్సవాలకు అధ్య

తిలకించేందుకు, బహుమతి ప్రదానానికి ప్రత్యేకంగా ఆహ్వానింప బడ్డారు.

సాయంత్రం వరకు ఆయన తమ పాతమిత్రుల కొందరను, ప్రభుత్వోద్యోగులను కలసుకొని సంతోషంగా గడిపివేశారు. వారందరు ఉత్సవాలకై ఆహూతులలో వున్నారు. సరిగా అయిదుగంటలకు గిరిజనాభ్యుదయ శాఖవారివల్ల నిర్మింపబడ్డ మండపంలో ఉత్సవం ప్రారంభమయింది. ఆయనే దానికి అధ్యక్షులు. స్థానికాధికారులు వారిని పుష్పమాలాలంకృతులుగా గావించి ఘనంగా సన్మానించారు. తరువాత విచిత్ర వేష ధారణ పోటీలు, నృత్య గేయ రూపకాలు జరిగాయి. ఇక మిగిలింది బహుమతి ప్రదానం. ఆటపాటలలో తదితర కార్యక్రమాలలో తమ ఘనత సూచించుకొన్న వారికి పేరు పేరున బహుమతులు పంచిపెట్టబడుతున్నాయి. అక్కడి అధికారి ఒకరు ఆయన కూర్చొన్న కుర్చీ ప్రక్క నిలబడి పేరులవారీగా ఆయా వ్యక్తులను వారి విశిష్టతలను సభవారికి పరిచయం చేస్తున్నారు. వారు ముందుకువచ్చి సాదరంగా ఆయనకు నమస్కరించి బహుమతు లందుకొని వెడుతున్నారు. కరతాళధ్వనులు సభమండపం బయలు వెలి మిన్నుముట్టుతున్నాయి. చాలా పేర్లు చదువబడ్డ తర్వాత ఈ వాక్యాలు దూరశ్రవణ యంత్రాలద్వారా సభలో ప్రతిధ్వనిస్తున్నాయి. "కుమారి శోభారాణి. ఈమెను గురించి సభవారికి నేను కొన్ని వాక్యాలు మనవిచేస్తున్నందుకు గర్విస్తున్నాను. ఈమె సహజంగా పుట్టింది కోయగడ్డపైన. మంటిలోంచి బయల్పడ్డ మాణిక్యంవలె, వనంలో దేవత వెలసినట్లు, గిరిజనులలో గిరిజాకుమారివలె ఈమె అవతరించింది. పువ్వు పుట్టినప్పటినుండి పరిమళం వెదజల్లేటట్లు చిన్నవాటినుండి ఈమెలో ప్రతిభ వెల్లివిరిసింది. ఆంగ్లము తెలుగు బాగుగా అభ్యసించి బి. యే. పరీక్ష యిచ్చింది. నిస్వార్థ సంఘసేవ చేయాలని తలపు వచ్చి ఉద్యోగాల్ని, హోదాల్ని వదలుకొని సాటి మానవుల సంక్షేమానికి అవిరళకృషి జరుపుతోంది. వివాహం చేసుకోకుండా ఈ క్షణంవరకు బద్ధకంకణరాలై తన సౌశీల్యమనే సౌరభంతో ఈ గిరిజన ప్రాంతాన్నంతను ముగ్ధపరుస్తున్న ఈమె సంఘ సేవా భావానికి, శీలసంపదకు మేము ప్రత్యేకంగా బహూకరించే స్వర్ణపతకం చూస్తే 'చంద్రుని కొకనూలుపోగు' అన్న లోకోక్తి జ్ఞప్తికివస్తుంది........."

ఇంకా ఆయన ఏదో చెబుతూనే వున్నారు. ఆ మాటలు వినడంకంటే సభలోంచి ఎవ్వరూ ఆ పతకాన్ని అందుకోవడానికి ముందుకు రాకపోవడం అధ్యక్షులవారి ఆశ్చర్యాన్ని ఇనుమడింపచేసింది.

ఆయన నిశ్చేష్టులై సభవంతా కలయజూచారు 'ఏరీ-- ఒకరూ ముందుకురారే! ఈ పతకం గానీ అగ్ని విస్ఫులింగంకంటెదా ? ఎవ్వరూ దీన్ని తాకనేలేరూ? అహో! ఈ శోభారాణి ఎవరు ? ఇంతకీ ఆమె ఈ సభలో ఉన్నట్లా లేనట్లా?' మౌనంగా ఆయన చూపులే సభవారిని ప్రశ్నిస్తున్నాయి.

"లేవాలి. శోభారాణి ముందుకు రావాలి. ఈ పతకాన్ని అందుకోవాలి" అధ్యక్షుల ప్రక్కనున్న అధికారి గర్జిస్తున్నాడు. ఔను మరి. ఆయన దృష్టి నంతవరకు అది తనకు గర్వకారణమైన విషయం.

మరి ఆమె- అంటే ఆముందువరసని కూర్చొన్న నాల్గవబారు కడన లేచినిలుచున్న వనిత- ఇప్పటివరకు ఎంతసేపటినుంచో ఏ ఏ మార్గాల ఏ ఏ కోణాల ఏ ఏ భావాలతో అధ్యక్షులను చూచి ఎలా పిలువబడబోతున్నదో! అవి అధికారుల పరిచయ వాక్యాలా? మీకు కావచ్చు. నాకు కావచ్చు. అందరికీ వీన సొంపుగావచ్చు. కాని ఆమెకో వెన్నవంటి మెదడు పై బలంగా వేయబడుతున్న సమ్మెట ప్రేటులు. నవనీత కోమల హృదయాన్ని తూట్లు పొడిచే శూలాలు. ఈ ప్రహారాలకు ప్రతిగా ఒక్కొక్క మాటకు ఒక్కొక్క వేడి కన్నీటి బిందువు మినహా ఆమె ఆ క్షణంలో మరి దేనినీ బహిర్గతం చేయలేక పోతోంది. ఆమె చేయగలిగిందల్లా ఒక్కటే. లేచి నిలబడింది. అంతే మళ్ళీ కూర్చుందామనుకున్నా కూర్చోలేదు. ఒక్క అడుగైనా ముందుకు వెయ్యడానికి ఆమెకు శక్తి చాలదు. ఆసంకల్పానికి మనస్సే ఊతనివ్వక పోతే ఆమెశరీరం ఇంకెలాగ కదలగలుగుతుంది?

"తన ఆరాధ్య దైవము ప్రత్యక్షమైనాడని తెలిసి కూడా భక్తుడు ఆయనను చేరలేకపోయాడు. ఇంతకన్న నేరం ఏమి వుంటుంది?"

అధ్యక్షులు ఆమెను పరీక్షగా చూశారు. శోభారాణి వ్యామోహాన్ని ఆయన గుర్తించారు. 'సరే ఈ పతకాన్ని తర్వాత ఆమెకు అందజేయ్యండి. చిన్న తనంవల్ల కావచ్చు, ఆమె తాను ఏం చేస్తున్నదీ తెలియక సిగ్గుపడుతున్నది" అన్నారు. బహు ప్రయాస పైన ఆమె కూర్చోగలిగింది. ఆకూర్చొనడం గురువు నెదుట తప్పనొప్పుకొని కూర్చొనే శిష్యుని, ప్రభువు నెదుట మోకరిల్లి పాపానికి పశ్చాత్తాపం ప్రకటించే భక్తుని అధ్యక్షుల విజ్ఞప్తికి తెచ్చింది.

"నన్ను క్షమించండి!" అని ఆమె పరిదీనవదన యై ఆయనన్ను ప్రతిమాలుతున్నట్లు తోచింది.

ఆయన హృదంతరాళంలో ఈ ప్రశ్న ప్రతిధ్వనించింది, "అయితే నేనెవ్వరికి క్షమాపణ చెప్పుకోవాలి???"

రోహిణీ చంద్ర మంగళ యోగము

శ్రీ రాళ్ళపల్లి గోపాలకృష్ణమాచార్యులు

“జరిగిన ఫలములకు జాతకయోగములతో సమన్వయము చేయుటతోనే కాలక్షేపము చేయుచున్నది. కాని, భావిఫలములను గూర్చిన వ్రాత మృగ్యము. ఇంచుమించుగా, ఈ వ్యాసములు శవపరీక్ష వంటివే.”

“భారతి” యందలి నా వ్యాసములను కటాక్షించిన మహాశయులలో కొందరు పై అభిప్రాయము లిచ్చిరని వింటిని. పరిహాసపు ధోరణితో వారట్లు సెలవిచ్చియుండినా, సత్యమును వారు గ్రహింపగల్గుటచే, నా పరిశ్రమ చరితార్థమే. వ్యక్తి జీవితములకు భావి ఫలములు సూచించు ఉద్దేశముతో నే నీ వ్యాసములు వ్రాయుచుండ లేదు. రాజకీయ సంస్థలకు కాని, రాజ్యతంత్ర నిర్వాహకులకు కాని, రానున్న కష్టసుఖములను జాతకములద్వారా ఊహించి ప్రకటించుట సముచితము నా ఆదర్శము కాదు. నా దృష్టిలో అట్టి కార్యము అరుచికరము. ఇట్టి ప్రముఖవ్యక్తికి వచ్చు సంవత్సరములో ఆయువు తీరునని కాని, ఇట్టి రాజకీయవ్యక్తి ఇట్టి వేళలో శత్రువుల కుట్రచే అపమృత్యువుపాలగునని కాని, పత్రికలలో ప్రకటించుట ఎంత ప్రమాదకరమో, పాఠక మహాశయులు సులభముగా ఊహించుకోగలరు. ఇట్టి వ్రాతలలో, కాకతాళీయముగా, ఏ ఒకటి అయినా ఫలించినచో వచ్చు ప్రచారమును కాని, కీర్తిని కాని, నేను ఆశించుట లేదు. అగుటచే, పైవిమర్శ ఉచితమే.

మరి, గత జీవితఫలచర్చ ఏమిలాభ మందురేమో? అనేక కారణములచే రాజాదరమును, ప్రజాదరమును కోలుపోయి ప్రాచీనజ్యోతిశ్శాస్త్రము క్రమముగా హీనస్థితికి వచ్చియుండుట అందరెరుంగుదురు. తత్ఫలముగా, ప్రాచీన ప్రయోగరహస్యము లనేకములు మరుగుపడినవి. అవి తెలిసిన ప్రాచీనులు కాలగర్భమున అంతర్ధానమయినారు. పత్రికలలో ప్రచురింపబడు వారఫలములు, మాసఫలములు, మాత్రమే భారతీయజ్యోతిశ్శాస్త్రపు పరమ ప్రయోజనమని అన్యదేశీయులు భావించు స్థితి వచ్చియుండుట శోచనీయము.

ప్రాచీన సంప్రదాయపు సూత్రములు, ప్రయోగ పద్ధతులు వెలికలవని, వానిని జీవిత విశేషములతో సమగ్రముగా సమన్వయపరచుట సాధ్యమని, ఆధునిక కాలపు పరిశోధక ఫలితములను నిరాదరించుట శాస్త్రమునకు నష్టమని పాఠకమహాశయులకు సోదాహరణముగా మనవి చేయుటమాత్రమే నా ఉద్దేశము. ఈ విషయమున ఆధునిక విద్యావంతులకు విశ్వాసము కలిగనేది శాస్త్రాభ్యుదయమునకు దారితీయు నని నా ఆశ. అట్టి ఆశతోనే, నా స్వవ జీవిత కథలను గ్రహించి అనుభవములను శాస్త్రసమన్వయము చేసి చూపుచుంటిని. జ్యోతిశ్శాస్త్రాభిమానము కల ఆధునిక విద్యావంతులగు ఆంధ్ర మహాశయులలో శాస్త్రాభ్యాస కుతూహలము, ఏ కొందరికైనా, ఏ కొంచెమయినా, రేకెత్తెనేని, నా ప్రయత్నము సార్థకమే. ఇతర శాస్త్ర విషయములలో వలె దీని పద్ధతులను గూర్చి వారే పరిశోధనము సలుపగలరు. చేయవలసిన పను లెన్నియో యున్నవి. ఒకరిద్దరితో సాధ్యమగునవి కావు. నేడు కాకున్న రేపయినా, కొన్ని యేండ్లకయినా, ఆంధ్ర భూమిలో ఈ శాస్త్ర విషయమున అట్టి వికాసము తప్పక రాగలదు. “కాలో హ్యయం నిరవధిః విపులా చ పృథ్వీ.” అను భవభూతి వాక్యము నాకు చేయూత.

ఒక్కమాట! ఇట్టి వేళలో గజెటెడు ఉద్యోగము వచ్చునని, ఇన్ని నెలలకు కూతురు వివాహము జరుగునని, ముందుగా ఫలాదేశము చేయుట నా అభిమతము కాదు. దైవమునకు ఎంత బలముండినా, పురుషకారపు సాహాయ్యము లేనిదే ఫలకారి కాబోదని శాస్త్రకారులు మొరపెట్టుచుండగా, పురుషకారమునకు విలువ చూపని అట్టి భావిఫలాదేశమునకు ఏపాటి విలువగలదో చదువరులు ఆలోచింతురు గాక. ఇట్టి ఫలములు చెప్పుట చాలవరకు ముఖప్రీతికొరకే అనుట తప్పు కాదు. ఇట్టి కాలములో వివాహము జరుపుట దాంపత్యజీవితమునకు శ్రేయస్సని, ఉద్యోగాభివృద్ధికి ఇట్టికాలములో ప్రయత్నించుట ఫలదాయకమని, చెప్పుట మాత్రమే శాస్త్ర సమ్మతము, ఉపయోగకరము అగు పద్ధతి అని నా మనవి. అనేక సందర్భములలో ఆశించినవారికి, తోచినంతలో,

అట్టి సలహా లిచ్చియుంటిని కూడ. నా వ్యాసములను శ్రద్ధతో కటాక్షించిన చదువరులలో కొందరయినా ఇది గమనించియుండక పోరు.

పురుషకారమునకు ఏ కొంచెమయినా విలువకల దను భావము సహా దైవము, అనగా గ్రహచారము, కల్పించిన మాయయే అని తలంచువారుండిరని, అట్టి 'మాయాతీత స్వరూపు' లకు సమాధానము చెప్పుట సామాన్య జనులకు సాధ్యముకాని పని. వారి దృష్టిలో భావము, భావించువాడు, భావించబడు పదార్థము, అన్నియు మాయయే—తాము తప్ప!

అది యట్లుండనిండు. ఆశ్చర్యకరమగు అనుభవములు గల పడుచుజాతక మొకటి ఉదాహరింతును. శాస్త్ర సూత్రము లెట్లు అనుకుచున్నవో, చిత్తగింతురు గాక.

కొన్ని సంవత్సరములకు పూర్వము నేనొక నగరమునకు పోయియుండి, అచటి నా ఆప్త బంధు వర్గమునకు చేరిన ఒకానొక శ్రీమంతుని ఇంటిలో విడిసియుంటిని.

ఒకనాడు ఏదో ప్రస్తావవశమున ఆమె ఇట్లు ప్రశ్నించెను.

"మానభంగమునకు వెరచి ఆర్తురాలగు నొక పడుచు పారివచ్చి రక్షించమని నన్నాశ్రయించినది. ఈ గొడవ మనకేల వదలుమని నా భర్తగారు నాకు ఆజ్ఞ ఇచ్చినారు. అపుడు నా కర్తవ్యమేమి?"

"ఇది చాలా చిక్కు సమస్య. రెండును గొప్ప ధర్మములే. వివరములు పూర్తిగా తెలియక అభిప్రాయ మీయరాదు." అంటిని.

"అయితే కథ పూర్తిగా చెప్పమంటారా?" అని ఆమె అడిగినది.

"నీ ఇష్టము" అని ప్రతి ఇచ్చితిని. ఆ సువాసిని తెలిపిన కథ సారాంశ మిది.

ఏడాదిక్రింద నొకనాడు ఉదయము తొమ్మిది గంటలకు ఆమె భర్త స్నానపానాదులు ముగించి వాడుకచొప్పున కార్య స్థానమునకు వెళ్ళినాడు. సాయంకాలమునకే అత డింటికి రాగల్గుట. తెల్లవారు జామున లేచి, స్నానముచేసి, వంట వార్పులు సవరించుట, ఏడుగంటలకు పారాయణ పూజా సామగ్రిని భర్తకొదిగించుట, ఎనిమిది గంటలకు అతని భోజనాది సదుపాయములు సమకూర్చుట, అతడు కార్య స్థానమునకు వెళ్ళిన తరువాత నెమ్మదిగా కూర్చుండి స్తోత్ర పాఠములతో, మంత్రజపాదులతో, కొంత కాలము గడపుట, భోజనానంతరము ఏ పురాణమో, పుణ్యకథయో చదువుకొనుచు కాలయాపనము చేయుట, ఆమె దైనిక కార్యక్రమము. ఆమె సంస్కారము గొప్పది. మూడు నాలుగు భాషలలో సరసముగా సయుక్తికముగా నిర్గళముగా ఆమె మాటలాడగలదు. మధ్యాహ్నకాలమున చుట్టుపట్టిండ్ల కుటుంబినులు తమ సమస్యలను ఆమెకు చెప్పి ఆమె సలహా తీసుకొనెడివారు. వారిఅభిప్రాయములో ప్రవర్తనమో, నైతికముగా ధార్మికముగా క్రమము తప్పినదని తోచెనేని, నిశ్శంకముగా ఖండించి వారికి బుద్ధిచెప్పి పంపుటకు ఆమె వెనతీయునది కాదు. ఇరుగుపొరుగు వారికి ఆమెయందు ఎంతో గౌరవభావము.

1956 వ సంవత్సరము ఫిబ్రవరి నెల 20 వ తేదీ అది. రమారమి ఉదయము పదిగంటల వేళ విరామముగా కూర్చుండి ఏదో స్తోత్రము నామె పఠించుచుండెను. అపుడు తెరమూసిన తలవాకిలి తలుపులను దబాలున తెరచుకొని ఒక పదునాలుగేండ్ల పడుచు చెంబొకటి చేతపట్టుకొని, అపరిమితమైన ఆత్రముతో లోపల ప్రవేశించి వెంటనే తలుపులుమూసి గొళ్ళెము తగిలించగా, ఆమె ఏకాగ్రతకు భంగమయినది. తీవ్రముగా రొజుచు, చేతులు కాళ్లు వణకుచుండగా తలుపుల కానుకొని నిలిచియున్న ఆ పడుచును చూచి రమ్మని పిలుచుచు విషయమేమని ఆమె ప్రశ్నించినది. బాష్ప పూరిత నేత్రములతో నోటిమాట వెలువడక గడగడ వణకుచున్న ఆ చిన్నదానిని ఆమె సమీపించి దయతో ఆశ్వాసించి భయములేదని వీపు తట్టి ధైర్యము చెప్పి, నమ్మకము కలిగించిన కొంతసేపటికి పులుకు పులుకుమని చూచుచు, "బాబ! బాబ! చంపుటకు సిద్ధము! దిక్కు లేదు. పారివచ్చినాను. బావినో, చెరువునో, చూచు కొంటాను. అంతవరకు కాపాడమ్మా!" అని [illegible] బావురుమని వాపోయినది.

ఆసీమంతినికి ఆపడుచు దూరపుబంధువు; చిన్న తనమందే తండ్రిని కోలుపోయిన అభాగ్యురాలు. పోషించుశక్తికాని, ఆర్థికవసతికాని లేనిది తల్లి. బంధువుల ఇండ్లలో నానాకష్టము లనుభవించుచుండి, తన అక్కయింట కొన్ని దినములు కడపుటకై వారము దినములక్రిందటనే ఆనగరమునకు వచ్చియుండుట! అక్క గర్భిణి. అందులో తొలిచూలు. ఆరోగ్యము, వసతిసహా మట్టమే. ఇతరు లెవరు కాని సహాయము లేరు.

భర్త నిర్దయుడు. అతని ఉద్యోగము, అతని ఆర్జనము, అతని రాసక్రీడా విహారములు తప్ప భార్యయొక్క యోగక్షేమములు విచారించుటకు అతనికి ప్రొద్దుచాలదు. ఏనాడైనా, కొంతకాల మతనికి ఇంటిలో కాలు నిలిచెనో, ఏదో సాకుతో ఆనాడు భార్యకు దేహశుద్ధి తప్పదు. ఇట్టి పరిస్థితులలో కొన్ని దినములు సహాయముగా అయినా ఉండునని, అక్క రమ్మని వ్రాయగా వచ్చియుండినది మనపడుచు, కథానాయిక.

అయిదారు దినముల క్రిందట ఒక మధ్యాహ్నమున అక్కచెల్లెండ్రిరువురు ఇంటికి రాగా, బంధుమిత్రాదులు చెప్పుకొని ఆ ఇల్లాలు పోయిగా వారితో ఒకగంట ప్రొద్దు కడిపినది. ఆ సందర్భములో నే తన భర్తగారి ప్రతాపమును, ధార్ష్ట్యమును, విలాస విహారములను మన కథానాయిక పోసరి విడమించి చెప్పినదట. ముంజేతి మీద అగుపడిన 'వాత' ఏమని ప్రశ్నించగా, భర్తగారి పరాక్రమ ప్రభావపు గుర్తని చెప్పి, ఆమె తనపరిస్థితులంతయు అగ్రహిణికి ఎరిగింపవలసి వచ్చినది. కన్నులు నీరుంచి ధైర్యమును ప్రకటించు ముఖమున రాని చిరునవ్వును ఎట్లో తెచ్చుకొని ఆ మాటలు తన గృహచ్ఛిద్రములను వర్ణించగా, జాలిగుండెగల ఆ గృహిణి సానుభూతితో ఆమెను ఓరడించి, తరుణోచితముగా అక్కచెల్లెండ్రకు కొంత హితోపదేశము చేసి, పంపినది. కథానాయకురాలిని రెండవపారిగా ఆమె చూచుట ఆనాడే.

ఇట్టి పరిస్థితులలో ప్రశంసాదినమున కథానాయకురాలు పారివచ్చి దాచుకొనుట, భయముతో పరుగున తన్ను రక్షించుమనుట కాక తన్ను చంపువనుట! ఏదో ప్రమాదకరమైన సన్నివేశము వచ్చియుండును గాని, ఆ ఇల్లాలు ఆ పడుచుకు అభయమిచ్చి, సమ్మతము కలిగించి జరిగిన సందర్భములను మెల్లమెల్లగా ఆమెతో తెలుసుకో గలిగెను. భయముతో, సిగ్గుతో, అవమానముతో, కథానాయకురాలు చెప్పలేక చెప్పలేక, తుదకు చెప్పినదట. రెండు దినములుగా ఆమెను తనకు స్వాధీనము చేయుమని భావ అక్కను చాలా తొందర పెట్టి బాధించినాడు. వయస్సుకు మించి అభివృద్ధినొందిన జవ్వనముతో మిసమిసలాడు అంగసౌష్ఠవముతో నొప్పుచున్న ఆమెను చూచి ఆ పసప్రాయునికి కన్నులు కుట్టినవి. పెట్టిన బాధలన్నియు సహించి ధైర్యశాలిని, అక్క అతని కోరకను నిరాకరించి ప్రయాసతో చెల్లిని రక్షించినది. కాని ఆదినము ఉదయమునుండి ఏమి కంపకారమో, అక్కను నానావిధములుగా తిట్టి, కొట్టి, హింసించగా పాప మాగర్భిణి తాళలేకపడిపోయినదట! తరువాత కథానాయకురాలిని కుక్షిటవృత్తితో ఆక్రమించ ప్రయత్నములో నున్న దుర్వినీతునకు రాగ ఉద్దేశము గ్రహించి, శీలభంగమునకు వెరచి, తెగువచేసి, బహి[illegible]పమున తాళముచేతపట్టుకొని ఇల్లు వెడలి, పరుగున పారివచ్చి ఆ పడుచు బంధుగృహమున తల దాచుకొన్నది. ఆమె కొవగరము కొత్త. అదటిభావ రాదు. ఇంకేమి చేయగలదు! ఇట్టి సన్నివేశములో ఇంత మాత్రము సాహసమైనా, ఆ వయస్సు పడుచులలో ఎందరు చేయగలరు?

"బావకు అప్పగించవద్దమ్మా." అని కన్నుల ధారతో ఆ కథానాయకురాలు ప్రార్థించినప్పుడు, ఎంత రాతిగుండెయైన అయినా, కరిగిపోకమానదు. ఆ ముగ్ధ ధైర్యసాహసములకు సంతోషించి, అగృహిణీ, "మీబావ వచ్చినా, దేవేంద్రుడు వచ్చినా రక్షింతును. భయపడకుము." అని ధైర్యము చెప్పి, ఓరడించి, సమాధానపరచి, అన్నపానము లిచ్చి ఇంటిలో దాచినది.

అనుకున్నట్లే, ఆ కుంక మధ్యాహ్నకాలమునకు వచ్చి 'దబదబ' తలుపు తట్టినాడు. కథానాయకురాలిని ఇంటిలో దాచి తలవాకిలి తలుపు కొంచెముగా తెరచి వెలికివచ్చి తలుపులు బిగించి బీగముచేసి నిలచి, అతనిని చురచుర చూచుచు, "ఏమి పని?" అని ఆ ధీర మానిని ప్రశ్నించినది. తన మరదలు తప్పించుకొని వచ్చి ఇచట దాగుకున్నందున వెదకుచు వచ్చినట్లు చెప్పి, ఆ పడుచును తనవెంట పంపివేయవలెనని, సిగ్గు, బిడియములు లేక ఆ నీచుడు కోరినాడు. పైగా పరుల పిల్లనిట్లు దాచుట నీతికాదని వాదించినాడు కూడా. "కామాతురాణాం నభయం, నలజ్జా." అను పెద్దల మాట మాటకి సారువంతులు అతనిపట్ల సార్థకమయినది.

"ఆ పడుచు భయపడి పారివచ్చినది. ఆమెను నీ స్వాధీనము చేయను. పొమ్ము, మర్యాదగా వెళ్ళకపోతే, తగినవారిని పిలిచి గెంటించి వైతును." అని ఆమె కసరినది.

చేయునది లేక అతడు, "నీ భర్తకు చెప్పి పిలుచుకొని వత్తును, తాళుము." అని బెదరించుచు బిర బిర వెళ్ళిపోయినాడు.

"వివేకభ్రష్టానాం భవతి వినిపాత శ్శతముఖః." అనురీతి, ఎంతైనయినా తెగినబంటే అతను. భర్తగారితో తాను మాటలాడుటకు పూర్వమే, అతడు కార్యస్థానమునకే పోయి, ఉన్నవి, లేనివి, నాలుగు చాడీలు చెప్పినచో, అమాయక సాధుశీలుడగు భర్త ఆ మాటలను నమ్మి ఇంటికివచ్చి ఏమి ఆజ్ఞాపించునో, అని ఆ వివేకవతి తలచి, వెంటనే సమీపమందున్న తనకు విశ్వాసపాత్రురాలగు అన్యజాతి కుటుంబిని ఇంటికి పోయి విషయముల నెరిగించి, ఆమె యింటిలో కథా నాయకురాలిని దాచివచ్చినది. సాయంకాలము అయిదు గంటలకు ఆ మూర్ఖుడు వెంటరాగా, ఆమె భర్త పరాపరి ఇంటికి వచ్చి. ముఖము చిట్లించుకొని కోపముతో. "ఈగోడవతో నీకేమిపని? అవివేకము! ఆ చిన్నదానిని ఇతని వెంట పంపివేయుము' అని భార్యను దండించినాడు.

ఆ చిన్నది వచ్చియుండినది వాస్తవమే అనియు, ఉపవాసముతో నున్నందున అన్నము పెట్టగా భుజించి వెళ్ళిపోయినదనియు, తరువాతి కథ తనకు తెలియదనియు, నెమ్మదిగా తొట్రుపాటులేక, భయపడక, ఆమె ప్రతి చెప్పినది. ఇంటిలో దాగియున్నదేమో అని వెతికిచూచి, ఫలము లేనందున కోపముతో శపించుచు ఆ దుష్టుడు వెళ్ళిపోయినాడు. తరువాత ఆ రాత్రి తొమ్మిది గంటలకు ఆ నగరమునకే దూరముగా కాపురమున్న తన సోదరునికి రహస్యముగా వార్తనంపి పిలిపించి, కథ నెరిగించి, జోరున కురియు వర్షములో, ఆ పడుచును అతనివెంట పంపి, మరుదినము తగిన రక్షణతో ఆమెను ఆమె మాతామహ స్థానమును చేర్చుదాక ఆ సుమంగలి నిద్రపోయినదికాదు. కాలక్రమమున తన భర్తకు విషయ మంతయు సవిస్తరముగా నచ్చచెప్పి, అసత్యమాడినందుకు క్షమింపుడని ఆ ధర్మశీల అతనిని వేడుకొన్నదట!

సావధానముగా విని, ఆమె సాధుశీలమునకు, ధైర్యమునకు, సమయస్ఫూర్తికి, ఎంతో ఆనంద పడితని. ఆమె భర్త పుణ్యాత్ముడనుకొంటెని.

"గొప్ప సుకృతము చేసినావమ్మ! అసత్యమాడుట దోషమే. కాని, శరణాగత రక్షణమునకై అట్లు చేసితివి. మహత్తర కార్యమునకై చేసిన ఈ అల్పదోషము గమనించదగినది కాదు. ఇట్టిదే ధర్మసూక్ష్మమందురు పెద్దలు." అంటిని.

ఇట్టి అనుభవము వచ్చుటకు కథానాయకురాలి జాతకములో ఏ విశేషమున్నదో, పరిశీలించుటకు నేను కుతూహలము చూపగా, ఆ జాతక సామగ్రి నామె తెప్పించి ఇచ్చెను.

ఆ జాతకమునకు నిరయన చక్ర మిది:—

ర 8-34		శ 1-36 చ 16-2 కు 16-11 గు 21-36	
కే 19-32 బు 15-8	(నిరయన)		
శు 24-32 ల 1-10	జాతక చక్రము		రా 19-32
		X 0-10	

జన్మనక్షత్రము రోహిణి. జన్మకాలచంద్ర దశా శేషము (జ్యోతిర్గణితపు అయనాంశలతో) 5 సం॥ 5 నెలలు, 21 దినములు. రాహు మహాదశలో రాహ్వంతరములో ఈ క్లేశము వచ్చుట.

ఈ చక్రములో ముఖ్యమయినది చంద్రమంగళ యోగము. దీనిచే ధైర్యసాహసములతో ప్రవర్తించు స్వభావము వచ్చినదనవచ్చును. ఇది సప్తమ లాభాధిపతుల సంయోగమగుటచే, భర్తృ సంపాదన విషయమున పనికివచ్చుగాక. లాభభావము జ్యేష్ఠసోదరిని తెలుపునది. దానినుండి సప్తమభావము (అనగా, పంచమస్థానమునట) ఆమె భర్తను (బావను) తెలుపును. అట్టి పంచమభావాధిపతి శుక్రుడు (బావ) కుటుంబస్థానమందుండి, చంద్ర కుజులకు త్రికోణమగుటచే, ఈ యోగము జాతకురాలు బావగారికి సులభముగా లోబడుటకు తగియుండు నేమోకాని, అతనితో ద్వేషము సంపాదించుకొనుటకు తగనిదనుకొందును. నా ఊహ అసంగతమయినచో, చదువరులు క్షమింతురు. అది యట్లుండ, రాహు మహాదశలో, రాహు భుక్తిలోనే యీ కథ జరుగనేల? అయనాంశలను

మార్చి వేరు భుక్తులను సాధించవచ్చునన్నచో, అది వేరు మాట.

ఇక, సాయన జాతక మేమనుచున్నదో, చూతము. ఆ చక్రమిదే:—

శ 12 34 బు 8-10	ర 1-36 పుణ్య 1-40	శ 24-38 (వ) 27-18	చ 9-4 కు 9-13 గు 14-38
కు 17-36	(సాయనము) — కథానాయకురాలి స్పష్ట జాతకకుండలి		దాంపత్య 0-48 భర్త 24-3
I 24-12			య 3-36
	X 3-12		రా 12-34 ఇ 28 25(వ)

ఇచట సయితము చంద్రమంగళయోగ మున్నది. కాని, ఆధిపత్యములు మారుటచే, అర్థము భేదమగును. పంచమ భావాధిపతి (బావ) బుధుడు ఆ కుజ చంద్ర సంయోగమునకు నిండు కేంద్రవేధలో నుండి దుష్టుడైనాడు. బావగారి చేష్టలు జాతకురాలి మనస్సునకు (చంద్రునికి) నచ్చక, ఆమె సాహసము చేసినదనియు (కుజుడు దశమాధిపతి), లాభాధిపతి బృహస్పతి (జ్యేష్ఠ సోదరి) ఆ కుజచంద్రుల సమీపమునందుండి దుష్ఫలము రానీయక రక్షించినాడనియు, ధర్మస్థానాధిపతియగు శుక్రునిపై ఆ గురువు శుభదృష్టితో నుండు కారణమున శీలభంగము కలుగకుండ ధర్మమును రక్షించినాడనియు, సమన్వయము చేయుట హృదయంగమముగా నుండునని నా భావము. సహృదయులే ప్రమాణము.

విశేషమేమనగా జాతకురాలిని కాపాడిన సాధ్వీమతల్లి మీనలగ్నములో బృహస్పతి యాజమాన్యమున జనించిన వ్యక్తి అనియు, ఆమె శుక్రుని శుభదృష్టి జాతకురాలి లగ్నమునకు, లగ్నాధిపతికి సహా నిండుగా కలదనియు, ఆమె లగ్నాధిపతి బృహస్పతి శుభదృష్టి కథానాయకురాలి కుజచంద్రసంయోగముపై నున్నదనియు, పాఠకమహాశయులు విన్నచో అన్యోన్య గ్రహయోగముల ఫలమున కానందించగలరు. అది యట్లుండె.

ఈ జాతకమందలి ఒకటి రెండు విశేషములను మాత్రము గమనించెదము.

మకరలగ్నములో లగ్నాధిపతి శనితో నిండు త్రికోణదృష్టితో సౌకర్యయుక్తమగు భాగలో పుట్టిన జాతకురాలు శాంత స్వభావము, జాగరూకత, దూరదృష్టి, కార్యనిర్వాహకశక్తి, కలదగుట వింత కాదు. అవకాశము ననుసరించి, సంతోషమునైనా, దుఃఖమునైనా, తులమున్కలుగా చూపునట్టి చిత్తవృత్తిని కుజచంద్ర సంయోగము సూచించగలదు. ప్రేమ సహనము యు ఆ గ్రహద్వయమున కెదురుగా నిలిచినది. ప్రేమకలిగిన చోట ఎంత త్యాగమునకు కాని, సాహసమునకు కాని, ఆమె వెనుతీయదు. భర్తృసహాయము నికరముగా భర్తృభావమందే నిలిచి లగ్నాధిపతితో అర్థకోణ శుభదృష్టిలో నున్నది. చేపట్టగల భర్తపై భక్తి తాత్పర్యములకు కొదవయుండదు. శుక్రునిపై ప్రేమసహాయమునైన సహోదక్కని గురుదృష్టియున్నది. కథానాయకురాలు బావగారి బయకారి మాయలకులో బడి శీలమును చెరచుకో గలదా? అట్టి పరిస్థితికి లగ్న సప్తములపై మిత్రదృష్టి గల శని అవకాశమిచ్చువాడు కాడు. వలసిన ధైర్యమును కూడింటి ఉద్బరవి ఈయగలడు. విక్రమస్థానాధిపతి కుజుని సంయోగముచే చంద్రుడు ఉద్భాసించుట! శీలరక్షణమునకై ఆమె ఎంత సాహసమయినా చేయగలుగును కదా? అపత్కాలములో సాహసము చూపి ఆమె శీలము దక్కించుకో గలిగెను. ధన్యురాలు.

పుణ్యురాలు అని, అప్పటి దశా యోగములు కామ పరవశిత ప్రేరేపించునట్టివి కావు. చెరమాన దశలో (చలిత జాతకమున) లగ్నమునకు, శుక్రునికి, సహాయములకు, కన్యకాత్వమునకు భంగము సూచించు యోగములు రాలేదు. దాంపత్యసహాయమునకు చలిత బుధుడు కేంద్రస్థితికి వచ్చుటచే, దాంపత్యధర్మ సంపాదన మప్పుడామెకు రుచించినది కాదు. కావుననే, గాంధర్వ వివాహమునకో, రాక్షస వివాహమునకో అవకాశము లభించలేదు. జ్యేష్ఠ సోదరీ భర్తను సూచించు సహాయము పెంక్కటి కుంభములో (29°—9') వశాంశ కేంద్రవేధలో నున్నది. గురదృష్టవశమున చలితశుక్రుడు నాకాలమున ఆ సహాయమును చేరుకొనుటచే, అవకాశము లభించెనని దురాశ్యమోహ పరవశుడైన బావ,

"భళిరా! శేరకు శేంజిక్కె
నిపుడీ బంగారుకొండంచు,
చంకలు తాటించుచు"

పై బడ నుద్యమించినాడు. కాని, పుణ్య సహాయమువుకు కుజుని అర్ధకోణ మైత్రి నార్జించి, తగిన ధైర్య సాహసముల నిచ్చి రక్షించినది. కుజుడు తృతీయ దశాధిపతి కదా?

ఇది ఇట్లుంచి, ప్రశంసాదినమున 9-45 A. M. (IST) కాలములో, అవగరమున గ్రహస్థితి చూడుడు.

	కు 7-8	కే 27-19	
I 6-0	(సాయనము)		
బు 17-16	కథానాయకురాలు సాహసించిన కాలము	చ 1-17 వ 6-22 (వ)	
ర 28-16 శ 8-4 కు 0-30	ఇ 2-3 X 17-30 రా 27-19	గు 0-39	య 0-20

మాయావి ఇంద్రుని కేంద్రవేధలో నున్న చంద్రుడు ద్రోహమును, మోసమును, సూచించు కథకు తగియున్నాడు. యముని కేంద్ర విషదృష్టిని దాటి, శుభగ్రహముగు బృహస్పతి అర్ధకోణదృష్టి నార్జించుటచే రక్షై శుక్రుడు పరుగెత్తుచుండుట నాటి కథాసంవిధానములో అచ్చుమెచ్చుగా అతుకుచున్నది కదా! వరుణుని సమసప్తక దృష్టితో దెబ్బతినుచున్న తాత్కాలికలగ్నమును చూడుడు. బలాత్కార శీలభంగమునకు వెరచి జాతకురాలు భావ ఇల్లు వెడలి పారి వచ్చుట కిది తగియుండలేదా? వరుణగ్రహమునకు ఫలము లేదనువా రిది గమనింతురు గాక.

సర్వజనసామాన్యమయిన ఈ యోగసముదాయము కథానాయకురాలి జీవితమందు మాత్రము ఫలమును చూప నేల? అనవచ్చును. ఆమె జాతకములో ఈ చక్రమును పోల్చి చూడని దే ప్రతి చెప్పలేముకదా?

ఆ క్షణమందు లగ్నమునకు వరుణుడు నేరుగా ఎదుట నిలిచియుండుట సర్వజనసామాన్యమైన యోగమే. కాని, జన్మలగ్నమునకు, జన్మ శుక్రునికిని, పరివర్తనము ఆ తాత్కాలికలగ్నము నిలుచుటయాత్రము కథా నాయకురాలికే చెందినదని కనుగొంటిమేని, మన ప్రశ్నకు సమాధానము లభించగలదు. ఆమె జనించిన దినమందే, అదే లగ్నభాగలోనే, జనించిన వ్యక్తికి తప్ప ఇతరులకు, ఆనాడు, అట్టి అనుభవము వచ్చుటకు కారణములేదు. ఇదే వృష లగ్నముయొక్క విశిష్టత. కాక, అఘటనఘటనా ధురంధరులు ఇంద్రా వరుణులు! జన్మకాలమున అన్యోన్య మిత్రదృష్టి కల ఆ గ్రహములు లగ్నాధిపతి యగు శనికి లోడు. ఇట్టి సందర్భములలో, ప్రశంసా దినమున ఆమె దైనిక దశమ కేంద్రము (కర్కాటములో 28° వ భాగ) ఆమె ఇంద్రావరుణుల పరిమన్యమందే నిలిచియుండెనని చదువరులు గ్రహించిరేని "వహవ్వా!" యని శిరఃకంపనము చేయక మానరు. మోహాంధుడగు భావ కను,త్రాపి, యుక్తితో ఆ ముక్కుపచ్చలారని ముగ్ధబాలిక తప్పించుకుని పారిపచ్చి తనకు రానున్న ప్రమాదమును తప్పించుకొనగల్గుట ఆ గ్రహముల శక్తిని సంపాదించుకున్న దైనిక దశను కేంద్రపు (ఆమె పురుష కారపు) ఫలము. ఇంద్రావరుణులకు జాతకములలో ఫలము లేదనువారు ఆనాటి విచిత్ర సంఘటనమునకు కారణాంతరము నేమి సూచించగలరో, ఊహించలేకున్నాను. పోనిత్తు. ఆమె రవితో, పుణ్యసహామముతో, తాత్కాలిక చంద్ర శుక్రులకు కల త్రికోణ శుభదృష్టి ఆమె సుకృతఫలము. మేషరాశిలో 7° వ భాగకు 'చావు బతుకుల' భాగయని పాశ్చాత్య శాస్త్రవేత్తలు నామకరణము చేసినారు. మన ప్రాచీనులు సహా దానిని దుష్టభాగయనియే భావించిరని లోగడ మనవి చేసియున్నానుకదా? కథానాయకురాలి దశమాధిపతి కుజుడు ప్రశంసాదినమందు ఆ భాగయందే నిలచి వరుణుని కోణదృష్టి నందుకొన్నాడుకదా? మానరక్షణము కొరకు దేహత్యాగమునకైనా సిద్ధపడిన ఆపదుచు మన స్తత్వమును ఈ కుజుడు ఎంత స్పష్టముగా చూపుచున్నాడో ఆలోచించిమాడుడు. "బావను" తప్పించుకొనుటకు "బావిని" చూచుకొందునని ఆమె అన్నది కదా?

ఈ జాతకములోని చంద్ర మంగళ యోగములో అసాధారణమైన విశేష మొక్కటి కలదు. రోహిణీ

నక్షత్రమునకు 13° భాగలు, 20' కలల ప్రదేశము. దానిలోని 'యోగతార' సాయనమిథునములో 9°—వ భాగలో నున్నది. పాశ్చాత్యులు దీనిని 'Aldebaran' అందురు. కుజ స్వభావముకల ప్రకాశవంతమగు తార ఇది. ఈ తారపైననే మన కథానాయకురాలి చంద్ర కుజు లుండుట. ఈ రోహిణీయోగతారకు నేరుగా సమసప్తస్థితిలో (సాయన ధనుస్సులో 9° భాగ) ఒక క్రూరతారకలదు (Antares). ఇది జ్యేష్ఠానక్షత్ర ప్రదేశములోని యోగతార. ఇది కుజునికి శత్రువను భావము (Anti-Ares) దీనికి పాశ్చాత్యులు పెట్టిన పేరులో నున్నది. రోహిణీ యోగతారలో చంద్ర కుజు లున్నప్పుడు జ్యేష్ఠాయోగతారలో శనియుండె నేని, అపమృత్యువో, బలవన్మరణమో, సూచింప బడునని పాశ్చాత్యులు చెప్పిరి. కథానాయకురాలికి జన్మకాలములో ఈ దుష్టయోగము లేదుకదా ? కాని ప్రశ్నాదినమున చారములో శని ఆ జ్యేష్ఠాయోగతార నంటుటచే, ఆనాటి పరిస్థితులవలన ఆత్మహత్యా ప్రయత్నపుమాటలు పుట్టినవి ! దైవచిత్రము !

మరియొక్క విశేషము. రోహిణిలో కుజ సంయోగము మహాదుష్టమని మన ప్రాచీన మహర్షులు ఎన్ని వేలేండ్లకు పూర్వమో కనుగొన్నారు. లంకా పట్టణములో అశోకవనమున క్రూరలగు రాక్షసస్త్రీల మధ్యమందు కూర్చుండి పతివియోగదుఃఖమున ఖిన్నురాలగు సీతాదేవిని, కుజునితో పీడింపబడిన రోహిణితో పోల్చినాడు మహాకవి వాల్మీకి !

"గ్రహేణాంగారకేణైవ,
పీడితా మివ రోహిణీం."

అని. ఇట్టి కుజుడే జాతకమున దశమ (జనక) భావాధిపతి. ఆమెతండ్రి మహాపరాక్రమశాలి. విద్యావంతుడే కాని, మూర్ఖుడు; సమర్థుడే కాని, దుష్టుడు. అతడు పడనిపాటులు, చెడనిచేటులు, లేవట! కడకు ఏ దుర్వ్యసనమోహ పరిణామపు ఫలముగనో, విషముత్రాగి, నడి వయస్సునే, ఆత్మహత్య పాలయినాడతడు !

కథానాయకురాలికి చలితశుక్రుడు జన్మశని కేంద్రమునకు వచ్చినకాలమది. అప్పుడే పితృకారకుడు రవి చలితశనితో అర్ధకేంద్రమునకు వచ్చుట. మరియు, చలితదశమము (తండ్రి) ఇంద్రుని విషమదృష్టి పాలగుట సయితము అప్పుడే.

ఇట్టి క్రూరదశలో, దైనిక చతుర్థకేంద్రమునకు శుక్రుడు వచ్చిన దినమందే, ఆమె తండ్రి దుర్మరణము పాలగుట ! కేంద్రమునకు శుక్రుడువచ్చి ఏమిచేసినా డని విమర్శింపదుమా దలచుకొంటిమా ? తొమ్మిదేండ్ల పసి బాలిక ఏమిచేయగలదు ? అనాథ అయిన తల్లిని కట్టుకొని "అమ్మా" అని ఏడ్చినది.

ఇచ్చటనే మరియొక్క ప్రశ్న పుట్టుట కవకాశముకలదు. స్త్రీ జాతకమున దశమకేంద్రము భర్త తల్లిని (అత్తగారిని) సహా సూచింపగలదు కదా ? కుజుని ప్రభావము అత్తగారు సయితము రుచి చూడవలదా? వాస్తవమే. కాని పెండ్లి కానిదే అత్తగారిమాటపుట్టనే పుట్టదుకదా? కథానాయకురాలి వివాహమునకు వేచి, తిరువాతి కథ చూతము.

ఆమె వివాహము 12-7-1958 వ తేదీన. 9-30 ఉదయము (ఐ ఎస్ టి) వేళలో జరిగెనట. ఆ ముహూర్తపు గ్రహస్థితి ఇది.

	కు 24-7 కే 27-11	చ 24-0	X 9-0 గు 18-0
	(సాయనము) — వివాహముహూర్తము —		ర 19-17
			శు 10-33 బు 11-54
శ 20-27	ఇ 2-0 (వ)	కు 22-33 రా 27-11	I 8-30

ఈ ముహూర్త చక్రపు విశేషము లివి :—

(i) ఆషాఢ మాసములో కృష్ణపక్ష త్రయోదశి తిథి; శనివారము; కృత్తికానక్షత్రము.

పంచాంగశుద్ధి ఎంత రమ్యముగా నున్నదో, వ్యాఖ్యాన మనవసరము. శాస్త్రోక్తము లగ్నములో శుభగ్రహమయినా లేదు. కన్యకు పరమమిత్ర తార అగుటచే, భయము లేదనుకొన్నారు కాబోలు ?

(ii) నాల్గింటనున్న శనికి సప్తమ పూర్ణ దృష్టిచే శుక్రుడు పోవుచున్నాడు. వైవాహిక జీవితసౌఖ్యము త్వరగా రానీయని యోగమిది.

పోతే, అత్తగారి విషయమున క్రౌర్యమునో, శాఠ్యమునో, ఈ గ్రహస్థితి సూచించగలదు కూడ.

(iii) లగ్న దశమాధిపతి బుధునికి వ్యయభావములో కరుణ సంయోగము. "వ్యయగో, వ్యయకారకః." అనుటచే, ఏదో కష్టమును సూచించుచున్నది.

అత్తగారికో, కన్యకకో, ఆకస్మిక ప్రమాదము సూచితము.

(iv) ముహూర్త చంద్రునికి కన్యక జన్మశని సంయోగము. మనోవికాసము తగ్గసూచన ఇది.

ఇంతచాలును. "పడిపోవనున్న మిద్దెకు కోరికినదే పోటి." అను సామెతగా పెండ్లి పెద్దలకు లభించినది సుముహూర్తము. ఏనాడు కోరితే. ఆనాడే ముహూర్తము పెట్టు మహనీయులు ప్రబలిన కాలమిది.

పోనిత్తము. ఈ ముహూర్తమున అత్తగారు (దశమ కేంద్ర బిందువు) ఎచ్చట వేంచేసెనో చిత్తగింపుడు. వెదకికొని పోయి పోయి, కథానాయకురాలి జన్మకాలపు రోహిణీ—చంద్ర— కుజసంయోగస్థానమునందే సింహాసనము వేసుకొనవలయునా? వెనువెంటనే ఆ ఫలము రావలయునని సంకల్పమా?

అనురూపులగు కన్యావరులు అన్యోన్యముగా సమ్మతించినారు. బంధుజాలము వారి వివాహమును ఆమోదించినది. వివాహప్రయత్నములు తొందరగా జరుగుచున్నవి. కాని, వరునితల్లికి మాత్రము, ఏమి కారణమో, ఈ సంబంధము నచ్చలేదు. ఈ పెండ్లి జరగనే కూడదని ఆమె ఒకటే మొండిపట్టు పట్టెనట. ప్రతిక్షణమున నూతన వికాసము పొంగివచ్చుచున్న నవయౌవనము కల కథానాయకురాలి వంటి అందాలరాశిని చూచి మోహపరవశుడైన వరుడు ఆమెనే పెండ్లియాడవలెనని నిశ్చయించి, తల్లి వాక్యమును సాగకు చేయలేదు. "నా ప్రాణ ముండగా ఈ పెండ్లి జరుగనీయను," అన్న తల్లి మాటలు గుడ్డి బెదిరింపులని తలచినారు బంధువులు. కుమారుడామె కోరికను లక్ష్యపెట్టలేదు. అతిమత్తో ముహూర్తము నిర్ధరించబడినది. బంధుమిత్రులు సంప్రహృష్టి శోభాయమానముగా పెండ్లి జరిపినారు. వధూవరుల ఉత్సాహము అడుగపనిలేదు. మంగళవాద్యముల ఆర్భాటములో మంత్రపాఠముల ధోరణిలో, ముత్తయిదువల కలకలములలో కథానాయకురాలికి మూడుముళ్ళు పడినవి. అదే క్షణమందే పెండ్లి ఇంటిలో ఒక వైపున ఆకస్మికముగా హాహాకారములు బయలుదేరి హాల్లకల్లోలమయినది. తాళి కట్టిన క్షణమే ఆ ఇంటి ఒక మూల కూర్చుండియుండిన వరుని తల్లి తటాలున లేచిపోయి, సమీపమునున్న బావిలో రాయి కట్టుకొని దభాలున దూకినది! ముహూర్తపు వాగ్దానము వెంటనే చెల్లినది. కోడలి గృహప్రవేశమునకు, అత్తగారి అగ్నిప్రవేశమునకు సహో, ముహూర్తము ఒకటే నిర్ణయించబడినది కాబోలు! అంతటితో, అత్తగారి కథ సమాప్తి.

జాతకురాలి వైనిక లగ్నము జన్మవరుణునిపైన, వైనిక దశమము జన్మ శుక్రునిపైన ఉండిన దినమది, నచ్చిన వరునితో జరిగిన వివాహము, ఆకస్మిక విషమ సంఘటనము సూచించబడినవి.

రోహిణీ నక్షత్రమందలి చంద్రకుజసంయోగము కథానాయకురాలి జీవితమున పదునారు సంవత్సరముల వయస్సునకు ఇన్ని విధములుగా తన ప్రభావమును చూపినది. భావిఫలము దశల అధీనము. ఆ చర్చ ఇప్పుడనవసరము.

ఒకటే యోగము, సమయానుసారముగా, ఎన్ని విధముల ఫలమును సూచించగలదో, మనకీ దృష్టాంతము బోధించుచున్నది.

"కాలవిధిపరిపాకః, కేన వా లంఘనీయః."

(భర్తృహరి)

మహాకవి శివయ్యగారి స్వీయ చరిత్ర

శ్రీ యస్వీ జోగారావు

'వెలువడినది! ఇప్పుడే వెలువడినది!
అద్భుత ప్రశంస నందిన
అపూర్వ గ్రంధరాజము
మహాకవి శివయ్యగారి స్వీయచరిత్ర
వెల స్వల్పము! ఫల మధికము!
త్వరపడుడు! ఆలసించిన ఆశాభంగము!
ఆషాఢభూతి అండు కో
మూర్ మార్కెట్, మదరాసు.'

అని కొన్ని వార, దినపత్రికలలో ఒక ప్రకటన చూశాను. వెంటనే వెనక శివయ్యగారితో జంటకవిగా శతావధానాలు చేస్తూవుండిన ఆయన మేనమామ శతఘ్నంగారి కా ప్రకటన చూపించాను.

శివయ్యగారు మేష్టరీచేసి పింఛను పుచ్చుకున్నప్పటినుంచీ రాజధానిలో నే ముకాం పెట్టేశారు. చాలా రోజులాయి సాహిత్యసేవ మానేసినా అధికారిసేవ చేసుకుంటూ వెనకటి తమ పలుకుబడిని కాస్తా రూపాయణా పైసల్లోకి మార్చుకుంటున్నారు.

శతఘ్నంగారు హాయిగా స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. నేను వారి యింట్లోనే ఒక వాటాలో అద్దెకుంటున్నాను. ఆయనతో నిత్యం ఏదో సాహిత్యగోష్ఠితో సరదాగా కాలక్షేపం అవుతూ వుండేది.

ఆ ప్రకటన చూపించగానే 'ఇదా! ఎవడు పంపించాడో గాని అప్పుడే నాకొక కాపీకూడా వచ్చిందిలే. వీడి బతుక్కి స్వీయచరిత్ర కూడానా!' అన్నారు శతఘ్నంగారు.

'అదేమిటండీ అలాగంటారు?' అన్నాను విస్తుపోతూ.

'మా లోగిట్లో పుట్టి పెరిగాడు మా అబ్బిగాడి సంగతి నాకు తెలీదూ! వీరికీ వారికీ స్వీయచరిత్రలు రచించిపెట్టిన సచ్చరిత్రుడు వీడికి ఇంక అవొక్కటే తరవాయి!'

'పోనీ తన స్వీయచరిత్ర మరొకరిచేత వ్రాయించుకో లేదు గదండీ!'

'భేష్ మా దొడ్డమాటన్నావులే!'

'పోనీ ఉపోద్ఘాతమైనా చదివి చూదాం ఆ మహాకవి ఏమంటాడో!'

'మహాకవిట మహాకవి! అతి సామాన్యమైన ప్రతీ వస్తువూ ప్రియమైపోతున్న ఈ రోజుల్లో ఈ మాటొక్కటే కారుచవకై పోతోంది. ఇదో చిత్రమైన మాట! డిగ్రీకాదు, టైటిలుకాదు, ఒక పరీక్ష లేదు, దావారాదు తంటారాదు, దెసిపికొట్టదు - ఆంధ్రదేశంలో కవు లందరికీ అదో పర్ నేమైపోయింది! నేను గాని బరితెగించి మా చాకలిని మహాకవం టే నమ్మ కాదనేమొగాడెవడు? అసలు పట్టించుకునే దానెవడంట ఈరోజుల్లో? దానికి తోడు వాడిబంధువొకడు పెద్దపదవిలో గాని ఉంటే వెంటనే వాడికి తోడా పడిపోతుంది. పిసరైన మహాకవులు కూడా శిఫారసులు చేస్తారు-వుంటాయి కతికోటి బతుకు తెరువుల కనంతకోటి మొహమాటాలు! సామాన్యులు పకోసరి ఉసుకొమంటే చెక్క భజన చేసేస్తారు.'

'పోనీ యింతకీ ఆయన మతల బేమిటో ఓసారి ఉపోద్ఘాతం చదివితే పోయిం దేముందండీ?'

'సరే నువ్వు చదువు నేను వింటుంటాను' అని సెలవిచ్చారు శతఘ్నంగారు.

ఉపక్రమించాను.

ఇక మీదటి పాదాపంక్తులు శివయ్యగారి స్వీయచరిత్ర ఉపోద్ఘాతంలోనివి.

మధ్య మధ్య శతఘ్నంగారి వ్యాఖ్యానప్రాయములైన మహావాక్యాలు:

"ఆ ప్రసాదరులారా! ఆంధ్రమహాజనులారా! ఇది మీలో ఒకడిని, మీ వాడిని అయిన నా స్వీయచరిత్ర–

'అబ్బో గమ్మత్తుగా నే ఎత్తుకున్నాడు ఎత్తుగడ!'

ఇది నా చరిత్రే అయినా కేవలం మీ కోసం రాస్తున్నానంటే నమ్మండి—

'పైగా ఇదో హాటూ!'

అసలు నాకు స్వీయచరిత్ర వ్రాసుకోవాలని సుతరామూ ఇష్టం లేదు. అయితే జగత్కల్యాణకాంక్షులైన మిత్రులెందరో బలవంతపెడితే వాళ్ళ నిర్బంధ ప్రేమానికి తట్టుకోలేక వ్రాయడానికి పూనుకుంటున్నాను.

'అబ్బా! నిజానికి వీడి నెవడూ అడిగివుండడు. బలవంత పెట్టేరుట బలవంతం! ఎంత గడుసు ధిషణ! అసలు స్వీయచరిత్ర వ్రాసుకునే చాలామందివరస యిలాగే కనిపిస్తుంది.'

ఆంధ్రదేశంలో బహుశా నన్నెరగనివా రుండరనుకుంటాను—

'ఏం వచ్చాలురా బాబూ! రెండుకోట్ల తొంభై తొమ్మిదిలక్షల తొంభైతొమ్మిది వేల తొమ్మిదివందల

పైచిలుకున్నారు వీడి పేరెరగనివాళ్ళు. ఆ మధ్య మా పెద్దబ్బాయి రాజధానిలో సరాసరి వీళ్ళింటికే వెళ్ళి పక్కవాటాలో వున్నవాళ్ళని శివయ్య పేరుచెప్పి వాకబు చేస్తే అలాంటి పేరుగల ఆసామీయెవరూ ఆ చుట్టుపక్కల వున్నట్టు తమకు తెలీదన్నారు'

శతాధిక గ్రంథకర్తను—

'స్వయంగా ఒక శతకం పూర్తిగా రాయలేదు వీడు శతాధిక గ్రంథకర్తట! ఇహ గ్రంథమంటే ఒక అనుష్టుప్పన్న లెక్క చెప్పుకోవాలి!'

శత శతావధానాలు చేశాను. కించిదూనంగా అష్టావధానాలూ, నేత్రావధానాలు కూడా చేశాను—

'అసలు వాడూ నేనూ కలిసి చేసినవే సరిగ్గా అరపాతిక శతావధానాలు. వాడు మరి విడిగా చేసి ఏడిసిందెప్పుడు? అష్టావధానం వాడి కస్సలు చేతకాదు. నేత్రావధానం అంటే ఎదిరింటి అమ్మాయిలను చూడ్డం అనుకున్నాడు! సరే తరవాత—'

అనేక బిరుదులూ, ఘన సన్మానాలూ పొందేను—

'ఏం బిరుదులు! అందరూ ఏదో సందర్భం వచ్చినప్పుడు ఫలాని కవీశ్వరుడంటే అదో బిరుదా? ఉత్త మామూలుమాట. ఒక సభలో అధ్యక్షు డితగాడిని పరిచయంచేస్తూ ఔపచారికంగా 'వాకవి పుంగవులు...' అని ఏదో అన్నాడు. మావాడి పాలిటికదీ ఒక బిరుదే. మనిషి మంచి బందోబస్తుగా వుంటాడు. ఉత్త పుంగవుడు కాదు పుంగవశేఖరుడనాలి వాడిని. ఇహ ఈ మహాకవి అనేమాటా! పాపం ఎలాగో మాట పడిపోయాడు మహానుభావుడు. ఇంతకీ అదో బిరుదా? అది ఒకరిచ్చేదేమిటి! ఎవడికి వాడే ఒక మంచి ముహూర్తం చూసుకుని తగిలించేసుకుంటే తీరిపోతుంది. మరి అయితే నిజం చెప్పొద్దూ యిది కేవలం వాడు తగిలించుకున్నది కాదు. ఆ మధ్య సాహిత్యంతో సమీపంగా ప్రమేయం లేని ఒకాయన, వీడిచేత స్వీయచరిత్ర వ్రాయించుకున్నవాడు, ఒక సభలో ప్రసంగిస్తూ మాటవరస కితగాడిని పరాకున నోరుజారి మహాకవి అనేశారు. ఇహ అది పట్టుకూర్చున్నాడు వీడు. నన్నూ మాచాకలి నూకయ్యలోలా అంటాడు 'దండాలు దండాలు, మారాజాలు, పెబువులు, ఏలినోరు' అని యిలాగు. ఇహ ఆ మట్టున నిజంగా నేను మహారాజు నే సుకోవడమే. అదలా వుండనీ. ఘనసన్మానాలన్నాడు. వీడికి ప్రత్యేకం సన్మానం జరిగిందెప్పుడు? అసలు వీడికి ప్రత్యేక వ్యక్తిత్వ మెక్కడేడిసిందయ్య టుప్పుగొట్టడంలో తప్ప. అవధానాల్లోనూ, సన్మానాల్లోనూ నేను వెంటతాడునీ; వాడు వత్తాసు. ఆటలో అరటిపండు, పులుసులో ముక్క! నాకు నాలుగుసార్లు సన్మానం జరిగితే తోడిపెళ్ళికొడుకులా ఉత్తినేవచ్చి పక్కను కూచున్నాడు. అయితే నిరుడా షష్టిపూర్తి సన్మానం మాత్రం కంజాయింటుచేసి చేయించుకున్నాడులే. అదొక్కటే ప్రత్యేకంగా జరిగింది వాడికి.'

మా తలిదండ్రులు మహాతపస్వులు, తండ్రిగారు యాయజూకుడు. నిత్యాగ్నిహోత్రి, పరమనైష్ఠికుడు,

'అబద్ధం పచ్చిఅబద్ధం! వీళ్ళ నాయన సంగతి నాకు తెలీదూ! చిలుంగోట్టం పట్టుకుని పేకాటలో కూచున్నాడంటే పొద్దుగూకులూ మరి లేవడు.'

మా తల్లి పరమపతివ్రత, మహాభక్తురాలు—

'రైట్! ఇదొక్కటి కరక్టు!'

ఆ పుణ్యదంపతులకు నేను లేక లేక కలిగిన ఏకైక సుపుత్రుడిని. నా గొప్ప నేను చెప్పుకోవడంకాదు కాని—

'ఎలాగూ చెప్పేస్తూ మళ్ళా ఈ హంసపాదెందుకు? నేను పుట్టబోయే ముందు ఒక యతీశ్వరుడు బదరీనారాయణం యాత్రచేస్తున్న మా తండ్రిగారితో శివాంశ సంభూతుడొక మహాశక్తి మీకు పుత్రుడుగా అవతరింపనున్నాడని చెప్పేడట—

'అబ్బా! అబ్బా!

నేను జన్మించిన ఉత్తరక్షణం మా ఊళ్ళో ఈశాన్య దిశనున్న కంటపాలాల్లో పుష్పవృష్టి కురిసిందని మా రైతులు చెప్పేరు—

'ఒరి వీడి కోచ్చాలు కోటప్ప కొండ కళ్ళా!'

నా పుట్టినదున్నాడు ఒక దైవజ్ఞ శిరోమణి నేను ఏడో ఏటే మహాకవి నయిపోతానని జోస్యం చెప్పేరు. అమోఘ వచస్కుడా మహానుభావుడు. సరిగ్గా అలా* ఉపనయనమైన రాత్రి నాకు సరస్వతీదేవి సాక్షాత్కరించింది. నా జిహ్వమీద ఏవో బీజాక్షరాలు వ్రాసింది. అపశంగా అశువుగా శ్రీ మహాతల్లి మీద సంస్కృతంలో ఒక దండకం, తెలుగులో ఒక శతకం చెప్పేను—

'వీడికి పదోయేటిదాకా ఓనామాలు రావు. సంస్కృతం యిప్పటికీ రామశబ్దం రాదు'

ఆనాటినుంచీ నే నేమాటంటే ఆమాట ఛందస్సుందరమైన సలక్షణమైన కవిత్వం అయి కూచునేది. నేను తిడితే ఆ తిట్టొక శాపమైపోయేది. ఇప్పటికాలంలో నమ్మకాలు నశించిపోయాయిగాని ఒకసారి, నమ్మండి నమ్మకపోండి, ఏం జరిగిందంటే నా కాలులో ముల్లు గుచ్చుకుంటే, అబ్బ! ఈ ముళ్ళచెట్లేం చెట్లు ముండచెట్లు అని కొత్త విసుక్కున్నాను. ఆయింతే ఆ చుట్టుపట్లనున్న తుమ్మ, బొమ్మజెముడు మొదలైన చెట్లన్నీ ముండమోసినట్లు వాటి ముళ్లన్నీ జలజల నేల రాలిపోయినై—

'ముళ్ళు రాలిపోవడంగాదు తన పొలం తగాదాలో మునసబు కరణాలు కలిసిరాలేదని వాళ్ళని శపిస్తానని బెదిరిస్తే వీడి దవడపళ్ళు రాలిపోయాయి.'

అదృష్టవశాత్తూ సకాలంలో నా శక్తి నేను గ్రహించాను. ఇదంతా ఈశ్వరప్రసాదం. లోకకల్యాణార్థం దీన్ని వినియోగించాలని సంకల్పించాను.

'హరి శివయ్యగా! సత్యంమీద ఇంత పిసరు దయ లేదట్రా నీకు! ఎంత ఆత్మవంచన! జగద్వంచన!'

అయితే ఆంధ్రుల దురదృష్టమేమి చెప్పను! ఆ మధ్య నేను గాంధీగారి సత్యాగ్రహోద్యమంలో చేరి జైలుకి వెళ్లినరోజుల్లో—

'నీకు జైలుకి వెళ్ళింది ఒక ఖూనీకేసులో. ఎప్పటికేనా తను జైలుకి వెళ్ళిన సంగతి లోకంకి తెలిసిపోతుందని కొబ్బోలు ఈ పన్నాగం పన్నుతున్నాడు. బాగుంది వరస!'

మావాళ్ళ అశ్రద్ధవల్ల ఇంటిదగ్గర మా తండ్రితాతల నాటి తాళపత్రగ్రంథాల భోషాణంతోపాటు నేను రాసిన కావిడిపెట్టెడు పుస్తకాలూ పరశురామప్రీతి. గ్రంథాలన్నీ తగులబడిపోవడంతో ఇప్పుడవన్నీ నాకు పూర్వజన్మ స్మృతులై పోయినై—

'నా గడుసుగా ముందరికాళ్ళకు బంధాలు వేస్తున్నాడు! మరీ జన్మకు నీకు నిజం చెప్పనని ఒట్టుపెట్టుకున్నట్టున్నాడు. వెళ్ళిపోతోంది హరిశ్చంద్రధోరణి!'

పూర్వజన్మస్మృతంటే జ్ఞాపకం వచ్చింది. నాకు అక్షరాభ్యాసం అయ్యేవరకూ పూర్వజన్మజ్ఞానం వుండేదిట. ఆ రోజుల్లో అంటూ వుండేవాడినట - మా అమ్మ చెప్పింది. నేను గతజన్మలో బదరీనారాయణంలో తపస్సు చేసుకుంటూ వుండే మహర్షి నని, నిత్యనైమిత్తిక కర్మల్లో ఏదో ఒక చిన్న ప్రత్యవాయం వచ్చి యోగభ్రష్టుణ్ణై ఆ లోటు భర్తీచేసుకోవడంకోసం ఒక్క జన్మ ఎత్తవలసివచ్చిందనీ, ఈ జన్మతో సరి. ఇక చివరిమాట—నాకు ఏకోనానా శివయ్య అంటే నేను, ఇది నాకథ అనే అహంకార మమకారాలు పసేమిరా లేవు. అంచేత వట్టి నిష్కామకర్మగా, కేవలం లోకోపకారార్థం శివయ్య అనబడే ఒక మహానుభావుని పవిత్రచరిత్రమును విషయం సవిస్తరంగా తెలిసినవాడినవటంవల్ల మరొకరికి బదులుగా నేనే వ్రాసి ఆంధ్రలోకాని కందజేస్తున్నాను. అంతే. అందరూ తలో కాపీ కొనుక్కుని యథాశక్తి తరింతురు గాక!"

'అరి పీడింటా బట్టానా! ఎంత బరి తెగించేశాడూ! ఎన్ని కోచ్చాలు కోశాడు! ఎన్ని డచ్చాలు కొట్టేడు! నే నింకా బతికున్నా నన్న సంగతే మరిచిపోయినట్టున్నాడు! నీకు మహాకవా? నీదూ స్వీయచరిత్ర రాసుకోవడమే!' అని కళకళలాడేరు శతభిషం గారు.

'అయ్యా కింద 'సరా' ఒకటి రాశాడండోయి మహాకవి!' అన్నాను.

'అదేమిటి!'

'సరా: ఈ గ్రంథం బాగోగుల విషయమై నాకెలాంటి ఖేదమోదాలు లేవు. విమర్శకులు కొందరి కిందటి విషయములు కొన్ని వింతగా దోచి ఆక్షేపింతురు గాక. దూషణ భూషణ తిరస్కారంబులు దేహంబునకుం గాని ఆత్మకుం గావు' అని చదివేను.

'అంతకన్నా, నాకు సిగ్గూ లజ్జాలేవు, గ్రంథం బాగోగుల విషయమై నాకు పూచీ లేదు-అని రాసివుంటే బాగుండేది' అన్నారు శతభిషం గారు. ఆయనే మళ్ళా అన్నారుగదా:

'అవును గాని ఈ స్వీయచరిత్రలు వ్రాసుకునే వాళ్లందరూ ఎందుకు తమ చరిత్ర తామే వ్రాసుకోవాలనుకుంటారు, అదో అహంప్రత్యయ ప్రకోపం గాకపోతే,—

'పాపం వీళ్ళనుగురించి మరెవళ్ళు రాయడానికి తీరుబాటుగా కూర్చున్నారు చెప్పండి!' అని వాళ్ల తరపున వకాల్తా పట్టినవాడిలాగ విన్నవించుకున్నాను నేను.

'అసలు వీళ్ల కెందుకా దుగ్ధంట తమ చరిత్ర లోకానికి తెలియాలని?'

'మహాకవి శివయ్యగారు సెలవిచ్చారు గదండీ కేవలం లోకోపకారార్థం అని'

'ఏడిశాడు!'

'కాని ఒక్క విశేషం మాత్రం మనం గ్రహించవలసివుంది సుమండీ! మహానుభావులు కొందరు స్వీయచరిత్రలు వ్రాసుకుంటారు గాని స్వీయచరిత్రలు వ్రాసుకున్నవాళ్ళందరూ మహానుభావులు కారు, కానక్కరలేదు అని నిరూపించారు మన శివయ్యగారు. అందుకు యావదాంధ్రలోకమూ వారికి ఋణపడిపోయింది' అని వినయంగా మనవిచేశాను.

'ఒరేయ్ నాకు ఒళ్ళుమండిపోతోంది. ఈ పుస్తకాన్ని నిలువునా చింపేస్తాను' అని తీర్మానించారు శతభిషం గారు.

'అయ్యా! పంచాంగాన్ని చింపేస్తే గోచారం ఆగిపోతుందా చెప్పండి? కొన్ని వేల కాపీలు అచ్చుపడి వుంటాయి. ఏదో మనదగ్గరున్న ఒక కాపీ చించేస్తే సరా? తక్కువ లోకమంతా ఏమయిపోయిం దనుకున్నారు! కాలోహ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ- అన్నాడు గదా మహాకవి భవభూతి. అటుపై మీ చిత్తం' అని పూరుకున్నాను పుస్తకం అట్టమీద అచ్చుగుద్దబడిన శివయ్యగారి ఛాయాచిత్రం కళ్ళలోకి దీనంగా చూస్తూ.

జీవన్ భద్రాణి పశ్యతి!
మహాకవి శివయ్య జిందాబాద్!

తృతీయ ప్రణాళిక: నిరుద్యోగ సమస్య

శ్రీ బులుసు వేంకటసుబ్బారావు

గడచిన మే మాసంలో కేంద్రమంత్రి శ్రీ గుల్జారీ లాల్ నందా కేంద్ర ఉద్యోగసంఘ సభలో చేసిన ప్రసంగం మన దేశంలో నిరుద్యోగసమస్య క్లిష్టతను తెలియచేయ గలదు. ఈ గురుతరమైన సమస్యకు కారణాలు అందరకూ తెలిసినవే. మనదేశపు జనాభాలో కేవలం 10 % మాత్రమే ఉద్యోగాలకు పరిశ్రమలపై ఆధారపడడం, జనాభా అతివేగంగా పెరిగిపోవడం, పారిశ్రామిక పురోగమనం తగినంత లేకపోవడం, నిరుద్యోగులు ఎక్కువ అయినా వివిధ పారిశ్రామిక రంగాలలో నిపుణత కలిగిన అభ్యర్థులు లేకపోవడం మొదలైనవి, ఈ కారణాలు. గణాంకవేత్తల అంచనాల ప్రకారం ద్వితీయపంచవర్ష ప్రణాళిక ప్రారంభానికి మన దేశంలో సుమారు 15 మిలియన్ల నిరుద్యోగులున్నారు. వీరుకాక 20 మిలియన్ల మందికి అసంపూర్ణంగా మాత్రమే ఉద్యోగం ఉంది. అంటే ఒక శ్రామికుడు దినానికి పదిగంటలు పనిచేయకలిగితే, అతనికి రోజుకి రెండుగంటల పని మాత్రమే లభ్యమౌతోందన్నమాట. ఈ విధమైనది మన దేశంలో గ్రామీణ రంగంలో బాగా ఎక్కువ. అయితే మొత్తంమీద దేశంలో 35 మిలియన్ల మంది మాత్రమే ఈ నిరుద్యోగసమస్యవలన బాధపడుతున్నారని చెప్పడానికి వీలులేదు. ఏమంటే, ఈ నిరుద్యోగులసంఖ్యలను తెలిపే లెక్కలు బాగా అసమగ్రమైనవి. ప్రతిపల్లెలోను ఎంతమంది నిరుద్యోగులున్నారో విపులంగా అంచనా వేయకలిగేందుకు సమగ్రమైన గణాంకశాఖ మనకులేదు. కాబట్టి ఈ లెక్కలన్నీ కేవలం ఉజ్జాయింపున సరిచూసినవే. ఇందువలన దేశంలో నిజంగా ఉద్యోగాభ్యర్థులు ఈ 35 మిలియన్లకన్న చాలా ఎక్కువ ఉంటారు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో కనీసం ఎనిమిది మిలియన్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు అందిన గణాంకసమాచారాన్నిబట్టి ఈ లక్ష్యం నెరవేరదు అని నిస్సంశయంగా చెప్పవచ్చును. దీని పర్యవసానం ఏమంటే తృతీయ పంచవర్ష ప్రణాళిక ప్రారంభానికి ఈ సమస్య అనుకొన్నంతకంటె తీవ్రతరమౌతుంది. దాని ప్రభావం తృతీయ ప్రణాళిక పొడుగునా ఆర్థికవ్యవస్థపై ప్రతిఫలిస్తుంది. రెండవ ప్రణాళికా రచనలో ఆర్థిక వేత్తలు నిరుద్యోగ సమస్యను మూడువిధాలుగా విభజించి పరిశీలనచేశారు. ఒకటి అప్పటికే దేశంలోఉన్న నిరుద్యోగుల విషయం. రెండవది సంవత్సరానికి రెండు మిలియన్ల చొప్పున పెరుగుతున్న క్రొత్తనిరుద్యోగుల విషయం. మూడవది అసంపూర్ణమైన ఉద్యోగంగలవారి సమస్య. ప్రణాళికా రచయితల అంచనా ప్రకారం ప్రభుత్వరంగంలో భారీ పెట్టుబడులవలన, ఆరోగ్యం, విద్య, సాంఘిక సంక్షేమం మొదలైన వానియందు ప్రభుత్వకృషివలన, ఉద్యోగం బాగా పెరగగలదని ఆశించారు. అంతే కాకుండా, ఈ కృషివలన ప్రజల జీవన ప్రమాణాలు అధికమై, నిత్యోపయోగ వస్తువుల గిరాకీ పెరుగుతుంది. ఆ గిరాకీ పెరగడంవలన, గ్రామీణపరిశ్రమలకు, లఘు పరిశ్రమలకు అధిక ప్రోత్సాహం లభించి, తద్వారా ఉద్యోగాభివృద్ధి జరగగలదు. రెండవ ప్రణాళికలో వివిధరంగాలలో ఈ క్రిందివిధంగా ఉద్యోగావకాశాలు కలుగగలవని ప్రణాళికా రచయితలు భావించారు. ఐదు వత్సరాలకు కలిపి వివిధములైన నిర్మాణ కార్యక్రమాలయందు మొత్తం 21.0 లక్షలమందికి ఉద్యోగాలు లభించగలవు. నీటిపారుదల, విద్యుచ్ఛక్త్యభివృద్ధి పనులలో 0.51 లక్షలమందికి, రైల్వేల అభివృద్ధియందు 2.53 లక్షలమందికి, రవాణాశాఖలో 1.80 లక్షల మందికి, పరిశ్రమలలో 7.50 లక్షలమందికి, గ్రామీణపరిశ్రమలు, లఘు పరిశ్రమలలో 4.50 లక్షం మందికి, అటవీశాఖ, మత్స్యపారిశ్రమలలో 4.13 లక్షలమందికి, విద్యావిషయిక కార్యక్రమాలలో 3.10 లక్షలమందికి, ఆరోగ్య విస్తరణకార్యక్రమాలలో 1.16 లక్షల మందికి, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలలో 1.42 లక్షలమందికి, ప్రభుత్వసేవలో 4.34 లక్షల మందికి, ఇతర రంగాలయందు, వర్తక వాణిజ్యములందు 27.04 లక్షలమందికి ఉద్యోగాలు లభించకలవని అంచనా వేశారు. అంటే మొత్తం సుమారు 80 లక్షలమందికి అన్నమాట. అయితే

ఇంత సాధించినప్పటికీ రెండవ ప్రణాళిక ముగిసేసరికి సమస్య ఏమంత ఎక్కువగా శాంతించదు. కాని రెండవ ప్రణాళికలోనే, ఇప్పటికి అందిన సమాచారాన్నిబట్టి పైఅంచనాలుకూడ ఫలించవేదని తేలింది. అందువలన మూడవప్రణాళికలో 14 మిలియన్ల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తే, మూడవప్రణాళిక ముగిసేసరికి పరిస్థితి విషమించక యథాతథంగా ఉండగలదు. కాబట్టి మనం ఎదుర్కొనవలసిన సమస్య నిరుద్యోగాన్ని తగ్గించడం కాక, ఎక్కువ కాకుండా చేయడమన్నమాట! దానికైనా, కనీసం 14 మిలియన్ల మందికి అయిదుసంవత్సరాలలో ఉద్యోగాలు కల్పించాలంటే సులభసాధ్యమైన పనికాదు.

పాశ్చాత్య ఆర్థికశాస్త్రవేత్తలు నిరుద్యోగసమస్యను శాస్త్రీయదృక్పథంలో పరిశీలించి అనేకసిద్ధాంతాలను తయారుచేశారు. సాంప్రదాయిక ఆర్థికవేత్తల ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థలో అసలు నిరుద్యోగమనేదే సంభవించదు. ఒకవేళ సంభవించినట్లైతే దానికి రెండే కారణాలు ఉంటాయి—ఒకటి శ్రామికులు పనిచేయడానికి నిరాకరించడంవలన. అంటే ఇది ఇచ్ఛాపూర్వకమైన నిరుద్యోగమన్నమాట (Voluntary unemployment). రెండవ కారణం వేతనం తగ్గించడంవలన శ్రామికుల నిరాకరణ. వేతనం తగ్గించడం అంటే వేతనం ధనరూపకంలో పూర్వపు విలువతో సమానమే అయినా, యథార్థపు విలువ అనగా వస్తురూపేణా విలువను తగ్గించడం. ఈ సాంప్రదాయిక వాదానికి ఆధారభూతమైన సిద్ధాంతం ఎల్లప్పుడు గిరాకీ, సరఫరాలు, నిలువచేసే ధనం, పెట్టుబడి చేసే ధనం సమానమే అవుతాయని. శ్రామికుల ఉద్యోగనిర్ణయం, వారి సరఫరా గిరాకీలపై ఆధారపడి ఉంటుంది. ఈ పరస్పర వ్యతిరేకశక్తులు వేతన ప్రమాణాన్ని నిర్ణయిస్తాయి. అందువలన, శ్రామికుల సరఫరా ఎక్కువైనప్పుడు వేతనం తగ్గడం, తక్కువైనప్పుడు హెచ్చడం సంభవిస్తుంది కాని ఎన్నడూ నిరుద్యోగమనేది కలుగదు. ఈవాదం కేవలం శాస్త్రదర్పణంటిది, కావడంవలన, వాస్తవిక పరిస్థితుల దృష్ట్యా నిరాధారమైంది. తరతరాలుగా నమ్మబడిన ఈ సిద్ధాంతాన్ని నిరాకరించి వాస్తవిక పరిస్థితుల కనుగుణమైన సిద్ధాంతాన్ని రూపొందించిన మహానీయుడు లార్డు కీన్సు. వాస్తవిక పరిస్థితులలో, నిలువ, పెట్టుబడి ధనాలు సమమై, శ్రామికుల సరఫరా గిరాకీలు సమమైనప్పుడే, నిరుద్యోగం పూర్తిగా సమసిపోగలదని నిరూపించారు కీన్సు. ఉద్యోగావకాశాల వృద్ధి ప్రభుత్వపు పెట్టుబడిపైనా, జాతీయాదాయంపైనా ఆధారపడి ఉంటుంది. కాబట్టి నిరుద్యోగసమస్యను తగ్గించడానికి ప్రభుత్వపు పెట్టుబడి ముఖ్యం. ఈయన గ్రంథం ప్రకారం నిరుద్యోగం ప్రబలినపుడు ప్రభుత్వపు పెట్టుబడి అనేక గుణితమై జాతీయాదాయాన్ని, ఉద్యోగాల్ని పెంపొందిస్తుంది. అయితే ఈయన తన సిద్ధాంతాన్ని, పెట్టుబడిదారీ దేశాల కనుగుణంగా రూపొందించారు. ఈయన సిద్ధాంతం బాగా అభివృద్ధిపొందిన పెట్టుబడి దారీ దేశాలలో, ఆర్థిక మాంద్యంవలన ఏర్పడిన తాత్కాలిక నిరుద్యోగాన్ని నిర్మూలించడానికి పనికి వస్తుంది కాని, ఇండియా, చైనాలవంటి వెనుకబడిన దేశాలకు పనికిరాదని ఆర్థిక శాస్త్రజ్ఞులు వెల్లడించారు.

ఇందువలన తేలేదేమిటంటే ఆర్థికంగా పురోగతిపొందిన అమెరికా, జర్మనీ, జపాన్ మొదలైన దేశాలలో నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం అవలంబించిన విధానాలు, మనదేశంలో నిరుద్యోగ నిర్మూలనకు సరిపడవని. మనదేశ పరిస్థితుల కనుగుణమైన విధానాన్ని మనం రూపొందించుకోవాలి కాని విదేశ విధానానుకరణ ఉపయుక్తం కాదు. విదేశాలలోని నిరుద్యోగ సమస్యకు, మన నిరుద్యోగ సమస్యకు పోలికలేదు. అక్కడ జనించే నిరుద్యోగం ఆర్థికమాంద్యంవలన కలుగుతుంది. మన దేశంలో, జాతీయార్థిక వ్యవస్థ వెనుకబడిన దశవలన కలుగుతుంది. వారిది తాత్కాలిక సమస్య. కొద్దిపెట్టుబడితో తిరిగి ఉద్యోగావకాశాలు కలిగి సమస్య నివారితమౌతుంది అక్కడ.

అంతే కాకుండా మనదేశం బహువిస్తృతమైనది అవడంవలన, సమస్య తీవ్రమై బహురూపాలను దాలుస్తుంది. బెంగాల్, బీహార్ మొదలైనరాష్ట్రాలలో జనించే పారిశ్రామిక నిరుద్యోగ సమస్య వేరు; ఆంధ్ర వంటి వ్యవసాయిక రాష్ట్రాలయందుకలిగే వ్యవసాయికమైన గ్రామీణ నిరుద్యోగ సమస్య వేరు. ఒరిస్సా మొదలైన వెనుకబడ్డ ప్రాంతాలలో కలిగే నిరుద్యోగసమస్య వేరు; అస్సాం, మధ్యప్రదేశ్ మొదలైన ప్రదేశాలలో కొండప్రాంతాలలోని జనులకు సంభవించే నిరుద్యోగ సమస్య వేరు. కాబట్టి నిరుద్యోగ సమస్య నిర్మూలనకు

దేశానికంతకీ ఒకేవిధానాన్ని అనుసరించడం సాధ్యం కాదు. వీరంతా కాకుండా చదువుకొన్న నిరుద్యోగుల సమస్యకు ప్రత్యేక పరిశీలన అవసరం. ఉద్యోగాభివృద్ధికి రెండవ ప్రణాళికలో అవలంబించిన విధానమందుగల ముఖ్యమైనలోపం, సమస్యలోని ఈ విధమైన ప్రాంతీయవ్యత్యాసాలను గమనించక పోవడమే. మరొక ముఖ్యమైన లోపం ఏమంటే నిరుద్యోగ సమస్యను ప్రత్యేకమైన సమస్యగాకాక, కేవలం దేశాభివృద్ధి పైన ఆధారపడే సమస్యగా వీక్షించడం. దేశాభివృద్ధి ప్రణాళికల మూలంగా జరుగుతుంది. కాబట్టి నిరుద్యోగం దానంతట అదే శాంతిస్తుంది అన్న పద్ధతి రెండవ ప్రణాళికలో అవలంబింప బడింది. ఈ విధానం సత్యదూరం కాకపోయినప్పటికీ, అధిక ఫలవంతమైనది కాజాలదు. కాబట్టే రెండవ ప్రణాళికలో నిరుద్యోగ సమస్యా నివారణానికి ప్రభుత్వం ప్రదర్శించిన వైఖరి ఒక నిర్ణీతమైన విధానంగా కాక కేవలం అస్పష్టమైన, అసమగ్రమైన అంచనా—లక్ష్యంగానే ఉండిపోయింది.

కాబట్టి మూడవ ప్రణాళికలోనైనా, ఈ తప్పులను సరిచేసుకోవలసి ఉంటుంది. మూడవ ప్రణాళికలో, రెండవ ప్రణాళికలో అవలంబించిన విధానపు తప్పుల మూలంగా సమస్యాభారం ఎక్కువ అయింది. ఉద్యోగసమస్యను పరిశీలించె కేంద్ర సంఘం ఈ తప్పులనేమీ గుర్తించినట్లు కనబడదు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ఈ సంఘం చేసినసూచనలు, ఎప్పుడో పందొమ్మిదవ శతాబ్దం నాటివే కాని క్రొత్తవి కావు. గ్రామీణ రంగాలలో శ్రామికశక్తి అధికంగా కావలసిన పరిశ్రమలను స్థాపించమని దీని ముఖ్య సూచన. ద్వితీయ ప్రణాళికలో ఉద్యోగవిధానం ఎందువలన సఫలము కాలేదో, ఆ అడ్డంకులు తృతీయ ప్రణాళికలో ఏవిధంగా తొలగింప బడాలో అన్న చర్చ రాలేదు. కేవలం చిన్నపరిశ్రమలను గ్రామీణ రంగంలో వృద్ధిచేసినంతమాత్రాన నిరుద్యోగసమస్య పరిష్కృతమౌతుందనుకోవడం, వాస్తవిక పరిస్థితులను గమనించకపోవడం వల్లనే ఏర్పడుతుంది. ఇంతటి ముఖ్య సమస్యకు కేవలం ఒక సులభమైన అసమగ్రమైన విధానం సరిపడదు. విధానం అతివిపులమైనదిగా ఉండాలి. అవసరమైతే అది ప్రతిజిల్లాకు మారేదిగా కూడా ఉండాలి.

మూడవ ప్రణాళికలో, ఉద్యోగావకాశాలను కల్పించడానికి అవలంబించే విధానంలో, ప్రభుత్వం ఆదాయసేకరణ మార్గాలకు (పన్నుల విధానానికి ముఖ్యంగా) ఉద్యోగవిస్తరణ విధానానికి సమన్వయ సూత్రం కనిపెట్టబడాలి. పన్నుల విధానానికి ఉద్యోగ విస్తరణకు అతిసన్నిహిత సంబంధం ఉంది. ముఖ్యంగా పారిశ్రామికోద్యోగ విస్తరణకు ఈ బాంధవ్యం హెచ్చు. పరిశ్రమ విస్తరణకు శ్రామికుల సంఖ్యనైనా ఎక్కువ చేయాలి, లేక యంత్రాగాన్నైనా ఎక్కువ చేయాలి. ఈ సందర్భంలో పెట్టుబడిదారుడు దేనికి ఖర్చు తక్కువ అయితే దానిని హెచ్చిస్తాడు. సాధారణంగా, దీర్ఘకాలికంగా పరిశీలిస్తే, పెద్దపరిశ్రమలలో యంత్రాంగాన్ని హెచ్చించడమే లాభదాయకంగా కనబడుతుంది. ఇటువంటప్పుడు యంత్రాగాన్ని హెచ్చు చేసే కన్న, శ్రామికులను హెచ్చుచేస్తే పన్నుల భారం తగ్గేదిగా పన్నుల విధానాన్ని రూపొందిస్తే ఉద్యోగవిస్తరణ జరుగుతుంది. ఒక కర్మాగారంలో శ్రామికుల సంఖ్యను హెచ్చుచేస్తే, ఆదాయపుపన్నులో కాని లాభాలపై విధించే పన్నులో కాని కొంతరేటు ముదరా ఉంటుందని ప్రభుత్వం ప్రకటిస్తే పారిశ్రామిక వేత్తలు తమ తమ కర్మాగారాలలో ఉద్యోగపరిధులను విస్తరించడానికి అవకాశం ఎక్కువ కలుగుతుంది. ఈ ముదరా ఈయడం వలన ప్రభుత్వానికి ధన నష్టం రాకుండా, మొత్తంమీద పన్ను రేటును కొద్దిగా హెచ్చు చేయవచ్చు. దీనివలన రెండు విధాలా కూడా ఉద్యోగ విస్తరణానికి ప్రోత్సాహం కలుగుతుంది. ఈ పద్ధతిని పూర్వం ఇంగ్లండులో ఉపయోగించారు. ఇంగ్లండులో పారిశ్రామిక పురోగమనం పరిణతి పొందింది కనుక ఈ విధానం అక్కడ ఎక్కువ విజయవంతం అవడానికి అవకాశం ఉంది. మన దేశంలో అంతటి ఎక్కువ అవకాశం లేకపోయినా, శ్రామికశక్తి సరఫరా ఎక్కువ కనుక కొంతవరకు అయినా అవకాశం ఉంటుంది. ఈ పద్ధతివలన ప్రభుత్వానికి, పారిశ్రామికులకు, పెట్టుబడిదారులకూ కూడా నష్టం రాదు. ఈ ఉపాయాన్ని మొట్టమొదట కనిపెట్టినది నికొలస్ కాల్డర్. మూడవ ప్రణాళికలో తగినంత పరిశ్రమాభివృద్ధి కలుగుతుంది కనుక, ఈ విధానం ఎంతవరకు ఫలప్రదమౌతుందో పరిశీలించవచ్చును. అయితే ఇది పారిశ్రామిక నిరుద్యోగానికి మాత్రమే సంబంధించినది.

మూడవ ప్రణాళికలో నిరుద్యోగ సమస్యపై సహకార వ్యవసాయానికి అనల్పమైన ప్రభావం ఉంటుందని ఊహించవచ్చును. గ్రామీణ రంగంలో ఈ ప్రభావం వలన నిరుద్యోగం అనేది కొద్దిగా తగ్గినప్పటికీ, ప్రతి వ్యక్తికి తగినంత ఉద్యోగం లభించదు నాగపూరులో సహకార వ్యవసాయంపై జరిగిన కాంగ్రెసు తీర్మానం ప్రకారం ప్రతి గ్రామంలో, ప్రతి ఒక్కరికి, భూమి ఉన్నా భూమి లేకపోయినా, సహకార వ్యవసాయ సంఘంలో సభ్యుడుగా చేరే హక్కు ఉంది. సహకార వ్యవసాయ సంఘంలో సభ్యుడుగా చేరిన భూమిలేని వ్యక్తి సమష్టి భూమిపై శ్రామికుడుగా పనిచేసి, దానికి తగిన ప్రతిఫలాన్ని పొందుతాడు. ఈ తీర్మానం ప్రకారం ప్రతి గ్రామీణుడికి సంఘంలో చేరి శ్రమించి, ప్రతిఫలాన్ని పొందే 'హక్కు' ఉన్నది కనుక ప్రస్తుతం గ్రామంలో పని పాటలు లేక తిరిగేవారంతా ఉద్యోగులౌతారు. ఐతే సహకారవ్యవసాయంలో ఉద్యోగ విస్తరణ ఈ విధంగా జరగడం కేవలం అవశ్యకతవలన కాదు; ప్రజల హక్కును నిలబెట్టేందుకు మాత్రమే! సహకార వ్యవసాయం వలన, సమష్టి కృషివలన, ఇప్పుడు మన రైతులు భరించలేని యంత్రాంగం అప్పుడు నలుగురూ కలసి భరించడానికి వీలౌతుంది. అందువలన గ్రామ సమష్టి క్షేత్రంలో శ్రామికుల అవసరాన్ని తగ్గించే ట్రాక్టర్లు మొదలైన యంత్రాలు ఎక్కువవౌతాయి. దీనివలన శ్రామికులకు గిరాకీ, ఆవశ్యకతకూడ తగ్గుతాయి. గ్రామంలో వ్యవసాయానికి కావలసిన కూలి, శ్రామికులసంఖ్య ఈ యంత్రాంగం వలన బాగా తగ్గిపోతాయి. అందువలన ప్రతి గ్రామీణుడూ భూమిలేకపోయినా సమష్టిసేద్యంలో చేరవచ్చును అనే హక్కు ప్రసాదింపబడకపోతే అదివరకు కన్న నిరుద్యోగం ఎక్కువౌతుంది. అయితే ఈహక్కు నియ్యడం వలనకూడా పరిస్థితి ఏమంత బాగుపడదు. అదివరకు నలుగురు చేయగలపనినే ఇప్పుడు పదిమందికి పంచుతారు. కాబట్టి ఎవరికీ తగినంతపని ఉండదు. పైగా ఈ పంపకం పరస్పర వైషమ్యాలకు దారితీస్తుంది. అందువలన సమష్టి వ్యవసాయ విధానం ప్రవేశపెట్టబడడంవలన గ్రామీణరంగంలో నిరుద్యోగ సమస్య మరింత క్లిష్టతరమౌతుంది అని చెప్పవచ్చును. ఒకవేళ యంత్రాంగం ప్రవేశపెట్టబడక పోయినప్పటికీకూడా మొత్తంమీద శ్రామికులకు గిరాకీ తగ్గుతుంది. ఇది అనుభవైక వేద్యమైన విషయం. వ్యవసాయం సంవత్సరంలో ఏవో కొన్ని నిర్ణీత కాలాల్లో జరిగేది కావడంవలన ఆ కాలాల్లోమాత్రమే మనకృషీవలురకు పని దొరుకుతుంది కాని మిగతా సమయంలో వారు పూర్తిగా నిరుద్యోగులే. ఇప్పుడు సహకారవ్యవసాయం పెట్టడంవలన ఆ కాలాలలో కూడా వారికి పూర్తిగా పనిదొరికే అవకాశం ఉండదు. అయితే గ్రామీణ రంగంలో ఈ నూతన సమస్యకు కేంద్ర ఉద్యోగ సంస్థ ఏమీ ప్రాధాన్య మిచ్చినట్టు లేదు.

నిరుద్యోగసమస్యను తగ్గించేందుకు చిన్న తరహా పరిశ్రమలను ముఖ్యంగా అంబర్ చర్ఖా చేనేత మొదలైన వాటిని నెలకొల్పవలెనా లేక పెద్ద తరహా పరిశ్రమలను నెలకొల్పవలెనా అన్న విషయం చర్చనీయం. ఈ సందర్భంలో కేవలం ఉద్యోగవిస్తరణే కాక, ఆ రూపేణా చేసే ఖర్చుకు తగిన ప్రతిఫలం లభిస్తోందా లేదా అనే విషయం కూడా విచారణీయం. చిన్న పరిశ్రమలు విషయంలో పెట్టుబడి తక్కువ పెట్టడానికి, తక్షణం కొంత ప్రతిఫలం పొందడానికి అవకాశం ఉన్నప్పటికీ, దీర్ఘకాలికంగా విస్తరణకు, ఉత్పత్తికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. వాటిలో శ్రామికుల వేతనాలు ప్రారంభంలో తక్కువే అయినా, సంస్థ వృద్ధి అయి, ఆ ఉత్పత్తికి గిరాకీ అధికమై, లాభాలు పెంపొందడంతో శ్రామికుల వేతనాలు కూడా పెరుగడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ తరహా పరిశ్రమల వలన, ఇటు ఉద్యోగ విస్తరణకు, అటు జాతీయాదాయానికి కూడా అవకాశం కలుగుతుంది. ఇటువంటి సంస్థలు సహకారసంఘాల యాజమాన్యాన, ప్రభుత్వ ప్రోత్సాహంతో పెంపొందగలవు. అయితే గ్రామీణ పరిశ్రమలకు చేతిపరిశ్రమలకు ప్రభుత్వం ఏ ప్రోత్సాహం ఈయనక్కర్లేదని దీనిభావం కాదు. ఉద్యోగ విస్తరణానికి కేవలం చిన్న తరహా పరిశ్రమల వృద్ధే ఏకైక మార్గం అని అనుకోవడం సమంజసంకాదు. కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా వ్యవసాయిక రాష్ట్రాలలో చిన్న పరిశ్రమల వృద్ధి అనుకూలంగా ఉండవచ్చును. అటువంటి ప్రదేశాలలో తదనుగుణంగా సహకార సంఘాల క్రింద వాటిని పెంపొందించవచ్చును. అంతేకాని, దేశవ్యాప్తంగా ఒక్క మార్గాన్ని అనుసరించడం భావ్యంకాదు. అయితే కొన్ని ప్రదేశాలలో

చేతిపరిశ్రమలు తరతరాలుగా పెంపొందుతూ, అక్కడి చేతిపారిశ్రామికులకు వంశపారంపర్యమైన నిపుణతకల్గి, ఆ ప్రదేశాలు ఆయా చేతిపరిశ్రమలకు ప్రఖ్యాతిమై ఉండవచ్చు. అటువంటి ప్రదేశాలలో ప్రభుత్వం తక్కువ పెట్టుబడితో ఎక్కువ అభివృద్ధి సాధించడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి కొన్ని విషయాలలో చేతిపరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు ఎక్కువ ఫలదాయకములుగను, మరికొన్ని విషయాలలో పెద్ద తరహాపరిశ్రమలు ఎక్కువ ఫలదాయకంగా ఉండడానికి వీలుపడవచ్చును. అటువంటప్పుడు స్థానిక స్థితిగతులను పరిశీలించి, ఏ వస్తువుల ఉత్పత్తిలో, ఏయే ప్రదేశాలలో, చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడం లాభదాయకమో నిశ్చయంగా పరిశీలన జరిపి తెలుసుకోవాలి. అట్టిపరిశీలనవలన కొన్ని నిర్ణీతవస్తువులను చిన్న పరిశ్రమలకు కేటాయించి, వాటి పురోభివృద్ధికి పాటుపడడానికి, మిగిలిన వస్తువుల ఉత్పత్తి పెద్దపరిశ్రమలకు కేటాయించడానికి వీలుపడుతుంది. ఈవిధంగా ఒక నిశ్చితమైన విభాగం అత్యవసరం. ఇట్టి అభివృద్ధికి సమగ్రమైన స్థానిక పరిస్థితుల పరిశీలన, జిల్లావారీ పథకాలు అవసరం. వీటి విషయంలో దేశీయంగా ఏ ప్రణాళికనూ విస్మరించడానికి వీలుపడదు. అయితే అట్టి పరిశీలన లేనందువల్ల ఒకవంక నిరుద్యోగ సమస్య, ఒకవంక చిన్న పరిశ్రమల సమస్య పరిష్కారమవడానికి కృషి చేయవలసి వస్తుంది కనక అట్టి విపులమైన పరిశీలన చేయించి సరియైన పథకాలను రూపొందించడం వృథాశ్రమ కాబోదు.

దేశంలో నిరుద్యోగులసంఖ్యలో సుమారు రెండు మిలియనులమంది చదువుకున్నవారు. వీరి సంఖ్య తృతీయ ప్రణాళికా ప్రారంభానికి 8.45 మిలియన్ల వరకు పెరుగుతుంది. అయితే రెండవ ప్రణాళికలో 1.44 మిలియనుల మందికి ఉద్యోగ ప్రాప్తి అవుతుందని అంచనా వేశారు. ఇది సఫలమైతే తృతీయ ప్రణాళికా ప్రారంభానికి 2.01 మిలియనులమంది విద్యాధికులైన నిరుద్యోగులుంటారు. విద్యాధికులలో నిరుద్యోగానికి మూల కారణం వారి విద్యకు, ప్రస్తుతం మన ప్రణాళికా దశలో కావలసిన సాంకేతిక పరిజ్ఞానానికి ఎక్కడా సామ్యం లేకపోవడమే, అందువల్లనే చదువుకున్న నిరుద్యోగులు లెక్కువే అయినా తగిన సాంకేతిక పరిజ్ఞానంకల అభ్యర్థులు దొరకడం లేదు మనకు. ఈ పరిస్థితి చక్కబడడానికి విద్యావిధానంలో మార్పు అవసరం. అంతేకాక సాంకేతిక శిక్షణ, సాంకేతికవిద్య అభ్యసింపబడేందుకు ఎక్కువ ప్రభుత్వ కృషి కావాలి.

నిరుద్యోగ సమస్యనుగురించి ఆలోచించేటప్పుడు 'మనదేశంలో నిరుద్యోగ సమస్య పూర్తిగా రూపుమాసిపోయి కోరినవారికందరికీ ఉద్యోగం లభించడానికి ఏమైనా అవకాశం ఉందా?" అనే ప్రశ్న ఉత్పన్నించడం సహజం. ప్రభుత్వపు అంచనాల ప్రకారం మనదేశంలో అటువంటి పరిస్థితులు రావాలంటే రూ 48,500 కోట్ల రూపాయలమూలధనం, పదిహేను సంవత్సరాల నిరంతరాయమైన ప్రభుత్వకృషి అవసరమని తెలుస్తుంది. అంతపెద్దకోరిక మనదేశంవంటి బీదదేశానికి సాధ్యమయేదికాదు. ఎప్పుడో నాలుగైదు ప్రణాళికల అనంతరం ఆ స్వర్ణయుగం రావచ్చును. దానికికూడా ఇప్పటినుండీ నిర్విరామకృషి అవసరం.

సాహితీ సుగతుని స్వాగతం

గుంటకల్లు - గుంటూరు బండి. ఒంటెద్దుబండి ఒడుపులో పరుగులు తీస్తోంది. "నిప్పుంటుందా, అయ్యగారూ?" అనే సన్నని గొంతు వినిపించింది రైలుబండి రొదలో. కిటికీలోనుంచి వెన్నెలలో విశాలప్రకృతిని చూస్తున్న వాణ్ణల్లా యథాలాపంగా తలతిప్పి చూచాను. ఎదుటిసీటులో కూచుంది ఒక కార్మిక ప్రౌఢ. మరొకసారి మరికొంత స్పష్టంగా వినిపించింది అదే ప్రశ్న. మళ్ళీ తిరిగి చూచాను. చేమా, ఆమె తప్ప ఆ పెట్టెలో మరెవరూ లేరు. కనుక నన్నే ఈ ప్రశ్న వేసిందా? ఛా! నన్నెందుకు అడుగుతుంది! నాది శ్రోత్రియ వేషం. ఒళ్ల గోచీపంచకట్టు, చొక్కా లేని ఉత్తరీయం, గోపీచందనంతీర్చిదిద్దినబొట్టూ, ఛాందసమైన ప్రదర్శన - అనుకుంటూ ఉండగానే "నిన్నే అయ్యగారూ, నిప్పెట్టె లేదూ?" అన్నది. అగ్గిపెట్టె ఎందుకూ ఈమెకు? "ఏందయ్యగారూ! ఉందంటే ఉందను; లేదంటే లేదను. ముద్రపాలు తాగిన గున్నదూడలాగ చూస్తావేం?" అంది పండ్లికిలిస్తూ. కొట్లు తిన్నంతగా బాధపడ్డాను. "నిప్పెట్టెందుకూ నీకూ? నా దగ్గర లేదు." అన్నాను కోపంగా. "లేదన్నావుగా. నీకెందుకూ? నే చుట్ట కాల్చుకుంటా" అన్నది. "ఆ! చుట్ట కాలుస్తావా?" అని గద్దించాను. "నీకేం? అడ్డపొగ పెడుతా." అన్నది గట్టిగా. నిజమే. నాకేం? ఇంతలో బండి ఒక స్టేషను వద్ద ఆగింది. మరొకరు పెట్టెలోకి ఎక్కారు. అతని వద్ద అగ్గిపుల్ల పుచ్చుకొని ఆ ప్రౌఢ చుట్ట వెలిగించి కసికొద్దీ నామీదికే గుప్పుగుప్పున పొగ వదిలింది.

ఆ పొగ ఘాటులోనే నా ఆలోచనలు రెక్కలు విచ్చాయి, దానిచరిత్రకోసం. 'ముందున్న చెవులకన్నా వెనుకవచ్చిన కొమ్ములే వాడి' అన్న నా మెత అక్షరాల నిజమైంది, ఈ పొగాకు దుర్వ్యసన విషయంలో- అనుకున్నాను. అయినా ఈ పొగాకు ఇటీవలనే కదా మనఖండంలో, మనదేశంలో వ్యాపించింది, నాగజముడులాగ. మనదేశానికే ఏమిటి? యూరోప్ ఖండానికి మహామారిలాగపాకింది మూడువందల ఏండ్ల క్రితమే. నేడు మనదేశంలో పెద్దపంటలలో ఒకటిది. మన రాష్ట్రానిదే అగ్రస్థానం ఈ పంటలో.

అమెరికాలో పుట్టి పెరిగి విశ్వవిజయం చేసిన దీని రకాలు 50 కి పైగా ఉన్నాయి. దీనిని 'నికోటియానా' అని ఫ్రాన్సులో పూర్వం అనేవారు. దీనిని ఫ్రాన్సుకు తెచ్చిన జీన్‌నికోట్ అనే అతని గౌరవార్థం ఈ పేరు పెట్టారు. నికోటియానా రస్టికా అనేది మెక్సికో మొక్క. నికోటియానా టబాకమ్ కాలిఫోర్నియాది. ఈ టబాకమ్ అనే మాటే టొబాకో అని తమాఖూ అని రకరకాలుగా మారింది. తంబాక్-అరబ్బీ. తన్‌బాకూ-పార్సీ. తమాకూ, తమాక్, తంబాక్, బుజ్జెర్ భంగ్-హిందీ. తంబాకూ - మరాఠీ. తమాకూ - సింధీ. తమాక్ - బెంగాలీ. తంబాకూ, హొగెసొప్పు-కన్నడం. పుగై ఇలై-తమిళ్. పొగాకు, పుగాకు-తెలుగు. నికోటియానా రస్టికా, నికోటియానా టబాకం-ఇవి రెండే వందసంవత్సరాలగా మనదేశంలో హెచ్చుగా పండేవి. ఇటీవలవర్జీనియాపొగాకుపంట హెచ్చయిందనుకోండి.

యూరోపువారికి పొగాకు తాగడం 1492 లో కొలంబస్ అనుయాయులు వెస్టుఇండీస్ దీవులలో చూచివచ్చిన తర్వాతనే తెలిసింది. నూతనదేశాలు కనుగొనడానికి బయలుదేరిన కొలంబస్ పొగాకు తాగడం మొట్టమొదట క్యూబాలో చూచాడట. ఆయన చూడలేదు, ఆయన అనుయాయులు 'గ్వానాహానీ' (శాన్ శాలడోర్)లో స్థానికులు తాగడం చూచారని కొందరు కృషిశాస్త్రజ్ఞులంటున్నారు. అక్కడివారు తాటాకు చుట్టలలో పొగాకు వేసుకొని (నేడు తెలంగాణా గ్రామవాసులు లాగ) తాగేవారట. పొగాకు మొక్కను 'కోహిబా' అని, కాలుతున్న దానిని 'టబాకో' అని వ్యవహరించేవారని కొందరన్నారు. పొగాకు పేరు 'యుయిపిజా' లేక 'కోహాబా', దానిని కాల్చే గొట్టం పేరు 'టొబాకో' అనేవారని మరొకరన్నారు. Y(వై) ఆకారంగల గొట్టంలో పై పంగలు రెండూ ముక్కులో పెట్టుకొనే వారని, కిందిగొట్టంలో పొగాకు కాలుతూ ఉండేదని ఒకరు తెలిపారు. ఈ గొట్టానికే 'టుబాకో' అని పేరన్నారు.

పొగాకు నములడం స్పెయినువారు దక్షిణ అమెరికాలో మొదట చూచింది 1502 లో. తర్వాత అమెరికావాసులంతా దీనికి అలవాటుపడడం చూచారు. నస్యం వేసుకోడమూ ఉండేది మెక్సికోలోను, అమెరికాలోని తక్కిన ప్రాంతాలలోను.

ఉత్తర దక్షిణ అమెరికాలలోని కొన్ని సమాధులలో ఎంతో పనితనం గల పొగాకు గొట్టాలు (చిలుములు) దొరికాయట. కొన్నిగొట్టాలపై ఉత్తర అమెరి

కాలంలో లేని మృగాల బొమ్మలు కూడా చెక్కి ఉన్నాయట.

అమెరికాలో పొగాకు పేర్లుకూడా రకరకాలుగా ఉండేవి. మెక్సికోలోనే 'పేటమ్, పేటన్, కొటెల్' అనే పేర్లు వ్యవహారంలో ఉండేవి. పెరూలో 'సాయిరా' అనేవారు.

యూరోప్‌కు మొట్టమొదట పొగాకు మొక్క వెళ్ళింది 1560 లో స్పెయిను ద్వారా. స్పెయిన్నుంచి పోర్చుగల్లుకు, అక్కడినుంచి ఇతర యూరోప్ దేశాలకు వ్యాపించింది. పోర్చుగల్ రాజాస్థానంలో ఫ్రెంచి రాయబారిగా ఉన్న జీన్‌నికోట్ ఒక డచ్ వాని నుంచి పొగాకు మొక్క ఫ్రాన్సుకు తెచ్చాడు. డ్రేక్ వెంట విశ్వయాత్రకు వెళ్ళిన కాప్టెన్ రాల్ఫ్ లేన్ వర్జీనియా నుంచీ వస్తూ మరొక మొక్కను 1586 లో ఇంగ్లండుకు తెచ్చాడట.

భారతదేశానికి పొగాకు అక్బరీ పరిపాలన కాలంలో 1605 లో బుడతగీసువారు తెచ్చారు. మొదట ఇది దక్కన్‌లోని బిజాపూర్‌కు వచ్చి, తర్వాత ఉత్తరభాగానికి పాకింది. అక్బర్ దీనిని తాగాడట. 17 వ శతాబ్దినుండు తూర్పు దేశాలకు ఇది తెలీదని భావించాలి. బుడతకీచుల (పోర్చుగీసువారి) పలుకుబడి ఆ కాలంలో చాలబలంగా ఉండేది గనుక పర్షియా, అరేబియా, చైనా మొదలగు దేశాలలో దీనిని వారు అలవాటుచేశారు. జావాకు ఇది 1801 లో చేరిందట.

పొగాకు తాగడంవల్ల పలువురు యువకులు ఆరోగ్యం చెడడం చూచి దానిని ఎవరూ వాడరాదని జహాంగీర్ పాదుషా హుకుం చేశాడని 'జహాంగీర్ స్మృతుల'లో ఉన్నది. లాహోర్ లో పొగాకు తాగిన వారిని గాడిదలపై ఊరేగించేవారని, వారి పెదవులు కోసివేసేవారని పెద్దలంటారు. శిఖ్కుల దశమగురువు గురుగోవింద్ సింహ్ అనుయాయివారికి చేసిన ఉపదేశాలలో పొగతాగరాదనేది ఒక్కటి. (తీరం ఏమరినా గడ్డం కాలిపోతుందని కాబోలు!) అయినా ఈ పొగతాగుడు కిందితరగతి శిఖ్కులలో రహస్యంగా జరుగుతూనే ఉంది. పఠానులలో పచ్చి పొగాకు నలిపి నోట్లో వేసుకోడం అలవాటు.

ఇదేమిటి? పొగాకు మనదేశందే. చాలకాలం కిందనే ఉంది. హిందీలో ఆదికవి అనదగిన అమీరు ఖుస్రో పద్యం ఒకటి ఉంది. పొడుపు పద్యం కూడా ఉంది—అంటారు శ్రీ గ్యాన్‌చంద్ వంటి పండితులు డాక్టర్ పి. కె. గోడేగారికి సమాధానంగా (భారతీయ విద్య సం—16 నం-1.). అమీర్ ఖుస్రో 1324 లో మరణించాడు. ఆయన పద్యాలివి:

"స్నాయ ధోయ సాజ మేరీ ఆయో
లే మామా ముంహ ముంహ హీ లగాయో
ఇతనీ బాతపై ఘుక్కా ము ఘుక్కా
ఏ సఖి సాజన? నా సఖి హుక్కా."

స్నానంచేసి అలంకరించుకొని నా పక్క మీదికి వచ్చాడు. ముద్దుపెట్టుకున్నాడు. ముఖంలో ముఖం పెట్టి ఇంతలోకే మాటమాటలో నే ఉమ్మివేశాడు. ఏమిటి చెలీ! ప్రియుడా? కాదు చెలీ. హుక్కా.

నయాకీ ఢేల్ పురాణీకీ తంగ
బూర్ఖోంతో బూర్ఖో నహీఁ చలో మెరెసంగ.

కనుక మనదేశంలో పొగాకుచరిత్ర 14 వ శతాబ్దికి ముందుదే అని అంటారు.

"పొగాకుకు సంస్కృతంలో 'కలంజం' అని పేరు. హిందీ విశ్వకోశంలో దీనిని కలంజమని అంటారని, భారతీయులకు చాలాకాలం క్రితమే తెలుసునని స్పష్టపరిచారు. శబ్దార్థ చింతామణి కలంజం=తిరు ఖూనారతీ అని అర్థమిచ్చి, విష్ణు సిద్ధాంత సారావళి ని

కలంజ సంవేష్టన ధూమపానాత్
పాశ్చాంతి శుద్ధిః ముఖరోగహానిః,
కఫఘ్న మామజ్వర హానికృచ్చ
గాంధర్వ విద్యాప్రవణైక సేవ్యం.

అన్న శ్లోకం ఉదాహరించింది. వాచస్పత్యం కూడా ఈ ఉదాహరణే ఇచ్చింది. మోనియర్ విల్లియం సంస్కృత నిఘంటువులోను, బృహత్ హిందీకోశంలోను పొగాకని అర్థమే ఉంది. విష్ణు సిద్ధాంత సారావళి ప్రాచీనమే అయి ఉంటుంది." అన్నారు శ్రీ గ్యాన్‌చంద్ గారు.

కలంజమంటే పొగాకు అని కిరందరూ ఎలా భ్రాంతిపడ్డారో ఆశ్చర్యమే. కలంజమంటే గంజాయి, విషబాణదిగ్ధ మృగమాంసమని కూడా అర్థం. అందువల్లనే "నకలంజం భక్షయేత్" అనే వాక్యానికి మీమాంసకులు విషబాణవిద్ధ మృగమాంసము నే అర్థం చెప్పారు. గంజాయి నములడం, పొగతాగడం మనకు అతిప్రాచీన కాలంనుంచే ఉంది. దానిని ఇష్టంలేనివారు విషవల్లరి, విషపత్రం అన్నారు. ఇష్టమున్నవారు జ్ఞానపత్రం అన్నారు.

అమీర్ ఖుస్రో చెప్పింది హుక్కా సంగతే కాని పొగాకుసంగతి కాదుగదా! హుక్కా, చిలుము, మామూలుగొట్టాలు - వీటితో పొగతాగడం అతిప్రాచీన కాలంనుంచే ఉంది. తథాగతుని కాలానికే బలంగా లేకపోతే అతడు తన శిష్యులకు ఈవిషయం ఎందుకు చెబుతాడు. వినయపిటకం మహావగ్గలో శిష్యుల ప్రశ్నలకు సమాధానంగా ఇలా చెబుతాడు:

"తేనఖో పనసమయేన ఆయస్మతో పిలిందవచ్ఛస్స సీసాభితాపో హోతి—అనుజానామి భిక్ఖవే ముద్ధని తేలకంతి, నక్ఖమనీయో హోతి—అనుజానామి భిక్ఖవే నత్థుకమ్మంతి..........................నక్ఖమనీయో హోతి—అనుజానామి భిక్ఖవే ధూమం పాతుంతి. తఞ్ఞేవ వట్టిం ఆలింపేత్వా పివంతి - కంఠం దహతి - అనుజానామి భిక్ఖవే ధూమనేత్తంతి-తేన ఖో పన సమయేన ఛబ్బగ్గియా భిక్ఖూ ఉచ్చావచాని ధూమనేత్తాని ధారేంతి-సంఖనాభిమయాంతి-తేన ఖో పన సమయేన ధూమనేత్తాని అపారుతాని హోంతి, పాణకా పవిసంతి-అనుజానామి భిక్ఖవే అపిధానంతి-తేన ఖో పనసమయేన భిక్ఖూ ధూమనేత్తాని హత్థేన పరిహరంతి - అనుజానామి భిక్ఖవే ధూమనేత్తథావికాంతి -ఏకతో ఘంసీయంతి-అనుజానామి భిక్ఖవే యమక థావికంతి - అంసబంధకో నహోతి - అనుజానామి భిక్ఖవే అంసబంధకం బంధనసుత్తంతి" (ఓల్డెన్‌బర్గ్-వినయ సంపుటం-1, పుట 204)

ఆయుష్మంతుడైన పిలిందవత్సునికి భిక్షువుకు శిరోభితాపం (తలను వేడెక్కడం) అయితే ఏమిచేయాలనే ప్రశ్నకు సమాధానంగా తథాగతుడు, తలమీద నూనె పెట్టుకోవడానికి, నస్యకర్మ చేసుకోవడానికి, ధూమపానానికి అనుమతిస్తాడు. "నస్య కర్మ చేసుకున్నప్పటికీ దుస్సహమైతే ఏమి చేయాలి - ధూమపానం చేయడానికి అనుమతిస్తాను. వత్తిగా చేసుకొని ధూమపానంచేయాలి. గొంతులో మంట అయితే ఏమి చేయాలి? చిలుముగొట్టం (ధూమ నేత్రంలో) తాగడానికి అనుమతిస్తాను. ఈ చిలుముగొట్టాలు అపవిత్రమైపోయి, పురుగులు దూరితే ఏమిచేయాలి? ఆ చిలుముగొట్టాలకు మూతలు పెట్టుకోవడానికి అనుమతిస్తాను. ఒకప్పుడు వాటిని చేత్తో తీసుకునిపోవడం కష్టమైతే ఏమిచేయాలి! దానికి బంధనసూత్రం (తాడు) కట్టి భుజానికి వేలాడవేసుకోడానికి అనుమతిస్తాను." అని అన్నాడు.

సంస్కృత సాహిత్యంలో ధూమవర్తిపానం, రోగనివారణకోసమూ, స్వస్థవృత్తంకోసమూ, విలాసంకోసమూ ఆచారమైనట్టు ప్రమాణాలు చాల ఉన్నాయి. తారాపీడుడు 'పరిపీతధూమవర్తిః" (ధూమపానం చేసి) విశ్రాంతి తీసుకున్నట్టు కాదంబరిలో ఉంది.

వైద్యక గ్రంథాల్లో వస్యధూమపాన ప్రక్రియలు శాస్త్రోక్తంగా వర్ణించబడ్డాయి. ఈ ధూమపానం ఔషధ ద్రవ్యాలధూమపానం. ఇది ఎలా ఎప్పుడు చేయాలనేది చరకుడు చెప్పిన విధమిది.

"స్నాత్వా భుక్త్వా సముల్లంఘ్య
క్షుత్వా దంతా న్నిఘృష్య చ,
నావనాంజన నిద్రాంతే
చాత్మవాన్ ధూమపో భవేత్."
(చ. సూత్రస్థా. 5,28)

స్నానం చేసినతర్వాత, భుజించినతర్వాత, జిహ్వాలేఖనానంతరం, తుమ్మితర్వాత, పళ్ళుతోముకున్నతర్వాత నసనం తర్వాత అంజనం వేసుకొన్నపిదప, నిద్రలేవగాను, శ్రద్ధగా ధూమపానం చేయాలి. ఎలా తాగాలి?

"ఋజ్వంగచక్షుః తచ్చేతాః
సూపవిష్టః త్రిపర్యయం,
పిబే చ్ఛిద్రం పిధాయైకం
నాసయా ధూమ మాత్మవాన్." (4 2)

సరిగా నిటారుగా కూచుని, ఏకాగ్రచిత్తంతో, ఒక ముక్కుపుటం మూసుకుని మూడుసార్లు ముక్కుతో పొగపీల్చాలి. ఇక చిలుముగొట్టం ఎలాఉండాలి అన్న విషయమై కూడా నిర్వచనా లున్నాయి:

"చతుర్వింశతికం నేత్రం
స్వాంగుళీభి ర్విరేచనే,
ద్వాత్రింశదంగుళం స్నేహే
ప్రయోగే చార్ధమిష్యతే." 48.

ధూమనేత్రం - చిలుముగొట్టం విరేచనక్రియకైతే 24 అంగుళాల పొడుపు. ఇలాగే...

కనుక, మనకు ధూమపానం చాలకాలంనుంచే ఉంనవడం స్పష్టం. పొగతాగడం కూడా అమెరికాలోని పూర్వవాసులు చేస్తున్నదే మనవారూ ముక్కుతోనే పీల్చేవారనని అనడాన్ని చరకాచార్యులు తెలిపారుగదా. బౌద్ధంతోపాటు మనదేశానికి విహారాలలో ఈ ధూమపానమూ శాస్త్రీయంగా వచ్చిఉంటుందేమో! (వైద్యకంలో ఉండనే ఉందాయె.) ఈ అభ్యాసం ఎలాగూఉంది గనుక కొత్తగా వచ్చిన పొగాకు పాతిగంజాయిని, ఔషధధూమవర్తిని తోసి రాజనింది.

కాగా, పొగాకు మనదేశంది కాదు; కలంజం గంజాయికాని, పొగాకు కాదు; పొగాకు ఇటీవలి కేవని వృక్షశాస్త్రజ్ఞులు, ఇతరపండితులు చెప్పడం ఎంతైనా సమంజసం.

ఇదిదేశంలో నాలుగుమూలలా వ్యాపించినతర్వాతనే రకరకాల చాటువులు పుట్టాయి.

—రామచంద్ర.

ప్రాకృతభాష: శ్రీ పరవస్తువారి సేవ

శ్రీ నిడుదవోలు వేంకటరావు

శ్రీమద్విజయనగర మహారాజ సంస్థాపిత సంస్కృత కళాశాలాధ్యక్షులై, తరుపరి, శ్రీ దివ్య తిరుపతి క్షేత్రమున సంస్కృత కళాశాలాధ్యక్షులుగను, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయాధ్యక్షులుగను ప్రసిద్ధిగాంచిన పరవస్తు వేంకటరామానుజస్వామి గారి నెఱుగని సంస్కృత విద్యార్థి గాని, విద్వాంసుడు గాని లేడనుట యతిశయోక్తి కాదు. సంస్కృత ప్రాకృత భాషలయందే గాక, ఆంధ్రాంగ్ల జార్మన్య (జర్మను) భాషలయందు పండితులగుటచేత, రామానుజస్వామిగా రాంధ్రవిద్వల్లోకమునకే గాక భారతవర్షమునందలి ప్రాచ్యవిజ్ఞానపరిశోధకుల కెల్ల కృతపరిచయులు. వా రరువదినాల్గేండ్లవయసున మొన్నటి సెప్టెంబరు నెల 14 దిని వైకుంఠవాసు లగుటచేత ప్రాచ్యభాషా సంస్కృతి పరిశోధనయందు, నందున ప్రాకృతభాషా వాఙ్మయ ప్రపంచమున తీఱని కొఱత వాటిల్లినది.

శ్రీ రామానుజస్వామిగా రాంధ్రదేశమున నే గాక యావద్భారత వర్షమున, [1]ఆర్యభాషా సంస్కృతి పరిశోధక పీఠమని ప్రఖ్యాతిఁ జెందిన యార్ష గ్రంథాలయ భవనమున పరవస్తు పండిత వంశమున జన్మించిరి. ద్రవిడ దేశీయ వైష్ణవులగు వీరి పూర్వులలో శ్రీనివాసాచార్యు లనువారు వేంకటగిరి ప్రాంతమునుండి విజయనగర ప్రాంతమునకు వచ్చి, యచ్చట విద్యాధికారమును బూరి కావించి, ఆ కాలమున విశాఖపట్టణమున శ్రీ గోడే వెంకటజగ్గారాయనను జమీందారుగారి ప్రోత్సాహమున నచ్చట నే స్థిరనివాస మేర్పఱచుకొనిరి.

శ్రీనివాసాచార్యులవారే తొలుత సంస్కృత భాషలో నకారాదిగా నిఘంటు రచనకు ప్రారంభకులు. వారు రచించిన నిఘంటువు [2]సర్వశబ్ద సంబోధిని యనునది. వారు క్రీ. శ. 1882లో కీర్తిశేషులగుటకు ముందు నే యది పూర్తియైనది. వారి కాలము క్రీ. శ. 1770-1882. తర్వాత నది క్రీ. శ. 1875 సంవత్సరమున ముద్రితమైనది, అది తెలుగు లిపిలో, సంస్కృతాంధ్రార్థములతో వెలయుచున్నది. శ్రీనివాసాచార్యులవారి కుమారులు జగద్గితకీర్తులు వేంకటరంగాచార్యులవారు. మహాసముద్రమువంటి సంస్కృత భాషలో "శబ్దార్థ సర్వస్వము" అను విజ్ఞాన సర్వస్వమును నిర్మించిన మహావిద్వాంసులు; భారత వర్షమున నాంగ్లప్రభుత్వమువారిచే ప్రథమమున మహామహోపాధ్యాయ బిరుదముచే నలంకృతులైన పండితవతంసులు; అసాధారణ ధారణా సంపన్నులు; అత్యద్భుత ప్రతిభావిభాసితులు; అనంత శిష్యప్రశిష్యవిపుల కల్ప మహీరుహములు నగు శ్రీ రంగాచార్యుల వారిని గూర్చి విశేషముగ ప్రశంసించుట సూర్యుని కాగడాతో జూపుట వంటిది. వారి పుత్రులు శ్రీనివాస జగన్నాథ స్వామి అయ్యవార్లంగారు. వీరును పాండిత్యమున తండ్రిని మఱపించు పుత్త్రులు శ్రీనివాస జగన్నాథ స్వామి అయ్యవార్లం గారలకు నలువురు పుత్రులు. వేంకట రంగనాథస్వామి 1875 - 1918. వేంకట భట్టనాథస్వామి 1884-1916. లక్ష్మీ నరసింహస్వామి 1887. వేంకట రామానుజస్వామి గారు 1895-1959.

రంగాచార్యులవారి పౌత్రు లందఱును వారి యశస్సౌధమునకు స్తంభాయమానులై వెలసిరి. వీరినిగూర్చి సుప్రసిద్ధాంధ్ర దేశీయ సంస్కృత వాఙ్మయ పరిశోధకాచార్యులగు శ్రీ యీయుణ్ణి వేంకటరాఘవాచార్యుల వారీ వఱకే ఆంధ్రపత్రిక అంగీరస (1932) సంవత్సరాది సంచికయందు విశేషించి వ్రాసియున్నారు. పై వారిలోఁ గడపటి వారగు శ్రీరామానుజ స్వామి గారినిఁ గూర్చి ప్రస్తుత మీ వ్యాసము.

శ్రీ రామానుజ స్వామిగారు, సంస్కృతము ప్రధానముగా పట్టపరీక్షయందు కృతార్థులై యూ

---

1. క్రీ. శ. 1908 లో పాశ్చాత్య పండిత ప్రకాండుడు, వైదిక సంస్కృత విద్వాంసుడు మనవసాచార్య - డాక్టరు ఏ. ఏ. మాక్డొనాల్డు తన భారత వర్ష పారవ్యత యాత్రలో విశాఖపట్టణమున నున్న యీ గ్రంథాలయమును సందర్శించినాడు.

2. ప్రసిద్ధాంధ్రభాషా నిఘంటు కర్తలు, బహుజనపల్లి వారు తమ నిఘంటువున సంస్కృతపదములను చాలవఱకు నీ నిఘంటువునుండి గ్రహించిరి.

వెనుక, సంస్కృతమే ప్రధానముగా శాస్త్రాచార్య (M. A.) పట్టమును క్రీ. శ. 1917 లో బడసిరి. వీరి కాచార్యులు విజయనగరమున వాఙ్గ్ల గీర్వాణ కళాశాలలకు రెంటికి నధిపతులు, సంస్కృతాంధ్రాంగ్ల భాషాపారంగతులు, కీర్తనీయులు నగు శ్రీ కిడాంబి రామానుజాచార్యుల వారు (M. A.B. L) (1858-1929). రామానుజస్వామి గారు ప్రథమమునుండియు వంశక్రమాగతమైన సంస్కృతమునందే గాక ప్రాకృత భాషయందును పరిశ్రమ గావించుచుండెడివారు.

వారి కాంధ్ర భాషయందును ప్రవేశ మానాడే కలిగినది. పరవస్తు విద్వద్వంశమున, విశేషములలో నది యొకటి. పరవస్తువంశీయు లెంత సంస్కృతభాషా విద్వాంసులో తెలుగుభాషాసంప్రదాయములను, రచనా విధానము నంతగా నెఱిగిన ధీవర్యులు. పరవస్తు రంగాచార్యులవారి యాంధ్రభాషాపాండిత్యము, కవితా రచన, వచన రచన శాకుంతలాది నాటకాంధ్రీకరణము చేతను, విశ్వంక చరిత్రము మున్నగు పద్యరచనల చేతను, సంగ్రహములను శీర నిరూపించుటకై గా వారు ప్రకటించిన హైందవ విజ్ఞాన విషయిక గ్రంథముల చేతను విదితమై యున్నది. శ్రీ భట్టనాథస్వామి గారును తెనుఁగున, యుక్తిశ్రీ భేదోపన్యాసము మొదలగు నుపన్యాసములను వ్రాసియున్నారు. కావున మన రామానుజస్వామి గారికి నాంధ్రభాషా రచన యలవడిన దన్న యదియొక వింతకాదు.

రామానుజస్వామి గారు క్రీ. శ. 1915 సంవత్సరమున విజయనగర సంస్కృత కళాశాలలో, నాంగ్ల భాషోపాధ్యాయులుగా ప్రవేశించి, యావెనుక, సంస్కృత వాఙ్మయ చరిత్రము, సామ్యభాషాతత్త్వ శాస్త్రము (Comparative Philology) బోధించుచుండెడివారు. క్రీ. శ. 1918 లో పి రాకళాశాలలో ఉపాధ్యాయులైరి. ఆవెనుక క్రీ. శ. 1929 లో కళాశాలాధ్యక్షులగు శ్రీ రామానుజాచార్యులవారు స్వర్గస్థులైన వెనుక కళాశాల కధ్యక్షులై, క్రీ. శ. 1942 వఱకు నా పదవియం దుండిరి. వీరి కాలమున నా కళాశాల మహోన్నత దశ నంది పేరు నల్లె విరాజిల్లుచున్నది. ఆంధ్రదేశమునందే కాక భారతవర్షమునఁ బ్రఖ్యాతి కెక్కిన మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయ శాస్త్రి గారు, వ్యాకరణాలంకారాధ్యాపకులు శ్రీ వేదూరి వేంకటశాస్త్రి గారు, మహామహోపాధ్యాయ శ్రీ పేరి లక్ష్మీనారాయణశాస్త్రి గారు, తర్క పండితులు గంటి సూర్యనారాయణ శాస్త్రి గారు, ఆంధ్రవైయాకరణసార్వభౌములు వఝల చిన సీతారామస్వామి శాస్త్రి గారు, నా కళాశాల నలంకరించిన పండితులు. ప్రాచీనపండితులకు నగాధ పాండిత్యమే గాని నవీన పాశ్చాత్యవైజ్ఞానిక సంస్కారము లేదనియు, పాశ్చాత్య విద్యా విజ్ఞాన సంస్కారము బడసి పట్టభద్రులైనవారికి పాండిత్యము కొఱవడు నను మాట లన్నియు వీరి కాలమున నర్థములేనివైనవని చెప్పుట సత్యోక్తియే. అగాధ పాండిత్యము, అద్వితీయ సంస్కృతవికాసము సమ్మేళము చెందిన విశిష్ట సంస్థగా సంస్కృతకళాశాల రూపొందినది. ఈనాడు దేశమున సిద్ధహస్తులగు ప్రసిద్ధసంస్కృతాంధ్రపండితులు: కవులు పెక్కు రీ సంస్కృత కళాశాలకు సంబంధించినవారే.

రామానుజస్వామి గారు విజయనగర సంస్కృత కళాశాలాధ్యక్షపదవియందున్నప్పుడు సంస్కృత కళాశాలాచరిత్రమును సువర్ణాక్షరములతో లిఖింపఁదగిన రెండు మహాకార్యములు జరిగినవి. 1. మహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రి పాదుల షష్టిపూర్త్యుత్సవము. 2. సంస్కృత కళాశాలా సువర్ణోత్సవము.

క్రీ. శ. 1942 వ సంవత్సరమున, శ్రీ రామానుజస్వామి గారు తిరుపతియందు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయాధ్యక్షులుగను, దేవస్థాన సంస్కృతకళాశాలాధ్యక్షులుగను నియమితులై యా పదవియందు పండ్రెండేండ్లు వ్యవహరించి, క్రీ. శ. 1955 సంవత్సరమున, విశ్రాంతిగైకొనిరి. ఇట్లు వారు నలుబది సంవత్సరము లవిచ్ఛిన్నముగా నధ్యాపకత్వమున, పరిశోధనమున జీవితము గడపిరి. విశ్రాంతి గైకొన్నను వారు తమ జీవితాంతమువఱకు పరిశోధన, భాషాసేవ గావించుచు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కార్యనిర్వాహకశిష్టసభాసభ్యులై యుండిరి.

శ్రీ తిరుపతి క్షేత్రమున, మహావిద్వాంసులైన, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి గారలు వీరికాలమున పరిశోధనసంస్థయందు ప్రవర్తిల్లుట, సంగీతసాహిత్యకళాపారగులు, విమర్శకావతంసులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు వీరున్నప్పుడే నియమితులగుటయు, వీరి జీవితమున నొక యదృష్టము.

వీరికాలమున నా యా సంస్థలలో విశేషము లభివృద్ధి నవి.

1) వీరు వేంకటేశ్వర పరిశోధనాలయ పత్రికకు సంపాదకులై దానిని తమ శ్రేణిలోని పరిశోధన పత్రికగా పెంపొందించిరి.

2) వీరికాలమున శ్రీ ప్రభాకర శాస్త్రి గారి మూలమున శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి యుత్కీర్తనములేర్పడి నేటికిని వర్ధిల్లుచున్నవి.

3) తిరుపతి క్షేత్రమున హిందూమతవ్యాప్తికి, బోధనకు, ప్రచారమునకు, నొకపాఠశాల యేర్పడినది. దాని ప్రణాళికను వీరే తయారుచేసిరి.

వీరిట్లు బహుముఖముగా తామున్న సంస్థలకు సంస్తవనీయమైన సేవ గావించినను, కీర్తిప్రతిష్ఠల కాశింపని తత్త్వముగలవారు, స్వధర్మనిర్వహణ కర్మఠులు, మితభాషులు, సౌజన్యపరులు, పరమశాంతస్వభావులు. వీరినిగూర్చి కీర్తిశేషులు ప్రభాకరశాస్త్రి గారిట్లు చెప్పచుండెడివారట.

"మిన్ను విఱిగిపడిన మీదను తొందర
పాలుగారు ప్రిన్సిపాలు గారు."[3]

శ్రీ రామానుజస్వామి గారు సంస్కృతాంధ్రాంగ్లభాషలయందు పరిశోధన వ్యాసములు వ్రాసియున్నారు. వారు ప్రాకృతభాషయందు సిద్ధహస్తులైన పండితులు. ఇక జర్మనుభాషయందు పరిశ్రమ చేసిన తెలుగువారిద్దఱు ముగ్గురిలో వారు గణనీయులు.[4] వారి పరిశోధన విజయనగర మహారాజాంగ్ల కళాశాలా పత్రికతో ప్రారంభమైనది. వారి పరిశోధన వ్యాస వివరము లివి.

సంస్కృతము—సంస్కృత వాఙ్మయమున నాటకములనుగూర్చి వీరు హెచ్చుగా పరిశ్రమించిరి. శ్రీ హర్షుని నాటకత్రయము నాగానందము, ప్రియదర్శిక, రత్నావళి యను మూడింటికి నాంగ్లభాషలో మూలములతో, వివరణములతోను సుసంస్కృతములగు ముద్రణములను ప్రకటించిరి. మఱియు నాటక సంబంధములగు నీ క్రింది వ్యాసము లాంగ్లభాషలో రచించిరి.

1. సంస్కృత నాటకములయందలి కాలవిభజనము—(Time Analysis in Sanskrit Plays.) ఈ వ్యాసమున కాళిదాసాది ప్రసిద్ధనాటకములు పండ్రెండు చేకొనబడినవి.

2. సంస్కృత నాటకములలో విదూషకపాత్ర. (Vidushaka in Sanskrit Plays.)

ఇవి రెండును విజయనగర మహారాజాంగ్ల కళాశాలా పత్రిక 2, 3, 4 సంపుటములలో ప్రకటితములైనవి.

3. సంస్కృత నాటకములయందలి కాలద్వయ వాదము (Double time theory in Sanskrit Plays. K. B. Pathak Commemoration Volume.)

4. సంస్కృత నాటకముల హాస్యరసము—(Humour in Sanskrit Plays. Journal of Sri Venkateswara Oriental Institute Vol V No. I.; Vol VII No. 1.)

5. కాళిదాస శూద్రకుల తారతమ్య పరీక్ష. (Kalidasa and Sudraka. A Comparative study. Gopalakrishnamachar Commemoration Volume).

6. లఘు శబ్దార్థ సర్వస్వము. (Laghu Sabdartha Sarvasvamu J. S. O. R. Vol X) ఇది వారి తాతగారైన వేంకట రంగాచార్యుల వారి గ్రంథమును గూర్చినది.

ఇట్లు వ్యాసములే కాక, "చాళుక్య చరిత్రము" అను పేర సంస్కృత శాసనములలోనున్న చాళుక్య రాజ చరిత్రాంశములను సంధానించిరి. ఇంకను శతకోపయతినిగూర్చి వ్యాసములను, సంస్కృతగ్రంథ సమీక్షలను గావించిరి.

ప్రాకృతము—శ్రీ రామానుజస్వామి గారి కీర్తి ప్రాకృతభాషకు వారొనర్చిన మహత్తర సేవపై నాధారపడియున్నది. సుప్రసిద్ధులైన జైన సమయాచార్యుడగు హేమచంద్రాచార్యుని "దేశీనామ మాల"ను వీరు భండార్కరు పరిశోధనసంస్థ మూలమున ద్వితీయావృత్తిని వెలువరించిరి. ఇందు వారు ప్రాకృత దేశీ పదములకు సద్బుటచ్చు సాజాత్యములైన ద్రావిడ భాషా పదముల

3 దీనిని శ్రీ తిమ్మావఝ్ఝల కోదండరామయ్య గారు నా కెఱుకపఱచిరి.

4. జర్మను భాషయందు పరిశ్రమ చేసినవారిలో మదరాసులో చిల్డ్రెన్స్ గార్డెన్ స్కూలు నడుపుచున్న డాక్టరు వి. యస్. శర్మగారొకరు. వీరు జర్మనీ భాషయందు పండితులు—సీతారామాంజనేయ సంవాదాది గ్రంథములను జర్మనుభాషలోనికి అనువదించిరి.

చూపిరి. నేటి యాంధ్రభాషాతత్త్వ శాస్త్రవేత్తలకీ గ్రంథ మత్యంత ముపాదేయము. మఱియు నీ క్రింది వ్యాసములు వ్రాసిరి.

1. ప్రాకృత భాషాకళాపరిణామము. (The Evolutionary Phase of Prakrit Languages)

2. ప్రాకృత భాషా విభాగములు. (The Division of Prakrit Languages)

3. ప్రాకృత వ్యాకరణమునందలి మతద్వయము (The two achool of Prakrit Grammar). పై మూడును విజయనగరమహారాజ కళాశాలాంగ్ల పత్రికలో ప్రకటితమైనవి.

4. కుందమాలలోని ప్రాకృతము (Prakrit in Kundamala) ఇది సర్ జార్జ్ గ్రియర్సన్ సన్మాన సంచికలో ప్రకటితమైనది.

5. హేమచంద్రుని దేశీనామమాల: త్రివిక్రముని వ్యాకరణమునగల దేశిపద తారతమ్యనిరూపణము. (A Study of Desi words in Trivikrama's Prakrit Grammar in Comparison with these in Hemachanrdas Desi namamala.

6. త్రివిక్రముని వ్యాకరణమున దేశీ పదములు (Desi words in Trivikrama's Gramer.)

జర్మనుభాష: 1. వారు క్రీ. శ. 1924లో డాక్టరు టి. శే. ·డ్డు (బి. యే. పి. హెచ్. డి) జర్మనుభాషలో రచించిన త్రివిక్రముని ప్రాకృతవ్యాకరణ ప్రవేశికను (Introduction to Trivikrama's Prakrit Grammar) నాంగ్లేయ భాషలోని కనువదించిరి. అది భండార్కరు పరిశోధన పత్రిక పదవసంపుటమున నాకాలముననే ప్రకటితమైనది.

2. జర్మను భాషలో ఫ్రుయిటే అను పండితుడు రచించిన భాసుని ప్రాకృతము (Bhasa's Prakrit) అను వ్యాసమును వీరాంగ్లభాషలోని కనువదించిరి.

3. ప్రాకృతమునకు సంబంధించినవే మఱి రెండు వ్యాసములను వీరు జర్మను భాషనుండి యనువదించిరి. J Waekernagal అను జర్మను పండితుడు రచించిన సంస్కృత వ్యాకరణమునందలి అచ్చులు (Treatment of vowels in Sanskrit Grammar) అను వ్యాసమును వీరనువదించిరి.

4. Willibald Kirjel పండితుడు జర్మను భాషలో రచించిన పురాణ పంచలక్షణ ప్రవేశిక (Introduction to Puraua Panchalakshana) అను వ్యాసమును వీరనువదించిరి. ఇవి యన్నియు శ్రీ వేంకటేశ్వర పరిశోధన పత్రికయందు ప్రకటితములు.

తెలుగు: తెలుగు భాషను వీరు పెక్కురచన లందించిరి.

1. సంస్కృతవర్ణసమామ్నాయము. భారతి 7 సం. 1 సం. (1930 జనవరి)

2. సంస్కృత భాషయందలి సర్వనామములు భారతి 8 సం.

3. సంస్కృత ప్రాకృతభాషలు. ఈ తెలుగు వ్యాసము. శ్రీ టి. కె. వేంకటాచార్యులవారిచే సంస్కృతీకరింపబడినది.

4. అచ్‌తోల్పలక్షితములగు ననునాసికాంత స్థలములు. ఈ తెలుగు వ్యాసమును సంస్కృతాంధ్రీకరణమున వేంకటేశ్వర పత్రిక యందు ప్రకటితములు.

5. ఆర్యద్రావిడ భాషలు. ఆంధ్ర పత్రిక తారణ సంవత్సరాదిసంచిక. ఇట్లు సంస్కృత భాషా విషయకమే గాక, తక్కిన వానినిగూర్చి కొన్ని వ్యాసములు గలవు.

6. ఆంధ్రులు: సంస్కృత భాషాసేవ. భారతి రజతోత్సవ సంపుటము.

7. ఆంధ్ర సంస్కృత సంపుటమునకు వారు వ్రాసియిచ్చిన సంస్కృత పండితుల జీవితములు. ఇంకను సంస్కృత భాషలోని వ్యాకరణ విషయములను గూర్చిన వ్యాసము లముద్రితములై యున్నవి.

వారి జీవితకాలములో తమ తాతగారి శబ్దార్థ సర్వస్వమహాగ్రంథమును వెలుగులోనికి దీసికొని వచ్చుట కెంతయు పరిశ్రమజేసిరి. దానిని ముద్రించుట కనువగు ప్రణాళికను తయారుజేసిరి. కాని యది కొనసాగలేదు. నేడు మనము వారికీర్తిని శాశ్వతము చేయుటకు నీక్రింది కార్యము లొనర్పవలసి యున్నది.

1. పత్రికలయందు ప్రకటితములైన వారి వ్యాసము లన్నింటిని, అముద్రితములైన వానిని సంగ్రహించి ప్రకటించుట.

2. ప్రాకృతభాషకు సంబంధించిన వ్యాసములను నాంగ్లభాషలోని కనువదించుట.

3 శబ్దార్థ సర్వస్వ మహాగ్రంథప్రకటనమునకు దోహదమొసంగుట.

సంస్కృత భాషా ప్రాముఖ్యము కరతలామలకమైన యీదినములలో రాష్ట్రీయ కేంద్ర ప్రభుత్వము వారీ మహాకార్యములకు దోడ్పడి, సంస్కృత ప్రాకృతాంధ్ర భాషావాఙ్మయములను సర్వతోముఖముగ నభ్యుదయము ప్రసాదింతురుగాక!

వార్తలు

చంద్రుని వెనుకభాగం

రష్యా ప్రయోగించిన రాకెట్ తీసిన చంద్రమండలం పశ్చాద్భాగం ఫోటోలు మాస్కోలో ప్రచురింపబడ్డాయి. ఈ భాగం గురించి ఇదివరకు ఎవరికీ ఏమీ తెలీదు. ఈ భాగం చదునుగా ఉన్నది. నల్లని పెద్ద మచ్చ ఒకటి, సుమారు 12 చిన్న మచ్చలు ఉన్నాయి. భూగోళంవైపు ఉన్న భాగంలో మిట్టపల్లాలు, అగ్నిగుండాలువంటివి ఉన్నాయి. వెనుకభాగం గుమ్మడికాయవలె ఉన్నది. వెనుకభాగంలో ఉన్న పెద్దమచ్చ అగ్నికుండమని, దీని వ్యాసం 187 మీటర్లని, దీనికి 'మాస్కో సముద్రం' అని పేరుపెట్టారని, చిన్న మచ్చలలో ఒకదానికి ఫ్రెంచి పదార్థ విజ్ఞానశాస్త్రవేత్త ఫెడరిక్ జోలియో క్యూరీ పేరుపెట్టారని రష్యా ప్రకటించింది.

బ్రిటన్‌లో ఎన్నికలు

అక్టోబర్ నెలలో జరిగిన బ్రిటిష్ పార్లమెంటు ఎన్నికలలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కన్సర్వేటివ్ పార్టీ గెలుపొందింది. యుద్ధానంతరం ఈ పార్టీ ఎన్నికలలో గెలుపొందడం ఇది మూడవసారి. కన్సరేటివ్‌లకు క్రితంసారికంటె రెట్టింపు మెజారిటీ వచ్చింది.

మరల చైనా దురాక్రమణ

మన దేశం సరిహద్దులో తిష్ఠవేసిన చైనా దళాలు అక్టోబరు 21 వ తేదీన లడఖ్ ప్రాంతంలోని చాంగ్ చెన్మో లోయలోని మన గస్తీదళాలపై కాల్పులు సాగించి తొమ్మిదిమందిని చంపివేసి, 10 మందిని అరెస్టుచేశాయి. దీనికి భారతప్రభుత్వం తీవ్ర నిరసన తెలిపింది.

లడఖ్‌కు ఉప్పు సరఫరాచేసే అమ్మోఘుర్ సరస్సును, మరికొన్ని పచ్చిక బీళ్లనుకూడా చైనా దళాలు ఆక్రమించాయి. ఇటీవల కొందరు చైనా గూఢచారులు పశ్చిమ బెంగాల్‌లోని కాలింపాంగ్ ప్రాంతంలో ప్రవేశించి వివరాలు సేకరించసాగారని, స్థానికాధికారులకు తెలిసేలోగా కీకారణ్యాలలోకి కాలికి బుద్ధిచెప్పారని తెలుస్తున్నది.

ఆంధ్రలో ప్రధాని పర్యటన

భారత ప్రధాని పండిట్ నెహ్రూ అక్టోబరు 10 వ తేదీ-మహానవమి నుండి నాలుగు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటన జరిపారు. ఆరోజు ఆయన వరంగల్లులో కేంద్ర ఇంజనీరింగ్ కళాశాలకు శంకుస్థాపనచేశారు. అక్కడనుంచి విమానంలో హైదరాబాదుకు వెళ్ళి మరునాడు మెడ్‌నగర్‌లో అధికార వికేంద్రీకరణకు జరిగిన పంచాయతీ సమితి ప్రారంభోత్సవం జరిపారు. ఆ సాయంత్రం వనపర్తికి వెళ్లి అక్కడ సాంకేతిక విద్యా శిక్షణ సంస్థకు ప్రారంభోత్సవం జరిపారు. మూడవనాడు సాయంకాలం విజయవాడ బహిరంగసభలో ప్రసంగించారు. ఉదయం మాచెర్లకువెళ్లి నాగార్జునసాగర్‌కు శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతానికి 'విజయపురి' అని నామకరణం చేశారు. నాల్గోరోజు ఉదయం రైలులో తిరుపతికి బయలుదేరి దారిలో తెనాలిలో సహకార నూలుమిల్లు భవనాలకు శంకుస్థాపన చేశారు. తిరుపతి చేరి శ్రీ వెంకటేశ్వరుల దర్శనం చేసుకొన్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇంజనీరింగు కళాశాలకు శంకుస్థాపన చేశారు; నృత్య సంగీత కళాశాలకు ప్రారంభోత్సవం జరిపారు.

అఖిలభారత రచయితల మహాసభ

అఖిలభారత రచయితల మహాసభ ఈ సంవత్సరం డిసెంబరు నెలలో మద్రాసులో జరుగనున్నది. 1930 నుంచి దక్షిణ భారత భాషలలో వెలువడిన గ్రంథాల వివరాలను ఈ సభ సమావేశకర్తలు సేకరిస్తున్నారు. ఈ వివరాలను "అఖిలభారత రచయితల మహాసభ, కార్యదర్శి కార్యాలయం, 68, బిగ్ స్ట్రీట్, తిరువల్లిక్కేణి, మద్రాసు-5" చిరునామాకు పంపాలని సమావేశకర్తలు కోరారు.

ఇండో-పాక్ తూర్పుసరిహద్దు

ఇండియా-పాకిస్తాన్ తూర్పుసరిహద్దు (అస్సాం, పశ్చిమబెంగాల్-తూర్పు పాకిస్తాన్ సరిహద్దు) వివాదాలు అక్టోబరు 23 వ తేదీన పరిష్కారమయ్యాయి. ఢిల్లీలో ఈ విషయమైన జరిగిన చర్చలలో ఇండియా పక్షాన కేంద్రప్రభుత్వమంత్రి సర్దార్ స్వర్ణసింగ్, పాకిస్తాన్ పక్షాన లెఫ్టినెంట్ జనరల్ షేక్ పాల్గొన్నారు.

డాక్టర్ జి. వి. సుబ్బారావు మృతి

సుప్రసిద్ధ నటులు డాక్టర్ గోవిందరాజు సుబ్బారావుగారు అక్టోబరు 23 వ తేదీన చెన్నపురిలో స్వగృహంలో మరణించారు. వీరి వయస్సు 64 సంవత్సరాలు. డాక్టర్ సుబ్బారావుగారు తెనాలి వాస్తవ్యులు. వైద్యులుగా, నటులుగా పేరుగడించారు. బుస్సీ, యుగంధరుడు, గిరీశం పాత్రలను అనన్యసామాన్యంగా నిర్వహించారు. 1938 లో సినిమారంగంలో ప్రవేశించారు. "మాలపిల్ల" చిత్రంలో సుందరామశాస్త్రి; "బాలనాగమ్మ" చిత్రంలో మాయలమరాఠీ పాత్రలు తెలుగువారు విస్మరింపరానివి.

ద్విపద భారతము: బాలసరస్వతి లోపాలు

శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ

ద్విపద భారతకర్తలలో రెండవవాడు బాల సరస్వతి. ఇతడు తిమ్మయ్యకు (ఆదిపర్వకర్త) శిష్యుడో శిష్యప్రాయుడో అయి ఉండువనియు, అందుచే నాత డితనిని సహాయునిగా గొని యీ రచన నుపక్రమించి యుండునవియు, తానాదిపర్వ రచన మారంభించి సభాపర్వ నిర్వాహణము నీతనిపరము చేసి యుండునవియు, నీతని రచన యంతపసిగా లేకపోవుటచే నంతతో నితని నాపనినుండి విరమింపజేసి తిమ్మయయే ఆరణ్యపర్వము మొదలు ద్రోణపర్వాంతము ద్విపదీకరించి యుండునవియు నభిప్రాయపడుటకు వీలుగానున్నది. మొత్త మీగ్రంథములో నొక్క సభాపర్వముమాత్రమే బాలసరస్వతిపేర కన్పట్టుట, అది పర్వ నిర్వాహణానంతరము ఆరణ్యపర్వాదులు మరల తిమ్మయకృతులుగానే వెలయుటపై నా యూహకు గొంతవరకు కారణములు. ఏమైన నేమి, ద్విపద భారత కర్తలలో ఈతనికిని ఒకింతచోటు దొరికినది. ఆ మహాగ్రంథమందు ఈ బాలకవి పేరు చిరస్థాయిగా నిలచినది.

అయితే, ఆ స్థానమెట్టిది? అతని రచనావిధాన మే తీరున నున్నది? తిక్కన యిరువురితో నీతడు చేతులు కలిపినాడా, లేక ప్రత్యేకముగా నిలిచినాడా? అను విషయములను గూర్చి యించుక వివరింతును.

ఇతడు కావ్య నాటకాలంకారాదులను చదివినవాడై యుండవచ్చునని సభాపర్వాశ్వాసాంతములందలి "అసమసాహిత్యవిద్యాదక్షుర్మ్మ" బిరుదము చాటుచున్నది. కాని యాంధ్రభాషా పరిజ్ఞానము నెడను, తెనుగు కవితయందును అంత యొక్కువ పరిశ్రమ కలవాడుగా చూపట్టడు. తిమ్మయయొద్దనుండి యొబుసుపోకకై ఛందస్సు నేర్చుకొని యెదో కవితయల్లుటమాత్రమె కొంత యభ్యసించియుండును. 'సాహిత్యవిద్యాధురీణుడుగదా! ఆపాటి ద్విపదా వితయల్ల లేడా' యని విశ్వసముచే తిమ్మయ సభాపర్వరచన యీతనిపరము చేసి యుండును. 'సంస్కృతములో సాహిత్యము కలుగగదా ఆపాటి తెనుగుముక్కలు ద్విపదలో వ్రాయలేనా!' అను "ధీమా"తో ఈతడా కార్యమునకు సిద్ధపడియు నుండును. కాని యీతని ప్రయత్న మంత సార్థకము కాలేదు. సంస్కృత సాహిత్యమును దేశి రచనల కుపయోగించు నేర్పు ఇతని కున్నట్లు తోపదు. అసలు, సంస్కృత పాండిత్యబలము వేరు; తెనుగులో జాతీయముగ కవిత చెప్పుట, అందును దేశిరచన సాగించుట వేరు. కేవల పాండిత్యబలము గలిగి, ఛందస్సుమాత్రము నేర్చుకొని, ఆంధ్రకవితాస్వరూపమును, తెనుగు నుడికారము సొంపును ఊహించుట్టుగా నెఱుగని వారి చేతబడిన దేశిరచనలు మత్తగజముల చేతబడిన మల్లెదండలై నలినలియగును.

అట్లని, ఆంధ్రకవితకు సంస్కృత సాహిత్య మక్కరలేదనియు, సంస్కృతపండితులు తెలుగు కవిత నల్లలేరనియు పైమాటలకు విపరీతార్థకల్పనము మాత్రము చేయకూడదు. "తెనుగెఱుగని సంస్కృతంబు తెన్నే మెఱుగు"నన్న నానుడిని తెలియనివాడను గాను. అయితే సంస్కృత సాహిత్య ముపస్కారకముగా నున్నంతవరకే దేశికవిత రాణించును గాని, లేకున్నచో ఆ కృతి యాకృతి చెడుటయే గాక అందలి యందమును నుందగించును. లేదా, కేవల పాండిత్య బలము గలదుగదా యను నహంభావముతో దేశిరచనల తీరు తెన్నూ తెలియక కేవల ఛందోజ్ఞానముతో వానిని రచింప సాహసించినచో అవ్వానిలు నీరసముగా చప్పగా నుండునవియే నా యభిప్రాయము.

ఇంచుమించు ఈ పరిస్థితియే బాలసరస్వతి రచనకు తటస్థించినది. ద్విపదభారత రచనా గౌరవములో నొకపాలు పంచుకొనజాలి, గంటము పట్టినాడే గాని యీతడాంధ్రకవితాస్వరూపమును గాని, దేశిరచనా వైశిష్ట్యమును గాని గుర్తించినట్లు తోపదు. అందును సంస్కృతభూయిష్ఠముగ మార్గకవితగా వెలసిన కవిత్రయభారతమును ద్విపదలోని కవతరింపజేయుటలోని ప్రయోజనము నే మనసున నిడుకొన్నట్లగపడదు. అందుచే చిత్తమువచ్చినతీరున నేదో 'గోలికి' పార

నైచినాడు. ఈతని వ్రాతమూచి తిమ్మయ అసంతృప్తి చెంది అంతతో నాతని నావనినుండి విరమింపచేసి యుండెను. ఈ "అసమ సాహిత్యవిద్యాచతుర్ముఖు"ని రచనావిధానమును గూర్చి యించుక ముచ్చటించి విశుతును. దయచేసి చిత్తగింపుడు.

ఈతడు తిమ్మయ ప్రణాళికను పరిశీలించి యా విధానము ననుసరించినట్లు లేదు. ఇక, స్వతంత్రించి మరియొక ప్రణాళిక చేతో చేర్పరచుకొనెనా యన్న నదియును దూపట్టదు. 'ఇట్లు రచింపవలె'నన్న యొక నియమముగూడ నీతని కున్నట్లు తోపదు. తిమ్మయ "ఈవిధముగా రచన సాగింపు"మని యేవో కొన్ని పద్ధతులు బోధించియుండెను. ఆ సూచనలలో తలకెక్కినవిలు గనున్న వానిని గుర్తించి, తనకు తోచిన త్రోవలను త్రొక్కినాడు. అందు మొదటిది నన్నయ రచన యందలి విషయములను యథేచ్ఛగా వదలివేయుట.

సభాపర్వమునకు జీవగఱ్ఱలైన మానవ శారీరక రుజా ప్రతీకారోపాయములు, అర్థార్జనవిధాన ప్రయోజనములు, మంత్రులను యోగ్యులగువారి నధికారులుగా నియోగించు విధానము, యుద్ధమున మరణించినవారి కుటుంబములను రాజు పోషించుట, లబ్ధులు ముమ్పులు మున్నగు నరియొక ప్రభువు మెలగవలసిన తీరులు ఆదిగా అమూల్యవిషయములను విడనాడి, ఖాండవాగ్నినుండి కాపాడినందులకు అర్జునునియెడ కృతజ్ఞత చూపుటకై వచ్చిన మయుని పాండవసభా ప్రవేశముతో కథను మొదలిడి, మయసభా నిర్మాణము ఇంద్రాది దేవసభా వర్ణనము, కృష్ణుడింద్రప్రస్థమునకు వచ్చుట, రాజసూయము సేయుమని భీమార్జునులు ధర్మజాన కుతూహలము గలిగించుట మున్నగు ముఖ్యవిషయములను మాత్రప్రాయముగా గైకొని రచన సాగించుచు,

1. "ఎందేని సర్వభూతేశుండు సృజియించె
సచరాచరములైన జగములెల్ల"
(నన్నయ. సభా. 1-9)

ఆదిగాగల మూలమును

"మనసిజారాతి సమస్తలోకములను
సచరాచరంబైన జగముల నెల్లం
బ్రచురంబుగా సృజింపంగం బూనెనో కొ!"
(బాల స. సభా. 4. పు)

అని యస్పష్టముగా ననుకరించుచు,

2. చోరభయ వర్జితముగా
ధారుణిం బాలింతె! యధిక ధనలోభమునన్
జోరుల రక్షింపరుగా
వారలచే ధనముగొని భవత్ భృత్యవరుల్
(నన్నయ. సభా. 1-42)

అని నన్నయ భారతములో స్పష్టముగా నున్న విషయములను

"పరికింపంగాం జోరభయవర్జితముగ
ధరణిం బాలింతువే? ధనలోభమునకు
దండిం జేపుకదా తిస్కారవలివి."
(బాల. స. సభా. 12. పు)

అని ప్రయోజనరహితముగా మూలభావములను తారుమారు చేయుచు,

3. "అవరజ్ఞాతోడి చింతనము...దీర్ఘచింత... అర్థంబులయందనర్థచింత......యనంబరగిన రాజదోషములం బరిహరింతె..." (నన్నయ. సభా. 1-86.)

అని నన్నయ సభలో విశేషముగా నాడినమాటను

"మహాప్రమత్తతయు నర్థచింత
చింతింపం గ్రోధంబు శీఘ్రచింతయును
దెలుంగొప్ప వర్ధంబు స్మృతి దాంపకునికి"
బాల స. సభా. 498. పు.)

ఆదిగా మూలవిరుద్ధములగు వ్రాతలు వ్రాయుచు ఇచ్చవచ్చిన తెరగున రచించి, సభాపర్వము పూర్తి చేసినాడు. ఈతడు విడిచిన వానిలోనా అర్థము లేదు; చేపట్టినవానిలోనా సరసత దూపట్టదు; మార్చినవానిలోనా ప్రయోజనము సున్న. ఇట్లు సాగిన దీతని సభాపర్వరచన. దానినంతను ఇంకను వివరముగా ఉదాహరణలతో చూపి చెప్పినచో పాఠకులకు విసువు జనించును. అట్టి యపచారము చేయలేను. కనుక నింతతో నితనిని వదలివైచి, అర్థాధికముగా నిందలి పర్వముల రచనను నిర్వహించి, తిమ్మయ మొదలిడిన ద్విపద భారత మహాసౌధనిర్మాణమునకు శిఖరముకట్టి భరతవాక్యము చెప్పిన మహానుభావుడు సోమనను దర్శింతము.

కథావస్తువు పోయింది!

శ్రీ కె. బాబూరావు

కథా వస్తువు పోయింది.
ఎంత ప్రమాదం!
అందబోతోన్న ప్రేయసి పెదాలు ఒక్క-
సారిగా అదృశ్యమయినంత!
వికసించబోతోన్న మల్లె
రాలి పోయినంత!
అర్ధరాత్రి ఓటమితో ఆత్మహత్య
చేసుకున్న యువజీవితమంత!
అగ్నిపర్వతం బ్రద్దలైనంత
అంతెందుకు?
భూమి పరిభ్రమిస్తూనే
గతి తప్పినంత!

నా హృదయం భగ్గుమంది.
మంటలు లేచాయి.
గాలి వేడెక్కింది
రొప్పుతున్నారు జనం
చేతుల్లో కడవలు
కడవల్లో నీళ్లు
మరి పైరింజను?
'దేవా!' ఎక్కడో ఓ భక్తురాలు.

ఏమైంది?
అయ్యో! ఏమ్రా! ఏం చేసేవ?
చేయి జారిందే!
ప్రియురాలా!—కాదు
అందమా!—?
మరి?
ఆనందం!
ఎక్కడ?

ప్రేమగాథేమో!
అబ్బాయి అమ్మాయిని కల్సుకున్నాడు
గాలి వీచింది.
సుహాసాలు—
మత్తెక్కింది వాతావరణం.
నక్షత్రాలు నాట్యం చేస్తున్నాయేమిటి?
ఎబ్బే! కాదు. ఇది ఆక్రోశం.
అయ్యో! ఆక్రోశం కాదు చిట్టితండ్రీ
విరహం!—వైరాగ్యం-?
దేని కేది పొత్తు?
ఏమనాలి?
అంతా అయిపోయింది.
అందం భ్రమసింది.
కళ్లు నెత్తికెక్కాయి.
లేకపోతే—
బాబో—ఎలా—
అవును—ఆకలి
తుచ్ఛమైన కోర్కె
పరమేశ్వరుడు సత్యం!

అబ్బా! అలాగేం?
ఏం?
ఈ అమానుషత్వం
ఈ వైషమ్యం
ఈ దోపిడి
ఈ దారిద్ర్యం
ఏమైనా యంటావ్?
'పో రా!'
ఆఁ!

ప్రేయసి కనుకొలకుల్లో నీళ్ళుచూడు
కాముకి కళ్ళల్లో దైన్యం కన్పడలా!
ఆశల తుంపులు
విసిగిన ప్రాణాలు
వాడిన పూలు
చస్తోన్న బతుకులు
బీటతీసిన పొలాలు
బలికున్న హృదయాలు
విరిగిన పాలు
వీరందరి జీవాలు
కవి కల్పించిన కావ్యకన్నె
'ఆ అమ్మాయి! ఎవరు?'
అవునూ —
ఆ కన్నె కళ్ళల్లో బతుకుచూడు
ఆ వెనక దారిద్ర్యం చూడు
జీవనం మన భావం
భావం వెనుక నిశ్చయం.

నిశ్చయంలో ఆశ
ఆశలో నిరాశ
నిరాశ వెనుక వ్యవస్థ
వ్యవస్థ?
వ్యవస్థ వృద్ధు —
అయ్యో! పండిన వృద్ధుకాదు
అదే లోపం -
సాక్షిగా ముసిలైంది

జ్ఞానం శూన్యం
భావ అహం
కాయం స్థూలం
ధ్యేయం గతం
కాదు
అవును
అవును
కాదు

పిల్లలు—ఆశాదీపికలు
గతాన్ని ప్రశ్నించారు
నేటిని నిలవేశారు
ముందేదో వుందన్నారు.
అమ్మమ్మ ఏమందంటే
నాలుగు మొట్టింది
కవ్వం తాడులో
కట్టివేద్దా మనుకుంది.
పాపం! అవ్వ ఆశ
(మనకు నిరాశ)
అయితే ఫేలయింది.
సముద్రం ఎందుకో వుప్పొంగింది.
ఆకాశంలో ఇంకో నక్షత్రం
కాంతి సంవత్సరాల్ని అధిగమించింది
మానవుడు వాతావరణాన్ని
ఛేదించాడు.
ఎందుకో ఆకాశంలోకి ప్రయాణం
సమకట్టాడు.
విచిత్రం కాదయ్యా!
నక్షత్రాలకు సమీపంగా -
కంటిపాపలో ఎర్రనిజీర
కోపమా!
అనురాగం కదూ!
అనాగరికం ఆరోగ్యమా?
ఆడవాళ్ళ అందం జామపండు!
అందం నాగరికమా!
నాగరికం అందం
బియ్యంలో రాళ్ళు
దేహంలో కాళ్ళు
గుండెల్లో రైళ్ళు -
కుళ్ళింది ప్రపంచం
మళ్ళింది వెనక్కు—
వెళ్ళింది త్రిశంకు -

అశల భూతం
అసజయాల రాకాసి
రాకాసి - భూతాల
రణరంగం
పీనుగుల పెంట.
బుద్ధి రాలేదూ!
నేచెప్తే విన్నా!
ఏమన్నావ్!
యుద్ధ నినాదం
శాంతి పునాది
హు! అవునా?
చెప్తా విను.
  శాంతే పూస్తుంది
  పూవులు అందం
  అందం ఆనందం
  ఆనందం అర్ణవం
  క్రొత్త జీవనం
నినాద ఫలంకాదు
శాంతి ఫలమాత్రం
కాదిది అసత్యం
నిజమైన నిజం.
  అబద్ధాల పుట్టలో
  నిజాల అనుమానం
  ఇది అనాదిదే
గెలీలియో చచ్చిపోయాడు
  ప్రేమకోసం పాపం-!
  బ్రతుకోసం అయ్యో-!
కాదు బాబూ!
నిజంకోసం
నిజమైన నిజం
నిజంగా చెప్పాడు.
  'వురే! వెధావాయ్
  అబద్దాలకోరివి కావూ!
  మరీ మాటల గారడీ!'
అర్థం కాలా—!
నేను అదికవిని
సుకవిని
కుకవిని
భావకవిని
ఇంకో— ఇంకో కవిని
కాదు.
నేను నేనే—
ఇరవయ్యో శతాబ్దపు ఉత్తరార్థపౌరుణ్ని
అందుకే ఇదంతా నాది
ఈ జీవితం నాది
ఈ వ్యవస్థ నాది
ఈ దుర్మార్గం నాది
ఈ ఇనుప తెర నాది
నా వెనుక
లో లోపల
నాలో
నామదిలో
నా హృదిలో
నా శరీరంలో
ఏముంటే అదే ఇది
నీకేం! ఎన్నయినా చెప్తావు -
ఒడ్డున కూర్చున్నావు.
అనుక్షణం నాలో ప్రవహించే
జీవనగీతం - నా వాణి
ప్రకృతికి పరిసరాలకి
నాకేదో సంబంధం
సాహిత్యానికి జీవనానికి
వున్నట్టే వుందని
చెబ్తూంటుంది - నా రాణి
మేల్కొలుపుతూంటుంది.

నా రాణి నయనాల్లో
నా ప్రతిబింబం చూస్తే
'ఇన్నినాళ్ళ నాలోని ఆవేశాలు
మార్పు కావాలనే భావాలు
మండుతోన్న అగ్నిజ్వాలలు'
చెప్పకుండ వుండలేను
(మనది రహస్యసమావేశం కాదుసుమా!)
ఈ స్వప్నం జయమవుతుంది.
కలల్లో కల అలలు
ఎగిరెగిరి విరిగాయి.
నా జీవన భానుడు
వుదయించెను
తెచ్చితిదె అందుకో
కలల మల్లెల మాల
రాబోయే రోజుల
అందాల కోవెల —
చీకటిని తోలేకాపు
నక్షత్రాల మధ్య
ఆకాశంలో
(శూన్యం కాదు-మనలో ఎంతవిశాలం)
అంతర్లోకాల
అంతర్గత భావాల
అంతులేని అలల
అంబరమంతా తనది
అందమంతా తనది
ఇదే మనందరి అవధి.
కాదంటం నీ వాదం
సారంలో చవిటిభూమి
సారం చేసే అగామి
నేటి మన రైతు
నాగేటి చాటున
నాగుల కాట్లల్లో
విషం! విషం
రైతుకు పాపం -

చెమటలు
నురగలు
మునకలు
క్షణంలో శాస్త్రకారుడు
ఏమయ్యా! ఏమంటావ్!
మంత్రం నిమిత్తం లేకుండా
చింతపిక్కలు రాల్చాడు.
తాటాకిళ్ళు
వీధి బళ్ళు
నెర్రల బీళ్ళు
పోయి
పచ్చని పైర్లు
కారు పైర్లు
పెంకుటిళ్ళు
వచ్చాయంటే
ఏమంటున్నావ్!
విధా!

వీధిలో పడ్డా
ఛీ! అబ్బబ్బ!
ఏమి టీ దోమలు!
ఇక్కడుండేదెలా?
ఇదంతా ఏమిటి నాలో?
ఎక్కడా మొదలు?
కథా వస్తువు కదూ పోయింది?
అవును—!
మరి
మరోటి వచ్చిందే
అదే చిత్రం -
విచిత్రం
పాత పునాదిపై
కొత్త స్వప్నాల భవనం
వింత కాంతితో
ఉదయిస్తుందీ.

కథకళి సాహిత్యము

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

[గతసంచిక తరువాయి]

కథకళి సాహిత్యములో నలచరిత్ర నాటకమణి. దీని రచయిత 'ఉణ్ణాయివారియర్'. ఔచిత్యము జీవనర్మముగా గణించి చెప్పిన ప్రముఖ కవులలో నితడొక్కడు. కథాఘటనము, పాత్రసృష్టి మొదలగు నన్ని ధర్మముల నీత డెంతయో చక్కగా పోషించెను. ఈ గుణములలో నీతనిబోలు సాహిత్యకారులు చాల కొద్ది. అట్టకథాకారులలో నిట్టివారు లేరనే చెప్పవచ్చు.

ఉణ్ణాయివారియర్ కాలమును గూర్చి యా విమర్శకులలో నేపలు చర్చ లున్నవి. 'తుళ్లల్' వ్రాసిన కుంజనంబియారును, నితనును గలిసి, కొంతకాలము తిరువనంతపురమునం దుండిరని చెప్పుదురు. కేరళరాజులలో ధూతల వీరమార్తాండవర్మ మహాప్రసిద్ధుడు. అతని కాలమునందే వారియర్ తిరువనంతపురమునకు వచ్చెనందురు. అతని చక్కని రాజాదరణను బొందినది 'కార్తిక తిరునాళ్ రామవర్మ' రాజు కాలమున. 'వారియర్' నాటకములు వ్రాయుటకు బూనియున్నచో, సంస్కృత నాటకకర్తల వంగుకొనియుండునని వారందురు. 'అట్టకథల'లో నీతడు ప్రవేశపెట్టిన నాటకలక్షణము లట్టివి! ఈతని పాత్ర లెంతయో స్వాభావికముగ ప్రవర్తించును. శబ్దార్థములతో బాలకులను మెప్పించుటకంటెను జీవితరంగములు, జీవితానుభవములు వివరించి హృదయమును గరగించుటయే యీతనికి ప్రీతి. మొదటిరాత్రి కథలో సరస్వతితో గవి యిట్లనిపించినాడు:—

[13]కనక్కు మర్థవుమ్, బునకణక్క ప్పదవింయుం
అనర్గళం, యమకవు మనుప్రాస ఉపమాది
ఇణక్కం కలర్న్న, రమ్యం నల్ సారస్వతం"

కవి, ఈ మాట లెందు కనిపించవలసివచ్చెనో కాని యీతని రచనలో వీని ప్రభావము చాల తక్కువ. కవికన్న వీనికతీతమైన యౌచిత్యమంగును తదనుగతమైన రసమందును కథావస్తువుగ 'నలచరిత్ర' మెన్నుకొనుటలోనే మన మీతని దృష్టిని కొంత గమనింపవచ్చును. జీవితములో దురూహములైన యెన్ని భావములనో యది వివరించును; కరుణరసమును జిత్రించుటకు, ఇట్టి కథ మఱియొకటి దొరకదు; కాని యంత మాత్రమే 'వారియర్' వ్యక్తిత్వము గాదు. ఈ కథను వ్రాసిన కవు లెందరో యున్నారు. మొదట వ్యాసభగవానుడు దీనిని వివరించెను. హర్షుడీ కథను మహాకావ్యముగ సృష్టించినాడు. మలయాళమందే 'నైషధ చంపు' వొక టున్నది. వ్యాసులకథ యెట్లున్నను తక్కినవారెవ్వరును 'వారియర్' వంటి హృదయ పరిపాకమున్నవారు గారు. సుకుమార కోమలమైన యీ కథను వ్యాసభగవానుడు యిర్వదియొనిమిది యధ్యాయములలో వర్ణించినాడు. హర్షు డిర్వదిరెండు సర్గలలో బ్రపంచించెను. ఈ కథ నింత విస్తరించుటచే దాని భావదార్ఢ్యము పలుచబడిన దనవచ్చును. హర్షుని రచనము జదివినప్పుడు పాండిత్య మల్లుడైన యొక విద్వాంసుని శబ్దార్థముల యింద్రజాలమే మనకు గనపడునది. కథ యాతని వ్యుత్పన్నత కొక యంగము మాత్రమే. మలయాళ చంపూ రచయిత యీ కథలో శృంగారమును నింపివేసినాడు.

మూలగ్రంథములో వృత్తాంతాలైన కథాగాత్రమును గ్రహించి, 'వారియరు' దానిని కృతికోమలమైన యొక కళాశిల్పముగా మలచెను. కథ నెంతయో సంక్షేపించినాడు. చెప్పవలసిన భావములను ఔచిత్యమును వదలక సూటిగా బలుకును. అతని రచనలో నప్రసక్త మొక విషయము దొరకదు. ఔచిత్యము లేని యొక సన్నివేశము, సంభాషణము లేదు. ఈ అట్టకథను చదువుచున్నప్పుడు మన తిక్కనార్యుని కళాశిల్పలేశమును బంచికొని కేరళమున నెవడో పుట్టినట్లు మనము భావింతుము. బ్రహ్మాండమైన కథనంతయు నాతడు నాల్గు ఖండములలో ముగించినాడు. దీనితో గథ కెంతయో గాంభీర్య

---

18 చక్కని యర్థము, బుధులు గమనించు ననర్గళ శబ్దసంపత్తియు, శబ్దార్థాలంకారముల యందము గలిగినదే చక్కని సారస్వతము.

చేర్పు చేసినది. కథాశరీరమును మలచుటయందే గాదు, శైలియందు గూడ నంతే. 'అల్పశబ్దములతో ననల్పార్థములు' సాధించుట యతని లక్ష్యము. కొన్నిచోట్ల నాతడు "ఉండెమ్మాళ్ల విల్ల", "ఇల్లెమ్మాళ్ల విల్ల"— యిట్లు ప్రాచీన మాత్రశైలి ననుసరించి వ్రాయును. తనభావమును చెప్పుటకు వ్యాకరణము అడ్డము వచ్చినప్పుడు, దాని నుల్లంఘించుటకు గూడ నాతడు వెనుదీయడు. సంగీతమును గూడ నాతడు పోషించి కొన వలసియుండుటచే కొన్ని పదముల తలలు - తోకలు మాయ్చుటయు సంభవించుచుండును. అవసరమును బట్టి, పదములు సృష్టించికొనును. సాధారణముగా 'నాట్య కథాకారులకు' పాత్రసృష్టిలో దృష్టి లేదు. పురాణకర్తలను ముందుంచికొని వారుపోయిన త్రోవనే పోవుచుందురు. కొట్టయకవులలో 'ఎజుత్తచ్చన్', 'కణ్ణశ్శ పణిక్కరు' మాత్రమే కొంత పాత్రసృష్టియందు కన్నుంచినది. 'నలచరిత్ర కర్త శిల్పమిందుకు భిన్నమైనది. కథ నాధారముగా జేసికొని యాతడు లోకతత్త్వమును జీవిత సత్యములను కొన్నిటిని వివరించి చెప్పెను. అనుభూతులను, మనోవికారములను చిత్రించెను. కళాపూర్ణమైన యాతని కథాశిల్పములో పాత్రలు ప్రభాతకాలమున తళతళ మెఱయు లేదీగలు.

'వారియరు' వర్ణించిన పన్నివేశముల రీతులు చెప్పలేదని కాదు. కాని వానినే యాతడు చెప్పుటలో నొకశిల్పమును జోడించి చెప్పెను. వ్యక్తిత్వమున్న కవి సృష్టిలోని రహస్యమదే. దమయంతి హంసను పట్టుకొను సందర్భములో నాత డామె నిట్లుచ్చరింప జేసినాడు. 14 "యౌవనందన్ను గిచ్చిట్టుం చెరుతాయిల్ల చెరుప్పం". అది బాల్యయౌవనముల సంధికాలము. అందుకు దగినట్లే యావిడ చెలికత్తెతో—

15 "త్తోళ్లేనే ఞాన్ కైకల్ కొండు
తోజియారే! కైయ్యాల్
కిట్టుకిల్ నన్నాయిరున్ను కేళి పెయ్యాన్"

అని జంకులో నమాయికురాలివలె మాటలాడుచు ప్రవేశించును. నలచరిత్రలో దమయంతి యొక యింద్రధనువు. ప్రియు సమాగమమునకై యుత్కంఠతో విలవిలలాడుచున్న క్రీడావతి యామె. ప్రతి నాయకుల ప్రేమార్థనను నిర్దాక్షిణ్యముగ దస్కరించు ధీర యువతి; స్వయంవర రంగమున దేవతల కూట నీతిని "త్రిభువనసంకట కారరికర్ పోల్" అని ప్రశ్నించిన సాహసవతి; అక్షద్యూతమునకు బోవుచున్న విభుని నిషేధించియు, జూదమందోడిపోయిన నలు ననుగమించి సకల కష్టములను క్షమాపూర్వకముగ సహించిన స్నేహమయి; స్థిరచిత్త యయిన భార్య; రెండవ స్వయంవరమును చాటింపించి, తనకోర్కను సాధించికొన్న నిశితబుద్ధిశాలిని; ప్రగల్భయైన యువతి. ఈ ఘట్టములందెల్లను స్వభావానురూపముగ కవి యామె మనఃకక్ష్యలను చిత్రించినాడు.

నలునిపాత్ర గూడ నట్టే యున్నది. స్వయంవరానంతరము వారి వెన్నెల రాత్రులు, వసంత విహారములు ఎంతయో రంజకములుగా దయారైనవి. నా రాడుకొన్న మాటలలో మెలగిన వర్తనములలో సభ్యతయు, నౌచిత్యమును నా కవి చూచిపెట్టెను. ఇంతలో నలునిదశ మారినది. ఘోరవిపినమునందలి వారి జీవితమును వర్ణించెడి పట్ల 'వారియరు' కరుణ రసమును కుండలతో బోసినాడు. ఋతుపర్ణుని రాజధానిలో నలు డొనర్చిన యీ నిశావిలాపము

16 "విజనే బత మహతి విపినే నీ యుణర్న్నిందు
వననే! పిన్నెంకు పెయ్యు కదనే?"

ఈ పాటలో దాను తప్పుదేపితి నన్న భావము, తదనురూపమైన పశ్చాత్తాపమును ఎంతయో దయనీయముగ వర్ణింపబడినవి.

17 "ఎన్ను కాణ్కు నిందు సామ్యరుచి ముఖం?
ఎన్ను పాణ్కు నింద్రకామ్య ముడలహం?"

అని యాశాభరిత వీక్షణములతో భావి యదృష్టమున కెదురు చూచుచున్నాడు.

'వారియరు' కేవలము పాత్రల మనోవికారములను చిత్రించుటతోనే తృప్తిపడలేదు; అతడొక చింతకుడు కూడ. కష్టానుభవములతో జీరికిపోయిన నలుడు కార్యకారణవిచారములోనికి దిగును. దానిని పురస్కరించికొని విచారప్రవణుడైన యా కవి తన

14 యౌవనము దలచూపినను, బాల్యచాపల్యము గూడ తక్కువగ నుండలేదు.

15 చెలికత్తెలారా! నేను దానిని చేతులతో దాకెదను. చేతికి జిక్కినచో నాడు కొనుట కెంత బాగుండునో!

16 విజనమైన గొప్ప యరణ్యమున వదలి పెట్టబడితివి. నీ వింకేమి చేయుదువు పాపము!

17 చంద్రునివంటి యా ముఖము నెప్పుడు జూతును? ఇంద్రకామ్యమును శరీరము నెప్పుడు పొందెదను!

మనోభావములను బయట పెట్టినాడు. సద్గుణశోభితులైన యీ దంపతులు కష్టము లేల ననుభవించిరి? మనుష్యుని ప్రవృత్తులకును అనుభవములకును గల బంధమేమి? పురుషకారమున కతీతమైన యేదో శక్తి మనుష్యుని నియమించుచున్నది గదా! అట్టిచో మానవుని కున్న స్వాతంత్ర్య మెంతవఱకు? ఈ ప్రశ్నలు కవి హృదయమున బొడసూపినవి. వీనికి సమాధాన మాతడు నలుని నోటనే చెప్పించెను. 'తన జూదమే సర్వకష్టములకును మూలము'ని నలుడే యనుకొన్నాడు. అతనికి 'విధి' యందు విశ్వాస మున్నది. కాని ప్రవృత్తి నివృత్తులు మనుష్యునకు లోబడినవని యాతని భావము. వివేకముతో వానిని సక్రమముగా వినియోగించుకొను మానవునిపై విధి తన విలాసమును సమగ్రముగ ప్రయోగింపలేదు. కర్కోటకుడీ మాటనే,

"[18]ఏతెన్నాకిలు మివన్ విడుమెన్నె, పిన్నె
నీ తన్నె వేణం తవగుణ ఘటనే"

అని నలున కుపదేశించినాడు. సద్గుణములను సంపాదించుకొను బాధ్యత మనుష్యునిదే యని యాతని భావము. పట్టుదల వదలని దమయంతి పురుషకారమే కదా వారి పునస్సమాగమమును సాధించికొన్నది! విధి-పురుషకారము యీ రెంటియొక్క సరసమైన సమ్మేళనమే జీవితమని కవి విశ్వాసము.

కలిపురుషుడు నలుని బాధింపగలుగుటకును నలునిలోగల భోగేచ్ఛ, ముందు వెనుక లరయని సాహసము, యౌవనోల్బణము-ఇవియే కారణములని కవి సూచించెను. వనవాసమునందలి కష్టానుభవములతో మనో మాలిన్యములన్నియు తొలగిపోయినవి. చిత్తము నివాతదీపమువలె నిలుకడకు వచ్చినది. శాంతి కుదిరిన వెంటనే కర్తవ్యము తనంతట తోచినది. మనుష్యుని ప్రవృత్తి పరిశుద్ధమైనచో విధివైపరీత్యము గూడ ఫలింపదు. అంతమాత్రమే గాదు. పురుషునకు దైవయోగ్గి—విధి లొంగిపోవుననియు 'వారియరు' విశ్వాసము. తన కష్టములకన్నిటికిని కారణము జూదమేనని తెలిసి, పశ్చాత్తప్తుడైన నలుని వయోజ్ఞానవృద్ధుడు భీమరాజిట్లోదార్చినాడు.

"శక్తియుండు ముక్తియోళం మాయ ఞ్ఞా-
తత్త మేత ముక్తి చేదు జీతవ
న్నతిలిన తోత్తిళవత్తోజేర్ తోన్నియ
తా నీకోత్తమ; కీర్తిమతాంవర!
పార్థివ ఞా నతివార్ధక బాధితన్
కార్త్తు కోళ్వాన్ మతి తవ మతిగతి"

ముక్తి వరకు పర్యంతము మాయ మానవుని పీడించుచునే యుండును. ఆస్థితి గల్గినంత నది తొలగి పోవునట! కాని—మానవుని ప్రవృత్తి చక్కనిదైనంతనే సంకటములు మాసిపోవుననియు తైహితమున సూచితమైనది. లోకవృద్ధుడైన భీముడు మానవుడు బాగుపడుటకును, నాశమగుటకును వాని బుద్ధియే కారణమని స్పష్టముగ చెప్పుచున్నాడు.

మమకారములు తొలగించికొనుటయే మోక్షమార్గమని కొందరి విశ్వాసము. వారియరు గూడ నిందులకు కేవల వ్యతిరేకి కాడు. కాని మనుష్యుడు సహజములైన మమతా బంధములనుండి తప్పించికొనలేడనియు, తప్పించికొనుట అనావశ్యకమనియు నాతని యభిప్రాయము. మూడవ దినమందలి కథలో జీవకునితో నిట్లనిపించుచున్నాడు.

"ఞాన్ ఎన్ను మెనిక్కిల్లి ఎన్నుం అభిమాన
మెల్లావర్క్కుం తోన్నుం
అనుమాయం అతి మేయం అతఃమాయున్న సుమల్లుంకిల్
కాయం పోకిలుం, తగుపాయం యోగికళ్ కుపదేశం."

'నేను నాది' యను బంధములు మనుష్యునకు సహజములు. వానిని విడిపించికొనుట సాధ్యముకాదు. ఒక వేళ బలవంతముగ విడిపించికొన్నచో ఆ బ్రదుకును జీవితమని చెప్పుటకు వీలులేదు. జనన మరణములనుండి తప్పించికొనవలెనని యోచించు యోగులు దానిని సాధించుకొందురుగాక యని పైవాని కర్థము. సర్వసంగ పరిత్యాగులైన యోగులపై 'వారియర్'కు గౌరవము లేకపోలేదు. కాని వారనుభవించునది జీవితముకాదను నంతవరకే యాతని యాక్షేపము. అతనికి బ్రదుకు కర్మమయము. జీవన్ముక్తియే బ్రదుకునకు లక్ష్యమని భారతీయ విశ్వాసముగదా! ఈ భావముపై నాతనికి గౌరవములేదా! ఉన్నది. కాని—జీవితానుభవముల మూలముననే మనస్సు పక్వమై మానవుడు తరించునని యాతని యూహ. నలునిపాత్ర సాధారణముగా కాని—సరస గంభీరమైన భావముల నెన్నిటినో కవి పలికించినాడు. కేవల భావగాంభీర్యమునకే గాదు, జీవితమునందలి వైవిధ్యమున గూడ నాతనికి సానుభూతి కద్దు. వనమధ్యమున నిషాదు నాతఁ డెంతయో సజీవముగ చిత్రించినాడు. వాని మాటలు, వాని చేష్టలు, కాముక

18. ఎటులైనను, వీడు నిన్ను వదలును. తరువాత నీ సద్గుణములను సంపాదించికొను బాధ్యత నీదే.

సృష్టి స్వభావోచితములై యున్నవి. ఈ యాట్టకథలో బుతుపర్ణుడొక హాస్యపాత్ర. అతని నొక యమాయకునిగ గవి సృష్టించెను. దమయంతీ ద్వితీయ స్వయంవర వార్త వచ్చినది. ఆమె కింతకు ముందే తనపై ప్రణయముండెడిదని ప్రలపనశీలుడైన బ్రాహ్మణుడు పలికి నాడు. ఆ వివాహమునకు 'శాస్త్రము' కామశాస్త్రమని బాహుకుడాక్షేపించెను. ఇరువురును రథముపై బోవుచున్నారు. రథచోదకుడు బాహుకుడు. రథము వాయువేగమున బోవుచున్నది. బుతుపర్ణుని మనస్సు దానిని మించి పరుగెత్తుచున్నది. ఇంతలో నాతని యుత్తరీయము గాలి కెగిరినది. ఈ యపశకునమునకు రాజు దిగ్గ్వగ పడినాడు. సమయమును జూచి సారథి—

"19ఓర్త పొన్నతు చేర్త వసనమో
తార్తేన్ వాణితన్ పాణిగ్రహణమో"

అని పరిహసించెను. ఈ మాటలతో బుతుపర్ణుని మొగము వాడినది. అతని యప్పటిస్థితి దయనీయము. ద్వితీయ వివాహమునగూడ నాతని పాత్ర నవ్వులపాలయినది. అన్నిటికంటె గొప్పహాస్యమేమనగా దన్నితరులు పరిహసించుచున్నారని యాతడు బాగుగ తెలియక పోవుట. అట్లే స్వామి భక్తితో దిక్కు తెలియని బ్రాహ్మణుడు దమయంతీ సందేశమును బూర్తిగా వినకముందే "స్వామి స్వామి" యని పరుగెత్తుట మనకు నవ్వుగొలుపును. ఆ భర్తృసందేశములో నాతడు—

20 "ఞానరియుం మెన్నల్లవన్ మాన మెన్నెయుం
మరియుం"

అని దమయంతి మొగముపై నొక 'హాని' ని విసరి పోవుట చూచి మనము నవ్వకుండ లేము.

కావ్యసృష్టితో నలచరిత్ర మాట్టకథలలో నాయకమణి వంటిది. ఈరచనము గానాత్మకముగదా! అర్థముపైననే దృష్టిని కేంద్రీకరించిన కవి రచనలోని నాదశుద్ధి నెంతగా బోషించినా డనుటయు నొక ప్రశ్నయే. ఆ గుణముగూడ నీతనిలో బుష్కలముగ నున్నది. కేరళమున నీతనిపాటలకున్న ప్రచారము సామాన్యము గాదు. 'కోట్టయత్తంబురాన్', 'ఇరయమ్మన్ తంబి' మొదలైనవారి సంగీత మాపాతమధురము. ఇతని దంత మాత్రమే గాదు; ఆలోచనామృతమును. ఉణ్ణాయివారియరు కవిగా - ఆట్టకథా నిర్మాతగా-సంపాదించికొన్న స్థానము చాల భద్రమైనది.

ఇంతలో దక్షిణదేశచరిత్రలో ధూమకేతువు గనపడినది. టిప్పుసుల్తాను కేరళముపై నెత్తెను. ఉత్తర కేరళ మంతయు నిర్మానుష్యమైనది. దేవాలయములలో దోపిడీలు సాగినవి. పద్మనాభస్వామి కోవెలనుగూడ దోచికొనుటకు వాడు యత్నించినట్లును—ఆ స్వామి దయచే లక్షలాది తేనెటీగ లాక్రమించి సైన్యములను చెదరగొట్టినట్లును నైతిహ్య మున్నది. అప్పుడే 'మార్తాండవర్మ' తనరాజ్య మంతయు పద్మనాభస్వామికి శరణాగతుడై సమర్పించినది. నేటికిని రాజుగా నున్నవాడు విధిగా దినమునకు రెండుమారులైనను స్వామి దర్శనమునకు బోవును. ఆపోవునపు డాత డొక యుష్ణీషమును ధరించును. దానిపై 'పద్మనాభదాస' యని వ్రాయబడియుండును. గర్భగుడిలో నేటికిని స్వామి ముందట నొక యరుగున్నది. ఆ యరుగేనట మార్తాండవర్మ వరపడినచోటు. ఆ యరుగుపై నేవస్తువు జారి పడినను—అది పద్మనాభస్వామిదే. నేటికిని నచ్చటికి బోవు యాత్రికులను పూజారులు "క్రింద నేమియు పడ వేసికొనకుడు" అని హెచ్చరించుచుందురు. టిప్పూ నశింపజేసిన గ్రంథాలయములకు లెక్క లేదు. విద్వాంసులు జీవనమునకై దేశమును వదలివెళ్ళిరి. చాలరోజులకు గాని వారికి తిరిగి రా సాధ్యపడలేదు. తనువులను—ధనములను—మానములను గోల్పోయిన సంసారములు కోకొల్లలు. ఇంతలో టిప్పును బ్రిటిషువా రోడించిరి. ఉత్తరమున 'పళశ్శి' రాజును, దక్షిణమున 'వేలుతంబి దళవాయి' యు బ్రిటిషువారిపై దిరుగబడినారు. ఈ రగడలు గొంతకాలము జరిగినవి. ఈమధ్య కాలమున సాహిత్యరచన లేవియు సాగలేదు. 'కుంజన్ నంబియా'రొక్కడు మాత్రము 'తుళ్ళల్' అనునొక సాహితీ ప్రస్థానము ప్రచారములోనికి దెచ్చెను. 'ఆట్టకథా' సాహిత్యమును మరల యథాస్థితికి దెచ్చినది "అశ్వతి తిరునాళ్ తంబురాన్." అంబరీష చరితము, పూతనామోక్షము, రుక్మిణీస్వయంవరము, పౌండ్రకవధ - యనునవి యాతని కృతులు. కవితాదృష్టితో నివి యంత యుత్తమములు గావు. కాని నాట్యప్రయోగమునకు దగిన గుణము లన్నియు నిందుగలవు.

అతని యనంతరము కథకళి సాహిత్యమునకు మరల గ్రొత్త యుత్పత్తము పట్టినది. అనేకము 'ఆట్టకథ'లు

---

19. గాలికి కొట్టుకొనిపోయినది యుత్తరీయమా? అందమై, తేనెవంటి పలుకులుగల, దమయంతీ పాణిగ్రహణమా?

20. నేనతని తెలుసుకొనుటయే గాదు. అతడు గూడ నన్నెఱుగును.

పుట్టెను. కాని యవి రాజుల మనోవినోదముకొరకు మాత్రమే వ్రాసినవి. కష్టములు దీరినవెంటనే—కథా ప్రకారము—రాజులు భోగలాలసులైనారు. రాజప్రాసాదములయందే 'కథకళి' సంరంభములు జరిగెడివి. వారి చిత్తవృత్తుల ననుసరించుటయే కవులకు ధ్యేయము. జనరంజకమునకై పాటుపడిన స్వతంత్రవ్యక్తియొక్కడునుగూడ నప్పుడు పుట్టలేదు.

స్వాతి తిరునాళ్ కాలము మలయాల సాహిత్యమునకు వసంతము; అతడు గొప్ప వాగ్గేయకారుడు; గీర్వాణకవి; భాషాపోషకుడు. అతని సభలో నెందరో విద్వాంసు లుండిరి. వారిలో ప్రసిద్ధు లిద్దరు. మొదటివాడు యిరయమ్మన్ తంపి; కోయిత్తంబురాన్ రెండవవాడు. ఇతడుగూడ నాట్యకథలను వ్రాసెను.

ఇరయమ్మన్ తంపి చక్కని భావనాశక్తి గలవాడు, అందమును జూచును. లాలసతతో జూచును. అతడు వ్రాసిన పాటలకు లెక్క లేదు. వానికున్న ప్రచారమును సామాన్యముగాదు. కొన్ని శృంగార పదములు గూడ 'ఇరయమ్మన్' వ్రాసినాడు. మన 'క్షేత్రయ్య'లోని గుణము వానిలో నెక్కువ. అతని సుఖలోలుపత రచనలో నొకానొక స్వప్నలోకమును సృష్టించినదే కాని వాస్తవజగత్తునకు దిగిరాదు.

నాటి తిరువనంతపుర మొక గంధర్వలోకము. అక్కడ ప్రదర్శింపబడని లలితకళ లేదు. సంగీతము నాటకములు నృత్యములు విద్యలవికి చెలరేగినవి. భారతదేశ విద్వాంసుల కన్నుల నన్నిటి నది యాకర్షించినది. 'కీచకవధ'లో 'ఇరయమ్మన్‌తంపి' విరాటరాజధాని నంతటి లాస్యరంగమును వర్ణించినాడు. ఆ వర్ణన నాటి తిరువనంతపురమునకు ప్రతిచ్ఛాయయే. అది యిది:

వాళికలోదన మారే; 21 నామ్ ప్రీత కళిక్కు 22
విధిన మోరో
కేళిక శాడి ముదా రాగమాలక 23పాడి కరం 24కొట్టి
చ్చాలవేచాడి, తిరుముం25చిల తాళత్తోడు26
మేళత్తోడు మేళిచ్చను
కాలతోడు, మాళిక లేవటనం చెయ్యేణం 27
వల్లకళి జగత్తిల్ వళర్త్తిడేణం 28
హృద్యతర మెన్ను పాడియుడు వానుకొ్యగ
మేతుంపుకైయ్యరుతే 29
విద్యుల్లతాంగీ! చొల్లిడుగ 30 గద్యంగళ్ ధంగి
కలర్న్న 31నీ
సద్యోగురూతరి! ధణంతక తద్ధిమి తత్తత్వ
తిత్తోతిత్తో మెన్ను మర్దళం వాదయ చంద్ర గోఖే! నల్ల
పద్యంగళ్ చొల్లు 32 నీ రతిన్న లేఖే!
పాణివళికళ్ 33 కిలుక్కినవే పాదం చేణుత్తె 34
కొంకకులుక్కీనవే
వేణియా జిత్తం35సఖి! హే కల్యాణి! ఘన వేణి శుక
వాణి! సుశ్రోణి! నామాణిక్య కుక్కమ్మ36 అడిచ్చి
కేణం నవాన్నయో
దణ్డు కుమ్మియడిచ్చి దేణం"37

'తంపి' వ్రాసినవి మూడాట్టకథలు. 'కీచకవధ' మొదటిది. తక్కినవి ఉత్తరా స్వయంవర, దక్షయాగములు. మూడును విద్వాంసు లాదరించినవే. 'ఉణ్ణాయి వారియరు' కున్న భావగాంభీర్య మీతనికి లేదు. లాలిత్య మీతని సొమ్ము, సుకుమారమైన భావముల నేరి వాడుకొనును. సుభేష్ణ యాసవము దెమ్మని చెప్పును. అప్పటిమాలిని స్థితిని కవి యిట్లు వర్ణించినాడు.

"శోణీంద్రపత్ని యారే,38 వాణీం నిశమ్య పున
రేణీవిలోచన సహ39క్షీ మిజి, యుణకలక్షీ40
వివళయిటిల్ ముజ్జి41, పలతనవు42మతిను43 పున
44వళోడు పఱ్ఞిళవు45 పురుష మెంజి46 కేట్టు న 47
ననక్షీ—
దాస్యం పము స్తజనహోస్వం నినమ్పు48నిజమాస్యం
నమిమ్ము పునకేషా. శ్రమసలిలబహూంతర
నయనజలమతి లుడననుజా49కి బత! మలినతర వేషా.
గాత్రం విరచ్చి50 తతిమాత్రం కర త్తిలసపాత్రం నరి

---

21 కమలనేత్రిలారా! 22 సిద్ధపడి నానాకళలు చూపించి. 23 గానమొనర్చి 24 చేతులుతట్టి, చక్కగ పాడి 25 మహారాజునకు 26 తాళమేళములతో కలిసి 27 నటించవలె 28 వ్యాపింప జేయవలెను. 29 తక్కువ కారాదు. 30 చెప్పి వేయుము 31 అందము జొనిపి 32 చెప్పుము. 33 చేతుల గాజులు ధ్వనింపజేయుము. 34 విస్తృతమైరోదను కులికింపుము. 35 వెండ్రుకలను చెదర్పుము 36 తాళముతట్టి యాడవలె. 37 అందముగ వంగి యాడవలె.

38. ఒక్క; 39 వగకేను. 40 కనుచూపులు కలగెను. 41 ముడిగెను. 42 చాలసారులు. 43 దానిని మఱల 44 ఆమెతో 45 చెప్పి, 46 పలుకు. 47 వినివణకినది; 48. తలచి 49 వంచి. 50 మునిగె.

51స్ఫురింటె నిన్ను, పరిచోదం52వడన్ను పథి కిమపి 53నిన్నా; హారిణరిపు వరసహిత దరియిలిహపోకు మెరదు

54హారిణియుడె వివశతకలర్న్న—
విశ్వస్య దీర్ఘ, మధ విశ్వస్య సాధమపి, విశ్వస్య
చేతసి సుజాతా, స్మృతిరహిత చేతా, స్మృతిపులిక జాతా,
హారిణుడె మణినికేతన మతిలకల్ చెన్ను55 ధీతి
పరితాప పరిభూతా.

అప్పటి ద్రౌపది చిత్తవృత్తికిని, యీదండకములోని పదముల త్రుళ్ళింతకును సంబంధమే లేదు. శైలిని పోషించుటయందే చూపుంచిన రచయిత - యౌచిత్యమునకు తిలాంజలి యొసగినాడు. ఒకానొక భావమును విస్తరించి చెప్పుటయు, వాంగికములైన వికారములకు ప్రాధాన్య మొసగుటయు నాదన సోమనాథుని గుణము. అది అతని యింటిలో నున్నది. సంస్కృత సాహిత్య చరమ కాలమం దిట్టి రచనలు చేసినవా రెందరో యున్నారు. భావతపస్సున కలవాటుపడనివారు మాత్రమే యీ యింద్రజాలములకు దిగుదురు. కేరళీయులు మాత్ర మిది గూడ ఘనమైన రచనయే యందురు. మన తెలుగులో నిట్టి కవులకు దారిద్ర్యమే లేదుగదా!

కోయిత్తంబురాన్ స్వాతీ తిరునాళ్ నకు బాల్యసఖుడు; సతీర్థ్యుడుగూడ. పాండిత్య మల్లనే గాక మల్లవిద్యలోగూడ కృతపరిశ్రముడట! కాని యాతడు బ్రతికినది కొద్దికాలమే. ముప్పదినాల్గవ యేటనే మరణించినాడు. అంతటి చిఱుత వయసులోనే గీర్వాణసాహిత్యమునందును, సంగీతమందును గొప్ప కృషి యొనర్చినాడు. 'ఇరయిమ్మన్ తంబి' కన్న నీతనిశైలి కొంత గంభీరము. భావములు గూడ లోతు గలవి. అత డింకను గొంతకాలము బ్రతికియున్నచో గొప్పరచనలు బయలుదేరెడివి. కాని యంతలోనే కాలము కబళించి వేసినది. 'రావణ విజయము' కథకళి యాతని ముఖ్యమైన కృతి. ఈ కృతిలో నాతడు సామాన్యకవులకంటె గొప్ప చాతుర్యమును గనుపరచినాడు. 'ఉణ్ణాయివారియరు'తో సమానుడనిపించు కొన్నాడు.

రామాయణమునందు వాల్మీకి రావణాసురు నెంతో యుదారముగ జిత్రించెను. ప్రతినాయకుని వాల్మీకివలె సానుభూతితో జూచినవా రరుదు. తరువాతి నాటకకర్తలు రావణ దుర్యోధనులను పాడు చేసిరి. వేణీ సంహారకర్త దుర్యోధనునకు గల్పించినస్థితి శోచనీయమైనది. 'కోయిత్తంబురాన్' రావణు నొక యాదర్శపురుషుడుగ గాకున్నను మనుష్యస్వభావము నిండిన ప్రౌఢునిగ సృష్టించెను. ప్రతినాయకుడుగ ప్రసిద్ధుడైన రావణుని నొక నాయకపద మొసగుట సామాన్యమైన సాహసముగాదు. రంభాప్రవేశ రంగమున నవతరించిన రావణు డాట్టకథలో నొక సరసుడైన శృంగారపురుషుడు. రావణునివలె బలాత్కరించి యనుభవించిన రసికులు పురాణములలో నెందరో యున్నారు. రావణుడును వారివంటివాడే. పైగా రంభ యభిసారిక. దేవతలకు గూడ నప్రాప్యమైన రావణుని పరాక్రమసిద్ధిని కైలాసము నెత్తుట మొదలగు వానిమూలమున గవి బ్రహ్మాండముగ వర్ణించెను. వానిలోని శివభక్తి పారమ్యమునుగూడ నిండుగ జూపించినాడు. నాయకునకు గావలసిన గుణములు రావణుని యందున్నవని వర్ణించుచు బోయినాడు. వాని కపకర్షకములుగ పురాణములందు వర్ణింపబడిన యంశములలో గవి నిమ్మళముగ దాటిపోయినాడు.

రావణవిజయమున నున్న దెక్కువ సంస్కృత కవిత్వమే. చిన్ననాటనుండియు నాతని కా భాషపై రక్తియు, శక్తియు. పైగా, రాజదర్శనమునకు వచ్చు పండితుల నిరంతర సంపర్కముతో నా ప్రౌఢిమ యింకను పదనుదీరినది. రావణ విజయము ప్రదర్శింపబడినదియు రాజప్రాసాదమందలి విద్వాంసుల యెదుటనే. కనుక నాతడు రచనమున విద్వదామోదము నెక్కువ పాటించెను. రంభ నలకూబరునికొఱకై పోవుచున్నది. "అతి మృదు పదన్యాసై ర్యాంతీ" అని యారంభించిన యీ కవిత్వ మంతయు సంస్కృతమయముగనే సాగినది. ఆ సంస్కృత మెంతో లలితమైయున్నది. హఠాత్తుగ రావణుడు రంగమున నవతరించును. చకిత హృదయయైన రంభ సంభ్రమముతో "తోడరుద" యని చేతులను మొగిడ్చి యాచింప నారంభించినది. రావణుడు రంభమాటలు వినలేదు. వా డపచరితము నే యొనర్చెను. కాని—కవి యొనర్చిన చిత్ర మేమనగా—నీ సమయమున రావణు డొనర్చిన యనౌచిత్యము మన హృదయములకు దోపకయే పోవునట్లు చేయుట. రంభ

---

51 స్వేదించు. 52 ఆటనుండి. 53 అల్లన నడచెను. 54 నిలచెను; సింహమున్న గుహలోనికి బోవుచున్న, హారిణియొక్క మనస్థితిగలిగెను. 55 పోయెను.

రావణుని ప్రార్థించు సందర్భములో కరుణరసమున కంటెను మాదకమైన శృంగారమునకే కవి యెక్కువ ప్రాధాన్య మొసగెను. రంభ పాలక మిది—

"ఆనీలనీరద దరాంతరితేందు బింబ
లీలానుకారి వదనం నిజ మాదధానా,
సంజాత వేపథుమతీ, శిరసా ప్రణమ్య
మందం జగాద ముకుళీకృతపాణిరేషా"

ఆ నిలచుట ఆ పలుకుట—రావణునకు దయను గాక కామోద్రేకమునే కలిగించినది. వాడు—

"[56]కొంచుం పెంజీ వాణీ మియ న్నిహ
కించన నీ వదనం తాఴ్త్రి
పుంచిరి కొండయి! మమహృదయం
వంచనచెయ్ తీను న్నింతే"

అని యామె వడుగుచున్నాడు. రంభయెంత నిషేధించినను జరుగవలసినపని జరిగియే పోయినది. ఆ రంగమును కోయి త్తంబురాన్ మత్స్యమువంటి యీ శ్లోకముతో ముగించెను.

"మా మా స్పృశేతి ముహు రప్యనయా చితోఽపి
రాజీవ కోరక కరాంజలి ముద్రయైవ,
హా! హా! అదప్సరసి; కామదవాతురాత్మ
చిక్రీడ తన్నిశి నిశాచర కుంజరోఽయం."

తామరకోరకమువంటి హస్తముద్రతో 'నను తాకవల దని నిషేధించుచున్న రంభపై రావణుడు బలవంతముగ చేయుకవలె బడినాడు. అధర్మముకంటె—మరసికతయే యీ సందర్భమున కవిదృష్టి నెక్కువగా గలచినది కాబోలు!

సంస్కృతమునందే గాక — మళయాళరచనయందును తంబురాన్ సమర్థుడు, నీలవస్త్రాచ్ఛాదితయై పోవుచున్న రంభను గన్నప్పుడు రావణునకు దోచిన భావము లీక్రిందివి.

"నీలనిచోళన నిహ్నుత మెంగిలుం
[57]చాల కేకాణున్న; చారు తరమంగం
కాళింది వారియిల్ [58] గాహనం చెయ్తుదు
కాంచన శిలాక లిక కాంతియుతు పోలవే
నాగకులాభరణ హీరమణి యాయనీ
ఆ రోమలే సుతిక! అర్ ఉమయో! రతియో!
ప్రకృతిజితపల్లవం. సీయరావ పూరితం
సుక మెంజి, పాజి, ఞ్ఞేరుం, సుస్మిత శ్రీపదం"

పై మళయాళ రచనకూడ ప్రౌఢ మనోహరమైయున్నది. తెనుగు కవులవలె నే మళయాళ కవులును—సంస్కృతమును విచ్చలవిడిగ వాడుకురు అందునను—మధ్యయుగమున నా యభ్యాసము మిక్కుటమైనది. మణిప్రవాళ కవుల పలుకుబడియది. కోయి త్తంబురాన్ అట్ట కథలే గాక 'తుళ్ళల్' కథలనుగూడ కొన్నిటిని వ్రాసెను. అతని 'సంతానగోపాలము' చాల ప్రసిద్ధమైనది. ఇందులో 'తంబురాన్' విభిన్నమైన శైలి ననుసరించెను. ఈశైలి సామాన్యులకు గొంత యందుబాటులో నుండును.

ఆ తరువాత కేరళమున నాంగ్లవిద్యాప్రభావ మెక్కువైనది. గద్యరచనకు గౌరవము హెచ్చినది. నాటకరచనము గూడ నారంభమైనది. 'కిళిప్పాట్టు' 'వంజిపాట్టు' మొదలైన యేవో కొన్ని రచనలు తప్ప కథకళి సాహిత్యము నిలచిపోయినదనియే చెప్పవచ్చును. కాని నేటికిగూడ నాజనుల కా సాహిత్యముపై గౌరవము తగ్గలేదు. వాని జామటయందలి యభిలాష పోలేదు.

---

56. జంకుచు మాటాడుచు, తలవంచి, పూల వంటి చిఱునవ్వులతో నన్నెందుకు వంచించు చున్నావు?

57. నీలనిచోళ నిహ్నుతమైనను నీయంగము కాళిందీ పూరమున గాహన మొనర్చిన కాంచన శిలాకాంతివలె చారుతరమున నున్నది. నాగకులాభరణ హీరమైన నీ వెవ్వరి సుతవు? ఉమవా! రతివా! చిలుకపలుకులు బలుకుచు, జితపల్లవమై, సుస్మిత శ్రీ పదమైన నీ పెదవి యెంతబాగున్నది!!

విప్రయోగి

శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

నా కనుల కెన్ని యెన్ని సంధాన పడియె
నన్నియును వన్య వైశ్వానరాభ రుచులు
చటుల వర్షా నభోవృత్త జలద మత్త
బర్హి బర్హాచ్ఛ మింద్ర చాపంబె లేదు!

ప్రాగ్దిశోదిత ముగ్ధ చంద్ర ప్రరోహ
మెదిగి గగనాన మల్లికా వృష్టిగురిసె;
మల్లెవాసన గ్రీష్మ సంబంధి యొకడు
సాగి తాపంబుగొనుచు ఝంఝానిలుండు.

ఊహ యొకంతు సాగి ప్రణయోజ్జ్వల భావము నాచికొన్న చా
లై హరిదంతసీమల వెలార్చిన కార్తిక చంద్రికా మధు
వ్యూహము వీడిపోయి హిమపుంజ సమాకృతి పేరి యేదొ ప్ర
త్యూహ నిరుద్ధమై విరహ దోహద శీలము భావ మేచెనుఁ.

ఉభయ సంధ్యల కండ్లలో నూహ చేసి
చేసి సుడిగొన్న జారె విశీర్ణ జీవ
నాశ లల్లిన కన్నీటి హారయష్టి
గ్రుడ్డి తనమున తెలిమంచు గుడ్డవోలె.

ఆకురాలిన చెట్లు సన్న్యాసులట్లు
నిల్చిన విదేమి వైరాగ్య నిష్ఠ! - నిజమొ?
గుండె లోతుల కత్తితో గొట్టి చూడు
పచ్చి వలపులు నిలువెల్ల విచ్చి చూపు!

ఈ మాధుర్యము దోచుకొందుమని తా మెన్నెన్ని యూహల్ మదిన్
వ్యామోహమ్ములు పెల్లు రేగినవిలే! హైమాద్రి పర్యంత ము
ర్వీ మాలాకృతియూచు సర్వ జగదావిష్టోత్పతన్మాధు రే
ఖా మోద ప్రకరమ్ము లాక్రమిత శంకా దిఙ్నభస్సీమముల్.

నన్నెచోడుని వర్ణనలలో వన్నెలు చిన్నెలు

శ్రీమతి వి. రాజేశ్వరి

ఆంధ్రచరిత్రలో సామ్రాజ్యాధిపతులకు కొదువ లేదు. కవితాసార్వభౌములకును లోపము లేదు. కాని సాధారణముగా రాజై కవియగుట అరుదు. రాజును కవియునై సామాన్యుల జీవిత తత్త్వమును సమగ్రముగ ఎరుగుట ఇంకను అరుదు. ఆంధ్ర సారస్వతమునందు ఆ శ్రేణికి చెందగలిగిన కృష్ణరాయ రఘునాథ రాయాదుల నేకొలదిమందినో వ్రేళ్ళపై లెక్కపెట్టవచ్చు. వారిలో మున్ముగా చెప్పదగినవాడు నన్నెచోడుడు. ఈ కవిరాజశిఖామణిగ్రంథమును సావకాశముగ చూచినచో ఆ వర్ణనలలో శాస్త్రవిద్యానైపుణ్యమే గాక లోకానుభవవైభవమును పుష్కలముగ గోచరించును. ఈతడు కేవలము సంప్రదాయసిద్ధములగు నగరార్ణవశైలాదుల సహజస్థితి నెంత సందర్భానుసారముగ వర్ణించెనో అనుభవైకవేద్యములగు సామాన్య మానవజీవితపు లోతులను అంత నిశితముగ పరికించినాడు.

కవిరాజశిఖామణి అనువది నాల్గు విద్యల నారితేరి రాజ్యతంత్రమంత్రాంగముల నెరిగిన ప్రౌఢ. అతనికి జలక్రీడ ఎంతసుగమమో రణక్రీడ అంతే యలవడినవిద్య. ఋష్యాశ్రమ వాతావరణమునందు మునుల తపశ్చర్యాగరిమల నెంత తాత్త్విక కాంతిప్రసారముగ వర్ణించినాడో, విటవిటీవిదూషకాది కాముకజనుల విలాసములను కామశాస్త్ర కళాశాస్త్రముల ఎల్లలలో అంత నేర్పుగ నడపగలిగినాడు. రాజై, కవిరాజై, రసరాజై ముక్తిసామ్రాజ్యాభిరతుడై హరునిలీలను స్థలపురాణము వలె వర్ణించి తృప్తిపడిపోక అడవియేనుగుల మనస్తత్త్వము, కౌమారావస్థలో నున్న దంపతుల సంసారగోష్ఠి మొదలుకొని పేలాలు వేచుపద్ధతినుంచి వెన్నపూస మెదిపి కాటుక దిద్దుకొను సామాన్యకుటుంబిని దినచర్య వరకు వర్ణించి కుమారసంభవమను నాదివ్యకథను రసవత్తరముగు కావ్యముగ సంతరించినాడు. అందు కవి ప్రదర్శించిన కావ్యశిల్పమెంతయేని కలదు. అదంతయు అటుంచి, ఒక్క వర్ణనల విషయమును కనుక ప్రత్యేకముగ చూచినచో అందు కవిప్రదర్శించినవర్ణనవైవిధ్య మెంతయేని గోచరించును. ఒకప్పుడు రసవత్తరముగు అపూర్వభావము వ్యక్తీకరింపబడె, మరియొకప్పుడు అతి ప్రసిద్ధమగు సామాన్యవస్తువులే నిత్యనూతనముగ భాసించును. ఒకచో ప్రాచీనకవినిబద్ధప్రౌఢభావకల్పనలు చమత్కారావహము లగుచుండ, వేరొకచో కావ్యమందలి ప్రసిద్ధములగు సన్నివేశకల్పన లెన్నియో కవి స్వకీయప్రతిభలో దేశీయతాముద్ర నంది వింతశోభను పొందినవి. పయిచతుర్విధవర్ణనలలో స్థాలీపులాక న్యాయముగ కొన్నిటిని చెప్పుట ఈ వ్యాసోద్దేశము.

భావ వ్యక్తీకరణములు

పార్వతి తపశ్చర్యలో గ్రీష్మఋతువు రాగా ఆమె పంచాగ్నిమధ్యమునందు తపము గావించును. ఆ విషయమును, తదతిశయమును చెప్పుటకు కవి గ్రీష్మఋతువుయొక్క ఉద్ధతిని ముందుగా వర్ణించును. "విలయానిలమువలె నెండకాయ గాడ్పు సంక్రుద్ధకాలాగ్నిరుద్రరోషాశ్వాససమేతమో" అనునట్లున్నదని చెప్పుచు నిట్లు వర్ణించినాడు.

"ఉరునిదాఘవాతాహతి గరుల తలలు
వ్రస్సి లోపలి ముత్యముల్ వరుస దిరిసి
మంగలములోని ప్రేలలభంగిఁ దూలి
ప్రేలిపడఁ గాచె కట్టెండ విస్ఫురించి"

పార్వతి తపముచేయు వనమందున్న ఏనుగలయొక్క కుంభస్థలములు గ్రీష్మాతపమునకు విచ్చిపోవ, అందు వరుసలలో నున్న ముత్యములు ప్రేలి పేలాల వలె తూలి క్రిందపడినవట. ఆ వేడికి ఏనుగు కుంభస్థలములే విచ్చిపోవ ఇక మిగిలిన జీవరాసుల గతి చెప్పనక్కరలేదనుట సామాన్యార్థము. ఈ పద్యమునందు ప్రేలు-తూలు శబ్దములు సాభిప్రాయములు.

గ్రీష్మాతపమునకు ఏనుగు కుంభస్థలములు విచ్చిపోయినవి. అంతతో ఆ వేడి ప్రభావము ఆగిపోలేదు. ఇంకను లోనుండి అమితముగు వేడి పిల్లుబుకుచునే యున్నది. కావుననే అందలి ముత్యములు పేలాలవలె ప్రేలి, తూలి క్రిందపడినవి. అట్లుగాక ఆ వేడి ఏనుగు కుంభస్థలమును పగులగొట్టుటతో నాగిపోయినచో

విచ్చిన స్థలమునుండి ముత్యములకు జారుపాటేకాని తూలుపాటవసరము లేదు. ఆభావము వ్యక్తము చేయుటకే కవి ప్రత్యేకముగ తూలు శబ్దమును వేసికొనినాడు. అదే శబ్దసార్థక్యము.

అంతియే కాదు, పయి ఉపమానముచే కవి యింకొక వాంఛితార్థమునుకూడ సాధింపకల్గినాడు. అట్లు క్ష్మాభృత్పతునకు ఏనుగు కుంభస్థలములు విచ్చిపోగా వానియందలి ముత్యము లన్నియు నేలపాలై పోయినవి. ఆ హిమవన్నగవనాంతమం దెక్కడ జూచినను ముత్యములే. అనగా ఆ ప్రదేశమంతయు ముక్తామయమైనదనుట. అతిసులభత విలువతగ్గుటకు చిహ్నము. ముత్యము లన్నియు అమితముగా క్రిందపడి పారలాడ అవి పేలగింజలకంటెను చవుకై పోయినవి. కావుననే ముత్యములు పేలాలైనవనుట. అది వాచ్యార్థము. ఇక అతఃపూర్వమే పార్వతి జన్మకు కారణభూతమగు హిమవన్నగముయొక్క విభూతి అమితముగు ముక్తాసమూహవర్ణనచే ధ్వనితము.

హేమంత ఋతువర్ణనము

హేమంతఋతువున పార్వతి ఋతుధర్మమునకు వ్యతిరేకముగ ఉదకవాసతత్పరయై తపము సాగించుచున్నది. ఆమె శరీరమంతయు నీటిలో మునిగిపోయి ఒక్క ముఖము మాత్రమే పైకి తేలియున్నది. నిర్మలమగు ప్రదేశమునందు నిశ్చలమగు జలములో పార్వతి ధ్యానమగ్నమైయున్న సమయమది. ఆ ప్రశాంత వాతావరణమున తటాకమధ్యస్థ పార్వతిముఖము కవికి సాక్షాత్కరించిన విధ మిది.

"తనరు హేమంత మునుడు పద్మంబు లడఁగి
పోయెఁ బోయిన గొలనొక్క పువ్వుతనకు
విత్తుగా దాచికొనియున్న విధముపోలె
శైలసుతముఖ ముదకవాసమున నొప్పె"

మంచుతాకిడికి పద్మసంపద తుటితము కాగా ఆసరోవరలక్ష్మి పార్వతి ముఖకమలమును విత్తుగా దాచికొన్నదని భావము. ఈ సందర్భమున కాళిదాసు:

"ముఖేన సా పద్మసుగంధినా నిశి
ప్రవేపమానాధర పత్రశోభినా,
తుషారవృష్టి క్షతపద్మ సంపదాం
సరోజసంధాన మివాకరో దపాం"

అని హిమబిందు పాతముచేత పద్మసంపద నశించి పోగా శోభతగ్గిన ఆ కొలనికి పార్వతిముఖము పద్మసంధానము కలిగించుచున్నదను భావమును వ్యక్తీకరించినాడు. నన్నెచోడుడు ఆ సందర్భమున ముందుపడి పద్మములన్నియు నశించిపోవునపుడు సరేంగితయగు నాసరోవరలక్ష్మి తన సంతతి నిలువదేమో యన్న భయముచేత పార్వతి ముఖకమలమును విత్తనముగా దాచి కొనినట్లున్నదని చెప్పి, విషయమును రసవత్తరము గావించినాడు.

సంస్కృతాంధ్ర గ్రంథములు రెండింటి యందును పార్వతిముఖము కమలాకరమునకు శోభ నిచ్చుచున్నదను విషయము సమానమే. రెండిటి యందును ముఖమునకు పద్మసామ్యము చెప్పబడినది. కాని నన్నెచోడుని గ్రంథమున పార్వతిముఖమును ఆసరోవరలక్ష్మి విత్తుగా దాచికొన్నదనుటలో విశేషము కలదు. ఉన్నవానిలో కెల్ల శ్రేష్ఠమైనదాని నేరి కదా విత్తనమునకు గుప్తపరచుట లోకసిద్ధము. అట్లే ఆసరోవరలక్ష్మి సంతతికి విత్తువంటిదనుటచే పార్వతి ముఖపద్మము ఉన్న పద్మములలో కెల్ల శ్రేష్ఠమైనదను భావము ధ్వనితము. కాళిదాసు గ్రంథమునందు ముఖమునకు పద్మసామ్యము మాత్రమే సిద్ధింప నిందు పద్మాధిక్యము కూడ కల్గినది. ఇది ఉపమానముకంటె ఉపమేయమునందు ఆధిక్యము.

శరదృతువు

శరత్కాలమునందు జలజోత్పలముల శోభను వర్ణించుచు ఒకచోట కవి యిట్లనినాడు.

"జలవాసులైన హరిల
క్ష్ములు వర్షనిశావసానమున మేల్కని క
న్నులు విచ్చి చూచినట్టులు
జలజోత్పలగుచులు మెరసె శారదవేళన్"

ఆ శారదవేళ మెరయుచున్న జలజోత్పలముల శోభను జలవాసులైన లక్ష్మీనారాయణులు వర్షానిశావసానమందు లేచి కన్నులు విప్పి చూచుచున్నట్టు లున్నవట. లక్ష్మీనారాయణులు జలవాసులు. పాలసముద్రమున నుందురు. వారు వర్ష ఋతువునకు ముందుగావచ్చు ఆషాఢశుద్ధ ఏకాదశినాడు పాలసముద్రమునందు శయనించి, శరత్కాలమునందు వచ్చు కార్తీకశుద్ధ ఏకాదశి నాడు మేల్కొందురని ప్రాచీన భారతీయసంప్రదాయము. కావుననే ఆషాఢ శుద్ధఏకాదశి శయనైకాదశి యనియు కార్తీకశుద్ధ ఏకాదశి ఉత్థానైకాదశియనియు వ్యవహరింపబడుచున్నది.

పయిపద్యమునందు 'వర్షనిశావసానమున'— అను సమాసము మిగుల అర్థవంతము. వర్షనిశావసాన

అనగా వర్షావసానము నిశావసానము అని అర్థము. ఇటవర్ణనీయవిషయము శరదృతువుయొక్క శోభ. శరదృతువునకు ముందువచ్చిన ఋతువు వర్ష ఋతువు. శరదృతువునకు ఆరంభదశ వర్షఋతువునకు అంత్యదశ యగును. శరదృతువురాక వర్షఋతువునకు అవసానము కల్గును కాన అయ్యది వర్షావసానమగుచున్నది. అగుచో నిశావసానమన నేమి యని ప్రశ్న. నిశావసానమన నిశకు అంత్యదశ. అనగా తెల్లవారుజాము. వర్షనిశావసానమనగా శరదృతువుయొక్క ఆరంభమునందలి ఒక తెల్లవారుజామని భావము: ఆ సమయమందు హరియు లక్ష్మియు కన్నులు విచ్చి చూచునట్టు లున్నవట జలజోత్పలములశోభ. అగుచో నిట నొక చిన్న సందేహము. పగలు వికసించునవి జలజములు, రాత్రి వికసించునవి ఉత్పలములు. భిన్నకాలములలో వికసించి శోభించు జలజోత్పలములశోభ ఏకకాలములో నెట్లు కల్గినదని ప్రశ్న. దీనికి సమాధానము కూడ 'నిశావసాన' మనుపదమునందే కలదు.

నిశావసానమనగా వేకువజామని చెప్పుకొంటిమి. అప్పుడు రాత్రియంతయు వికసించియున్న ఉత్పలములకు అర్ధముకుళితావస్థ. జాములో వికసింపనున్న జలజములకు అర్ధవికసితావస్థ. అయ్యది జలజోత్పలములు రెంటికిని అరవిచ్చిన సంధికాల మగుచున్నది. కావుననే వర్షనిశావసానమున, జలజోత్పలశోభితమైన ఆ వసంతవేళ లక్ష్మీనారాయణులకు మేల్కొలుపైనది. దీర్ఘనిద్ర చెంది అప్పుడే కనులు విప్పిన లక్ష్మీనారాయణుల కనులను అరమోడ్పుగనే యుండును. అరమోడ్పు కనులకు అరవిచ్చిన పూదోన్నెను. ఇట్టిది, కవివరేణ్యుడు తిలకించిన శారదశోభ.

"ఉపమా నన్నెచోడస్య"

మన్మథదహనానంతరము విటలాక్షుడు విరక్తచిత్తుడై అచ్చోటు వాయ, హిమవంతుడును లజ్జితుడై వచ్చి పరాభవాగ్నిచే దందహ్యమాన మగుచున్న నిజాత్మజను ఎత్తుకొని అంతఃపురమునకు తీసికొని పోవును. ఆ దృశ్యము కవిరాజశిఖామణికి "కీలు ప్రిదిలి తటిల్లత నేలబడ శారదాభ్రము మగుడ దాని నెత్తికొని పోయినట్లు" గోచరించినదట. ఇట పార్వతి తటిల్లత; హిమవంతుడు శారదాభ్రము. విద్యుల్లతను గర్భీకరించుకొను సామర్థ్యము ఒక్క శారదాభ్రమునకే కల్గినట్లు అప్పటి పార్వతి హృదయతాపమును కొంతదైన చల్లార్చుటకు ఆ చలిమలరాజే తగినవాడు. శీతలత్వముచేతనేమి, పావనత్వముచేతనేమి, హిమవంతుని శారదాభ్రముతో పోల్చుట సందర్భోచితముగ నెంతయేని తగియున్నది. కవికులగురువగు కాళిదాసుకూడ ఈ సన్నివేశమును ప్రత్యేకముగ వర్ణింపదలచి

"సపది ముకులితాక్షీం రుద్రసంరంభ భీత్యా
దుహితర మనుకంప్యా మద్రి రాదాయ దోర్భ్యాం,
సురగజ ఇవ బిభ్రత్ పద్మినీం దంతలగ్నాం
ప్రతిపథగతి రాసీ ద్వేగదీర్ఘీకృతాంగః"

అనినాడు. ఇందు హిమవంతుడు ఆత్మజను బాహువులతో పొదిగి తీసుకొనిపోవుట దంతలగ్నమైన పద్మినిని ఐరావతము తీసికొనిపోవునట్లున్నదను భావమును 'సపది ముకులితాక్షీం' మొదలైన విశేషణములతో వ్యక్తపరచినాడు. ఐరావతముతోడి సామ్యమువలన హిమవంతునియందలి గాంభీర్యమెంత ద్యోతిత మగుచున్నదో పద్మముతోడి సామ్యముచేత పార్వతియొక్క సౌందర్య సౌకుమార్య మంత ప్రకటీకృతము లగుచున్నవి. కాని నన్నెచోడుని గ్రంథమున హిమవంతుడు శారదాభ్రముతో పోల్చబడుటవలన ఐరావతమందలి గాంభీర్యౌదార్యములే కాక శీతలత్వము మరియొక ప్రత్యేక లక్షణము కూడ స్ఫురించుటచేత ప్రకరణానుకూలముగ పార్వతియందు తాపము ప్రతీయమాన మగుచున్నది. అదిగాక సంస్కృతగ్రంథమందు చెప్పిన పద్మినీ ఐరావతముల సంబంధముకంటె ఆంధ్రగ్రంథమందలి విద్యుల్లతా మేఘమాలికల సంబంధమునందు ఔచిత్యము మెండు. మేఘము లేనిదే మెఱుపు లుండవు. తండ్రి లేనిదే పుత్రిక లుండదు. ఆ భావమిందు సుస్పష్టము. ఐరావత పద్మినుల కట్టి అవినాభావసంబంధము లేదు; పరికదా ఐరావతము, పద్మినిని పెకలించును. మేఘమట్లు గాక విద్యుల్లతను గర్భీకరించుకొనును. ఏ విధముగ చూచినను కవిరాజశిఖామణి ఉపమానైపుణి మూలాతిశాయియై యొప్పుచున్నది.

మనస్తత్త్వ పరిశీలనము

మన్మథదహనానంతరము, పార్వతి విరక్తచిత్తయై స్థిరనిశ్చయముతో తపమునకు పోవుసమయమున తల్లి మేనాదేవి ఆ ఘోరవిపత్తునకు తల్లడిల్లి పోయినది. ఈ సుకుమారి ఆ కఠోరదీక్షను సమన్వయము చేయజాలదని చింతించి ఆత్మజను మెల్లగ చేరజీరి "అమ్మా!

పూవో పూవో యని చే
కేలిన గందువని యోసరిల్లెడు నామై
జీవంబు నిలుచునె నిను
బోవిడిచి మహోగ్రదుర్గములఁ బొల్పడగాక"

అనును. ఇందు మెత్తని చిన్న పదములలో మాతృహృదయ వాత్సల్యాంబుధిని కలయ జూపినాడు కవి. 'చేరలిన కందు నేమో యనునట్టి నిన్ను బోవడచిన నామెయి జీవము నిలుచునె' అనునపుడు 'చేరలిన కందు' నన్న పదమువలన పార్వతి సౌకుమార్యము, 'నిను బోవడచిన నామెయి జీవము నిలుచునె' అనుటలో ఏకైక పుత్రికను కన్న మాతృహృదయపు ఆవేదన ఎట్టిదో వ్యాఖ్యానము లేకయే సహృదయహృదయములను తాకుచున్నవి.

మన్మథదహనానంతరము దుఃఖార్తయగు రతీదేవికి అశరీరవాణి మన్మథ పునరుజ్జీవనమును గూర్చి చెప్పి, ఇదివరకే ఆమెనుండి వీడిపోయిన ప్రాణమును దెచ్చి ఆమెశరీరములో నెలవెట్టినదట.

"ప్రాణ మెడలిలో నాకాశవాణి దెచ్చి
మగుడఁ జెలువొప్పె నన రతి మలయుచుండె" (5.101)

ఆమెప్రాణ మెంతమాత్రము తిరిగివచ్చుట కిచ్చగింపలేదట. ఆకాశవాణి బలిమిని దెచ్చి మరల బొందెలో నెలవెట్టుటచే పోలేక నిలిచినదట. ఈభావపరాకాష్ఠ మెంత ఔచితీబద్ధమో గమనార్హము. ఆకాశవాణి మన్మథుడు తిరిగి బ్రతుకునని చెప్పుటచే దుఃఖార్తయగు రతి యూరడిల్లినదనుటకు బదులు ఇదివరకే పోయినప్రాణము అశరీరవాణి బలిమిచే రతిశరీరములో నెలవెట్టబడినదని రమణీయముగ చెప్పి కవి, రతీపాత్రకును రతీమన్మథుల ప్రణయాతిశయమునకును చక్కని రూపునిచ్చి తన ప్రతిభకు వన్నె పెట్టుకొనినాడు.

మన్మథ పునరుజ్జీవము కలుగువరకు రతీదేవి ప్రాణములు నిక్కబట్టి ఎట్టులో కాలము గడపినది. కాలవాహిని కొంత యజ్ఞాతముగ గడచిపోగా ఆమె పాలిటి శుభోదయమైనది. మన్మథుడు బ్రతికి తనవైపునకే వచ్చుచుండుట అల్లంతనె గాంచినది రతి. అప్పుడామె మోదభరముచే మ్రాన్పడెనని చెప్పుట కవి మనోగత రతి. ఆ భావవ్యక్తీకరణమున కవి ప్రదర్శించిన రామణీయక మిది:

"ఎలమి ప్రాణేశున కెదురేఁగె యుత్కలి
ప్రాణంబులన మేను మ్రాను పడియె"

అల్లంత నున్న మన్మథుడు వచ్చువరకు రతి యూరక లేదు. వెంటనే మన్మథుని చేరవలయును. అందులకామె యతి త్వరితముగా ఆవైపునకు పోవుచున్నది. ఆతురతతో నున్న ఆమె ప్రాణమునకు శరీరముయొక్క వేగము చాలలేదు. అందుచే ఆప్రాణము శరీరమును వెనుకదిగ దవ్వునను తాను ముందుగ మన్మథుని చెరుకొనగ వేగినట్లు ఆ మ్రాన్పాటున్నదట. మ్రాన్పాటును అంత చక్కగ వర్ణించిన కవి నింకొకని గానము.

పయి సందర్భమునందే—పతిని గాంచిన రతీదేవి కనులకు ఆనందభరముచే హర్షవారి క్రమ్ముకొనినది. ఆ హర్షవారి మన్మథుని తదేక దృష్టితో చూచు నామె దృష్టికి నిరోధము కాగా అది సహింపలేక రతి రెప్ప లల్లలనాడినవి. తోడనే కనుపాప లాడుట సహజము కనుక ఆడినవి. ఆ కనుపాపల యాటకు కవి చెప్పిన యర్థము, మన్మథ పునరాగమ సమయమున హర్షచిహ్నముగ కనుపాపలు చేయు ప్రనర్తనమట. ఇట్టి అపూర్వభావవిలసితములైన సంగతు లెన్నియేని ఈ కృతిలో గోచరించును.

మన్మథుడు దేవకార్యార్థియై ఇంద్రుని సభ కేగినప్పుడు రంభాద్యప్సరసలు అతని రూపును తదేకదృష్టితో చూచిరను భావమును చెప్పుట కవి యుద్దేశము. దానిని చెప్పను తనవైపే చూచుచున్న దేవకాంతలను గని మన్మథుడు "తన్నుగని యనిమిషలైరో మున్నయైరో" అని అనుకొని నాడట. దేవస్త్రీలకు అనిమిషత్వంబు సహజము. అది మన్మథు డెరుగును. ఆ దేవభామినులును మన్మథుని రూపమును గూర్చి వినినవారే. కాని వారొకరి నొకరు చూచుకొను సందర్భ మానాడే కలిగియుండును. మన్మథుడనన నీతడా యని వారు 'విస్తు' పోయి చూచుచుండ వారిచుచ్చెర పాటును కని మన్మథుడు తన్నుగని వారు అనిమిషులైరా లేక అంతకు మున్నె యైరా అని సంశయించినాడట.

నిత్యనూతనత

పార్వతి విరహావర్ణనావసరమున పూర్వకవి ప్రసిద్ధములగు విరహవస్తువులను చెప్పుచు కవి వానినొక పట్టిగా నీయక గిరిరాజనందన చెలికత్తెలలో చతురయగు చతురికచేత చమత్కారముగ చెప్పించినాడు. "విరహావ్యథచే విలుప్తధైర్యయైన యగజను వలరసం బొక్కపెట్టున తిరిమి యుక్కివంబుగానిండ—తాల్మి కట్టువిడినదో యన యాత్రపు వారి పెల్లుబికి వెల్లివిరిసి" దిగువారజాలువార అది చూడలేక ఆమె ప్రియవయస్య ఆమెననునయించుచు

"అడుగకు నమ్మ నగ్గొనకు
మమ్ము, బయల్పడ నాడు చిక్కితో
నాడకుమమ్ము, తేటగను
నాలతి సేయకు మమ్మ, వెన్నెలం
జూడకుమమ్ము తెమ్మెరల
సోకకుమమ్ము, తలిర్చుమావి క్రీ
నీడకు బోకు మమ్మ యని
నెచ్చెలికత్తియ లెప్పెనమ్మతిన్" (5-118)

అని హితోపదేశము గావించును. ఇట కవి తానై విరహమును వర్ణింపక కవినిబద్ధవక్తృప్రౌఢోక్తి గావించుట విశేషము.

మరియొకచోట గిరిరాజనందన హరునియందు దాస్యక్తయై లీలోద్యానమునకు నొంటరిగ జేరి బాలేందుశేఖరుని లలితాకారమును రహస్యముగ చిత్రించుకొని మైమరచి సంధ్యదాటినను అటనే నిలిచిపోయినది. అట చెలులు కన్యాంతఃపురమున పార్వతిని గానక వెదుక నారంభించిరి. అందు చతురికయను నెచ్చెలి లీలోద్యానంబునం దందందు తిరుగుచు అచటి పద్మచకోరకాది వస్తుసముదయమును గాంచి 'జలజాతముల కింత చన విచ్చిరి గిరిజ దరహాసరుచి తావులెసగునట్లు'— 'హిమగిరి కీమెయి యెంగంగవచ్చె నితాంత సుధాపూర్ణకాంతి చనరో'— 'రాజకీరముల కింత రసవంతమను మాట నోర్వ ఏరీతి వచ్చె?' అని తర్కించి బహుళ ప్రాలేయాచల కన్య మనసు వేనవచే తిన్నగా మరచియున్న సమయమెరిగి ఆ బాల అవయవముల సొంపును ఇవి గిలుపాడుకొని యుండెనో పునని యొక నిశ్చయమునకు వచ్చినదట.

మరియొక సందర్భమున నగజ సౌందర్యమును వర్ణించుచు పూర్వకవులు వాడినట్లే కేశబంధమునకు తమాలమును, కంఠస్వరమునకు పికారావమును, నాసికకు చంపకమును పోలికలుగా చెప్పుచు, స్వకీయ ప్రతిభచే చమత్కారవర్ణనము గావించినాడు. పార్వతి విరహపడుచుండ చెలులామె చుట్టుచేరి విరహకారకములగు వస్తువులవలన భయములేదని చెప్పుచు "నీ వేనలి కాలోరగంబని మలయానిలంబు నీపొంతకు రాదు - కమలాస్య నీ కనుగవ చకోరకంబని వెన్నెల సారకు నీయున్న యెడకు— నీ స్వరము పికోరవమని మాతమ్ములు నీకు కొమ్మలు చూపవెరచు— నీ నాసిక చంపకమను భీతిని అళులు నీ పొంత గని అలయబారును— శివుని నీహృదయవాసిగని మన్మథుడే రా వెరచును" అటువంటప్పుడు మదనతాపకారులవలన నీకు భీతియేలయని చమత్కారముగ అనునయింతురు. ఇందు పార్వతి ననునయించుట వాచ్యార్థము. ఆమె ప్రత్యంగ సౌందర్యవర్ణనము వ్యంగ్యము.

దేశిసంప్రదాయము

కుమారసంభవ కథ కాళిదాసు గ్రంథమునందును భాగవతమునను, బ్రహ్మ బ్రహ్మాండ పురాణములందును గానకలదు. కాని వానియందెందును దక్షుడు కూతుల కాపురములను పరికించుటే కానరాదు. అది ఒక్క నన్నెచోడకవీంద్రుని ప్రతిభాప్రోద్దీప్తము. అందును అది అతిదేశీయమై యొప్పినది. దక్షుడు తన యేబండ్ర సుతలకు విధిప్రయుక్తముగ వివాహములు గావించి అత్తింట కంపినాడు. వారందరు సంతానవతులై సుఖంబుననుండ దక్షునకు వారి కాపురములను స్వయముగ పోయిచూచు వేడుక కల్గినది. ఆ ప్రకారము వరుసగా ధర్మరాజ కుబలయశాంభవాది జామాతలను చూచి, కూతులను పలుకరించి వారి ప్రశాంత సాంసారిక జీవితమును కని ముదితుడైనాడు. అట్లు దక్షుని సహజమగు పితృవాత్సల్యముతో బయలుదేరి పరమేశ్వర ప్రాసాదమున కరుగుటకుగల ఘట్టములలో దేశీయతాముద్ర ప్రతిబింబించును.

దక్షుడు తనకు శివునివలన కలిగిన పరాభవము నిల్లాలితో చెప్పుకొనుట మరియొక కళామయ ఘట్టము. దక్షయజ్ఞము వర్ణించిన కవులందరు దక్షునకు శివుని వలన కలిగిన పరాభవమునకు అతడు రౌద్రమూర్తియై ప్రతిక్రియార్థము యజ్ఞము సేయబూనినట్లు వర్ణించిరి. నన్నెచోడుడు పరాభవానంతరము మనఃక్షుభితుడైన దక్షుని నిజనివాసమునకు పంపి తన మనఃఖేదమును అసిక్నికి చెప్పించును. అపుడయ్య విన్న దక్షుని ఇల్లాలు భర్తతో—"ప్రియమెలుంగునంచిచ్చిన బిడ్డ మనకు బాసనియుండు డింక నా పలుకు లేల"—"అని యటుంచి, దుర్మూర్తులకేలికి బిడ్డ నిచ్చినందుల కనుభవింపు" మన్నట్లు సమాధానము చెప్పను. ఆమె మాటలతీరునం దంతయు కామారప్రాయమందున్న అకువారి తత్వము తప్ప అన్యము స్ఫురింపదు. అది సామాన్యసంసారస్త్రీల హృదయతత్త్వము. అల్లుని తిట్టలేక మగని తెగనాడుట ఎదుటివారిని దూషింపలేక తన్నుతాను నిందించుకొనుట వంటిది.

రతీమన్మథుల సంవాదము

ఇందు రతీమన్మథుల సంభాషణము కవివరేణ్యుని సంవాదరచనాచాతురికి దక్కిన తార్కాణము. అంతియేగాదు. రతీమన్మథుల పరస్పర సంభాషణములో రతీపాత్ర అద్భుతముగ పోషింపబడుటయే కాక ప్రత్యేకముగ చిత్రింపబడినది కూడ.

మన్మథుడు దేవసభయందు ప్రగల్భములు పల్కి వచ్చునంతలో నిట రతీదేవికి దుర్నిమిత్తంబులు పొడసూపినవి. తిరిగివచ్చిన మన్మథుని చూచి పెల్లుబుకు ఆవేశ

నను అంగచిపట్టి సురపతి నిన్ను పిలిపించిన పని యేమని రతి ప్రశ్నించెను. పురుషప్రకృతి ధీరమైనది. అందును అగతానాగతముల నెఱుగనివాడు మన్మథుడు. అతడు నిశ్చలుడై ఆమె కళవళపాటునకు గతిం బడుచు "ఉమాను హేతుని తపోభంగము చేయుటకై నాకాధిపతి వేడ నద్దాని కొడంబడితి"నని యలవోకగా జెప్పెను.

ఆమాట విన్న రతీదేవి గుండె జల్లుమన్నది. నాకాధిపతి యంతటివాడు మన్మథు నీ పని కెట్లు వినియోగించె ననుభావ మామె హృదయమున నెల కొన్నది. అతడు ప్రభువై యధికారగర్వముచే నట్లు పనిచిన పనుచుగాక, 'నీవాపని కెట్లొడంబడితి' వని మన్మథుని ప్రశ్నించినది.

మన్మథునకీ విషయమున అధైర్యమెంతలేదో, రతికి ధైర్యమంతలేదు. దూరదృష్టిగల రతి కీపని నాశంకించినది; సురనాథుని తొందరలేక మరు పొంగద్దలను లోనైన మన్మథుడు సాహసమునకు సిద్ధపడినాడు. రతికళవళపాటునకు కారణ మాతడెరుగడు. అతని మొండిధైర్యమునకు గతించేమిరో ఆమెకు తెలియును. కాని భర్తను అపదనుండి దక్కించుకొనుట ఆమె కర్తవ్యము. సామదానభేదములలో నేదానిచే నైనను అతడు కార్యమునకు విముఖుడు కావలయును. ఏమి చెప్పినను మన్మథుని స్థిరనిశ్చయమునకు చలనము కలుగ లేదు. ధూర్జటి కంటికడిందిగాంటల్లో చెలగాటమాడు టకే సిద్ధపడె "ప్రాణగోడ్డనుంగును" ప్రగల్భముల్లాడి పరమేశ్వరుని పువ్వుశర జర్జరితాంతరంగుని కావించెద ననినాడు.

'ఏమిచూచుకొని యీసాహసమని' ఇల్లాలు లాలితముగ ప్రశ్నించినది. మీది ఇక్షుశరాసనము, అతనిది కనకాచలము. అంటినంత కందిపోయెడు పూవుబాణ ములు మీకున్న, అతనికి పాశుపతమున్నది. అతడు పురా పహారి, మీరు పాంథుల చేయుట తప్ప అన్య మెరుగరు. కావున పురాంతకునితో వైరము మానుకొమ్మని ప్రతి మాలినది.

ఆమాటలకు మన్మథునిలో మార్పుకలుగలేదు. "ఉగ్రుని ఫాలలోచనాగ్ని నెదిరి నిలువ నీ కొలది ఏపాటిది? బాలురైనను నవలి పిప్పిచేయు చెరకును విల్లుగా పట్టి, సెలతల కేశపాశముల తాకిడికే వాడిపోత్త లగుపూలను బాణములుగా గొంచి, అబలలు కేరిపార చూచినంతనే ఆకసమున కెగిరిపోవు శుకపికములను మూలబలముగా గొంచి నిటలాక్షు నెదిరించుటకు సిద్ధపడుటా?" యని మందలించినది.

అప్పటికిని మన్మథుడు చలింపలేదు. ఆమె కర్తవ్యతావిమూఢస్వాంతయై ఖేదోపాయ మరసినది— మన్మథుని మాచి "ఇదంతయు నింద్రుడు నిన్ను గడ తేర్పజేసిన పన్నగడ సుమీ" యని హెచ్చరించినది. "నాకలోకపురుచ్చిగంటులందరు నింద్రునకు వశంవదులు. వారాతని విలాసక్రీడలకే జన్మమెత్తినవారు. అట్టివారు ఇంద్రలోకమున నిన్ను చూచి చలించిపోయిరి. ఇంద్రు డది సహింపలేక నిన్ను నిటలాక్షునికంటిమంట కెర సేయుచున్నాడు. అది ఇంద్రుని పన్నుగడ తప్ప అన్య ము కాదు. ఆడుకర్ణ మని నాపలుకు శ్రోత్రపేయముకా సాహసము మానుమ"ని హెచ్చరించినది.

మన్మథుని కార్యదీక్షకు చలనము లేదు. "ముదితా! ఎంతటివాడును కామ మాయలకు లోనుగాకపోయెను నా శక్తి నినవే? పరమేశ్వరుని నా బాణముల కగ్గ మొనరించెద చూడు"మని మన్మథుడు ఆమె నాశ్వాసించి నాడు. ఈవిధముగా రతీమన్మథుల ప్రసంగమును నాట కీయపద్ధతిలో మలచి కుమారసంభవకథను సవ్యముగా నడిపించినవారిలో నీతడే ప్రథముడు

పయిసంభాషణమున, మన్మథుడు లక్ష్మీపుత్రు డనికాని రతీదేవి యొక్క యాగ్నత శక్తియని కాని మనకు తోపదు. మరి, వారు ప్రేమైక బద్ధులు సామాన్య పతీ పతులుగా గోచరింతురు. వారి వాగ్వాదముల తీరుమాచ దంపతులు క్లిష్టపరిస్థితులలో చేయు గోష్ఠివలె సాంసా రికముగ సాగిపోయినది.

ఎఱుకత

శైలేంద్రతనయ తపోభిముఖియై హిమవన్నగ వనాంతరమున తిరుగాడుచు పర్వతసానువులలో సంచ రించుచు ఎరుకతలను చూచినదట. వారి వేషభావలను వర్ణించుచు 'వారితనుకాంతి హరినీలమణులకు నాయువు వచ్చెనా యనునట్లున్న' దనినాడు కవి. కవిసమయాను సారము స్త్రీల తనుకాంతిని మెరుపుతీగగనో జంగమ హేమవల్లిగనో, పుత్తడిబొమ్మగనో పోల్చిచెప్పుట సంప్రదాయము. కాని పర్వతసానువులందు చరించు నెఱుకత జంగమహేమవల్లియు, పుత్తడిబొమ్మయు నెట్లగును! ఆమె రూపు నల్లనిది. యువతియగుటచే నిగనిగలాడు మిసిమిగలతనువుతో నొప్పినది. కావున నే అతను కాంతి హరినీలమణులను పోలినదని స్థానిక ప్రభావానుగుణముగ వర్ణించినాడు.

ఆటవికస్త్రీలు

పయిసందర్భమున నే ఆకాంతారవాసులగు ఆట విక స్త్రీలు వర్ణింపబడిరి. వారి రూపరేఖావిలాస చేష్ట లను వర్ణించుచు నోటితో వారిని చీరికకల్లు ద్రావిన మదపింఛుర గామినులనినాడు. కావ్యసంప్రదాయముల ప్రకారము అంగసౌష్ఠవముగల రూపవతులనడకలు మద గజరాజయానములవంటివి; కాని ఇట వనమధ్యమునందు అతిశీతలత్వమును అత్యుష్ణతయు గణింపక మృగములను

వేటాడుచు మృగములలో మృగములై తిరుగు ఆటవిక స్త్రీలు మదగజరాజయానలు కారు. అయినను వారి నడక లతిమందములై నడుట విరుద్ధాంశము. తత్పరిహారమునకై కవి ఆ మందయానములకు కారణము వారుణీమదమని చెప్పి సమన్వయించుకొనినాడు. మరియు నమ్మదోన్మత్త మత్తకాశినులు, పటపగ్గములు లేక విచ్చలవిడిగ సంచరించుచు, క్రీడించుచు, విల్లను దంపుచు, గౌడ గీతములను పాడుకొందురట. ఇట గమనింపదగ్గ దొక విషయము. ఆటవిక స్త్రీలరూపు, రూపమున కనువగు ప్రవృత్తి, ప్రవృత్తి కనుగుణములగు చేష్టలు, స్థానిక ప్రభావానుగుణములై మనోహరముగ వర్ణింపబడినవి. అంతియే కాదు. వారు ఇచ్ఛావిహారవర్తనలు, వారుణీ మదోన్మత్తలు అగు నాటవిక స్త్రీలు అట్టి జాతిని వర్ణించునప్పుడు కూడ కవి ఔచిత్యమును మరువలేదు. కావుననే ఆ మత్తకాశినుల ఆలాపముల కర్థము గౌడగీతములలో జంగమల్లికార్జునుని స్తుతించుటతప్ప అన్యము కాదనినాడు. శివలీలావినోదియగు నన్నెచోడుని హృదయము పరమేశ్వరాయత్తమగుటచే నతని కెల్లప్పుడు సర్వము శివమయముగనే కనిపించినది. పార్వతి బాల్యక్రీడలలోను, ఆమె గర్భమందున్నపుడు చూలాలుగా మేనక తలచిన తలపులలోను, శివుని తన పూలబాణములకు వశవర్తిగా జేయబోవునప్పటి మన్మథుని భావనలోను, మునివాటికా పరిసరములందలి ప్రత్యణువునను కవీశ్వరునకు శివునిలీలలే గోచరించినవి. వేయేల హాస్యరసప్రతిపాదనావసరమునకు కవి తన శివభక్తిని పదిలముగ చూచుకొనినాడు.

ప్రౌఢ భావ కల్పనలు

హరిణీచామలాంబుజ స
　　హస్రముపూన్చి మృగాంకు కందు వి
స్ఫురిత మలాసితాబ్జముని
　　పున్పఁగఁ జాచినచేయి చూచి చం
దురుడని రాహు సాచి వెఱ
　　దుప్పల దూగఁగ జారుచున్న న
య్యురుపురఁజూచి నవ్వు పర
　　మేశ్వ డీవుత మా కభీష్టముల్.

పయిపద్యమునకు సందర్భము ఇష్టదేవతాప్రార్థనము. విష్ణువు శివుని తెల్ల తామరపూవులతో పూజింప దలచి యాతని శిరసునందున్న చంద్రునిలోని మచ్చను ఒక అసితాబ్జమని భ్రాంతిపడెను. అంతతో నూరకొనక దానినితీసి పారవేయ సమకట్టి చేయిచాపగా ఆ చేయి అమృతాంశునకు రాహువుగా దూపట్టినది. తోడనే అతడు కలవరపడిపోవును. అట్లు హరియు చంద్రుడును భ్రాంతికి జిక్కి కలవరపడ ఆ కలవరపాటుచూచి శివుడు నవ్వినాడట. కవి ప్రార్థనావసరమునకూడ హరి చంద్రాది దేవతలను కూడ భ్రాంతిలో ముంచి తాను శివభక్తుడు కాన ఒక్క శివుని మాత్రము భ్రాంతినుండి దక్కించుకొనినాడు.

"తమ వక్త్రాధర కేశ(పాశ)యానవచనో
　　ద్దామ ప్రభావంబులన్(?)
రమణం బోలుగుమన్న తత్సరసతుల్
　　రాజీవబంధూక భృం
గమరాళోత్పల రాజి నూరివెలి వ
　　ల్కన్నిర్గ్రహింపించిన
ట్లమరెన్ దోయజషండముల్ పురవరో
　　ద్యానంబులం దందమై"

ఇట వర్ణనీయము పురబాహ్యోద్యానమం దొప్పిన తోయజషండము. రామణీయకము ఆ పురస్త్రీలు తమ ముఖములకు, నగములకు, కేశపాశములకు నడకలకు కన్నులకు సాటివచ్చునన్న ఈర్ష్యచే రాజీవబంధూక భృంగమరాళోత్పలరాజిని ఆ పురబాహ్యోద్యానకమలాకరమునందు ద్రోయించిరేమో యనునట్లు ఆ తోయజషండము అమరినదట.

ఈ విధమైన ఉత్ప్రేక్షా భ్రాంతిమదలంకార శోభితములగు వర్ణనలెన్నియేని కలవు. అవ్వాని రచనాచాతుర్యమున కవిరాజశిఖామణి కృష్ణరాయక్షితీశుని కూడ మించెనేమో యనిపించును. మరొకటి వర్ణనల విషయమున గమనింపవలయును. ఆంధ్రమందలి పురాణములకును, ప్రబంధములకును గల ముఖ్యభేదములలో వర్ణనలొకటి. పురాణకవులు కథాకథనమునందు శ్రద్ధనిచ్చిన ప్రబంధకవులు వర్ణనల కెక్కువ ప్రాముఖ్యమిచ్చిరి. ప్రబంధములందు పాత్రౌచిత్యమునకును, రసపోషణమునకును ఎంత ప్రాధాన్యముకలదో ప్రౌఢభావకల్పనల కంతే ప్రముఖస్థానము కలదు. ఆ విషయమున పరాకాష్ఠకు పోయిన ప్రబంధములలో విష్ణుచిత్తీయ వసుచరిత్రములు ప్రధానములు. నన్నెచోడ గ్రంథమునందు ఏకదేశముగా నున్న ఆ ప్రౌఢభావవర్ణనలు వసుచరిత్ర విష్ణుచిత్తీయములలో ప్రధానములైనవి. ఉత్ప్రేక్షా రూపక భ్రాంతిమదలంకారములు అట్టి వర్ణనలకు జీవగఱ్ఱ. ఇక నన్నెచోడుని ఉత్ప్రేక్షాలంకారాల నిర్మాణకౌశలమును ప్రత్యేకముగ పరిశీలింతము.

కలగూరగంప

'పల్లవుల శిల్పశైలి!'

పల్లవుల శిల్పం నుంచి విచిత్రముగా కనబడే మూడు అంశాల్ని ఇవ్వడంలో నా నమ్మకము పల్లవుల శిల్పమంతా విజాతీయమే అని కాదు. "పల్లవులు విజాతీయాలూ, ఆక్కడ విదేశీయ జాతులు కలిసిపోయినట్లే వీరున్నూ భారతీయులలో కలిసిపోయినారూ, భారతీయుల మతాచారాలూ ఇతిహాసాలూ అవలంబించారూ, అయినా వారి స్వజాతీయాభిమానము రెండు మూడు చిన్న సంజ్ఞలలో నిలిచివున్నట్టు కనిపిస్తుందీ, చిత్తగించండీ" అని మాత్రమే నా మనవి. పల్లవచిత్రములన్నీ భారతీయములే. పల్లవులు "శివపాదశేఖరు"లు.

అయితే, కొన్ని కుటుంబాలలో ఏదో ప్రత్యేకాచారము ప్రాచీనకాలంనుంచీ దిగిరావడము మనకు అనుభవసిద్ధమే. ఇది సంఘపు మొత్తపుఆచారాలలో కానరాకపోవచ్చును, గాని ఆ కుటుంబపు ఆచరణలలో నిల్చివుంటుంది. ఈ ఆచారాన్ని బట్టి, ఆ కుటుంబానికి పూర్వకాలంలో సంభవించిన విపరీతానుభవమును తెలుసుకోవచ్చు మనము. తిరుపతిస్వామి బీబీనాంచారమ్మ, రంగనాథస్వామి నాచ్చియారూ, మహమ్మదీయుదండయాత్రల ఫలితముగా నాటిభక్తులు ఆస్వాములకు కూర్చిన దేవేరులు. చంద్రధ్వజము ధరించి వెంకటేశ్వరస్వామి ఊరేగింపుకి ముందు ఒకరు (ఏడాదికొకమారు) నడవడమూ ఆదండయాత్ర ఫలితమే. ఈ మైలారల్లు చరిత్రను విప్పి మనకళ్లయెదుట పెట్టగలవు.

అదేరీతిగా పల్లవుల శిల్పాలలో వారి విజాతీయతకు చిహ్నములుగా రెండుమూడంశములు నిలిచివున్నట్టు నాకు కనిపించింది. కొమ్ముల కిరీటము ఒకటి. ఇది గణేశరథముపైన మాత్రమే కాక ఆ రథశిఖరముఖ మండపములోనూ, పార్శ్వమందూ, మహాబలిపురపు గుహాలయ ద్వారపాలురకున్నూ, భైరవకొండ ద్వారపాలురకూ, సింగరాజపుర ద్వారపాలురకూ, ఇంద్రకీలపర్వతపు అక్కన్నమాదన్న గుహాలకు ద్వారపాలునికీ, చివరకు పల్లవశిల్పాన్ని కొంత అనుకరించిన బాదామిచాళుక్యుల, పట్టదకల్ విరూపాక్షాలయ స్తంభాలంకార ద్వారపాలునికి కూడా కనబడుతున్నది. మహాబలిపురపు మహిషాసురునికీ, దీని ననుకరించి వెలసిన ఎల్లోరా మహిషాసురునికి కొమ్ములుకలవు. కంచికైలాసనాథాలయ శిల్పచిత్రములలోని దుర్గచేతి త్రిశూలము ఇలాటి 'కొమ్ము'లతోనే కనబడుతున్నది. ఈ రకపు కిరీటానికి శైవవ్యాఖ్యానమే కాబోలు 'శివపాదశేఖరా'త్వము. పల్లవుల శాసనాలలోనో, నాటికావ్యాలలోనో ఏనుగుతలవంటి కిరీటము ప్రశంస ఉన్నట్లు కీర్తిశేషులు వెంకయ్యగారు చూపినారు. శిల్పంలోని ఈ కిరీటము కొత్త; వాఙ్మయములోని ఆ కిరీటము కొత్త: అదే ఇది కావచ్చునని పించింది నాకు. ఏనుగుతొండము వలెనే కిరీటముకొన పొడూగ్గా వుంది. ప్రక్కన దంతాలులాగ ఈ కొమ్ములున్నాయి. అంతమాత్రమే నా సూచన. ఆముందర గోపాలరావుగారిచ్చిన "అహిచ్ఛత్రపు కిరీటపురేకుల"కూ ఈ కొమ్ములకూ పోలికే లేదు. అందుకే కొమ్ములిమ్మన్నాను. అర్ధచిత్రాలలో స్ఫురణమాత్రంగా గోచరించే 'నిండు'దనమునుపట్టి చూపించే గణేశరథపు శిరస్సును రెండు కోణాల్లో చూస్తే అవి కొమ్ములేఅని తెలుస్తుంది. మరి, "కొమ్ములు లాగే కనబడతాయిగాని కొమ్ములు కావు" అని వారి అభిప్రాయము; కొమ్ములేనని నా అభిప్రాయము.

గంగావతరణచిత్రములోని ముని చేతిలో నిది పాత్ర అవడములో విప్రతిపత్తిలేదు. అతను పాత్రలో నీరునింపి గిలకరించి తిరగబోస్తున్నాడనవచ్చును.

పల్లవులు శిల్పించిన సింహాన్ని దానిముంగ్రాని తలనుబట్టీ, దానివర్తులాకారపు జూలునుబట్టీ గుర్తుపట్టవచ్చును. శుంగ, శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండిన వంశీయుల సింహాలకు ఇది భిన్నము. వారందరు నిర్మింపించిన సింహాలను చూస్తూనే తమ శిల్పాలన్నిటా— స్తంభాలడుగువనా, నిండుశిల్పంగా 'రథము'ల దగ్గరనూ, ధర్మరాజసింహాసనము దాపునా,— ఈ కొత్తసింహాన్ని నిర్మించడములో పల్లవుల స్వంత అభిమానము గోచరిస్తోందన్నాను. ఈ రకపు రింగుల జుట్టు గాంధారశిల్పాలలోనూ, మధురశిల్పాలలోనూ, శాక్యసింహుని శిరస్సుమీద కానవస్తుంది. గాంధారశిల్పాలన్నిటా ఇదే కానవస్తుందని చెప్పలేదు. ముడిగట్టిన జుట్టుకూడా గాంధారశిల్పాలలో ఉన్నది. కనబడుతూంటే లేదని ఎవరంటారూ? రింగుల జుట్టూ కనబడుతున్నది. యవనులపాలనలో చిరకాలముండిన మధురలోని శిల్పాలమీదా కనబడుతోంది రింగులజుట్టు. పల్లవశిల్పంలో మిగిలి కనబడే (ఔత్తరాహ) విజాతీయగుణ మిది అన్నాను. పల్లవశిల్పంలో గజలక్ష్మికి కనబడే కిరీటమూ, పల్లవ విగ్రహాల కర్ణాభరణ అసామనస్యమూ కూడా వింతలే అన్నాను. ఈ వింతలు పల్లవుల నైజమును—పల్లవశిల్పనైజము ననలేదు—పట్టియిచ్చే అంశాలూ, పరిశీలించండన్నాను. పల్లవుల శిల్పశైలి కానే కాదు, చేసుకొనినజాగా. మరి పల్లవులు విదేశీయులనే!

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

గ్రంథవిమర్శనము

వెన్నెలవాడ

[గేయనాటికలు : కర్త: శ్రీ పి. నారాయణరెడ్డి. ప్రకాశకులు : సరోజా ప్రచురణలు, హైదరాబాద్. పుటలు : 95, వెల 1-50. ప్రాప్తిస్థానం: ఆంధ్రా బుక్ హౌస్, సుల్తాన్ బజారు, హైదరాబాద్.]

చేతిలో శ్రవ్యకావ్యం 'చూచి', రేడియో రూపకం 'విని' ఆనందించే రోజులివి—కాలగతిలో ఇది తప్పని సరి మార్పే కావచ్చును. దీనితోపాటు ఈ అర్ధశతాబ్దపు సంధికాలంలో సాహిత్యపరివర్తన పరిణామ మార్గంలో ఏర్పడిన అవ్యవస్థ ఈనాటికీ సుస్థిరంగా ఉన్నట్టే కనబడుతుంది. నాటకం దశవిధరూపకాల్లో ఒకటని ఎవరికీ తెలియని సంగతికాదు. నాటిక పదునెనిమిది ఉపరూపకాల్లో ఒకటని ఎవరికీ తెలియని సంగతి కాదు. కేవలం సంప్రదాయాన్ని అలంకారశాస్త్రాన్ని పాటించే విశ్వనాథ సత్యనారాయణగారి వంటివారో తప్ప ఆధునికులమని చెప్పుకొనే రచయితలెవరూ ఆ శాస్త్రం వైపు తిరిగి చూడటంలేదు సరిగదా ప్రదర్శనోద్దేశంతో వ్రాసిన ప్రతిదానినీ పెద్దదయితే నాటకమని, చిన్నదైతే నాటిక అని అంటున్నారు. ఇది సామాన్యంగా దృశ్యకావ్యాల సంగతి.

ఇంక, గేయరూపకాలనేవి ఏ పేరు పెట్టుకోవాలెనో తెలియక తంటాలుపడుతున్నాయి. కొందరు నృత్యనాటికలని అక్షరాలు ఉన్న ర్తవంచేసే పేరుతో పిలవగా, మరికొందరు సంగీతరూపకాలని సాగదీసి పిలుస్తున్నారు. ముద్దుగా కొందరు గీతినాటికలంటే మరిపెంగా కొందరు గేయనాటిక లంటున్నారు. ఈ అవ్యవస్థ కంతటికీ రెండు కారణాలు కనబడతాయి— పూర్వసాహిత్యాన్ని పరిశీలించకపోవడం; ప్రాతకో క్రొత్తకో తాము వ్రాసే ప్రక్రియ స్వరూపాన్ని నిర్ధారించి నియమించకపోవడం.

నాటకం సమాహారకళ. అందులో మాటకూ చేష్టకూ ఎంతప్రాధాన్యం ఉందో ఆటకూ పాటకూ కూడా అంత అవకాశం ఉంది. కాని ఆట, పాట మాత్రమే ప్రధానంగా ఉండే రూపకాలు మనకు లేవా? పాశ్చాత్యుల నృత్య ప్రధానమైన 'ఆపెరా' లాంటివి, 'మ్యూజికల్స్' లాంటివి మనపూర్వరూపకాల్లో లేకపోలేదు. అందులోనూ తెలుగులో దేశి మార్గపద్ధతుల్లో రెండిటిలోనూ మన కిటువంటి రూపకాలున్నాయి. యక్షగానాలు దేశిపద్ధతికి చేరితే మన కూచిపూడివారి 'పారిజాతా'లనబడే కలాపాలు మార్గపద్ధతికి చెందిన ఉపరూపకాలు. ఆచార్య హేమచంద్రుడు కొన్ని ఉపరూపకాలను 'గేయాని' అని 'మ్యూజికల్స్'గా పేర్కొన్నారు. వీటిలో సంగీతమూ నృత్యమూ సమప్రధానములైన శ్రీగదితము మొదలైనవీ ఉన్నవి. రాసకాదినృత్య ప్రధానములూ ఉన్నవి. మన కూచిపూడివారి (సత్య) భామాకలాపం శ్రీగదితమనే ఉపరూపకం. ఇందులో పాఠ్యం, స్థితపాఠ్యం, ఆసీనపాఠ్యం ఇత్యాదిగా నిల్చొని పాడడం, కూర్చొని పాడడం మాత్రమేగాక వాద్యం పెట్టుకొని 'కచేరి'చేసే అవకాశంకూడా ఉంది. నృత్యంమాట సరేసరి. కాని ఆనాటి యక్షగానాల్లో, ఉపరూపకాల్లో ఉండే పాటలకు సంగీతానికి లక్షణం, పద్ధతి ఉన్నాయి. ఏలలు, దరువులు మొదలైనవికూడా ఒక పద్ధతికి లొంగివచ్చినవే.

ఈనాటి గేయరూపకాలలో నియమితమైన వస్తు సంవిధానం కనబడదు. రసభావములమీద దృష్టి ప్రాయశః కొంచెం. రచన సాధారణంగా పదో పదునైదో ఇరవయ్యో మాత్రలని కొండగుర్తుగా వస్తాయి గేయాలు. వాటికి త్రిశ్రగతి, చతురశ్రగతి, ఖండగతి అనే ఏగతీ పట్టదు. వాటిని పాడేవారో లేక వాటికి ఆడేవారో వాటిని విరుచుకోవాలి. ఈమధ్యలో అర్థం, దానికదుపులో భావం, ఏమౌతాయో ఎవరికీ తెలియదు. ఈ గేయరూపకాలు వ్రాసే కవులు సాధారణంగా జనరంజకంగా ఉంటాయనుకొన్న ఒకచారిత్రక గాథనో ఒక కల్పననో ఎన్నుకొని లలితపద విన్యాసంచేసి సంతోషిస్తున్నారు. సినిమాల పుణ్యమా అని ఈనాటి సంగీతానికి శాస్త్రమెట్లా అక్కరలేదో ఈ గేయరూపకాల్లో నృత్యాలుకూడా అట్లే శాస్త్రాన్ని విడిచిపెట్టి అక్కరలేదంటున్నాయి. కాని కవులు మాత్రం ఒక్క ఉపకారంచేసి బ్రతికించినారు. ఈ గేయరూపకాల్లో కవిత్వం ఉండాలనేది వాండ్లు మరచిపోలేదు. గేయరూపకాల్లో కవిత్వం ఎంతవరకుండాలి, అసలు గేయరూపకానికి తగినవస్తు వేది, భావానుగుణంగా ఛందోవిన్యాసం చేయడమెట్లా అనేవి మనవా

రింకా ఆలోచించుకోవలసిన విషయాలు; కట్టి ఊహాగానంచేస్తే బహుశః అది ఎక్కడైనా అంతో ఇంతో కవిత్వం కావచ్చునుగాని అది రూపకమై దానిలో అటూ పాటూ ఇమిడిపోతాయనుకోవడం పొరబాటు. ఈరకపు రచనల్లో కనుపించే అవ్యవస్థను నివరించడంకోసమే ఇదంతా వ్రాయవలసివచ్చింది.

ఇదంతా ఒక యెత్తు—రేడియో రూపకాలు వ్రాయడం ఒకయెత్తు. అందులో మాట వినికిడిచేతనే శ్రోతకు దృశ్యకావ్యానుభవం కలిగించవలసి ఉంటుంది. శ్రోతను అవసరింపజేసి, కథారంగంలో దృశ్యం కావలసినదాన్ని శ్రవ్యంగా అందించి ఆకట్టుకోవాలి; చటులమైన సంభాషణాక్రమము, జటిలమైన భావప్రకోపమూ చూపించాలి. లేదా శ్రోతల ఊహను రెచ్చగొట్టి, మత్తుగొల్పి, ఆ అరనిద్దురలో అల్లే కలగంటూ కూర్చొనేటట్లు చేయాలి. ఈ రెండోరకంవాటికి పనికివచ్చేవస్తువు ప్రణయం లేదా ఏదైనా ఊహాకల్పన (Fantacy). ఈ రెండూ చేరితే ఇక, చెప్పవక్కర లేదు. ఈ మధ్యవచ్చిన గేయరూపకాలను కొంచెం పరిశీలిద్దాం.

శ్రీనారాయణరెడ్డిగారు కవిగా తెలుగుపాఠకలోకానికి బాగా పరిచితులు. కమనీయమైన కల్పనచేసి కమ్మగాపాడి సంతోషపెట్టగల ప్రతిభావంతులు. 'వెన్నెలవాడ' అనే ఈ గేయనాటికల సంపుటిలో వెన్నెలవాడ, దివ్వెలసంగీతం, సంక్రాంతి, గోకుల విహారం, అజంతాసుందరి, మనిషి-యంత్రం, నవ్వని పువ్వు అనే ఏడు కల్పనలున్నాయి. శరత్కాలం, భాగవత దశమస్కంధంలోని కృష్ణకథ, అజంతా చిత్రాలు ఎవరి కిష్టంకావు? సంక్రాంతి పండుగనాటి సంబరం, దీపావళి పండుగనాటి దీపదీధితి ఎవరు కోరరు? వీటిలో రెండుమాత్రం కొంచెం క్రొత్తకల్పనలే. అజంతాసుందరి, నవ్వనిపువ్వు ఈవరకే ప్రకటితాలు. అన్నీ రేడియోలో ప్రసారంచేయడానికి వ్రాసినవి. ఇందులో వెన్నెలవాడ, గోకులవిహారం, నవ్వనిపువ్వు, అజంతా సుందరి, రంగస్థలంమీద నృత్యనాటికలుగా ప్రదర్శింపవచ్చునట. ఏమైనా అటు రేడియోకు, ఇటు ప్రదర్శనానికి అనుకూలంగా ఉండేటట్లు వ్రాయడం చాలకష్టం. ఇవి చాలా జనరంజకమైనాయంటే రెడ్డిగారి రచనానైపుణ్యం వేరే చెప్పనక్కరలేదు.

వెన్నెలవాడ అనేది శరద్రాత్రికి సంబంధించిన ఒక కల్పన. కలువలరాణి చంద్రుని ప్రేమించడం, వర్షపువల్ల రెండునెలలపాటు ప్రియుని దర్శనం లేకపోవటం, శారదవేళ చంద్రోదయం కాగానే దిగివస్తున్నాడనుకొన్న చంద్రుని మబ్బులు కప్పివేయడం, రాణి వాయువును ప్రార్థించడం, మబ్బువిడిపోయి చంద్రుడు కొలనులో ప్రతిబింబించి కలువలతో విహరించడం ఇందులో కథ. దివ్వెల సంగీతంలో దీపావళినాటి దీపాలకు ఆకాశంలో చుక్కలకూ స్పర్థ. స్త్రీ—ఆకాశం - చుక్కలూ, అమావాస్య—దీపాల ఆత్మ ఒక్కటేనని తీర్పు చెప్పిస్తాడు కవి. దీపాలు వెలిగించే ప్రేయురాలిని చేరిచూస్తుంటాడు ప్రియుడు. ఆమె అది వెలిగించి ప్రియుని చేరేలోగా ఈ చుక్కల దీపాలకథ జరిగినట్లుగా చెప్పబడింది. మూడవది సంక్రాంతి—చక్కని సంసారంతో సంక్రాంతి పండుగనాటి ముంగిటి దృశ్యాలను కవి చక్కగా సంతరించినాడు—నగరు వచ్చి చెల్లెలి వదినను నిద్రలేపడం, వదిన ముంగిట్లో సరసాలు, రంగవల్లులు వేయడం, గొబ్బిపాటపాడడం, గంగిరెద్దులవాడు రావడం, అందరినీ దీవించడం— పాతని జియ్యరొకడే తక్కువగా కనబడుతాడిక్కడ. గోకుల విహారం అనేది అతివేగంతో నడిచే—కృష్ణుని జన్మ, గోపికలు కృష్ణుని అల్లరులు చెప్పడం, బృందావన విహారం కథ. అజంతాసుందరి, నవ్వనిపువ్వు ఈవరకే పాఠకులకు పరిచితాలు. ఇంక మిగిలింది. 'మనిషి-యంత్రం'...ఇందులో కవి,

'యంత్రానికి దయాగుణం హుళక్కి
ప్రకృతిని చీల్చడమే దాని ఫక్కి
మానవ సమాజం నోరూరించి
అరచేతిలో స్వర్గం చూపించి
మృత్యువనే చీకటిగదిలో
మెడపట్టి నెట్టుతుంది యంత్రం.'

అని తెలియజెప్పి,

'యంత్రం ఒక మదపుటేనుగైతే
నీవు మావటీడవు కావాలి
యంత్రం ఒకవారిధి యైపోతే
నీవొక నావరథివై నిల్వాలి'

అని ఉద్బోధిస్తాడు.

ఈ కల్పనలన్నిటిలోను సంక్రాంతి సహజచిత్రణంచేత, అజంతాసుందరి కళావిమర్శను పొదువుకొనడంచేత, నవ్వని పువ్వు అన్యాపదేశంగా నీతిబోధ చేయడంచేత మేలైనవని చెప్పాలి. వెన్నెలవాడ హృదయంగమమైన కల్పనేకాని నూతనత్వం, దమ

త్కారం లేవు. దివ్వెలసంగీతంలో చమత్కారం గాని, ప్రయోజనం గాని కన్పించవు.

రెడ్డిగారు సున్నితంగా ఊహచేయగల భావుకులు. కలువల కలగానువల్ల చంద్రునివిగా వసులో కలవరమేర్పడినదట! దీపావళివాడు మేదినిపై జలుకుల జలపాతములట! ఇటువంటి చక్కని సున్నితమైన ఊహలు ఉన్నా అక్కడక్కడ భావానికి విజాతీయంగా కనిపించేమాటలు చేర్లడం పాఠకుని మనస్సు చెదరగొట్టాయి. వెన్నెలవాడిలో చంద్రుడు 'మీ యీ ద్గగనమ్ముగుండె లోయలోన మార్మోగెను' అనడం ఏమంత బాగుండదు. చంద్రగోళంలో పల్లవించవచ్చు, నృత్యం చేసే వ్యక్తి నేటి నాట్య పరిభాషలో 'జెర్క్' చేసి కుండేలోయలు చూపించే అవకాశమూ ఉండవచ్చు. అసలు భావానికీ లోకులకు ఏమీ సంబంధము లేదు. అల్లే: దివ్వెలసంగీతంలో ప్రేయసి అంటున్నది:

'విరహంబలె ముసురుకొన్న
ఇరుల తెరల పొరద్రోల
వలపు దివ్వె లంటినింక
వెలిగించుచుమన్నదాన'

ఇందులో విరహానికి ఇరులకు ఉపమానోపమేయ భావం చెప్పి తర్వాత వలపుదివ్వెలని రూపకం. తానుండగా అక్కడ ప్రియునికి గాని తనకు గాని విరహం ప్రసక్తి లేదు. వాండ్లకు తెలిసిన ప్రణయ పరిభాషలో మాటాడుతున్నదనుకున్నా, వలపులంటే దివ్వెలంటే స్పష్టంగా ఉంటుంది.

'సంక్రాంతి'లో లక్ష్మి మగనితో 'ఈనాటి సంక్రాంతియూ నా ప్రియతమా, కలలబరువున నేను మరచినాను సుమా' అనడం కొంచెం అసహజంగా కనబడుతుంది. అల్లే 'నీయందే పైన వలపులు నూరినాను' అని లక్ష్మి మగనితో అనడంలో రచయిత ఏదో విచిత్రత విశేషం ఉందని భ్రమపడినాడా అనిపిస్తుంది. నిజానికది సున్నితమైన భావం కాదు. ఈ కల్పనలో రెడ్డిగారు కొన్ని ప్రసిద్ధమైన పాటలు ఇతికలని వాడినారు- గొబ్బిళ్ళపాట, చందమామపాట. వీటి కర్తల పేర్లు ఉదాహరించడం న్యాయ్యం. పద్యాని పుప్పులో 'ఉదయ భానుకరాల సూగలు జారె వేళ' అనటం సంప్రదాయానికి క్రొత్త.

ఇటువంటి కల్పనలకు కావలసిన లలితపదాలు, గేయాలతీర్పు, మెత్తని యూహాలు కవికి సమృద్ధిగా ఉన్నాయి. అలరించి మురిపించే నేర్పూ ఉన్నది. ప్రతిదానికీ ఊహాసుందరంగా చూపగల కన్ను ఉన్నది. కానైతే వస్తువును లోతుగా సంతరించడం, ఉరికించే ఊహలని ముద్రాదుపట్టి మురిపెంగా నడిపించడం, భావానికి వ్యాఘాతాలు దొర్లకుండా చూసుకోవడం కొంచెం అవసర మనిపిస్తుంది. అద్భుత కల్పనలే వ్రాసినా వాల్టర్ డి లా మేర్ వ్రాసినట్లు లోతుపాతులు, వెలుగు నీడలు చూస్తే రెడ్డిగారి రచనలు ఇంకా బాగా రాణింపగలవు.

రా గ హృ ద యం

[రాగహృదయం : రచన : కె. వీరభద్రాచారి, పి. యస్. ప్రకాశదీక్షితులు. ప్రచురణ: విజ్ఞానప్రభాస, భీమవరం. 88 పుటలు. వెల, 12 అణాలు]

ఈ గేయరూపకం 24-11-55 భీమవరం కళాశాల సంస్కృతి ఉత్సవాలలో తొలిసారిగా ప్రదర్శింపబడినదట. సాకేతనగరంలోని సువర్ణాక్షి అనే విదుషీ కుమారుడైన అశ్వఘోషుడు ఆ యూరిలోని ఆప పాడ శేస్పం ప్రభావతి అనే యవన వ్యాపారి కుమార్తెను ఒక కళాగోష్ఠిలో కలుసుకొని ప్రేమించడం, కొడుకు ప్రేమలో పడితే మహాకవి కాలేడని తలచిన సువర్ణాక్షి కోరికచే ప్రభావతి అతనినుండి వైదొలగడం, ధర్మసేనుడనే బౌద్ధాచార్యునితో వాదం చేస్తుండిన అశ్వఘోషుడు ప్రభక్తి పరితపించి తర్వాత కాలంలో సౌందరనందాది గొప్ప కావ్యాలు వ్రాయడం ఇందలి ఇతివృత్తం. దీనికి చారిత్రకాధారం లేదు. అయినా ఉత్తరదేశంలో ఇది 'ప్రచలితగాథ' అట. ప్రదర్శనకోసం వసంతోదయం, కళానిలయం, వల్లకీవనం, బౌద్ధవిహారం, శిశిర సంధ్య అని అయిదు రంగాలుగా ఉన్నదీ రూపకం. విద్యార్థులు తాము చేర్చిన ఆటపాటలతో ప్రదర్శించుకోడానికిది బాగా నేడుంది. ఇందలి గేయాలు అర్థ విచారం చేయక ఏదో జిలుగు పదాలు కూర్చుకోవడంవల్ల భావానికిగా బాధపడని వాండ్లకు శ్రవణపేయంగానే ఉంటాయనవచ్చు. మరీ 'లాస్యగుణ లలితచరణ పద్మావతి సాగతి మనవే' 'భువనభవన జన మోహనకంఠికి', 'జాలువారు నవపుష్ప మంజరి వ్రాలుచున్న చదె మత్త మధుపము...', 'విరితమ్మి విపణూలు' మొదలైనచోట్ల అన్వయమో అర్థమో కూర్పో విచార్యంగా ఉంటున్నది.

కళానిలయంలో కళాతపస్వుల గోష్ఠిలో ప్రభావతి అశ్వఘోషుడు పాడె విజయప్రతీకను గెల్చుకొన్న ఆ రెండు గేయాలు చిత్తగింపండి.

ప్రభాదేవి:

పరిహసిత యమునాలోలలావణ్య
లహరీ విహరిత జటాజూట
పరవశిత గాంగ తరంగ వీచీశీకర
విలసిత వాక్సుధాపూర
ప్రాభాత శైశవ సౌభాగ్యలక్ష్మీ
శోభానాంచిత వైభవోపస్విని
హృదయవర్తనలోల
మృదుల మోహన శీల
నటరాజ రాజేశ్వరా

అశ్వఘోషుడు:

అతిలోక మనోజ్ఞ భావ
భంగ్యంతర వ్యంగ్యవైభవ
రసాంచిత కావ్యకథా సరోజపత్రాంత
తుషారబిందు కళికావృత దివ్యలోచన
విలోలాలక, లోలలోచన
విపంచిధారిణి మనోవినోదిని వాణీ
విశ్వసౌందర్య శోభారాణీ
అశ్వఘోష హృత్పద్మస్థిత
భావభ్రమరిణీ.

ఆనాటి ఆనాటి సభ్యులవలె కరతాళ ధ్వనులు చేయడం తప్ప చేయగలదేమీ లేదు. Imagination rumming riot అంటే ఇదే గాబోలు!

కావ్యమాల

[కావ్యమాల: కర్త: శిరోమణి శ్రీ సన్నిధానము సూర్యనారాయణశాస్త్రిగారు, ఆంధ్ర, సంస్కృత భాషోపన్యాసకులు. ఆర్. బి. వి. ఆర్. ఆర్. కళాశాల, హైదరాబాద్. 124 పుటలు. వెల రు 1-50 న.పై.]

శిరోమణి. శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు తెలుగునాట కవిపండిత లోకాని కంతటికీ చిరపరిచితులు. ఆయన సవివరణంగా ప్రకటించిన కావ్యాలంకార సంగ్రహము, సంతరించిన తత్త్వ చంద్రిక చదువని సాహిత్య విద్యార్థియుండడు. ఆయన గోవర్ధన సప్తశతీసారము, అలంకారశాస్త్రంలోని రసవంతమైన శ్లోకాలకు చేసిన అమృతకణముల నే అనువాదములు, కీరసందేశ కావ్యము చదివి యానందింపని సాహిత్య రసికు లుండరు. వారి జాతకకథా గుచ్ఛము కూడ పత్రికాలోకమున ప్రశస్తి పాత్రమైనదే. శాస్త్రిగా రటు గొప్ప వైయాకరణులు, ఇటు కవియునైనవారు. వారు రచించిన పద్యకథాసంపుటి ఈ కావ్యమాల.

ఇందులో పది కథ లున్నవి. తెలుగువారైన కుమారిల భట్టు వారు విజృంభించియుండిన బౌద్ధము నరికట్టుటకు ప్రచ్ఛన్న వేషమున బౌద్ధధర్మము నభ్యసించి పిదప బౌద్ధుల నోడించి సుధన్వుడను రాజాస్థానమున పరీక్షకు నిల్చి వైదికమతమును స్థాపించి బౌద్ధగురువునకు చేసిన ద్రోహమునకు చింతించి తుషాగ్నిలో ప్రవిష్టుడై మరణించిన కథ మొదటిది. రెండవది భారత ప్రసిద్ధుడగు ఏకలవ్యుని కథ. మూడవది గురుభక్తి. నాల్గవది మాధవ విద్యారణ్యులు హరిహరబుక్క రాయలచే విద్యానగరము కట్టించి ఆంధ్రసామ్రాజ్యము స్థాపింపజేసినకథ. ఐదవది శాపానుగ్రహసమర్థుడగు వేములవాడ భీమకవి రాజ కళింగగంగును యోగిగా జేసి మరల రాజ్యమిచ్చినట్లు చేసినకథ. ఆరవది నారదతుంబురులకు సంగీతమున తాను గొప్పయన్న తానే గొప్పయని స్పర్థ రాగా హనుమంతుడు తన భక్తిసంగీతముచే రాలుగరిగించి వారినందరి కించి చేతనైనచో మీరుకూడ రాలుగరుగునట్లు పాడి బతుకుడని వారిని వేడెకించినకథ. ఏడవది మునికుమారుడైన రురుడు ప్రమద్వరయను గంధర్వాప్సరస్సంతానమైన కన్యను వలచి యామె మృత్యువు వాతబడగా తన యాయుస్సున సగమిచ్చి యామెను బ్రతికించికొని వివాహమాడిన ప్రసిద్ధభారతకథ. ఎనిమిదవది తాన్‌సేనకథ. అక్బర్ అంతఃపురములోని యొక హైందవ కుమారి తాన్‌సేనును ప్రేమించి విఫలురాలై అతనిమీది యనురాగముచే దర్బారీ రాగమును సాధించి రాజసభలోని శత్రువు లభిచారము చేయగా నకాలమరణము పొందిన తాన్‌సేను విద్యను నిలిపినకథ. తొమ్మిదవది ఒక బ్రాహ్మణుడు సమర్పించిన జరామరణము లేని పండుకారణముగా స్త్రీస్వభావము నరయవచ్చి సంసారము రోసి ముముక్షువైన భర్తృహరి కథ. పదవది దీపావళినిగురించి ఉత్తర, పశ్చిమభాగములందు వ్యాప్తిలోనున్న ఒక రాజకుమారి కథ.

ఇందులో కొన్ని పురాణకథలు, కొన్ని గాథలు, కొన్ని చరిత్రపూర్వగలవి. ఈపదింటిని కథాకావ్యాలుగా తీర్చడంలో శాస్త్రిగారు రెండువిశేషములు చూపినారు — మొదటిది ప్రతిపద్యములోను తెలుగు పలుకుబడులు చిమ్మడం. రెండవది అనేకంగా వైయాకరణ విశిష్టములైన ప్రయోగాలు వాడడం. ఈకథలు చదవడంవల్ల ఇటు తెలుగుపలుకుబడి అటు ప్రయోగ విజ్ఞానము సాహిత్యవిద్యార్థులకు కలిగితీరుతుంది. శాస్త్రిగారికృషి ఈ విషయంలో శ్లాఘాపాత్రము.

ప్రయోగవిజ్ఞానాన్ని కల్గించడానికి పాటుపడినా శాస్త్రిగారి రచన అంతటా ప్రసన్న మధురము. మచ్చునకు దీపావళియను కడపటి కథనుండి యొక పద్యమును, తర్జనీయమునుండి యొక పద్యమును చిత్రింపుదు.

'అది లేదని యిది లేదని
మది వగవక దైవ మిచ్చె మనకిది యను మర్మ
ముడతా మణి తనవి ర్తకు
ముదమిసిరేయుం బూన్గ కామ పొల్కె సతతమున్.'

'శ్రవణపేయమైన సంగీతవిద్యకుఁ
జక్షుపేయమైన యందమునకుఁ
జిత్తపేయమైన శీలంబునకు దాను
దలిరుఁబోఁడి క్రీతదాసి యయ్యె.'

ఇందలి యేకలవ్యుని కథలో మాత్రము శాస్త్రిగారు కొన్ని మార్పులు చేసినారు. నిషాదునకు ద్రోణుడు విలువిద్య నేర్పననుటకు కారణ మిందు క్రొత్తది. ఏకలవ్యుడు నిషాదుడు గనుక అస్త్రమంత్రముల నాతడు సరిగా నుచ్చరింపలేడనియు సరిగా నుచ్చరింపనిచో నవి విపరీతఫలము నిచ్చి చెడుపుచేయగలవనియు ద్రోణుడు చెప్పెను. యాదృచ్ఛికముగ నేనీ కోర్కె తీర వేరగల దని యాశీర్వదించెను. రెండవది అర్జునుని గొప్పచేయుటకై ఏకలవ్యుని బొటనవ్రేలు గోసి గురుదక్షిణగా నిమ్మని ద్రోణు డడుగలేదు. అర్జునుడే ద్రోణునకు తెలియకుండ ఈ కార్యము నిర్వహించినట్లు తీర్చబడినది. ఈమార్పులతో శాస్త్రిగారు ద్రోణాచార్యుల ప్రవర్తనకు వంకలొత్త బ్రయత్నించినారు. మార్పులు ఈకథలోని పరిధికి లోబడినంతవరకు ఔచిత్యమునకు కొరవ లేదు. విలువిద్య నేర్పనిచో గురుదక్షిణ యడుగరాదనుట న్యాయ్యమే కాని ద్రోణునికి సంబంధించిన ఈమార్పుల వల్ల గలుగు చివరిఫలమేమి? ఆయన దోషము అర్జునుని జుట్టుకొన్నది. ఇంతకును ఏకలవ్యవృత్తాంతము ద్రోణుని జీవితమున ఒక సంఘటన. ద్రోణుడు భారతమునందలి అసంఖ్యాకపాత్రలలో నొకడు—భారతమును విడిచి ఏకలవ్యకథకు గాని, ద్రోణునకు గాని నిలుచుటకు శక్తి చాలదు. ద్రోణునియం దాదోష మున్నంతమాత్రమున ప్రత్యేకముగా వచ్చిన నష్టము కాన్పింపదు. గురువు చేతిలో నంతటి యన్యాయమునకు బాత్రమగుట చేతనే—పాఠకునకు—ఏకలవ్యునిపై సానుభూతి, అతని గురుభక్తి దీప్తి కలుగుచున్నది గదా! అర్జునునివలన నాపట్లయ్యెనన్నచో నది మెరుగుతగ్గ ననిపించును. ఇంతకును ఈ మార్పులలో గాన్పించునది శిష్యవాత్సల్యముగల శాస్త్రిగారి గురుహృదయమని నాతలంపు.

గురుడు ప్రమద్వరను బ్రతికించుకొన్న కథలో శాస్త్రిగారి తీక్ష్ణ రసోచితముగా హృదయంగమముగా నున్నది.

భర్తృహరి కథలోని రాణి ప్రవర్తనమునందలి స్వైరత తెరమరుగు వృత్తాంతమును టార్చిలైటు వేసి చూపినట్లు ప్రౌఢముగా తీర్చినారు శాస్త్రిగారు.

ఇట్లీ కావ్యకూలలోని పది కథలును సర్వులు చదివి యానందింపదగినవి. సాహిత్యవిద్యార్థుల కవశ్యము చదువదగిన, పాఠ్యగ్రంథముగా నుండదగిన పుస్తకమిది.

గాంధీగీత

[గాంధీగీత : కృతికర్త. గొట్టిపాటి సుబ్బరాయులు. ప్రతులకు : వికాస ప్రచురణాలయము, అనంతపురం. 52 పుటలు. వెల. రు. 1.]

పరిమితమైన భాషాపాండిత్యంతో ప్రబంధాలు వ్రాయసం కష్టమేమో గాని ప్రతిభతో జిలుగైన పద్యం వ్రాయవచ్చు. పాండిత్యాన్ని సాధించడ మెంత కష్టమో తన శక్తిసామర్థ్యాల పరిమితిని తా నెఱుంగటంకూడ అంత కష్టము—కొందఱికది పట్టుబడితే మఱికొందఱికది పట్టుబడుతుంది. "గాంధీగీత" అనే చిన్న కావ్యాన్ని వ్రాసిన గొట్టిపాటి సుబ్బరాయులుగారీ రెండవ తెగకు చెందినవారు. గాంధీగారి జీవితాన్ని 'సీటు' గా తేటగీతులలో వ్రాసి జిలుగైన చిన్నకావ్యంగా సంతరించినారు. గాంధీగారిజీవితాన్ని వ్రాయదలచుకున్నవారు రాజకీయాలను చరిత్రను తప్పించుకోలేరు—ఈకృతికర్త కవితాదృష్టితో చరిత్ర ఫలానికి రంగు వేయగల దిట్ట.

'దంపఁబడినంత మాత్రాన చావబోరు
ధర్మజీవిత పథమున ధన్యులైన
అమరజీవులు ఈ జగత్తలరునాక
మంచితన మను గుణము జీవించుదాక.'

'భక్తకు తేజమ్ము, ప్రవక్త కూత,
కవికి సత్కాంత, పీశల నవిలి వెంట
సాగవమ్మును, త్యాగికి సాహసమ్ము
కూర్చినా డిన్నిటను మార్పు దార్చి వాడు.'

మహాత్ముని గూర్చిన ఇట్టి భావములతో కవి యీ కావ్య రచనకు పూనుకొన్నట్లు స్పష్టము. రచన ఆద్యంతము తేటగానున్నది. కూర్పులో జిలుగుగూడ నెక్కువే. అచ్చపు దెలుగు పలుకుబడి తాను మెచ్చిన త్రోవ. ఇతివృత్తమునకు రచనా పద్ధతి కిట్లు నిరాడంబరతలో పొత్తు కుదిరినది.

'కోరంబ జలెఁబట్టి యుత్తేజ ముడిమి కుతిసె
వాక్కు లడిగెను కత్తికి కొక్కెరదిగ'

అన్నచోట పలుకులలో వాడి, ఊహ యెంతగా మెండుకొన్నదో చిన్నవాడు ప్రయాణమై లండనుకు బోయిన గాంధీ—

'ఆంగ్లమున కుంటుబడక మాటాడలేదు
బహువిధంబుల భోజనభాజనముల
పద్ధతులఁగూర్చి యెఱుఁగదు పాప మతని
కంతియును వింత పెద్దల పంతియయ్యె'

వనుటలో గూడ నంతటి సొగసున్నది.

'భోగభాగ్యాల తులదూగు భూరిరాజ్య
దర్పవిన్యాస మంతియు తగ్గిపోగ్గి
ఒక్క మానిసి చేవ్రాలు నొక్కతోఁడ
పక్కునం జీలి వ్రక్కలు ముక్కలయ్యె.'

గాంధీ—ఇర్విన్ సంధిఫలాన్ని చెప్పే పై పద్యం లోని ఉక్తి బలమెటువంటిదో రౌండు టేబిల్ సమావేశాలు వ్యర్థమైనాయని చెప్పే ఈ క్రింది పద్యంలో మెరిసే అలంకార విన్యాస మటువంటిది.

'వాదముల తీరు ప్రతివాద వైఖరులను
కంతకోపదొ; ఫలితము గగన కుసుమ
ముఱుము మెఱపులతో పెట్టు చెఱువునిండు
ఉత్తమాటలతో పెట్టు పొత్తుగుదురు.'

కావ్యం చిన్నదైనా గుణానికి చిన్నది కాదు. అక్కడక్కడ దొరలిన పొరపులు మలిముద్రణంలో సవరించుకుంటే బాగుంటుంది. ఈ కావ్యం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారి కంకితము.

ఎస్. కె.

కైకేయి

[కర్త. చిట్టిప్రోలు కృష్ణమూర్తి; ప్రతులకు: కర్త పేర—గామాలపాడు, వయా-దాచేపల్లి, పల్నాడు తాలూకా, గుంటూరుజిల్లా. 7[illegible] పుటలు వెల: రు. 1-50 న.పై.]

యౌవరాజ్య పట్టాభిషేకం చేసుకోబోతున్న శ్రీరామచంద్రుని అడవులకు బోకేసిన కైకకు తరువాత ఎప్పుడో అవశ్యంగా కలిగిన పశ్చాత్తాపంగా ఈ చిన్న కావ్యం సంతరింపబడింది. శ్రీ చిట్టిప్రోలు కృష్ణమూర్తిగారీ గ్రంథం వ్రాసినవారు. 'మనవి'లో వారిట్లా వ్రాస్తున్నారు: "పండిత లోకంలో కైకేయిపట్ల సదభిప్రాయమే ఉన్నా జనసామాన్యంలో మాత్రం ఆమె పట్ల విరసభావం పాదుకొని పోయింది. 'గయ్యాళి'కి 'కైక'ను పర్యాయపదంగా వాడేటఱకూ పోయింది ఈ దురభిప్రాయం. ప్రజాబాహుళ్యంలో వేరువన్నిన ఈ దురభిప్రాయాన్ని తొలగించడమే ఈ కావ్యరచనోద్దేశం."

ఈ వుద్దేశంతో గ్రంథకర్త కైకేయి తలపోతలో రాముని బాల్యమాదిగా పాదుకొని పట్టాభిషేకం దాకు వచ్చిన కథను అవృత్తి చేయించినారు. రాముల అడవికి పంపిందని ప్రజాబాహుళ్యం కైకను నిందింపవచ్చు. తెలిసినవారు సానుభూతి చూపనువచ్చు. మరి సీత నడవుల త్రోచినమాట వచ్చినప్పుడు శ్రీరాముని నిందింపని వారు ఎవరు? కైక పశ్చాత్తాప పడడం చాల సహజమె. ఆమెనుగురించిన అపోహ లోకంలో తగ్గిపోవాలనే గ్రంథకర్త కోరిక ఆయన కామెమీద గల సానుభూతిని మాత్రమే సూపుతుందిగాని కొన్ని వేల యేండ్లనుండి కైక చెడ్డది అనుకొంటూవస్తున్న లోకం మారుతుందని ఆశ సమీక్షకునికి లేదు. ఏదో ఒక నెపంతో రామకథ అంతో ఇంతో పలికిన గ్రంథకర్త నభినందిస్తున్నాను.

గ్రంథకర్త వృత్తం నడపడంలో చేయి తిరిగినవారు. ఈ కావ్యమంతా చంపకోత్పలాలు మత్తేభ శార్దూలాలుగా నడిచింది. తెలుగుసంస్కృతాలు సమపాళంగా వాడిన ఈ రచన పశ్చాత్తాపాని కనువైన చిచ్చుదనంతో ఆ వుద్వేగానికి తగిన పద్యబంధంతో చక్కగా సాగిపోతుంది.

'చతురప్రజ్ఞలు సర్వమానవ మన
స్తత్త్వమ్ము లూహింతు పం
డిత మార్గమ్ములు నేను నా హృదయవా
టిన్ దీవ్ర ఝంఝానిలో
ద్ధతివీచుల్ చెలరేగి యేనిటులఁ బ
స్తాయించు టూహించి సం
తతసంక్షుబ్ధము నాయెడంద వెలయిం
చన్ సుంతి యూహింతురా'

చివరకు కైకేయినోట అనిపించిన ఈ మాటలు ఎంత శిల్పమార్గమున సంధానింపబడినప్పటికిని కవిగారి కుపయోగించినంతగా కైకేయి కుపయోగించవేమో!

గ్రంథకర్త కైవాడమునకు పద్యంలోని ధారా శుద్ధికి ఈ పద్యం చిత్తగించండి.

ప్రాతస్సంస్మరణీయమై ధియదపా
　　పచ్ఛేదకంబై జగ
త్పూతంబై రఘురాము నామమును ఆ
　　ప్తోక్త ప్రపంచ ప్రజా
వ్రాతవ్యాఖ్యత నింద్యమై స్మరణమా
　　త్రప్రాయసంహాస్కర
ఖ్యాతవ్యంబయి నాదు నామమును నా
　　కల్పంబు వర్తించెడిన్.

రామనామ మాకల్పము పాపచ్ఛేదకంగా నిలువవలెననీ కైకమ్మ చెడ్డపేరు పోవలెననీ అందరూ కోరవలసిందే. తథాస్తు!

చకోర సందేశము

[చకోరసందేశము కృతికర్త: శ్రీ మోటూరి వేంకటరావు. బి. ఏ., ప్రకాశకులు: శోభా ప్రచురణలు. ప్రతులకు: శోభా ప్రచురణలు, విజయనగరం సిటీ. 64 పుటలు వెల: రు. 2.]

చకోరసందేశమనే ఈ కావ్యం శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు కావ్యపరిచయంలో తెలిపినట్లుగా కాళిదాసు మేఘసందేశానికి 'దేహం తిరతుల్య సంవాదం'గల కావ్యం. కొన్ని సంవత్సరాల క్రిందట వేంకటరావుగారి హిమగళము నే ఖండకావ్యసంపుటిని నవ్యసాహిత్య పరిషత్తువారు ప్రచురించటం పాఠకులు మరచి ఉండరు. నిన్న మొన్నటి వారి 'సింహబలి' కావ్యం విద్జ్ఞుల మన్నన లందినది. ఏడాది తిరుగక మునుపే వేంకటరావుగారీ చకోరసందేశాన్ని పాఠకలోకానికి సమర్పిస్తున్నారు.

'హిమగళము' 'సింహబలి' 'చకోరసందేశము— ఈ మూడూ మూడురకాలైన కావ్యాలు. హిమగళములో వేంకటరావుగారి కాల్పనిక కవితామార్గ వశంవదమైన సంయమశీలమైన వ్యక్తిత్వం తెలుస్తుంది. సింహబలిలో వీరరసం ప్రధానం. చకోరసందేశంలో విప్రలంభశృంగారం. వేంకటరావుగారి బహుముఖప్రజ్ఞ ఈ కావ్యపై విన్యాసంలోనే తెలుస్తుంది.

మేఘసందేశం చదివి ఆనందించని సాహిత్య రసికు లుండరు. ఈ చకోరసందేశంలో ఇంకొకరో కాదు, ఆ యక్షుని ప్రియురాలే ప్రియునకు చకోరికతో సందేశం పంపటం ఇతివృత్తం. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ఈ కావ్యశిల్పాన్ని సమీక్షిస్తూ వ్రాసినట్లు ఇది 'చమత్కారముగా చెప్పినచో తోటాను త్రిప్పి కొట్టుటవంటిది.' ఇతర భాషలందువలె తెలుగులోను మేఘసందేశాని కనువాదాలు, అనుకరణలైన సందేశ కావ్యాలు ఎన్నో ఉన్నవి. కాని వేంకటరావుగారి ఈ కృతి విలక్షణమైనది; చమత్కారావహము; రసవంతమునైనది.

కాళిదాసురచన జ్ఞాపకాలతోనే ఈ కావ్యారంభం. యక్షప్రియురాలి గురించి పాడుకోబోయి కన్నీటి బొట్టుజారి వీణాతంత్రుల శ్రుతి భంగపడగా, గోడకున్న దర్పణంలో 'అతికృశాంకిత నిజాకృతి' నమ్మలేక లేచివెళ్లి వాతాయనందగ్గర కూర్చుంటుంది. వెన్నెలలో మరీచికవలె కన్పించిన చకోరికతో మెల్లగా తన సొద వెళ్ళబోసుకుంటుంది.

'వినవే చకోరికా! వినవె నా చెల్లి !
వినిపింతుఁ గన్నీటి విరహగీతికల—
అనుకంప నీకు ప్రత్యణువులోఁ దోఁచక
విలపింతు నేను నిల్వున గరంగుచును'

అనే ఈ మాటల ఆవృత్తితో ప్రథమఖండమంతా సాగుతుంది.

'సత్కృతులు నా జీవన శ్రుతులై కలంచ
మతిమాలి నాసొదల్ మఱిచెప్పకొందు'-అంటుంది.
'ఎన్నినాళ్లో కదే ఈ బాధ నన్ను
వెన్నంటి ఈ రీతి వేధించె! ఇంక
ఎన్ని నాళ్ళనిట్లె ఏడ్వంగవలెనో
చిన్నారి నాచెల్లి! చెప్పవే తల్లి!'అని కుములుతుంది.

ప్రియునికి సందేశ మందించి వచ్చి—

'ఈపాటి దయ నీవు చూపింతువేని
నీ పుణ్యమూ అంచు దీపమ్ము పెట్టి
నీ పేర ఏపొద్దు నే నుచ్చరింతు!
నీ పూజలను ప్రీతి నిత్య మొనర్తు!'

అని స్త్రీ సహజంగా ప్రతిమాలుకుంటుంది.

'చలికాని తెలుకు జాపుల వెన్నెలలను
సెంటాలి మెయిఁ జెమ్మగిలిపోతినమ్మ
వలపుకాని మృదూక్తి జలదస్వనాల
కలరి కేకిగ వింతచెలువ మొల్కితిని'

అని పూర్వపు ప్రణయానుభవాన్ని స్మరిస్తుంది. తనకు ఎడబాటు కలుగుటకు కారణమైన ధనదుని శాపం ఎట్లా సంభవించిందో తన నాథుని ప్రమత్తత ఏదో నాయిక వివరించడం ఇందులో విశేషం.

'కాయూపిరిని గల్గి మిసమిసమిన్కంచు
జీన చిన్నగా వెలుగును జిమ్ముకొంచుఁ
ప్రమిదలో జ్యోతినై ప్రేమియించు నాకు
జమురందినట్లయ్యె సకియ నీ చెల్మి'

అని చకోరికతో చెప్పుకొని తనస్థితి ప్రియునికి జెప్పి చెల్మికాని యాంతర్యము తెలిసివచ్చి తన చెవిని వేయుమంటుంది.

ఈ ప్రథమఖండమంతా ద్విపదలో వ్రాయబడినదని వేరే చెప్పనక్కరలేదు. ద్వితీయఖండమంతా మత్తకోకిలలు తరలాలుగా వ్రాసినాడు కవి. కాళిదాసు మేఘునికి చెప్పిన మార్గం ఇందులో వెనుకకు త్రిప్పి చెప్పబడింది. అయినా యక్షి స్వర్గఖండమని కాళిదాసు చెప్పిన విశాలానగరం వరకే చకోరికకు దారి తెలియ జెప్పి ఆ తర్వాత నే నెఱుగనంటుంది. అదైనా విశాల వరకూ తా నెప్పుడో యక్షస్త్రీలతో కలిసి వెళ్ళి చూచినది. తరువాతిది భూలోకంలోని స్థితిగతుల ప్రసక్తి.

'ఋతువులూరు విభిన్నతల జని
యించి మారు లతాంత సం
తతులు రాలి నశించు జేల సు
ధామయూఖుని కాంతి శా
శ్వతము గాదు నిశీథినీ పిర
చంద్రికా తమముల్ వరెన్
బ్రతుకు, చావు, ఘటిల్లు దుర్గతి
భాజనమ్ముగ ధాత్రిపై'

అని తనకు తెలిసినంగతి చెప్పతుంది నాయిక.

కాళిదాసురచనకు సమాంతరంగా విశేషాలు కూర్చుకుంటూ, మార్పులు చేసుకుంటూ, ఔచిత్యాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసిన రచనయిది. పతిశీలయైన స్త్రీదృష్టి, ప్రతీకలలోని సౌకుమార్యము ఈ కావ్యంలో గమనించి అనుభవించి ఆనందింప దగిన విషయాలు.

అడుగడుగునా కాళిదాసు రచనను నెమరు వేసుకుంటూ సాగిన రచన కావడంచేత అమాధుర్యం దీని కబ్బినంలో వింతలేదు. చకోరికకు దారిచెప్పతూ హిమవంతము మాటవచ్చినప్పుడు నాయిక ఇట్లా అంటుంది :

'పండువెన్నెలకన్న మిన్నగ ప్రబ్బు దివ్యకళాప్రభల్
నిండిపోవ దిగంతరాళము, నీవు తత్కమనీయ గ
ఖండమున్ మలదారిబత్తెముగా బడిన్ గ్రహియించి త
త్కాంతరాయని వీడుకొందు చకోరికా పయనింపవే'

ఈ రచనలోని సౌకుమార్యం తెలియడానికి కాళిదాసు రచన జ్ఞాపకం చేసుకోడానికి పై పద్యం చాలు.

కావ్యాదిలో కవి తనకావ్యాన్ని ఆశీర్వదించి పరిగ్రహింపమని కాళిదాసును కోరడం ఉత్సాహ వృత్తాల్లో వ్రాసినారు. దానికి సమాధానంగా వచ్చిన కాళిదాసు ఆశీర్వాక్కులు కవిరాజవిరాజితాల్లో వ్రాసినారు. కృతికన్యకయే మేఘదూతకృతి సఖ్యర్థించుట (మూడవది) సీసములలో నున్నది. మేఘసందేశకృతి కాంతాశ్రావణము చంపకోత్పలాది వృత్తములలో నున్నది. కృతికర్త ధన్యవాదములు ద్విపదలోను ఆటవెలదిలోను చెప్పబడినవి.

ఖండికాప్రాయములైన ఈ అయిదుభాగాలు కవికి కాళిదాసుపెడగల భక్తిని, ఈ కావ్యం మేఘసందేశం ముందు ఏ స్థానాన్ని కోరేది తెలుపుతున్నది. వినయభరంతో కూడిన ఉత్సాహమే కవి ఈ కార్యారచనకు చోదకశక్తిగా నిలిచిందనటంలో సందేహంలేదు. ఈమధ్యవచ్చిన చిన్నకావ్యాల్లో ఇది రసవంతమైనది; మేలైనది. అందరూ అవశ్యం చదివి ఆనందింపదగినది.

రా. చ.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.